ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 8-2-2026 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 179 | రూ. 8-00 పేజీలు 18+28 | www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

దేశ క్వాంటమ్ నిర్దేశకులం మనమే

ప్రపంచశ్రేణి టెక్నాలజీ నగరంగా అమరావతి

- ఈ ఏడాది డిసెంబరు నాటికి ఏపీలో అందుబాటులోకి తొలి క్వాంటమ్ కంప్యూటర్
- దేశానికి, ప్రపంచానికి 80% పరికరాలు అందించాలన్నదే లక్ష్యం
- అమరావతి క్వాంటమ్ వ్యాలీ శంకుస్థాపన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: హైటెక్ సిటీ హైదరాబాద్‌కు గేమ్‌ఛేంజర్‌గా మారితే.. అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ దేశానికి గేమ్ ఛేంజర్ కానుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాజధాని అమరావతిలో 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ (ఏక్యూవీ)' భవన నిర్మాణానికి కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖ సహాయమంత్రి జితేంద్రసింగ్‌తో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో చంద్రబాబు మాట్లాడారు. 'ప్రపంచశ్రేణి ప్రమాణాలతో నిర్మించే అమరావతి క్వాంటమ్ వ్యాలీ భారత్ క్వాంటమ్ భవిష్యత్తును (మిగతా 12లో)



అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, హరికెవిన్, కందుల దుర్గేష్, నారాయణ, అజయ్‌కుమార్, కామకోటి, అభయ్, నారా లోకేశ్, కాటమనేని భాస్కర్, పెమ్మసాని చంద్రశేఖర్, మన్నవ మోహనకృష్ణ, తెనాలి శ్రావణ్‌కుమార్, తమీమ్ అన్సారియా తదితరులు

కల్తీ నిజమే..
కానీ నేరం నాది కాదు

సీఎఫ్‌టీఆర్‌ఐకి నెయ్యి శాంపిళ్లు పంపాలన్నది నేనే	రిపోర్టు వచ్చిన విషయం మాత్రం నాకు తెలియదు	తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చిలకపలుకులు



ఈనాడు - అమరావతి

"నెయ్యి కల్తీ జరిగింది. పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్, కొన్ని ఇతర పదార్థాలతో నెయ్యి కల్తీ చేశారని సిట్ నివేదికలో తెలిపింది. కల్తీ నెయ్యి సరఫరాలో చాలా మంది వ్యక్తులు, కొందరు అధికారుల ప్రమేయం ఉందని, బయటి వ్యక్తుల (థర్డ్ పర్సన్స్) పాత్ర ఉందని చెప్పింది. వారి పేర్లు ఛార్జిషీట్‌లో ప్రస్తావించింది. - దిల్లీలో విలేకర్లతో, ఒక ఇంగ్లిష్ ఛానల్‌తోనూ మాట్లాడుతూ తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలివి.

ఏం చెప్పారు సుబ్బారెడ్డీ!

కల్తీ నెయ్యి సరఫరా వాస్తవమేనట!

దానిలో చాలా మంది వ్యక్తులు, కొందరు అధికారుల ప్రమేయం ఉందట! కల్తీ నెయ్యి సరఫరా జరిగినప్పుడు తితిదే పాలక మండలి ఛైర్మన్‌గా ఉన్న ఆయన ప్రమేయం మాత్రం లేదట! నాలుగేళ్లపాటు తితిదే ఛైర్మన్‌గా ఉన్నా కల్తీ నెయ్యి విషయం ఒక్కసారి కూడా ఆయన దృష్టికి రానేలేదట! కల్తీ నెయ్యి వ్యవహారంలో తానేదో పులుకడిగిన ముత్యం అన్నట్టుగా సుబ్బారెడ్డి వ్యాఖ్యలు చేస్తున్నారు. తితిదేకి సరఫరా చేసిన నెయ్యిని రసాయనాలు, పామాయిల్ వంటి వాటితో కల్తీ చేసినట్టు సిట్ చెప్పిందే తప్ప, జంతు కొవ్వులు, చేప నూనె వంటివి కలిసినట్టు ఎక్కడా చెప్పలేదని సుబ్బారెడ్డి అడ్డగోలుగా బుకాయిస్తారు. ఆయన వాదన చూస్తుంటే మర్డర్ చేసిన హంతకుడు.. 'హత్య జరగడం వాస్తవమే. నేను కత్తితో పొడిచి చంపితే తుపాకీతో కాల్చానంటారేంటి? అలా అనడం తప్పు కదా' అని దబాయించినట్లుగా ఉంది.

నాణ్యత పెంచాలంటే నిబంధనలు నీరుగార్చాలా?

"తితిదేకి అవసరమైనంత నెయ్యి సరఫరా జరగకపోవడంతో అధికారులు నిపుణుల కమిటీని వేసి, వారి సిఫారసు మేరకు నిబంధనలు సడలించారు. ఎందుకు సడలించారని తర్వాత మేం అడిగితే ఎక్కువ మంది పాల్గొనేందుకు అవకాశమిస్తే పోటీ పెరుగుతుందని, తక్కువ ధరలకు కోట్ చేస్తారని చెప్పారు. నెయ్యి నాణ్యతపై రాజీ పడకుండానే టెండర్ నిబంధనల్ని సడలించాం. - సుబ్బారెడ్డి నుంచి వచ్చిన మరో సుభాషితమిది.

నిబంధనలు సడలించి నాణ్యత పెంచారా? అంతకంటే హాస్యాస్పదం ఉంటుందా? భోలే బాబా డెయిరీ లక్షల కిలోల నకిలీ నెయ్యిని సరఫరా చేసింది మీరు నిబంధనలు సడలించాకే కదా! నాణ్యత పెంచడమంటే నెయ్యే కాని రసాయన మిశ్రమాన్ని కొనడమా? అసలు ఎవరైనా నాణ్యత పెంచడానికి నిబంధనలు సడలిస్తారా? అన్నట్టు నిబంధనల సవరణకు కమిటీ వేసిందీ, సవరణకు ఆమోదం తెలిపిందీ మీరు ఛైర్మన్‌గా ఉన్న పాలకమండలే కదూ! (మిగతా 17లో)

వాణిజ్య ఒప్పందానికి శ్రీకారం

- మధ్యంతర ఒడంబడికపై సంతకాలకు ఫ్రేమ్‌వర్క్ ఖరారు.. మార్చిలో సంతకాలు
- సంయుక్తంగా ప్రకటించిన భారత్, అమెరికా
- వెంటనే భారత్‌పై అదనపు సుంకాలను ఎత్తేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- త్వరలో మరింత తగ్గనున్న భారం
- మేక్ ఇన్ ఇండియా బలోపేతం: ప్రధాని మోదీ
- రైతుల ప్రయోజనాల పరిరక్షణ: గోయల్



దిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి గోయల్

వాషింగ్టన్, న్యూయార్క్: మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి భారత్, అమెరికా శ్రీకారం చుట్టాయి. ఇందుకు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేశాయి. ఈ విషయాన్ని శనివారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో రెండు దేశాలూ వెల్లడించాయి. తొలి దశలో కుదుర్చుకోనున్న ఈ ఒప్పందంపై మార్చిలో సంతకాలు జరగనున్నాయి. దీనివల్ల రెండు దేశాల మధ్య పలు ఉత్పత్తులపై సుంకాలు సున్నా స్థాయికిగానీ, గణనీయంగాగానీ తగ్గనున్నాయి. ఫ్రేమ్‌వర్క్‌పై సంయుక్త ప్రకటన వెలువడటానికి ముందు భారత్‌పై విధించిన 25 శాతం అదనపు (మిగతా 3లో)

నాయకుడు గెలిపించాడు

అమెరికాపై సూర్య మేటి ఇన్నింగ్స్

టీ20 ప్రపంచకప్‌లో భారత్ శుభారంభం

టీ20 ప్రపంచకప్‌లో ఆతిథ్య భారత్ శుభారంభం చేసింది. కానీ విజయం అంత తేలిగ్గా ఏమీ దక్కలేదు. మొదట అమెరికా బౌలర్లు విజృంభించడంతో భారత్ ఓటమి ముప్పును ఎదుర్కొంది. కానీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (84; 49 బంతుల్లో 10×4, 4×6) ఒత్తిడిలో వీరోచితంగా పోరాడి జట్టుకు పరాభవాన్ని తప్పించాడు. షాడ్లీ షావ్కిక్ (4/24) ధాటికి ఒక దశలో 77 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన భారత్.. సూర్య పోరాటంతో 9 వికెట్లకు 161 పరుగులు చేయగలిగింది. అనంతరం హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ (3/29)తో పాటు మిగతా భారత బౌలర్లూ సత్తా చాటడంతో యుఎస్ఏ 8 వికెట్లకు 132 పరుగులే చేయగలిగింది. భారత్ 29 పరుగుల తేడాతో విజయాన్నందుకుంది. సూర్య కుమార్‌కే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.



సూర్యకుమార్ యాదవ్

వివరాలు ఛాంపియన్ లో..

దగ్ధమైన ప్రైవేట్ స్లీపర్ బస్సు

క్షణాల్లోనే వాహనాన్ని చుట్టుముట్టిన అగ్నికీలలు

డ్రైవర్ అప్రమత్తతతో 39 మంది సురక్షితం

కీసర సమీపంలో తెల్లవారుజామున ఘటన

లోపలి పేజీలో

veenaworld.com



నమస్తే ఇండియా

నేను ఈఫిల్ టవర్ ని

మీరు చూసిన వేలాది స్వప్నాలలో నేను ఒకటి. కొంతమంది నన్ను మొట్టమొదటి సారి కలుస్తారు, వారి కన్నులు ఆనంద బాష్పాలతో నిండిపోతాయి. కొంతమంది వారి యవ్వనాన్ని మరియు సంతోషాన్ని మరలా పొందడానికి తిరిగి నాదగ్గరకి వస్తారు. ప్రతి ప్రయాణికుడు తన కథని తీసుకుని వస్తారు... నేను వాటన్నటిని నా దగ్గర దాచుకుంటాను. ఎందుకో తెలుసా, యూరప్ అనేది కేవలం ఒక ప్రయాణమే కాదు – ఇది లెక్కలేనన్ని భావోద్వేగాలు మరియు జ్ఞాపకాల సేకరణ, ఇక ఇప్పుడు నా ప్రియమైన భారత్, మీ యూరప్ కథ ప్రారంభం కాబోతున్నది.

ఛలో, బ్యాగ్ భరో, నికల్ పడో

యూరప్‌కి వీణ వరల్డ్‌తో

వీణ వరల్డ్

యూరప్

ప్రతి కుటుంబానికి మరియు కుటుంబంలో ప్రతి ఒక్కరికి!

ఇది మీ మొట్టమొదటి యూరప్ టూర్ అయినా లేదా ఐదవదయినా, కేవలం మీ కోసమే వీణ వరల్డ్‌తయారుచేసిన టూర్ ప్రోగ్రాం – ప్రతి కారణానికి, ప్రతి కాలానికి

5 రోజుల నుండి 30 రోజుల వరకు. ₹1.5 లక్షల నుండి ₹7 లక్షల వరకు. ఫ్యామిలి టూర్స్ నుండి సోలో ఎక్స్‌ప్లోరర్స్ వరకు. వుమెన్స్ స్పెషల్ నుండి సీనియర్స్ స్పెషల్ టూర్స్ వరకు. కస్టమైజ్డ్ హాలిడేస్ నుండి MICE కార్పొరేట్ టూర్స్ వరకు.

మీ ప్రాధాన్యత, బడ్జెట్ మరియు సమయానికి అనుకూలమైన టూర్‌ను ఎంచుకోండి.

వెస్టన్ లేదా ఈస్టన్ యూరప్, సెంట్రల్, బాల్టిక్ లేదా బాల్కన్, నార్దరన్ లేదా సదరన్ మెడిటేరియన్.. పలు రకాల ఎంపికలతో, మీ మనసు ఎంతో తేలికగా సంతోషించే కంటే కొంచెం ఆగండి.

మీకు నచ్చిన సరైన యూరప్ టూర్‌ని ఎంచుకోవడానికి వీణ వరల్డ్ ఇంకా సులభం చేస్తుంది.

మీ యూరప్ కలలను మాతో పంచుకోండి, ఆ కలని ఓ అందమైన కథగా మార్చి దాన్ని నిజం అయ్యేలా ఎప్పటికి మర్చిపోలేని మధురమైన జ్ఞాపకంగా గుర్తుండిపోయేలా మేము మీకు సహాయపడగలము.

A Surprise of Joyful Memories
Veena World Gift Cards!
veenaworld.com/gift-card

Veena World means
100% All-Inclusive Tours
No Discounts!
No 'Free' Gimmicks!
No Hidden Costs!
No Optionals!
No extra charges on tours. Breakfast-Lunch-Dinner, Maximum Sightseeing Veena World Treats Driver tips, Guide tips... included

Affordable
Western Europe or Eastern Europe
starts from ₹
1,75,000
Southern Europe ₹2,00,000
Northern Europe ₹2,50,000

Over 12 years
1,03,900+ guests have explored Europe with Veena World.
15,200+ in Financial Year 2025-2026

All-India One Price Benefit
for tours from Mumbai, Kolkata, Bengaluru, Cochin, Hyderabad, Chennai, Indore, Delhi, Ahmedabad
if booked before 15th February

Ask us for exclusive tours designed specially for your group of family and friends

Travel Now Pay Later!
EMI options available (3 to 24 months) subject to EMI partner approval.
*T&C apply

Book Online
365 days
24x7
visit veenaworld.com

First time to Europe?
Then see it the classic way
8 Countries in 8 Days!
10 Countries in 10 Days!
or 11 Countries in 11 Days!

Start your visa process
Act now, book and process your visa before the crowds increase at consulates. Our 118+ in-house visa experts guiding you step by step

VISA
Assistance in Your City
at Special Promotional Service Charge
Less Effort. More Comfort
Contact Today!
*T&C apply

Ex-Destination
Direct Joining Leaving tour price available

Pre & Post-Tour
Extend your journey with Pre & Post-Tour Holidays

Full Payment Benefit
Advance full payment earns extra savings (minimum 3 to 12 months) save ₹3,000 to ₹15,000 pp

FOREX
Buy Foreign Exchange at Veena World Forex

Customized Europe
Get your private holiday designed with us

MICE
Corporate Tours
Contact us for incentive tours, offsites...

Explore detailed information on 120+ all-inclusive Europe group tour options at veenaworld.com

Choose from Ex-Hyderabad/Mumbai... departures or Joining & Leaving (J&L) tours from any city in India or abroad. The price chart below lists: • Ex-Hyderabad/Mumbai... price (includes airfare, visa & insurance) • J&L price (excludes airfare, visa & insurance). Need help with your J&L travel? Our team is here to assist with flights, visas, and more.

Euro is rising
tour prices are changing
Now is the Time!
Book today, pay in Indian ₹ and lock your tour price

Western Europe - England to Italy

Tour Name	Ex-Mumbai	J&L
Swiss Paris Austria Germany (6D)	175K-190K	110K-125K
European Panorama (8D)	250K-260K	180K-190K
European Splendours (10D)	275K-285K	205K-215K
London Paris Swiss Italy (9D)	285K-295K	205K-215K
European Highlights (11D)	305K-320K	225K-240K
European Delight (13D)	370K-385K	290K-305K
European Jewels (15D)	410K-425K	330K-345K
European Essence (15D)	400K-425K	330K-355K
Multi-Country Europe (17D-27D)	465K-695K	385K-615K
Amsterdam Brussels/Swiss Paris(7D/11D)	230K-345K	160K-275K
England Scotland /Ireland (10/15D)	315K-440K	245K-370K
Swiss Paris/French Riviera (8D/10D)	285K-310K	210K-240K
Swiss Paris London (11D)	375K-400K	290K-315K
Swiss Paris Italy (11D)	320K-335K	250K-265K
Swiss Austria/Italy(8D/11D)	275K-335K	205K-265K
Swiss Paris Austria (11D)	330K-340K	260K-270K
Italy (8D/15D)	295K-465K	230K-395K
Switzerland (7D/10D)	275K-360K	210K-290K
Best of Austria (8D)	275K-290K	205K-220K
Best of France (11D)	325K-340K	255K-270K

Northern Scandinavian Europe

Tour Name	Ex-Mumbai	J&L
Highlights of Scandinavia (7D)	250K-275K	175K-200K
Best of Scandinavia (10D)	335K-360K	250K-275K
All of Scandinavia (15D)	475K-500K	385K-400K
Scandinavia Iceland (15D)	565K-590K	475K-500K
Scandinavia Eastern Europe (17D)	525K-550K	440K-465K
Scandinavia Russia (17D)	435K-460K	365K-390K
Scandinavia Midnight Sun (16D)	535K-550K	455K-470K
Scandinavia Midnight Sun (9D)	375K-400K	295K-420K
Scandinavia Iceland Midnight Sun (14D)	625K-650K	545K-570K
Scandinavia Northern Lights (9D)	400K-425K	310K-335K
Iceland Northern Lights (10D) Mar 12	515K-545K	440K-465K
Scandinavia Iceland Northern Lights (14D) Mar 4	520K-545K	430K-455K
Scandinavia Iceland Northern Lights+Icebreaker Cruise (15D)	575K-600K	480K-505K
Best of Greenland (9D) Aug 31	675K-700K	585K-610K
Best of Russia (7D)	175K-200K	115K-140K

Southern Europe, Mediterranean Europe, Central, Eastern Europe

Tour Name	Ex-Mumbai	J&L
Highlights of Spain (7D)	200K-225K	130K-155K
Best of Spain (10D/11D)	265K-280K	195K-210K
All of Spain (15D)	375K-400K	305K-330K
Spain Portugal (13D)	335K-360K	260K-285K
Spain Portugal Morocco (16D)	375K-400K	295K-320K
Greece Athens Santorini (5D)	200K-225K	135K-160K
Greece Athens Santorini Mykonos (7D)	250K-275K	185K-205K
Greece Athens Santorini Rhodes (9D)	300K-315K	235K-250K
Greece Athens Santorini Rhodes Mykonos (10D)	325K-350K	260K-285K
All of Greece (14D)	425K-450K	360K-385K
Egypt Greece Turkey (15D)	425K-450K	--
Greece Turkey (12D)	350K-375K	270K-295K
Turkey (10D/15D)	225K-350K	155K-180K
Best of Egypt (9D)	175K-200K	115K-140K
Egypt Greece Cyprus (12D)	390K-415K	310K-330K
Greece Cyprus (9D)	325K-350K	245K-270K
Egypt Morocco (8D)	240K-265K	170K-195K
Egypt Jordan (10D)	295K-320K	230K-255K
Best of Jordan (7D)	200K-225K	135K-160K

Tour Name	Ex-Mumbai	J&L
Vienna Prague Budapest(8D)	250K-275K	175K-200K
Berlin Warsaw Krakow (8D)	240K-265K	170K-195K
Croatia Slovenia Slovakia Hungary (12D)	330K-345K	255K-270K
Central & Eastern Europe (17D)	400K-425K	325K-350K
Uzbekistan Kazakhstan Kyrgyzstan (9D)	215K-230K	160K-175K
Tashkent Samarkand (5D) Mar 10,24	81K-85K	61K-65K
Georgia Armenia Baku (10D)	225K-250K	175K-200K
Georgia Armenia (8D)	175K-200K	125K-150K
Georgia (5D/8D) Mar 17	99K-175K	49K-130K
Baku (5D/8D)	99K-150K	64K-110K
Baltic Europe Estonia Latvia Lithuania (8D)	250K-275K	180K-205K
Baltic Europe + Scandinavia (15D)	500K-525K	420K-445K
Baltic Berlin Warsaw Krako (15D)	390K-415K	330K-355K
Balkan Romania Bulgaria Serbia North Macedonia (15D)	405K-430K	335K-360K
Best of Morocco (8D)	225K-250K	155K-180K
Tunisia Malta Sicily (10D)	375K-400K	295K-320K

Coming soon...Unique Switzerland group tours
YOLO, Swiss by Rail, Swiss by Self-Drive Cars, Swiss for Students & Parents, Swiss 5 Star with Mercedes Van, Honeymoon Special Switzerland

The Americas

Tour price from 2,00,000 to 13,25,000

South America (21D) 13,95,000 (J&L) 10,90,000
Antarctica The 7th Continent (13D) 13,35,000 (J&L) 11,35,000
USA East Coast (6D/7D/9D)
USA West Coast (7D)
USA East & West Coast + Chicago (13D)
USA East & West Coast+ Orlando Disneyland & NASA (15D)
USA East & West Coast with Chicago & Death Valley Yosemite (18 Days)
USA East & West Coast+Orlando & Bahamas Cruise (19 Days)
USA East & West Coast with Chicago & National Parks (22 Days)
USA California Carnival with Death Valley & Yosemite (10 Days)
Alaska Canada (18D) | Best of Alaska (9D)
Best of Canada (11D) | Hawaii Mexico (11D)
Best of Mexico (7D)




Main Hoon Na!
Europe's vast beauty can feel overwhelming to navigate, but with a dedicated Veena World Tour Manager by your side, every moment of your journey becomes easy, stress-free, and truly enjoyable.
















Virtual Travel Conference
Expert-led short sessions to help you decide better • Call: 887 997 2223

Group tour price includes return airfare(Ex-Hyderabad/Mumbai), transport, accommodation, all meals: breakfast, lunch, dinner, sightseeing with entrance fees, driver-guide tips, services of a Tour Manager, VISA fee (except for Free Visa Countries & USA) and travel insurance*. J&L tours exclude airfare, visa & insurance. USA tours are for valid USA visa holders. The full payment benefit is valid only for a limited period* and does not apply to promotional tours EUGP, EUGV, EUHJ, EUGD, AMGP, ASPJ, ASZL... or their speciality tours.

Shivalik Plaza, Road No. 1, Banjara Hills, Hyderabad 500 034 • Call: 887 997 9700 | Mon-Sun 10 to 7

Rajahmundry, Vijaywada, Guntur, Nellore, Tirupati, Visakhapatnam, Warangal • Call: 865 575 5282

Book Online 24x7 from anywhere on veenaworld.com | Call: 1800 313 5555

Applications invited for Sales Partners/Agents across Southern India
WhatsApp on : 887 997 9733

VEENA WORLD
Travel. Explore. Celebrate Life.

Dadar	887 997 2203	Vile Parle	887 997 2213	Borivali	887 997 2201	Ghatkopar	887 997 2226	Thane 1	887 997 2205	Pune	887 997 2300	Vashi	887 997 2207	Kolkata	887 997 2288
Girgaon	887 997 2215	Andheri	887 997 2216	Kandivali	887 997 7500	Chembur	887 997 2202	Thane 2	887 997 2204	Baner	887 997 9300	Ahmedabad	887 997 7200	Bengaluru Jayangr	887 997 2217
Bandra	887 997 2212	Versova	887 997 9100	Bhayandar	887 997 7400	Mulund	887 997 9600	Dombivali	887 997 2206	Chinchwad	887 997 2310	New Delhi	887 997 2700	Bengaluru Indirangr	887 997 9500
						Vidyavihar	887 997 2223	Airoli	887 997 9200	Hadapsar	887 997 7300	Noida	887 997 4100	Hyderabad	887 997 9700
Matunga	887 997 2214	Malad	887 997 2219	Vasai	887 997 2209	Indore	887 997 9800	Panvel	887 997 3700	Book Online	887 997 2221	Gurugram	887 997 4300	Chennai	887 997 3500

Tour price is per person and on twin sharing basis. These tour prices are nett and no discount is applicable. At the time of booking, tour price to be paid in full INR by UPI/NEFT/RTGS/Cheque, in the name of 'Veena Patil Hospitality Pvt. Ltd.' No cash transactions at Veena World. Government taxes apply. Any increase in YQ taxes, airport taxes, VISA fees, surcharges (if any) will have to be borne by the travellers. T&C apply.

వాణిజ్య ఒప్పందానికి శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

సుంకాలను ఎత్తివేస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారు. ఈ నిర్ణయం మాత్రం శనివారం నుంచి అమల్లోకి వచ్చిందని శ్వేతసౌధం ప్రకటించింది. దీనికి ప్రతిగా రష్యా నుంచి ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ చమురును కొనుగోలు చేయబోమని భారత్ హామీ ఇచ్చిందని స్పష్టం చేసింది. మధ్యంతర ఒప్పంద ఫ్రేమ్‌వర్క్ ఖరారును ప్రధాని మోదీ స్వాగతించారు. దీనివల్ల మేక్ ఇన్ ఇండియా బలోపేతం అవుతుందని, యువత, మహిళలకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు.

◆ 'మధ్యంతర ఒప్పంద ఫ్రేమ్‌వర్క్‌ను అమెరికా, భారత్ అంగీకరించాయి. ఇది ఇరువురికి ప్రయోజనకరం' అని సంయుక్త ప్రకటన వెల్లడించింది.

భారీ ప్రయోజనం

మధ్యంతర ఒప్పందం అమల్లోకి వస్తే భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులు, ఉత్పత్తులపై సుంకాలు సున్నా శాతం నుంచి 18 శాతం వరకు అమలవుతాయి. ప్రస్తుతం అదనపు సుంకాలతో కలిసి 50 శాతం ఉన్నాయి. శుక్రవారం 25 శాతం అదనపు సుంకాలను ఎత్తి వేయడంతో 25 శాతానికి తగ్గాయి. అవి మరింత తగ్గనున్నాయి. కొన్నింటిపై సున్నా స్థాయికి చేరనున్నాయి. అమెరికా నుంచి భారత్‌కు వచ్చే ఉత్పత్తులపైనా సుంకాలు సున్నాగానీ, స్వల్పంగా గానీ ఉండనున్నాయి.

◆ అమెరికా పారిశ్రామిక ఉత్పత్తులు, ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులైన ఎండు ధాన్యాలు, పశువుల దాణాగా వాడే ఎర్ర జొన్నలు, ట్రీ నట్స్, తాజా, ప్రాసెస్డ్ పండ్లు, సోయాబీన్ ఆయిల్, వైన్, ఆల్కహాల్‌పై సుంకాలు సున్నాగానీ, స్వల్పంగా గానీ ఉంటాయి.

◆ భారత్, అమెరికా సంయుక్త ప్రకటన ప్రకారం.. రూ. 45.29 లక్షల కోట్ల ఇంధన ఉత్పత్తులు, విమానాలు, విమాన విడి భాగాలు, విలువైన లోహాలు, టెక్నాలజీ ఉత్పత్తులు, కోకింగ్ బొగ్గు వంటి వాటిని దీర్ఘకాలంలో అమెరికా నుంచి భారత్ కొనుగోలు చేయనుంది.

ప్రధాని ప్రశంస

మధ్యంతర ఒప్పంద ఫ్రేమ్‌వర్క్ ఖరారు కావడంతో రైతులు, వ్యాపారులకు కొత్త అవకాశాలు లభిస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యువత, మహిళలకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని తెలిపారు. భారత్‌తో బంధానికి కట్టుబడి ఉన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

◆ మధ్యంతర ఒప్పంద ఫ్రేమ్‌వర్క్ ఖరారుతో భారతీయ ఎగుమతిదారులకు 30 ట్రిలియన్ల అమెరికా డాలర్ల వ్యాపారానికి ద్వారాలు తెరుచుకుంటాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలవారు, రైతులు, మత్స్యకారులు లబ్ధి పొందుతారని తెలిపారు. గ్రామీణ ప్రజల ప్రయోజనాలను పరిరక్షించేలా.. పాలు, పాల ఉత్పత్తులు, చీజ్, మొక్కజొన్న, గోధుమ, బియ్యం, సోయా, కోళ్లు, ఇథనాల్ (ఇంధనం), పొగాకు, కొన్ని కూరగాయలు, మాంసం, గింజ ధాన్యాలు, జొన్నలు, సిరి ధాన్యాలు, రాగులు, కోడో, తోటకూర, అరటి పండ్లు, స్ట్రాబెర్రీలు, చెర్రీలు, నిమ్మజాతి పండ్లపై సుంకాలు కొనసాగుతాయని వెల్లడించారు. ఇంకా గ్రీన్ పీస్, కాబూలీ శనగ, పెసర్లు, ఆయిల్ సీడ్స్, పశువుల దాణా, వేరుశనగ, తేనె, బార్లీ, వంట ఉత్పత్తులు, ఆల్కహాల్ రహిత పానీయాలు, పిండి, గంజి, నిర్జలీకరించిన చమురులపైనా సుంకాలను భారత్ కొనసాగించనుంది.

ఒప్పందం ముఖ్యాంశాలు..

◆ తొలి దశలో భాగంగా భారత్ నుంచి ఎగుమతయ్యే రూ.3,98,536 కోట్ల ఉత్పత్తులపై సున్నా ప్రతీకార సుంకాలు అమలవుతాయి.

◆ రూ.2,71,729 కోట్ల ఉత్పత్తులపై 18శాతం సుంకాలు అమలవుతాయి.

◆ రూ.1,08,691 కోట్ల విలువైన ఉత్పత్తులపై ప్రస్తుత సుంకాలే అమలవుతాయి. వీటిలో ఉక్కు, రాగి, కొన్ని రకాల ఆటోమొబైల్ విడి భాగాలున్నాయి. అన్ని దేశాలపైనా ఈ మొత్తానికి 50శాతం సుంకాలు అమలవుతున్నాయి. దీంతో వాటిలో మార్పులేదు.

సుంకాలు తగ్గే భారత ఉత్పత్తులు..

◆ టెక్స్‌టైల్, అప్పారెల్, తోలు ఉత్పత్తులు, ప్లాస్టిక్స్, రబ్బర్, ఆర్గానిక్ కెమికల్స్, కళాకృతులు, పాదరక్షలు, ఆభరణాలు, యంత్ర విడి భాగాలు, బొమ్మలు, హోం డెకార్, స్మార్ట్ ఫోన్లు, వ్యవసాయ ఉత్పత్తులు.

◆ రత్నాలు, వజ్రాలు, జనరిక్ ఔషధాలు, విమాన విడి భాగాలు, ఆటోమొబైల్ విడి భాగాలపై సున్నా సుంకాలు.

◆ మసాలాలు, టీ, కాఫీ పొడర్లు, కొప్రా, కొబ్బరి నూనె, పోక చెక్కలు, జీడి పప్పు, బ్రెజిల్ నట్, చెస్ట్‌నట్, అవకాడో, అరటి, జామ, మామిడి, కివీ, బొప్పాయి, పైనాపిల్, పుట్టగొడుగులు, కూరగాయల సాగు పరికరాలు, టారో, బార్లీ, కానరీ విత్తనాలు, బేకరీ, కోకో, కోకో ఉత్పత్తులు, నువ్వులు, గసగసాలు, వంట జామ్‌లు.. పేస్ట్‌లు.

అమెరికా ఉత్పత్తులు..

◆ డేటా సెంటర్లకు, ఏఐకి ఉపయోగపడే పరికరాలు, అత్యున్నత నాణ్యత కలిగిన చిప్‌లు, ఐసీటీ గూడ్స్ యంత్రాలు.

◆ వైన్స్, ఆల్కహాల్ ఉత్పత్తులు, వాల్‌నట్స్, బాదం, పిస్తా, బీన్స్.

◆ హైఎండ్ కార్లు, మోటారు సైకిళ్లు, విమానాలు.

◆ గుండె, న్యూరో, డయాబెటిస్ సంబంధిత ఔషధాలు, కాస్మెటిక్స్, వైద్య పరికరాలు, ఎక్స్‌రే వాల్వ్‌లు, డయాగ్నస్టిక్ పరీక్షల్లో వాడేవి, పేస్ మేకర్లు, హియరింగ్ ఎయిడ్లు, కృత్రిమ జాయింట్లు, ఇమేజింగ్ ఉపకరణాలు.

చెన్నై విమానాశ్రయంలో రూ.23 కోట్ల గంజాయి స్వాధీనం

ఆరుగురి ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల అరెస్టు

చెన్నై(వడపళని), న్యూస్‌టుడే: చెన్నై విమానాశ్రయానికి విదేశాల నుంచి తీసుకొచ్చిన రూ.23 కోట్ల విలువైన గంజాయిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారుల వివరాల మేరకు.. శుక్రవారం థాయ్‌లాండ్ నుంచి చెన్నై వచ్చిన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు సోదాలు చేశారు. కేరళకు చెందిన నలుగురు యువకులపై అనుమానంతో వారి లగేజీని క్షుణ్నంగా పరిశీలించి.. రూ. 15 కోట్ల విలువైన గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. థాయ్‌లాండ్‌కు పర్యాటక వీసాపై వెళ్లిన ఇద్దరు యువకులు మరో విమానంలో చెన్నైకి తిరిగొచ్చారు. వారిని సోదా చేసి రూ.8 కోట్ల విలువైన 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆరుగురూ ఇంజినీరింగ్ చదివినవారు కావడం గమనార్హం.

వైకాపా ప్రభుత్వంలో ఆటవిక రాజ్యం: మంత్రి కొల్లు

ఈనాడు, అమరావతి: ఆటవిక రాజ్యం ఎలా ఉంటుందో గత వైకాపా ప్రభుత్వంలో ప్రజలు చూశారని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. జగన్‌కు జంగిల్‌రాజ్ అవార్డు ఇవ్వాలని శనివారం ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. జగన్ పాలనలో దేవాలయాలు, ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యాలయాల మీద యథేచ్ఛగా దాడులు జరిగాయని మండిపడ్డారు. హంతకులకు పదవులిచ్చి జగన్ ప్రోత్సహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు పాఠశాల క్రీడల కార్యదర్శి భానుమూర్తి తెలిపారు. పురుష టీచర్లకు క్రికెట్, ఉపాధ్యాయినులకు త్రోబాల్ పోటీలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో పాల్గొనే వారికి ప్రత్యేక క్యాజువల్ సెలవు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం(ఆర్డీఎస్ఎస్) కింద చేపడుతున్న విద్యుత్తు సరఫరా, పంపిణీ నష్టాల తగ్గింపు పనుల్ని వేగవంతం చేయాలని డిస్కంలను సీఎస్ విజయానంద్ ఆదేశించారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి డిస్కంల సీఎండీలు శివశంకర్, పృథ్వీతేజ్, పుల్లారెడ్డిలతో శనివారం ఆయన సమీక్షించారు.



గ్రహం అనుగ్రహం

8-2-2026 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, బహుళ పక్షం
సప్తమి: తె. 5-34 తదుపరి అష్టమి
స్వాతి: తె. 5-52 తదుపరి విశాఖ
వర్జ్యం: ఉ. 9-52 నుంచి 11-36 వరకు
అమృత ఘడియలు: రా. 8-18 నుంచి 10-02 వరకు
దుర్ముహూర్తం: సా. 4-23 నుంచి 5-08 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.6.35; సూర్యాస్తమయం: సా.5.54

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	16.0	31.0
అనంతపురం	16.4	34.1
తిరుపతి	16.7	32.0
హైదరాబాద్	17.0	31.7
శ్రీకాకుళం	17.0	33.0
రాజమహేంద్రవరం	17.0	37.5
విశాఖపట్నం	17.4	31.6
కడప	18.0	32.0
తాడేపల్లిగూడెం	18.0	33.0
విజయవాడ	18.0	33.2
కర్నూలు	18.4	33.9
గుంటూరు	19.0	33.0
ఒంగోలు	19.4	32.7
నెల్లూరు	20.4	32.6

ఇదీ సంగతి!



నాకు ఉండటానికి జాగా లేదు.. ప్లీజ్! నాకూ ఒక ప్లాట్ ఇప్పించండి!

9న దిల్లీకి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు సోమవారం రాత్రి దిల్లీ వెళ్లనున్నారు. విజయవాడ విమానాశ్రయం నుంచి రాత్రి 7:20 గంటలకు బయలుదేరి....రాత్రి 10:15 గంటలకు దిల్లీ చేరుకుంటారు. పదో తేదీ ఉదయం కేంద్ర పెద్దలను కలుస్తారు.

విద్యార్థులకు 'దారి' చూపిన పవన్‌కల్యాణ్

కొండాపురం, న్యూస్‌టుడే: పాఠశాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేక ఇబ్బందిపడుతున్న విద్యార్థులు సమస్యను ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే నిధులు మంజూరు చేయించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొండాపురం మండలంలోని చల్లగిరిగెల గ్రామ విద్యార్థులు 3 కి.మీ. దూరంలో ఉన్న గజ్జలవారిపల్లె ప్రాథమిక పాఠశాలకు విద్యా శాఖ ఏర్పాటు చేసిన ఆటోలో నిత్యం వెళ్తుంటారు. కానీ, రోడ్డు సౌకర్యం సరిగా లేదు. వర్షాలు కురిస్తే నడవడానికీ వీలుండదు. వాహనాలు బురదలో ఇరుక్కుపోతుంటాయి. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోలేదు. విద్యార్థులు సమస్యను సామాజిక మాధ్యమాల ద్వారా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తెలుసుకున్న పవన్‌కల్యాణ్ పరిష్కారానికి చొరవ చూపారు. ఆయన ఆదేశాలతో అధికారులు రూ.86 లక్షలతో ప్రతిపాదనలు చేయగా.. అనుమతులూ వచ్చాయి.



పాఠశాలకు వెళ్లే రోడ్డు అధ్వానస్థితి..

నాడు దాక్కుని.. నేడు అసాంఘిక శక్తుల కోసం పాదయాత్రలా!: ఎమ్మెల్యే నజీర్ అహ్మద్

ఈనాడు, అమరావతి: అధికారంలో ఉన్నప్పుడు ప్రజల దగ్గరికి వెళ్లకుండా పరదాల మాటున దాక్కున్న జగన్.. నేడు సంఘవిద్రోహ శక్తుల్ని కాపాడటానికి యాత్రలు చేస్తున్నారని తెదేపా ఎమ్మెల్యే నజీర్‌అహ్మద్ ధ్వజమెత్తారు. మంగళగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "తెనాలిలో బ్లేడ్ బ్యాచ్, గంజాయి కేసుల్లో నిందితులకు జగన్ మద్దతు తెలపడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. జోగి రమేశ్ పరామర్శ పేరుతో ఇబ్రహీంపట్నం వెళ్లి ఇద్దరు యువకుల్ని బలి తీసుకున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గెలుపంటే ఏంటంటే..



నిన్నటితో పోలిస్తే ఈరోజు మీరు ఎంతో కొంత మెరుగయ్యారా? అంటే ఈరోజు మీకు తెలియని అంశమేదైనా నేర్చుకున్నారా? ఓ విభిన్న ప్రయత్నమేమైనా చేశారా? ఓ కొత్త సమస్యను పరిష్కరించారా? అయితే మీకు అభినందనలు. ఈరోజు మీరు గెలిచారు!

– వైభవ్ అగర్వాల్, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్

బాలికపై గ్యాంగ్‌రేప్ పేరుతో అసత్య ప్రచారం

● 'సాక్షి' ప్రతినిధులపై పోక్సో కేసు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: గ్యాంగ్‌రేప్ అంటూ బాలిక ఫైల్ ఫొటో, వివరాలు ప్రచురించినందుకు సాక్షి దినపత్రిక ఎడిటర్, జిల్లా బ్యూరోచీఫ్, కోవూరు మండల విలేకరిపై కోవూరు పోలీసులు పోక్సో కేసు నమోదుచేశారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరులో మృతిచెందిన బాలిక విషయంలో అసత్య ప్రచారాలు చేయొద్దని నెల్లూరు గ్రామీణ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు సూచించారు. శనివారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. '12 ఏళ్ల బాలికను ఇద్దరు మైనర్లు బలవంతంగా తీసుకెళ్లి ఏదో ద్రవం తాగించినట్లు బాలిక తల్లి ఫిర్యాదుచేయగా, కోవూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. బాలికకు తొలుత కోవూరు సీహెచ్‌సీలో ప్రథమచికిత్స చేయించారు. తర్వాత చెన్నైకి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. బాధితురాలి మెడికల్ రిపోర్టు, పోస్టుమార్టం నివేదిక, ఆర్ఎస్ఎల్ రిపోర్టు రావాల్సి ఉంది. ఇలాంటి కేసుల్లో మృతురాలి వివరాలు గోప్యంగా ఉంచాలి. ప్రాథమిక నివేదికల ప్రకారం బాలిక మృతికి కారణం సస్పెక్టెడ్ పారాక్వాట్ లిక్విడ్ అని భావిస్తున్నారు. బాలికపై 'గ్యాంగ్‌రేప్' జరిగినట్లు వచ్చిన వార్త అవాస్తవం. ఇప్పటి వరకు బాలిక తల్లిదండ్రులు అలాంటి విషయాలు వెల్లడించలేదు' అని తెలిపారు.

బాలిక తాత ఫిర్యాదుతో..: బాలిక పేరు, వివరాలు, ఫైల్ ఫొటోతో వార్త ప్రచురించినందుకు సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి, జిల్లా బ్యూరోచీఫ్ మస్తాన్‌రెడ్డి, కోవూరు మండల రిపోర్టర్ మధుపై బాలిక తాత ఫిర్యాదు మేరకు కోవూరు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసినట్లు జిల్లా పోలీస్ కార్యాలయం తెలిపింది. మస్తాన్‌రెడ్డి, మధులకు కోవూరు పోలీసులు నోటీసులు అందజేశారు.

లైంగిక వేధింపులకు గురైన బాలలకు అండగా సపోర్ట్ పర్సన్స్

ఈనాడు, అమరావతి: లైంగిక వేధింపులకు గురైన బాలలకు అండగా నిలిచేందుకు, వారికి న్యాయపరమైన సాయం అందించేందుకుగాను సపోర్ట్ పర్సన్స్‌ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని బాలల సంక్షేమశాఖ సంచాలకులు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. వీరు బాధితులకు కేసు విచారణకు ముందు, విచారణ సమయంలో మార్గదర్శకత్వం, కౌన్సెలింగ్ ఇస్తారని శనివారం ఒక ప్రకటనలో వివరించారు. జిల్లాకు ఒకరు చొప్పున వీరి నియామకం ఉంటుందని, జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో నియామకాలు జరుగుతాయన్నారు. పోస్టులకు కావాల్సిన విద్యార్హతలు, విధులు, ఇతర నిబంధనలతో కూడిన ప్రత్యేక నోటిఫికేషన్లను కలెక్టర్లు విడుదల చేస్తారన్నారు.

జగన్ పర్యటనలో ఉల్లంఘనలపై కేసు నమోదు

● నిందితుడిగా వైకాపా నేత జోగి పేరు

ఈనాడు-అమరావతి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్ పర్యటన సందర్భంగా అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించినందుకు ఎస్సై రవివర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ మంత్రి జోగి రమేష్ తదితరులపై ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులు పలు సెక్షన్లను చేర్చారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి.. శుక్రవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలో బయలుదేరి జోగి రమేష్ ఇంటికి వెళ్లి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. జగన్ పర్యటన కారణంగా గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పలు చోట్ల వైకాపా కార్యకర్తలు రెచ్చగొట్టే చేష్టలు చేశారు. జనసమీకరణ చేయొద్దని జోగి రమేష్‌కు పోలీసులు నోటీసులు ఇచ్చినా బేఖాతరు చేశారు. దీంతో బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

జగన్ ఫ్లెక్సీకి రక్త తిలకం దిద్దిన అఖిల్‌పై..: జగన్ పర్యటన సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం వెల్వడం గ్రామానికి చెందిన అఖిల్ అనే యువకుడిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. అతను చేతిని కోసుకుని జగన్ ఫ్లెక్సీకి రక్త తిలకం దిద్దాడు. అందరినీ భయభ్రాంతులకు గురి చేసినందుకు, చట్టవిరుద్ధంగా గుమిగూడినందుకు, న్యూసెన్స్ తదితర కారణాలతో కేసు నమోదు చేశారు.

రాంబాబు మృతిపై..: జగ్గయ్యపేట మండలం చిల్లకల్లుకు చెందిన వైకాపా నాయకుడు రాంబాబు.. ఇబ్రహీంపట్నం ర్యాలీకి వచ్చి మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంకా పోస్టుమార్టం నివేదిక రాకపోవడంతో అనుమానాస్పద మృతి కింద కేసు కట్టారు. నివేదిక వచ్చిన తర్వాత సెక్షన్లు మార్చే అవకాశం ఉంది.

పిట్టలు కొంచెం.. అందాలు ఘనం





తన బిడ్డకు ఆహారం తినిపిస్తున్న బంగారు వీపు వడ్రంగి పిట్ట ★ తోక పిగిలి పిట్టను చూడటానికి రెండు కళ్లూ చాలవు. దీని తోక ఒక అడుగు వరకు పొడవు ఉంటుంది

వైఎస్సార్ కడప జిల్లాలోని లంకమల అభయారణ్యంలో అందమైన, అరుదైన దేశీయ విహంగాలు విహరిస్తున్నాయి. ఎన్నో రకాల పక్షులకు ఈ అటవీ ప్రాంతం ఆవాసం. పచ్చని చెట్లపై రకరకాల శబ్దాలు చేస్తూ సందడి చేస్తాయి. ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఇక్కడికి వలస వచ్చి, గుడ్లు పెట్టి.. వాటిని పొదిగి.. పిల్లలు బయటకు వచ్చిన తరువాత కొన్నాళ్లకు తిరిగి స్వస్థలాలకు వెళ్తాయి. సువిశాలమైన ఈ అడవిలో 113 రకాల పక్షులు సంచరిస్తున్నాయని విశ్రాంత అటవీ క్షేత్రాధికారి షేక్ మహమ్మద్ హయాత్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఒంటిమిట్ట, సిద్దవటం

ఆకుపచ్చని అభయం


అనేక మైళ్లు విస్తరించిన మహా వట వృక్షమది. అయినా బాటసారులకు నీడను ఇవ్వలేకపోతోంది. ఎందుకంటే, దానిమీద ఓ బ్రహ్మరాక్షసుడు చేరాడు. మనిషి కనపడితే అమాంతం చంపి తినేస్తున్నాడు. దగ్గరికి రావద్దని చెప్పడానికి మర్రి చెట్టుకు నోరు లేదాయె! కాబట్టి, పురుగులు దొలిచిన తన ఆకులను గాలికి దూరంగా వరుసగా పడేలా విసురుతోంది. క్రిములు చేసిన కన్నాలు (కీటకృత వ్రణచ్ఛలన లిపి) ‘రావద్దు... ఇక్కడ రాక్షసుడున్నాడు’ అనే వాక్యంలా ఏర్పడి, బాటసారులను హెచ్చరించాయి. క్రమంగా ఆ ప్రాంతం నిర్జనమైంది. చెట్ల పరోపకార బుద్ధిని వివరిస్తూ ‘ఆముక్తమాల్యద’లో కృష్ణదేవరాయలు చేసిన అద్భుత కల్పన ఇది! ‘కాంచెన్ వైష్ణవుడు...’ అనే ఆ పద్యంలో తొలిపదం తప్ప, తక్కినదంతా ఒకే సుదీర్ఘ సమాసంగా సాగి, కవి ఊహతో పాటు ఆ చెట్టు వైశాల్యాన్ని స్ఫురింప జేస్తుంది. ‘పచ్చదనమునెల్ల పరిసరమ్ముల నిల్పి, శుద్ధి చేసి గాలి వృద్ధి చేసి వీచుచుండు వేయి వింజామరల తోడ’ అంటూ కవులు వాటి సేవాగుణాన్ని ప్రస్తుతించారు. నిజానికి భూదేవికి- చెట్లు పరువు, మనిషి బరువు!

‘చెట్టు మనిషికి గురువు’ అన్నారు రవీంద్రులు. ‘ఫలాలు తన తరానికి అందవని తెలిసినా, మొక్కను నాటే వాడే- జీవిత పరమార్థాన్ని గ్రహిస్తాడు’ అని తేల్చారు. రామరాజ్యంలోని వృక్ష సంరక్షణ గురించి చెబుతూ- ‘పత్రాణామపి అవ్రణం... అక్కడ చెట్లకు గాయాలు ఉండవు’ అన్నారు వాల్మీకి మహర్షి. వాటి ప్రాధాన్యానికి ప్రతీకగా, పతాక శీర్షికగా- రాముడి రథం మీద జెండాపై చెట్టును చిహ్నంగా చిత్రించారాయన. అంతకన్నా ధన్యత ఏముంటుంది- ఏ జీవికైనా? మనిషికన్నా చెట్టు గొప్పదనేది అందుకే! మనిషికి పచ్చిగాలే- ప్రాణవాయువు. పచ్చదనమే- జీవహేతువు. ఆ రెండింటికి ఆయువు పోస్తాయి వృక్షాలు. కొమ్మను నరికితే, పరిహారంగా ఓ మొక్కను పెంచమంది వేదం. ‘వేసవి తాపాన్ని తామే భరించి, ఆశ్రితులకు చల్లని నీడనిస్తాయి’ అన్నాడు శాకుంతలంలో కాళిదాసు. ఊత‘కర్ర’ సాయంతో వృద్ధాప్యాన్ని వెళ్లదీసే మనిషి- ‘కట్టెలు’ తోడుగా కడతేరిపోతాడన్న సత్యాన్ని చెబుతూ, ‘నరునితో చెట్టు సహజీవనమ్ము సేయు, నరునితో చెట్టు సహగమనమ్ము చేయు’ అన్నారు బులుసుకవి. వాస్తవానికి అవి కలప వృక్షాలు కావు- కల్ప వృక్షాలు.

ఈ రహస్యం తెలిసిన విశ్వనాథ తన రామాయణ మహాకావ్యానికి కల్పవృక్షమని పేరు పెట్టారు. ‘ఈ చెట్లన్నియు తోడబుట్టువులు సుమ్మీ సీతకున్’ అనిపించారు రాముడి నోట- చెట్లకు, సీతమ్మకు భూదేవే తల్లి కనుక! ‘భారతం చిన్నచిన్న కథలనే శాఖలతో విస్తరించిన మహావృక్షం... అమిత ఆఖ్యానక శాఖలం బొలిచి’ అన్నాడు నన్నయ. ‘భాగవత కల్పతరువుకు కొమ్మలు సుకుమారం, కాండం చేవ’ అంటాడు పోతన. బతుకుతున్న బతుకు తనకోసమే కాకపోవడంలోని జీవన సాఫల్యం చెట్లకే బాగా తెలుసు. ‘కుసుమచ్ఛాయా ఫలశ్రీ (పూలు నీడ పళ్లు)చే ఉపకారంబులు సేయు ఎల్లరకును ఈ ఉర్వీజములు (చెట్లు) కంటివే?’ అని అడిగింది భాగవతం. ‘పెద్దపెద్ద చెట్లకింద నిత్యం నడకలు సాగించేవారికి హృద్రోగ ప్రమాదం నాలుగు శాతం తక్కువ’ అని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధనల్లో తేలింది. గుండె జబ్బులతో బాధపడే 89వేల మందిని పరిశీలించి తాజాగా చెప్పిన మాటది. ఆకాశసౌధాలను కాదు- అమోఘ వృక్షాలను చూసి మురిసిపోవాలి... మనిషి పచ్చని లోకంలో బతకాలి అన్నది దాని సారాంశం. వృక్షో రక్షతి రక్షితః!

విద్య యజమాని అయితే రాజకీయం దానికి సేవకుడు కావాలి. అధికారాన్ని నైతికతతోనూ శాస్త్ర సాంకేతికతలతోనూ జత చేసినప్పుడే అభివృద్ధి సాధ్యం.

– డాక్టర్ జాకీర్ హుస్సేన్, మాజీ రాష్ట్రపతి



విపత్తుల్లో డేటాను కాపాడేదెవరు?



మనందరి ఆధార్ వివరాలు, యూపీఐ లావాదేవీలు, భూములు, ఆస్తిపాస్తులు, ఆర్థిక సమాచారం, జనాభా లెక్కలు... ఇదంతా మహాసముద్రమంత డేటా! ప్రభుత్వం దగ్గర అది భద్రంగానే ఉన్నా, ఏదైనా అనుకోని ముప్పు వస్తే? దేశంలో ప్రకృతి విపత్తులు సంభవిస్తే, యుద్ధాలు వస్తే, ఇంటర్నెట్, టెలికం వ్యవస్థలు ఆగిపోతే, సర్వర్లు మొరాయిస్తే ఎలా? ప్రభుత్వ, ప్రజా కార్యకలాపాలన్నీ ఆగిపోవు! దేశం స్తంభించదు! సంక్షోభంలోకి కూరుకుపోదు! ఇలాంటి ఊహించని ఉత్పాతాలను ఎదుర్కొనేందుకు డేటా ఎంబసీలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇటీవల యూఏఈ అధ్యక్షుడి ఇండియా పర్యటనలో ఇందుకు తొలి అడుగు పడింది.

డేటా ఎంబసీ అనేది సాధారణ దౌత్య కార్యాలయం కాదు. ఒక దేశం తమ కీలకమైన డిజిటల్ డేటాను విదేశంలోని ఓ కేంద్రంలో భద్రపరచుకుంటుంది. దీనివల్ల సైబర్ దాడులు, ప్రకృతి విపత్తులు, యుద్ధాలు వంటి భౌగోళిక రాజకీయ సంక్షోభాలు ఎదురైనప్పుడు సైతం ప్రభుత్వం ఎలాంటి అవాంతరాలు లేకుండా కార్యకలాపాలను కొనసాగించుకోవచ్చు. మనకు విశ్వసనీయమైన ఆతిథ్య దేశంలో కీలకమైన డేటాబేస్‌ను సురక్షితంగా దాచి ఉంచడం ద్వారా ఇది సుసాధ్యమవుతుంది. డేటా ఎంబసీ విదేశీ గడ్డపై ఆ దేశ నిర్వహణలోనే ఉంటుంది. అక్కడి చట్టాల పరిధిలోనే పని చేస్తుంది. కాకపోతే, ఎంబసీలోని సర్వర్లలో భద్రపరచిన డేటాపై నియంత్రణ, ఆ సమాచార యాక్సెస్ సొంత దేశానికి, ఆ దేశ ప్రతినిధులకే ఉంటుంది. స్థానిక చట్టాల నుంచి రక్షణ లభిస్తుంది. సెర్చి వారెంట్లు, జప్తులు చెల్లవు. సమాచారాన్ని ఆ దేశం కోరడం, దానిపై ఉత్తర్వులు ఇవ్వడం కుదరదు. ఇదొక క్లౌడ్ ఎంక్లేవ్‌లా పనిచేస్తుంది.



వ్యూహాత్మక ప్రాధాన్యం

దౌత్య సంబంధాలపై వియన్నా ఒడంబడిక ప్రకారం ఒక దేశం... తమ గడ్డపై ఏర్పాటైన విదేశీ దౌత్య కార్యాలయానికి ఎలాంటి భద్రత, న్యాయరక్షణ, ఆతిథ్య మర్యాదలు లేని ఇమ్యూనిటీని కల్పిస్తుందో డేటా ఎంబసీకి కూడా అవన్నీ వర్తిస్తాయి. డేటా ఎంబసీలో దేశపు అత్యంత విలువైన డిజిటల్ సంపదను, అంటే పౌరుల గుర్తింపు డేటాబేస్‌లను, ఆర్థిక రిజిస్ట్రీలు, ప్రభుత్వ కీలక రికార్డులను భద్రపరుస్తారు. ఇండియాకు సంబంధించిన డేటా డిజిటల్ రూపంలో బ్యాకప్‌గా యూఏఈ డేటా ఎంబసీలో జాగ్రత్త చేస్తారు. ఇందులో కీలకమైన ఆర్థిక సమాచారంతోపాటు, ప్రజలకు సంబంధించిన రికార్డులు కూడా ఉండే అవకాశం ఉంది. ఇండియాకు సంబంధించిన కీలక సమాచారాన్ని తమ దేశంలో భద్రపరిచే ఎంబసీకి యూఏఈ అత్యున్నత స్థాయి భద్రతను సమకూర్చాల్సి ఉంటుంది. ప్రతిగా, యూఏఈ మన దేశంలో డేటా సెంటర్ హబ్‌ను ఏర్పాటు చేసుకుంటుంది.

ప్రపంచంలో తొలి డేటా ఎంబసీని 2017లో ఎస్టోనియా ఏర్పాటు చేసింది. లక్సెంబర్గ్‌తో ఒప్పందం ద్వారా దాన్ని నెలకొల్పింది. 2021లో మొనాకో కూడా ఈ-ఎంబసీని లక్సెంబర్గ్‌లో ఏర్పాటు చేసింది. ఇప్పుడు యూఏఈ, ఇండియా పరస్పరం తమ డేటా కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించాయి. అంగీకారం కుదిరింది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చుకుంటే ఇండియాకు సంబంధించి ఇదే తొలి ఈ-ఎంబసీ అవుతుంది. ఈ మేరకు డిజిటల్ ఎంబసీల ఏర్పాటులో సాధ్యాసాధ్యాలు, అవకాశాలను పరిశీలిస్తున్నట్లు భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ పేర్కొంది. డేటా ఎంబసీలకు జాతీయ ప్రాధాన్యం ఉన్న వ్యూహపరమైన విలువ కలిగిన సమాచారాన్ని భద్రపరిచే అవకాశం ఉన్నట్లు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వివరించారు. ఐటీ మంత్రిత్వ విషయమనీ, దీనికి సంబంధించిన చట్టబద్ధమైన విధివిధానాలు రూపొందిస్తున్నామన్నారు. నిజానికి 2023-24 బడ్జెట్‌లోనే ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ డేటా ఎంబసీల ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ప్రకటించారు. డిజిటల్ ఇండియా మిషన్‌లో భాగంగా ఈ ప్రతిపాదనకు వ్యూహాత్మక ప్రాధాన్యం ఉంది. మన దేశం ఇప్పటికే కాగితం రహిత పాలనా వ్యవస్థ వైపు వేగంగా ముందడుగు వేస్తున్న నేపథ్యంలో ప్రకృతి విపత్తులు, భారీ స్థాయి సైబర్ దాడులు వంటివి తీవ్రముప్పు కలిగించే అవకాశం ఎక్కువ. మన దేశం యూఏఈలో డేటా ఎంబసీని నెలకొల్పడం ద్వారా భౌగోళికంగా దూరంగా, డిజిటల్‌గా చేరువలో హాట్‌సైట్ బ్యాకప్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నట్లవుతుంది. ఏవైనా విపత్తులు సంభవించినప్పుడు డేటా రికవరీలో ప్రధాన డేటా కేంద్రం విఫలమైతే, కొద్ది నిమిషాల వ్యవధిలోనే బాధ్యతలు స్వీకరించేందుకు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉండే కేంద్రమే హాట్‌సైట్ బ్యాకప్ సెంటర్. ఇది వైపరీత్యం సంభవించిన వెంటనే కొన్ని నిమిషాలు, గంటల వ్యవధిలోనే సేవలను పునరుద్ధరిస్తుంది. రియల్‌టైమ్ డేటా మార్పులను ఎప్పటికప్పుడు నవీకరిస్తుంటుంది. దీనివల్ల కార్యకలాపాలకు ఎటువంటి అంతరాయమూ తలెత్తదు. విపత్తు నిర్వహణ వ్యూహంలో ఇదొక భాగం. ప్రధాన కేంద్రానికి అవసరమైన అన్నిరకాల హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ నెట్‌వర్క్ సౌకర్యాలు సదాసిద్ధంగా ఉంటాయి. ప్రభుత్వ కార్యకలాపాలు, ప్రజా సేవలు, బ్యాంకింగ్, ఆరోగ్య, ఈ-కామర్స్ వంటి సేవలు నిరంతరాయంగా అందించడంలో కీలకంగా పనిచేస్తుంది.

డిజిటల్ కారిడార్


మన దేశంలో డిజిటల్ ఎంబసీలను ఏర్పాటు చేసుకోవాల్సిందిగా ఇండియా వివిధ దేశాలను కోరుతూ వస్తోంది. అందులో యూఏఈ ముందుగా ఏర్పాటు చేసే అవకాశం ఉంది. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో దాన్ని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఇండియా, యూఏఈ డిజిటల్ ఎంబసీ ప్రాజెక్టును ఐమెక్(ఇండియా మిడిల్‌ఈస్ట్ యూరప్ ఎకనామిక్ కారిడార్)కు అనుసంధానించే అవకాశాలు ఉన్నాయి. ఈ డిజిటల్ కారిడార్ ఆచరణకు వస్తే, సీమాంతర డేటా సరఫరా తేలికవుతుంది. ఈ-ఎంబసీల సార్వభౌమత్వ నియంత్రణ పరిధిలోనే డేటా ప్రయాణానికి వీలుకల్పిస్తాయి. ఇలాంటి ద్వైపాక్షిక ఒప్పందం విశ్వాస ఆధారిత డిజిటల్ సంకీర్ణాలకు నాంది పలుకుతుంది. బిగ్ టెక్ వేదికలపై పూర్తిగా ఆధారపడాల్సిన అవసరం లేకుండా, ప్రభుత్వాల నడుమ డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనకు వీలు కుదురుతుంది.

– శ్రీనివాస్ దరెగోని

ఇల్లా... బొమ్మరిల్లా?

ఇల్లంటే... భార్యాభర్తా పరస్పరం గౌరవంతో, ప్రేమతో, నమ్మకంతో ఉంటారు. ఒకరికోసం ఒకరన్నట్లుగా జీవిస్తారు. మరి బొమ్మరిల్లయితే... అందులో పాత్రలన్నీ బొమ్మల్లా యజమాని చెప్పినట్లు పడి ఉంటాయి. ఈ తేడా అర్థమయ్యేలా నూటయాభై ఏళ్ల క్రితమే ‘ఎ డాల్స్ హౌస్’ అనే నాటకం రాశారు నార్వేజియన్ రచయిత హెన్రిక్ ఇబ్సెన్. షేక్‌స్పియర్ తరవాత అత్యధికంగా ప్రదర్శితమైన నాటకాలు ‘ద ఫాదర్ ఆఫ్ మోడ్రన్ డ్రామా’గా పేరొందిన ఇబ్సెన్‌వే.

క్రిస్మస్ షాపింగ్ చేసి కూనిరాగం తీస్తూ ఇంట్లోకి వస్తున్న నోరాతో నాటకం మొదలవుతుంది. ఆమె తెచ్చినవన్నీ చూసి చాలా ఖర్చుపెట్టేస్తున్నావంటాడు భర్త టార్వాల్ట్. ఇప్పుడు ప్రమోషన్ వచ్చింది కాబట్టి ఖర్చుపెట్టుకోవచ్చంటుంది నోరా.



ఇంతలో ఆమెను చూడటానికి చాలాకాలం తరవాత స్నేహితురాలు లిండ్ వస్తుంది. బాధలన్నీ చెప్పుకొంటూ భర్తను కోల్పోయి ఒంటరిగా ఉన్న తనకి ఉద్యోగం ఇప్పించమని అడుగుతుంది. నోరా కూడా స్నేహితురాలితో ఒక రహస్యాన్ని పంచుకుంటుంది. భర్త ఆరోగ్యం కోసం తాము ఇటలీ ట్రిప్‌కి వెళ్లాల్సి వచ్చిందనీ, ఒకరి దగ్గర అప్పుచేసి, అతి కష్టమ్మీద భర్తకు తెలియకుండా పనులు చేస్తూ వాయిదాల్లో అప్పు తీర్చానని చెబుతుంది. ఆ తరవాత లిండ్‌కి ఉద్యోగం ఇప్పించమని భర్తను అడుగుతుంది. కాసేపటికి టార్వాల్ట్ దగ్గర బ్యాంకులో పనిచేసే క్రాగ్‌స్టాడ్ వస్తాడు. నోరా అప్పు తీసుకుంది అతడి దగ్గరే. ఆరోజుల్లో స్త్రీలకు ఆర్థిక లావాదేవీలు నడిపే స్వేచ్ఛ లేదు. మగవాళ్ల సంతకం తప్పనిసరి. అందుకని తండ్రి సంతకాన్ని ఫోర్జరీ చేయడమే కాక నోటుమీద పొరపాటున తండ్రి చనిపోయిన తరవాత తేదీ వేసి క్రాగ్‌స్టాడ్‌కి దొరికిపోతుంది నోరా. దాన్ని అడ్డం పెట్టుకుని అతడామెను బ్లాక్‌మెయిల్ చేయబోతాడు. టార్వాల్ట్ తనని ఉద్యోగంలోంచి తీసేస్తున్నాడనీ తన ఉద్యోగం కాపాడమనీ లేకపోతే ఆమె రహస్యం చెప్పేస్తాననీ బెదిరిస్తాడు. నోరా భర్తను ఒప్పించలేకపోతుంది. క్రాగ్‌స్టాడ్ జరిగిందంతా టార్వాల్ట్‌కి ఉత్తరం రాస్తాడు. అది చూసిన టార్వాల్ట్ భార్యమీద మండిపడతాడు. తన జీవితాన్ని నాశనం చేసిందని, తన బిడ్డల్ని పెంచే అర్హత ఆమెకు లేదని, సమాజంకోసం మాత్రమే ఆమెను భార్యగా భరిస్తానంటాడు. లిండ్ జోక్యంతో మనసు మార్చుకున్న క్రాగ్‌స్టాడ్ కాగితాలన్నీ పంపించేస్తాడు. అది చూసి తేలిగ్గా నిట్టూర్చిన టార్వాల్ట్... నోరాను క్షమించానంటాడు. భర్త పరువూ ప్రతిష్ఠా అనకుండా తన తరఫున నిలబడతాడనీ, అతడి కోసం తాను ఆత్మహత్య చేసుకోవాలనీ ఆలోచించిన నోరా ఆ భ్రమలోంచి బయటపడుతుంది. స్వార్థం తప్ప తనమీద ప్రేమలేని అతడు అపరిచితుడిలా కనిపిస్తున్నాడనీ ఇక కలిసి జీవించలేనంటూ భర్త పిలుస్తున్నా వినకుండా తలుపు ధడాల్న వేసి వెళ్లిపోతుంది.

ఇబ్సెన్ స్నేహితురాలి విషయంలో అచ్చంగా ఇలాగే జరగ్గా భర్త విడాకులిచ్చి ఆమెను మానసిక శరణాలయంలో చేర్పించాడట. ఆ నేపథ్యంలోనే ఇబ్సెన్ ఈ నాటకం రాశారు. కాకపోతే కొంతకాలానికి ఆమె బయటికి వచ్చి గొప్ప రచయిత్రిగా పేరు తెచ్చుకున్నారు. నోరా ఆత్మగౌరవాన్ని వెతుక్కుంటూ వెళ్లిందని బెర్నార్డ్‌షా అంటే, నోరా తలుపు మూసిన చప్పుడు ప్రపంచమంతా మార్మోగిందన్నారు కళా విమర్శకుడు జేమ్స్ హునెకర్. స్త్రీవాద చరిత్రకారిణి మిరియం షీనర్ ఈ కథని స్త్రీవాద రచనల్లో చేర్చారు. చక్కటి సంభాషణలు, పాత్రల వ్యక్తిత్వాలను మలచిన తీరు నాటకాన్ని ఆపకుండా చదివిస్తాయి. దానిపై జరిగిన చర్చలు కూడా ఆసక్తికరంగా ఉంటాయి.

– మిహిర

న్యాయ నిరాకరణా? నాశనమా?

‘న్యాయ రథచక్రాలు ఒక్కోసారి నెమ్మదిగా కదులుతుంటాయి’ అంటారు బ్రిటిష్ మానవ హక్కుల కార్యకర్త, రచయిత టెర్రీ వెయిట్. మన దేశంలోనైతే వాటికీ నత్తలకూ పోటీపెడితే- నిమ్మళంగా నడిచే ఆ గుల్లపురుగులే గమ్యానికి త్వరగా చేరతాయి! ఎక్కడో అరుదుగా కాదు- ప్రతిచోటా ప్రతిసారీ న్యాయ వితరణలో కంటే నత్త నడకలోనే వేగమెక్కువ అనే నిట్టూర్పులు జనంలోంచి వినపడుతుంటాయి. జీవించే హక్కులో అంతర్భాగమైన సత్వర న్యాయం సుదూర స్వప్నంగా మిగిలిపోతున్న దయనీయావస్థలో- మన నేరన్యాయ వ్యవస్థే ఒక శిక్షగా పరిణమిస్తుంటుందని సుప్రీంకోర్టు మూడేళ్ల క్రితం ఆవేదనాత్మకంగా వ్యాఖ్యానించింది. అందులో అతిశయోక్తి ఏమీ లేదని ధర్మోదేవి అనే ఓ అభాగ్యురాలి జీవితగాథ నిరూపిస్తుంది. సీఆర్‌పీఎఫ్‌లో పనిచేసే ఆమె భర్త 1962 ఇండో-చైనా యుద్ధంలో వీరమరణం పొందారు. ఆయన భార్య ధర్మోదేవికి 1966 వరకు పింఛను ఇచ్చిన యంత్రాంగం ఆ తరవాత హఠాత్తుగా దాన్ని నిలిపేసింది. దానిపై ఆమె అదే ఏడాదిలో పంజాబ్-హరియాణా హైకోర్టును ఆశ్రయిస్తే- పెన్షన్‌ను పునరుద్ధరించాలంటూ 2022లో తీర్పు వచ్చింది. 56 ఏళ్ల పాటు చట్టబద్ధమైన హక్కును కోల్పోయిన బాధితురాలికి దీంతో న్యాయం జరిగినట్లేనా? ‘లేదు’! ఎందుకంటే, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఇటీవల హెచ్చరించినట్లు- ‘న్యాయ వితరణలో ఆలస్యం కావడమంటే న్యాయాన్ని నిరాకరించడం మాత్రమే కాదు, నాశనం చేయడం కూడా’!



పుణ్యభూమి

వ్యక్తిత్వాలకు అడుగడుగునా శల్యపరీక్షలు చేసే మన సమాజంలో అకారణంగా నింద మోస్తూ నాలుగు రోజులు బతకడమే కష్టం. అలాంటిది నలభై ఏళ్లుగా జనం కళ్లకు నేరగాడిగా కనపడాల్సి రావడమెంత దుర్భరం? తన నిర్దోషిత్వాన్ని గుర్తిస్తూ కోర్టు ఇచ్చే తీర్పుకోసం వందేళ్ల వయసులో కళ్లు కాయలుకాచేలా ఎదురుచూడటమెంత నరకం? ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ధనీరామ్ తన జీవన సంధ్యా సమయంలో ఈ వేదనంతా అనుభవించాడు. 1982 నాటి ఓ హత్య కేసులో అతను దోషి అని చెప్పి ట్రయల్ కోర్టు 1984లో జీవిత ఖైదు విధించింది. దానిపై ధనీరామ్ దాఖలు చేసిన అప్పీలుపై అలహాబాద్ హైకోర్టు కొద్దిరోజుల క్రితమే తీర్పిచ్చింది. ధనీరామ్ నిర్దోషి అని 42ఏళ్ల తరవాత తేల్చింది. న్యాయదేవత దయకు నోచుకునే సరికి కొంతమంది అమాయకుల జీవితాలు ఇలా తెల్లారిపోతుంటే- మరోవైపు, నిజంగా నేరాలు చేసినవారు దండనల నుంచి తప్పించుకుని పైలాపచ్చీసుగా బతికేస్తున్నారు. అదే ఉత్తర్‌ప్రదేశ్‌లో అదే 1982లో ఒక వ్యక్తి తన భార్యను చంపేశాడని కేసు నమోదైతే 1984లో ట్రయల్ కోర్టు దాన్ని కొట్టేసింది. దానిపై ప్రభుత్వం ఆనాడు అప్పీలుకు వెళ్తే, నిరుడు అక్టోబరులో ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆ వ్యక్తి హత్య చేశాడని నిర్ధారించిన హైకోర్టు అతనికి జీవితఖైదు విధించింది. రెండు వారాల్లో లొంగిపొమ్మని ఆదేశాలిచ్చింది. 28 సంవత్సరాల ప్రాయంలో హేయ నేరానికి పాల్పడిన వ్యక్తికి 71 ఏళ్ల వయసులో శిక్ష పడిందంటే- అది దండన ఎలా అవుతుంది? 1997లో ఇరవై రూపాయలు లంచం తీసుకున్నాడని అహ్మదాబాద్‌కు చెందిన ఓ కానిస్టేబుల్‌పై కేసు నమోదైంది. 2004లో జిల్లా కోర్టులో అతనికి మూడేళ్ల శిక్ష పడింది. రెండు దశాబ్దాలకు పైగా సాగిన విచారణ తరవాత గుజరాత్ హైకోర్టు ఆ కానిస్టేబుల్‌ను మొన్న నాలుగో తేదీన నిర్దోషిగా ప్రకటించింది. తన జీవితంపై పడిన మరక తొలగిపోయిందంటూ భావోద్వేగానికి గురైన ఆ మాజీ పోలీసు ఆ రోజు రాత్రే కన్నుమూశాడు. కళ్లకు గంతలు కట్టుకున్న న్యాయదేవత సాక్షిగా ఇలా చెప్పుకొంటూ వెళ్తే దేశవ్యాప్తంగా ఎన్నెన్నో కేసులు... సంవత్సరాల తరబడిగా పేరుకుపోయిన ఆ వ్యాజ్యాల గుట్టల కింద రాజ్యాంగ నిర్దేశమైన సత్వర న్యాయ భావన నలిగిపోతోంది. నిస్సహాయ జనభారతం దాన్ని చూస్తూ, వ్యవస్థలపై విశ్వాసాన్ని హరించే నిర్వేదంలో మునిగిపోతోంది!

జాతీయ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ సమాచారం ప్రకారం, దేశవ్యాప్తంగా కిందిస్థాయి కోర్టుల్లో 4.81 కోట్ల కేసులు మోక్షంకోసం ఎదురుచూస్తున్నాయి. హైకోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య 63.56 లక్షలకు చేరితే- సుప్రీంకోర్టులో అది దాదాపు 93వేలుగా లెక్కతేలుతోంది. అపరిష్కృత వ్యాజ్యాలు ఇంతగా పోగుపడటానికి న్యాయమూర్తులు కారణం కారని, వ్యవస్థలోనే లోపముందన్నది కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాట! ఆ తప్పే ఎక్కడ ఎవరి వల్ల జరుగుతోంది? ఇందుకు సమాధానం- ‘ప్రభుత్వాధికారుల నియామకాలు చేపట్టినంతగా న్యాయమూర్తులను నియమించరు’ అన్న మాజీ సీజేఐ జస్టిస్ రంజన్ గొగొయి విమర్శలో దొరుకుతుంది! అమెరికాలో ప్రతి పది లక్షల మందికి సగటున 150 మంది, యూరోప్‌లో 220 మంది జడ్జిలు పనిచేస్తున్నారు. చైనాలోనైతే మూడొందల మందికి పైగా ఉన్నారు. మరి మన పుణ్యభారతంలో? పది లక్షల జనాభాకు కనీసం యాభై మంది న్యాయమూర్తులు ఉండాలని లా కమిషన్ ఎప్పుడో 1987లో సిఫార్సు చేస్తే- ఇప్పటికీ అందులో సగానికి కూడా చేరుకోలేదు మనం! ప్రస్తుతం ప్రతి పది లక్షల మంది భారతీయులకు 22 మంది న్యాయమూర్తులే అందుబాటులో ఉన్నారు. ఈ నెల ఒకటో తేదీ నాటికి దేశీయంగా పాతిక హైకోర్టుల్లో మంజూరైన 847 జడ్జి పోస్టుల్లో 308 ఖాళీగా కనపడుతున్నాయి. కింది స్థాయి కోర్టుల్లో 25,895 మంది న్యాయాధికారులను నియమించాల్సి ఉంటే- 4867 పోస్టులు భర్తీ కాలేదు. దీనికితోడు మౌలిక సదుపాయాల కొరత, వాయిదాల సంస్కృతి వంటివి పెచ్చుమీరుతున్నప్పుడు ఇక వేగంగా న్యాయ నిర్ణయాలు ఎలా వెలువడుతాయి? పౌరహక్కులు సురక్షితమెలా అవుతాయి? ప్రజలందరికీ న్యాయం చేస్తామని రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పదవుల్లోకి వచ్చిన నాయకులే దీనికి జవాబు చెప్పాలి!

– శైలేష్ నిమ్మగడ్డ

ఎవరు గొప్ప?

నన్ను మించిన వారెవరూ లేరు అనే అహంభావం వల్ల మనుషుల మధ్య గొడవలు జరగడం సహజమే. కానీ మునులు, మహాపురుషులు, దేవతలు సైతం వాటి ప్రభావంలో పడి, తరవాత పశ్చాత్తాపం చెందడం ఆశ్చర్యపరుస్తుంది.

పరమేశ్వరుడి ‘డమరుకం’ నుంచి సంగీతం ఆవిర్భవించింది. శ్రవణ శుభగమైన ఆ సంగీతకళను లోకానికి అందించి పునీతం చేయాలని మహేశ్వరుడు సంకల్పించాడు. అదే సమయంలో తుంబురుడు, నారదుడు పరమేశ్వరుడి దర్శనార్థం వచ్చారు. ఆ సంగీత విద్యను తమకు నేర్పాలని అర్థించారు. అర్ధనారీశ్వరుడు అంగీకరించాడు.

తుంబురుడు సంగీతం నేర్చుకుని దేవలోకంలో ప్రచారం సాగించాడు. నారదుడు భూలోకంలో సంచారం చేస్తూ సంగీత కళను పరివ్యాప్తం చేయసాగాడు. కొంతకాలం గడిచింది. కాకతాళీయంగా వారిద్దరూ ఓసారి కలిశారు. సంగీతంలో నేను నిష్ణాతుణ్ని అంటే నేను గొప్పవాణ్ని అని వాదోపవాదాలు మొదలయ్యాయి. తీర్పు కోసం సరస్వతీదేవి దగ్గరికి వెళ్లారు. ‘ఇద్దరూ ప్రవీణులే’ అంటూ తప్పించుకుందామె. శివుడి చెంతకు వెళ్లి తమ కలహాన్ని తీర్చమని కోరారు. శివుడూ నొప్పింపక, తానొవ్వక తప్పించుకున్నాడు. అప్పుడిక పార్వతీదేవిని ఆశ్రయించారు. ‘మీరు ఆంజనేయుణ్ని అడగండి. ఆయన గొప్ప సంగీత విద్వన్మణి!’ అని సలహా ఇచ్చిందామె.



అంతర్యామి


తుంబుర నారదులు వింధ్య పర్వత ప్రాంతంలో తపస్సు చేసుకుంటున్న హనుమను చేరి, ‘పవనసుతా! మమ్మల్ని పరీక్షించి మా ఇద్దరిలో గొప్ప ప్రతిభాశాలి ఎవరో చెప్పాలి’ అని కోరారు. ‘మీ వీణలు ఇవ్వండి ముందు’ అన్నాడు వాయుసుతుడు. తుంబురుడు తన ‘కళావతి’ని, నారదుడు ‘మహతి’ని హనుమకు ఇచ్చి ఎదుట కూర్చున్నారు. మారుతి తన సుమధుర స్వరంతో గానం చేయడం మొదలుపెట్టాడు. తుంబుర నారదులు ఆ మధుర మనోహర ఆలాపనను వింటూ పరవశులైపోయారు. తన అపూర్వ గానమాధుర్యానికి అక్కడి కొండరాళ్లన్నీ కరిగి నీరై ప్రవహిస్తుంటే హనుమ హఠాత్తుగా గానం ఆపేసి, చేతిలోని రెండు వీణలను ప్రవాహంలోకి విసిరేశాడు. గానం ఆగిపోగానే ఆ నీళ్లన్నీ రాళ్లుగా మారాయి. తుంబుర నారదులు అవాక్కయ్యారు. ‘అయ్యో, మా వీణలేవీ?’ అని వాపోయారు. ‘మీరిద్దరూ మీ సంగీతంతో రాళ్లను నీళ్లుగా మార్చి, వీణలు తీసుకుని పోవచ్చు’ అన్నాడు హనుమంతుడు. తుంబురుడు గానం చేశాడు. రాళ్లు రాళ్లుగానే ఉన్నాయి. తెల్లమొహం వేసి, అలసి పాడటం మానేశాడు. నారదుడూ స్వరం సవరించాడు. రాళ్లలో మార్పులేదు. మళ్లీ హనుమ గానం చేసి రాళ్లను నీళ్లుగా మార్చి వీణలు బయటికి తీసి వారికిచ్చాడు. ‘ఏ విద్యలోనైనా అహంకారం పనికిరాదు. గర్వం పతనానికి నాంది. నిజానికి మీరిద్దరూ సమానులే. మీ విధులను మీరు నిర్వర్తించండి’ అన్నాడు. హనుమకు నమస్కరించి తుంబుర నారదులు తమ వీణలతో తిరుగుముఖం పట్టారు. ‘నేనే గొప్పవాణ్ని’ అన్న అహంకారం ఎక్కువైతే ఎవరికైనా భంగపాటు తప్పదని ఈ వృత్తాంతం తెలియజేస్తుంది.

– చిమ్మపూడి శ్రీరామమూర్తి

గాలిలో ఏముంటుంది?

ఫ్రెండ్స్... మీరు ఎప్పుడైనా గాలిని చూశారా? ఎవరైనా చూస్తారా దాన్ని? అనే కదా మీరనుకుంటుంది. మరి, మన చుట్టూ ప్రతిచోటా గాలి ఉంటుంది కదా! ప్రతి ఖాళీలోనూ ఉంటుంది. మనం శ్వాస తీసుకున్న ప్రతిసారీ ఊపిరితిత్తులు గాలితోనే నిండిపోతాయి. అంటే మన చుట్టూ, మన లోపల గాలి ఉన్నా కనిపించడం లేదన్నమాట. గాలిని కంటితో చూడకున్నా, రుచి చూడకున్నా, అది ఉన్నట్లయితే తెలుస్తుంటుంది కదూ! మరి, గాలిలో ఏముంటుందో తెలుసుకుందామా!

గాలి ఒక పదార్థం. శాస్త్రవేత్తలు కూడా పదార్థమనే అర్థంలో మ్యాటర్ అని వ్యవహరిస్తారు. పదార్థం అంటే ఘనరూపం కావచ్చు, ద్రవరూపంలోనూ ఉండొచ్చు. ఇక్కడ పదార్థంగా పిలిచే గాలి వాయు రూపంలో ఉంటుంది. ఇంతకీ గాలి ఎలా ఏర్పడుతుందంటే.. కొన్ని



రకాల వాయువులతో కలిసి ఏర్పడుతుంది. అందులో నైట్రోజన్, ఆక్సిజన్ ముఖ్యమైనవి. గాలిలో 99శాతం ఇవే ఉంటాయి. 78శాతం నైట్రోజన్, 21శాతం ఆక్సిజన్ నిష్పత్తిలో ఉంటాయి. మిగతా ఒక శాతం అరుదైన వాయువులుగా పిలిచే ఆర్గాన్, నియాన్, హీలియం, క్రిప్టన్, జెనాన్ వంటి వాటితో నిండుతుంది. స్వల్ప పరిమాణంలో కార్బన్‌డయాక్సైడ్ కూడా ఉంటుంది. దీన్ని ప్రాణమున్న జీవులు చేరుస్తాయన్నమాట. గాలితో కూడిన మహాతలం భూమి ఉపరితలం పైనుంచి కొన్ని మైళ్ల పైదాకా విస్తరించి ఉంటుంది. ఎందుకంటే, గాలిని గురుత్వాకర్షణ శక్తి లాగుతుంటుంది. లేదా భూమి వైపుగా పట్టి ఉంచుతుంది. గాలికీ బరువు ఉంటుంది. అది పీడనాన్ని కలుగజేస్తుంది. మన శరీరం మొత్తాన్ని గాలి అన్నివైపుల నుంచీ పీడనానికి గురిచేస్తుంది. ఏదైనా పర్వతం పైకి ఎక్కినప్పుడు, విమానంలో వెళ్లినప్పుడు, అలా పైకి వెళ్లేకొద్దీ తక్కువ గాలి ఉంటుంది. అందుకనే, పీడనమూ తగ్గుతుంది. దాదాపు వంద కిలోమీటర్లపైన పీడనమే ఉండదు తెలుసా!

– శ్రీజన్

చెప్పుకోండి చూద్దాం!

ఇక్కడ ఆంగ్లంలో ఒకే అక్షరంతో ముగిసే అంశాల పేర్లు ఉన్నాయి. కానీ అందులో కొన్ని వేరేవీ కలిసిపోయాయి. అవేంటో చెప్పుకోండి చూద్దాం.

తాళం	జింక	పాలు
మామిడిపండు	సంచి	పుస్తకం
గడియారం	పాము	ఇటుక

కమనీయం.. సిడిబండి మహోత్సవం




ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ల "సిడిబండి" మహోత్సవం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. ప్రధాన ఘట్టమైన నూతన పెళ్లికుమారుడిని గంపలో కూర్చోపెట్టి ఊరేగించే కార్యక్రమం కోలాహలంగా సాగింది. ట్యాంకు ఏరియా నుంచి బయలుదేరిన సిడిబండి భారీ పోలీసు బందోబస్తు, వేలాది జనంతో వీరమ్మతల్లి తిరునాళ్ల ఉత్సవ ఆలయ ప్రాంగణానికి చేరుకుంది. అనంతరం సిడిబండిని తిరునాళ్ల ముగింపు వరకు అక్కడే ఉంచుతారు. గన్నవరం డీఎస్పీ సి. హెచ్. శ్రీనివాస్ నేతృత్వంలో ఉయ్యూరు పట్టణ సీఐ టీవీవీ రామారావు ఆధ్వర్యంలో వందలాది మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. - ఉయ్యూరు, న్యూస్‌టుడే

నిర్లక్ష్యం నిప్పై.. నిస్తేజం ముప్పై..

బస్సుల నిర్వహణకు ట్రావెల్స్ యాజమాన్యాల పాతర
పర్యవేక్షణను గాలికొదిలిన అధికార యంత్రాంగం



కీసర వద్ద శనివారం తెల్లవారుజామున దగ్ధమవుతున్న బస్సు


పూర్తిగా కాలిపోయిన లోపల భాగం

'మొన్న అనాసాగరం దగ్గర ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సుకు పెద్ద ప్రమాదం త్రుటిలో తప్పింది. బస్సు నిండా ప్రయాణికులు ఉండగా.. ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. **తాజాగా** అదే జాతీయ రహదారిపై కీసర వద్ద.. మరో పెను ప్రమాదమే తప్పింది.'

- ఈ రెండు ప్రమాదాలకు కారణమైన బస్సులు ప్రైవేట్ ట్రావెల్స్‌వే. ఒక బస్సు అతివేగంగా ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేయబోయి ప్రమాదానికి గురవగా.. మరో బస్సు నిర్వహణ సరిలేక.. వెనుక ఇంజిన్ భాగంలో మంటలు చెలరేగాయి.'

కీసర దగ్గర బస్సు ప్రమాద తీవ్రత చూస్తే.. నిరుడు అక్టోబరులో కర్నూలులో జరిగిన విషాద ఘటననే గుర్తుకు తెస్తోంది. కీసర వద్ద బస్సు డ్రైవర్ ప్రమాదాన్ని ముందే గుర్తించి.. బస్సును ఆపేసి.. అందరినీ అప్రమత్తం చేసి.. మంటల వ్యాప్తికి ముందే దించకపోయి ఉంటే.. మళ్లీ కర్నూలు దుర్ఘటనే జరిగేది. ఇప్పటికైనా అధికారులు అప్రమత్తమై.. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై పర్యవేక్షణ పెంచాలి.

రద్దీ ఉంటే.. రెచ్చిపోతున్నారు.. విజయవాడ నుంచి నిత్యం వందల ట్రావెల్స్ బస్సులు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తిరుపతి, విశాఖ సహా అన్నిప్రాంతాలకు వెళ్తున్నాయి. అటునుంచీ అంతే స్థాయిలో వస్తుంటాయి. ప్రధానంగా వారాంతాలు, పండగల వేళల్లో అధిక డిమాండ్‌తో.. ఉన్న బస్సులన్నీ రోడ్డుపైకి తెస్తున్నారు. ★ వీటిలో చాలావాటికి.. ఫిట్‌నెస్, సేఫ్టీ, పర్మిట్‌లలో ఉల్లంఘనలు ఉంటున్నాయి. అధికారుల తనిఖీల్లోనూ ఇది బయటపడుతూనే ఉన్నా.. బస్సులను సీజ్ చేయడం.. వదిలేయడం తప్ప కఠిన చర్యల్లేవు. ★ అధిక ధరలు పెంచి డిమాండ్‌కు తగ్గట్టుగా ట్రావెల్స్ సంస్థలు పిండేస్తున్నాయి. కొన్నిసార్లు ఈ ఏసీ స్లీపర్ కోచ్ బస్సుల టిక్కెట్ ధరలు చూస్తే.. విమానాల్లో వెళ్లడం మేలనేలా ఉంటున్నాయి.



లోపలభాగం పూర్తిగా కాలిపోగా.. బయట ఇలా..

దృష్టి పెట్టాల్సిన అంశాలు...

★ బస్సు ఫిట్‌నెస్ సరిగా ఉందో లేదో.. రవాణా శాఖ క్రమం తప్పక తనిఖీ చేయాలి. ★ ప్రయాణికుల లగేజీ తప్ప.. ఇతర వాణిజ్య సరకులు ఎక్కించడానికి వీల్లేదు. ★ మండే స్వభావం ఉన్న సరకులు, ఇంధనం, ద్విచక్ర వాహనాల తరలింపును నిషేధించాలి. ★ అతివేగంపై ఆంక్షలు లేక బస్సులను మెరుపులా పరుగులు పెట్టిస్తున్నారు. ★ ఇంజిన్‌కు విశ్రాంతి ఇవ్వకుండా నిరంతరం నడపడంతో వేడెక్కడం, ఇంధనం లీకేజీ, షార్ట్‌సర్క్యూట్‌లు జరుగుతున్నాయి. ★ అగ్నిప్రమాద నిరోధక ఏర్పాట్లే ఉండడం లేదు. అత్యవసర ఎగ్జిట్‌లు కనీసం 2, 3 ఉండాలి.


కాలిపోయిన బస్సును పరిశీలిస్తున్న అధికారులు

- ఈనాడు, అమరావతి- న్యూస్‌టుడే, కంచికచర్ల




అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్2025 విజేతలతో కేంద్ర మంత్రి జితేంద్రసింగ్, సీఎం చంద్రబాబు, ప్రొ.వి.కామకోటి (డైరెక్టర్ ఐఐటీ మద్రాస్), మంత్రి నారా లోకేశ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని తదితరులు


దశ మార్చే ఘట్టం.. దార్శనికతకు పట్టం

★ కలల క్వాంటమ్ వ్యాలీకి శంకుస్థాపన
★ విద్యార్థులు పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి: సీఎం

తుళ్లూరు, న్యూస్‌టుడే

ఎంత పెద్ద ప్రయాణమైనా ఆ అడుగుతోనే ప్రారంభమవుతుంది. దీనికి మహోజ్వల సంకల్పం ఇంధనమైతే.. దార్శనిక నాయకత్వం తోడైతే.. ఇక ఎదుగుదలకు ఆకాశమే హద్దు. ప్రజా రాజధాని అమరావతిలోని ఉద్దండరాయునిపాలెం వేదికగా జరిగిన క్వాంటమ్ వ్యాలీ శంకుస్థాపన వేడుకకు ఈ మాటలు సరిగ్గా సరిపోతాయి. కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖ మంత్రి జితేంద్ర సింగ్, సీఎం చంద్రబాబు, పలువురు మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ, వివిధ సంస్థల ప్రతినిధుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం పండగ వాతావరణంలో జరిగింది. క్వాంటమ్ వ్యాలీ ప్రాధాన్యత, రాష్ట్రానికి చేకూరే ప్రయోజనాలను వివరిస్తూ వక్తలు చేసిన ప్రసంగాలకు వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు, యువత నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ప్రత్యేకంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు మాట్లాడుతున్నప్పుడు ఉత్సాహంతో పెద్ద ఎత్తున చప్పట్లు, కేరింతలు కొట్టారు. రాష్ట్ర యువత క్వాంటమ్ సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రపంచస్థాయిలో ఎదగాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి రాజధాని రైతులు, మహిళలు, వివిధ కళాశాలల విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. ★ అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ 2025లో విజేతలుగా నిలిచిన విద్యార్థుల బృందాలకు ధ్రువీకరణ పత్రాలతోపాటు నగదు ప్రోత్సాహక చెక్కులను కేంద్ర మంత్రులతో కలిసి సీఎం ప్రదానం చేశారు. హాజరైన వారందరికీ భోజనం, అల్పాహారం, తాగునీరు అందజేశారు.


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తదితరులు


రాష్ట్ర చరిత్రలో ఇది కీలక మైలు రాయి. హైదరాబాద్‌లో హైటెక్ సిటీని నిర్మించిన సీఎం చంద్రబాబు.. ఇప్పుడు క్వాంటమ్ హబ్‌కు శ్రీకారం చుట్టడం అద్భుతం.- **సునీల్, బీటెక్, కేఎల్ యూనివర్సిటీ**


రాష్ట్రంతో పాటు దేశ అభివృద్ధిలో క్వాంటమ్ వ్యాలీ కీలక పాత్ర పోషిస్తుంది. అమరావతిలో క్వాంటమ్ టెక్నాలజీ హబ్‌ను ఏర్పాటు చేయడం సీఎం చంద్రబాబు దార్శనికతకు నిదర్శనం. -**జి.ఎలిజబెత్ రాణి, విద్యార్థిని, ఏపీ-ఎస్ఆర్ఎం వర్సిటీ**


క్వాంటమ్ సాంకేతికతకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది. వేగంగా ఆర్థిక వృద్ధి సాధిస్తున్న మన దేశానికి అమరావతిలో నిర్మించే క్వాంటమ్ వ్యాలీ కీలకంగా మారనుంది. -**డా.సుధాకర్, డీన్, స్కూల్ ఆఫ్ సీఎస్ఈ, వీఐటీ ఏపీ**

సౌర విద్యుత్తు మిగులు బకాయిలు తక్షణమే చెల్లించాలి

సూర్యారావుపేట: సౌర విద్యుత్తు మిగులు యూనిట్ల బకాయిలను తక్షణమే వినియోగదారులకు చెల్లించాలని సంబంధిత విద్యుత్తు సర్కిల్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఏపీసీపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఆర్సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. సౌర విద్యుత్తు వినియోగదారులకు 7 నెలలుగా చెల్లింపులు ఆగిపోయిన వైనంపై.. 'మిగులు నగదు.. అందక దిగులు' శీర్షికన ఈ నెల 4న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మిగులు సౌర యూనిట్ల చెల్లింపులపై వివరణ ఇచ్చారు. 2026 జనవరి వరకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆదేశించినట్లు వివరించారు. కొత్తగా అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్ ద్వారా 2026 ఫిబ్రవరి నుంచి నగదు మొత్తాన్ని వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.

సమాజ సేవ.. వికాస తోవ

పీఎంశ్రీ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటు

విజయవాడ సిటీ, ఉయ్యూరు గ్రామీణం - న్యూస్‌టుడే

మార్కులపై వ్యామోహం వద్దు... జీవన నైపుణ్యాల మెరుగుపై దృష్టి సారించండి.. అంటూ తాజాగా 'పరీక్ష పే చర్చ' కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అందులో భాగంగానే చదువుతో పాటు సేవా భావం, దేశభక్తి, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాల పెంపు, సమాజంలో నడవడిక... తదితర రంగాల్లో విద్యార్థులు రాణించేలా సమగ్ర శిక్షా.. పీఎంశ్రీ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటు చేసింది.

ఒక్కో పాఠశాలకు రూ.50 వేలు

★ సమగ్ర శిక్షా అధికారులు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని 59 పీఎంశ్రీ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటు చేశారు. ఒక్కో పాఠశాలకు రూ.50 వేలు మంజూరు చేశారు. పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. అందుకు రూ.5 వేలు కేటాయించారు. ★ ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులతో చేయిస్తారు. రూ.30 వేలతో స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరిన విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టించి ఇచ్చారు. రూ.15 వేలతో క్యాంప్‌నకు తీసుకెళ్లారు. ఉమ్మడి జిల్లాలో 1,770 మంది విద్యార్థులను ఎంపిక చేశారు.

★ ఆ విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి పరిరక్షణ బాధ్యత తీసుకుంటారు. దేవాలయాల వార్షికోత్సవాలు, వివిధ వేడుకల సమయంలో వచ్చే భక్తులు క్యూలైన్లలో వెళ్లేలా పర్యవేక్షిస్తారు. తాగునీరు, మజ్జిగ, ప్రసాదాలు పంపిణీ చేస్తారు. స్వాతంత్ర్య దినోత్సవాలు, రిపబ్లిక్ డే తదితర కార్యక్రమాల్లో భాగస్వాములవుతారు. ఆయా సేవా కార్యక్రమాలు విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతున్నాయని అధికారులు చెబుతున్నారు.


మొక్క నాటుతున్న విద్యార్థులు

బాధ్యతపై అవగాహన కలుగుతుంది

విద్యార్థి దశలోనే వ్యక్తిత్వ వికాసం కలుగుతుంది. పాఠశాలలు, గ్రామం, ఇతర ప్రాంతాల్లో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల సేవాభావం, నాయకత్వ లక్షణాలు అలవడతాయి. సమాజంలో ఎలా ప్రవర్తించాలి, పౌరుల బాధ్యతపై అవగాహన కలుగుతుంది.
- **ఎస్.అశోక్‌బాబు, సమగ్ర శిక్షా, ఏఎంవో**

ఏలూరు కాలువకు నీరు నిలిపివేత

ఎన్టీఆర్ కలెక్టరేట్: కృష్ణా తూర్పు ప్రధాన కాలువ పరిధిలోని ఏలూరు పంట కాలువకు నీటి విడుదలను నిలిపివేశారు. ఎనికేపాడు వద్ద బుడమేరు అండర్ టన్నెల్(యూటీ) విస్తరణ పనులు చేపట్టనున్న క్రమంలో తాగునీటి అవసరాల కోసం చెరువులను ముందస్తుగానే నింపారు. ప్రకాశం బ్యారేజీ నుంచి పశ్చిమ ప్రధాన కాలువకు 2,304, గుంటూరు ఛానల్‌కు 86, కృష్ణా తూర్పు 502 క్యూసెక్కులు విడుదల చేశారు. ప్రధాన కాలువ నుంచి కేఈబీ కాలువకు 302, బందరు కాలువకు 200 క్యూసెక్కులు ఇస్తున్నారు.

జిల్లా స్థాయి ప్రతిభాపాటవ పోటీలు నేడు

ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి పాఠశాలల ప్రతిభా పోటీలు ఆదివారం జరగనున్నాయి. విజయవాడ కొత్తపేటలోని కేబీఎన్ కళాశాలలో ఉదయం 9.30కి పోటీలు ప్రారంభం కానున్నాయి. నాలుగు నెలలుగా ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని వివిధ కేంద్రాల్లో 133 పాఠశాలల్లో వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్ విభాగాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పోటీలు జరిగాయి. రీజినల్ స్థాయిలో 1420 మంది హాజరు కాగా, 144 మంది బహుమతులు అందుకుని జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. మచిలీపట్నం, అవనిగడ్డ, గుడివాడ, గన్నవరం, విసన్నపేట, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట, పెనమలూరు, విజయవాడలోని పలు కేంద్రాల నుంచి 144 మంది విద్యార్థులు జిల్లా పోటీలకు అర్హత సాధించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆదివారం ఉదయం 9 గంటలకు వేదిక వద్దకు చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు. - చిట్టినగర్, న్యూస్‌టుడే

నేటి నుంచి శిరస్త్రాణం తప్పనిసరి



విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ద్విచక్రవాహన ప్రమాదాల్లో మరణాలను తగ్గించేందుకు ట్రాఫిక్ పోలీసులు ఆదివారం నుంచి కఠిన చర్యలకు శ్రీకారం చుడుతున్నారు. శిరస్త్రాణం లేకుండా ద్విచక్రవాహనం నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆదివారం నుంచి ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని స్పష్టం చేశారు. గతంలో తీసుకున్న చర్యలతో శిరస్త్రాణం వినియోగం గణనీయంగా పెరిగిందని 65 నుంచి 70 శాతం మంది వినియోగిస్తున్నారని తెలిపారు. దీనిని నూరు శాతం పెంచాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని ఇటీవల పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు వెల్లడించారు. దీనిలో భాగంగా శిరస్త్రాణం వినియోగంపై ఆదివారం నుంచి ప్రత్యేక తనిఖీలు చేపడతామని తెలిపారు.

కుటుంబ భవిష్యత్తు దృష్టిలో ఉంచుకోండి

- షిరీన్‌బేగం, ట్రాఫిక్ డీసీపీ

రోడ్డు ప్రమాదం ఒక కుటుంబాన్ని విచ్ఛిన్నం చేస్తుందని ట్రాఫిక్ డీసీపీ షిరీన్‌బేగం తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయిన పిల్లలు, పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల వేదన చూడలేమని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని కోరారు. తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని కోరారు.

నేడు విద్యుత్తు బిల్లులు చెల్లించొచ్చు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: ఆదివారం సెలవు దినమైనప్పటికీ జిల్లాలోని అన్ని విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలు తెరచి ఉంటాయని సంస్థ ఎస్ఈ యు.హనుమయ్య తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని తమ విద్యుత్తు బిల్లులు చెల్లించాలని కోరారు. దీంతో పాటు ఏపీసీపీడీసీఎల్ కస్టమర్ యాప్ ద్వారా ఇంటి వద్ద నుంచే విద్యుత్తు సర్వీసు నంబరును యాప్‌లో రిజిస్టర్ చేసుకుని కూడా బిల్లులు చెల్లించవచ్చన్నారు. అదే విధంగా గూగుల్ పే, ఫోన్ పే, అమెజాన్ పే, బిల్‌డెస్క్ యాప్‌ల ద్వారా కూడా విద్యుత్తు బిల్లులు చెల్లించవచ్చని ఎస్ఈ తెలిపారు.

కోత వీడేలా.. రాత మారేలా!

చినగొల్లపాలెంలో కడలి కోతకు పరిష్కారం ★ సిద్ధమవుతున్న డీపీఆర్

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలంలోని చినగొల్లపాలెం సముద్రుడి ఉగ్రరూపానికి చిగురుటాకులా వణికిపోతోంది. జిల్లాలోనే కొబ్బరి, సరుగుడు తోటలకు ప్రసిద్ధి అయిన ఈ గ్రామం కొన్నేళ్లుగా కడలి కోతతో కంటతడి పెడుతోంది. ఉప్పుటేరు, కొల్లేరు కాలువలు.. సముద్రం కలిసి గ్రామాన్ని చుట్టుముట్టేయడంతో దీవిలా మారిపోయింది. మొగ మూసుకుపోవడం..అలల ఆటుపోట్లతో వేల ఎకరాల పంట పొలాలను కడలి ముంచేసింది. ప్రశాంత వాతావరణం.. ఎటు చూసినా పచ్చదనం.. ఎగసిపడే అలల సవ్వడి.. ఎంతో ఆహ్లాదంగా ఉండే చినగొల్లపాలెం కడలి కోతపై పలుమార్లు 'ఈనాడు, ఈటీవీ'లో కథనాలు ప్రచురితమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక 'చుట్టుముట్టేస్తోంది.. గట్టుకోసేస్తోంది' శీర్షికతో మరోమారు 'ఈనాడు- ఈటీవీ'లో రైతుల ఆవేదనపై కథనం వచ్చింది. స్పందించిన ఎంపీ బాలశౌరి సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. గత నెల 9న జాతీయ తీర పరిశోధన కేంద్రం (ఎన్‌సీసీఆర్) శాస్త్రవేత్తల బృందం గ్రామంలో పర్యటించి సమస్య అధ్యయనం చేసింది. పలు శాఖల ఇంజినీర్లు కోతకు గురవుతున్న తీరు.. పరిష్కార మార్గాలపై అన్వేషణ చేస్తున్నారు. త్వరలోనే రక్షణ గోడలు.. పూడిక తీత.. ఇతర నిర్మాణాలపై రూ.300-350 కోట్ల అంచనాలతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.


అధ్యయనం చేస్తున్న అధికారులు

త్వరలో పనులు ప్రారంభం: వ్యవసాయం, చేపల వేటే ప్రధాన జీవనాధారమైన ఈ గ్రామంలో సుమారు 12,000 మంది జనాభా ఉన్నారు. అధిక వర్షాలు.. సముద్ర ఆటుపోట్లకు కాలువలు పొంగి గ్రామంలోని ఇళ్లలోకి నీరొచ్చేస్తోంది. ఏటిపర్రు మొగ నుంచి.. కొత్తకాలువ మొగ వరకు దీవి చుట్టూ కొబ్బరి, సరుగుడు తోటలు సంద్రంలో కలిసిపోతున్నాయి. అధిక వానలు.. ఎగువ నుంచి వరద నీరు వస్తే క్షణక్షణ గండంగా మారుతోంది. కడలి కోతను అరికట్టడమే ప్రధాన పరిష్కార మార్గం కావడంతో ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

ఊరు మిగలదనుకున్నాం

ఏళ్లుగా కొద్దికొద్దిగా వేల ఎకరాల కొబ్బరి, సరుగుడు తోటలు కడలిలో కలిసిపోయాయి. పొలాల గట్లు కోసేస్తూ గ్రామంపైకి సముద్రం చొచ్చుకొస్తోంది. నిర్లక్ష్యం చేస్తే ఊరు మిగలదని రక్షణ చర్యలు చేపట్టాలని గత ప్రభుత్వంలో అధికారులు.. పాలకుల చుట్టూ తిరిగితే ప్రతిపాదనల్లోనే చేతులెత్తేశారు. 'ఈనాడు, ఈటీవీ'లో కథనాలు రావడం.. ఎంపీ, ఎమ్మెల్యేల చొరవతో.. సముద్ర కోత నుంచి రక్షణ గోడల నిర్మాణాలకు చర్యలు చేపడతున్నారు. కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకం వమ్ముకాలేదు. - **నడకుదిటి వీర్రాజు, గ్రామస్థుడు**

సహకార స్ఫూర్తితో కొండపల్లి బొమ్మకు శోభ


మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి కొయ్య బొమ్మల వారసత్వ సంపద తరతరాలకు అందాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. హస్తకళల సహకార సంఘాల ప్రతినిధులతో కొండపల్లి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో ఆయన శనివారం సమావేశమై మాట్లాడారు. కొండపల్లి బొమ్మకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు చేయీ చేయీ కలపాలన్నారు. ఐక్యతతో శతాబ్దాల చరిత్ర ఉన్న కళకు మరింత వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం ఇస్తుందని, దీన్ని కళాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొండపల్లిని ఒక మోడల్ గ్రామీణ సృజనాత్మక ఆర్థిక కేంద్రంగా మార్చడానికి అందరం కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప తదితరులు పాల్గొన్నారు.

కార్గో కౌంటర్లకు మరింత మెరుగులు

త్వరలో టోకెన్ సిస్టమ్

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే

పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో అరైవల్ బ్లాక్‌లోని ఆర్టీసీ కొరియర్ అండ్ కార్గో బుకింగ్ అండ్ డెలివరీ కార్యాలయాలు ఆధునిక హంగులతో కొత్త రూపును సంతరించుకున్నాయి. గతంలో పార్సిల్ బుకింగ్‌కు వచ్చే వినియోగదారులు క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడి ఉండేవారు. ప్రస్తుతం ఆధునికీకరణలో భాగంగా బుకింగ్ పాయింట్‌లో ఏసీలు అమర్చి వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా కుర్చీలు ఏర్పాటు చేశారు. పార్సిళ్లను పెట్టుకునేందుకు ప్రత్యేక అరలు ఏర్పాటు చేశారు. వినియోగదారులు చేసిన ప్యాకింగ్ పాడైనా, లేదా ప్యాకింగ్ చేయాలన్నా కార్యాలయం బయట ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద నిర్ణీత రుసుము చెల్లిస్తే ప్యాకింగ్ చేసి అందజేసే ఏర్పాటు చేశారు. దీంతో అత్యవసరంగా పార్సిళ్లు పంపే వినియోగదారులు, ప్రయాణికులకు ప్యాకింగ్ విధానం వల్ల సమయం ఆదా అవుతుందని కమర్షియల్ అసిస్టెంట్ మేనేజర్ మోషే తెలిపారు.



నూతన కౌంటర్లు, కూర్చునేందుకు సిద్ధంగా కుర్చీలు

వినియోగదారులకు తొలగనున్న ఇబ్బందులు

గతంలో డెలివరీ కౌంటర్‌లు కొరియర్, కార్గో కౌంటర్లు ఉండగా ప్రస్తుతం మరో కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా ముందుగా వినియోగదారులు పార్సిల్ బుకింగ్ నంబరు, చరవాణి నంబరు ఇస్తే, పార్సిల్ స్టేటస్ చూసి మైక్‌లో అనౌన్స్‌మెంట్ ఇచ్చి వినియోగదారులకు అందిస్తారు. వినియోగదారులు నిల్చునే పని లేకుండా త్వరలో ఇక్కడ డిజిటల్ తెరలు ఏర్పాటు చేసి టోకెన్లు ఇస్తామని వారి నంబరు తెరపై చూసుకుని పార్సిళ్లను తీసుకువెళ్లేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు మోషే తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆర్గానిక్ హబ్ రూపకల్పనకు ఎఫ్‌పీవోల ప్రోత్సాహం అవసరం



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, పక్కనే డీఏవో విజయకుమారి తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లను(ఎఫ్‌పీవోలను) కలెక్టర్ జి.లక్ష్మీశ అభినందించారు. ఎన్టీఆర్ జిల్లా ఆర్గానిక్ హబ్‌గా రూపుదిద్దుకోవడానికి ఎఫ్‌పీవోల ప్రోత్సాహం అవసరమన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలపరచడానికి.. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, బ్యాంకుల ప్రతినిధులతో జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం నగరంలోని కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విలువ ఆధారిత ఉత్పత్తులు, కస్టమ్ హైరింగ్ సెంటర్లు, డ్రోన్లు, వివిధ వ్యవసాయ పరికరాలను అందుబాటులో ఉంచేందుకు సంఘాలు కృషి చేయాలని సూచించారు. డీఏవో డీఎంఎఫ్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మామిడి నాణ్యతపై ఆరా

ఎన్టీఆర్ కలెక్టరేట్: ఒకప్పుడు నూజివీడు సబ్ కలెక్టర్‌గా పని చేసిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ.. మామిడి కాయలపై ఆసక్తి చూపారు. వాటి నాణ్యతపై ఆరా తీశారు. శనివారం కలెక్టరేట్‌లో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, బ్యాంకుల ప్రతినిధులతో జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. మామిడిలో కాయ నాణ్యత పెరగడానికి కాయ చిన్న దశలోనే కవర్లు కట్టి పండిస్తున్న ఎఫ్‌పీవోలను ఆయన అభినందించారు.

జాతీయస్థాయి శాస్త్రీయ నృత్య పోటీలు ప్రారంభం



జ్ఞాపిక, ప్రశంసా పత్రాలతో నృత్య కళాకారులు, వేదికపై త్రినాథ్ నాయుడు, సాయిశంకర్, ప్రసాద్ తదితరులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: నృత్య కళలను ప్రోత్సహించడం సంతోషంగా ఉందని, ప్రతి ఒక్కరికీ అవకాశం ఇలాంటి కార్యక్రమాల వల్లే లభిస్తుందని పౌరాణిక రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి అగురు త్రినాథ్ నాయుడు అన్నారు. సంస్కార భారతి విజయవాడ మహానగర్, సుమధుర కళానికేతన్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి శాస్త్రీయ నృత్య పోటీలు శనివారం నగరంలోని ఐదు వేదికలపై ఘనంగా సాగాయి. ఈ కార్యక్రమాలు వివేకానంద సెంటినరీ పాఠశాల(అజిత్‌సింగ్‌నగర్), శ్రీ కోదండ రామాలయం కళావేదిక(ముత్యాలంపాడు), కౌతాపూర్ణానంద కళావేదిక(గాంధీనగర్), తదితర వేదికలపై నిర్వహిస్తున్నారు. తొలి రోజు సీనియర్, జూనియర్ విభాగంలో సుమారు 400 మంది కళాకారులు పాల్గొన్నారని సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ కృష్ణ తెలిపారు. పాల్గొన్న ప్రతి కళాకారుడికి జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందించామన్నారు. రెండో రోజు పోటీల అనంతరం అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద సెంటినరీ పాఠశాలలో నృత్యోత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటుందని, ఇందులో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. పి.సాయిశంకర్, ఐ.ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసనలు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: నిరుద్యోగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా 9వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. యుగంధర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్‌కుమార్ తెలిపారు. శనివారం దాసరి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన ఉపాధి హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ నెల 12వ తేదీ నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యలపై చర్చించి ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, బాబీ, ప్రభాకర్, గోవిందరాజులు, నాగరాముడు, కత్తి రవి, సుభాని తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు

వంకాయలు-20/24, టమాటా-14, బెండ-30, పచ్చిమిర్చి-34, కాకర-32, బీర-30/26, క్యాలీఫ్లవర్-15/20, క్యాబేజి-14, క్యారెట్-26, దొండ-40, బంగాళదుంప-21, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-30, దోస-20/30, సొర-12/10, పొట్ల-30, అరటికాయ -7/6, చామ దుంప-24, అల్లం-72, మునగ-10/12, ఆకు కూరలు(కట్ట) -2.50, కంద-38, బీట్ రూట్-26, కీరదోస-38, బీన్స్-60/55, క్యాప్సికమ్-64, చింతకాయలు-65, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22(నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి.
- న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు

తిరుపతమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ గోపాలకృష్ణారావుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో మహేశ్వరరెడ్డి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు శనివారం కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఆయనకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో మంగళవాద్యాల నడుమ స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ గోపాలకృష్ణారావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో మహేశ్వరరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు అమ్మవారి చిత్రపటం అందజేశారు. ఆలయ అర్చకులు, వేదపండితులు వేదాశీర్వచనం, అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆత్మవిశ్వాసం పెరుగుదలకు కళలు దోహదం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఈవో చంద్రకళ, నారాయణ తదితరులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాల పిల్లలు కళల్లో రాణించడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం, పట్టుదల, పోటీతత్వం పెరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. జిల్లా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో భవిత కేంద్రాల్లోని ప్రత్యేక అవసరాల పిల్లలకు నగరంలోని స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సహిత విద్య జిల్లా సమన్వయకర్త నారాయణ, జీసీడీవో విశ్వభారతి తదితరులు పాల్గొన్నారు. పిల్లలు వేదికపై సంప్రదాయ నృత్యాలు చేసి అలరించారు. పోటాపోటీగా ప్రదర్శనలిస్తూ ఆహూతులను ఆకట్టుకున్నారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

మాదకద్రవ్యాలు, గంజాయి నిర్మూలనే ధ్యేయం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లాలో మాదకద్రవ్యాలు, గంజాయి వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాలన్న లక్ష్యంతో ఎన్టీఆర్ జిల్లా పోలీసులు కఠిన చర్యలతో పాటు [illegible] ముందుకు సాగుతున్నారని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు పేర్కొన్నారు. [illegible]

ఆంధ్ర నాట్యానికి గత వైభవం తీసుకురావాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పద్మమోహన్, కళాకృష్ణ, ఉమామహేశ్వర పాత్రుడు, నారాయణరావు తదితరులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: కూచిపూడి, భరత నాట్యాలతో పాటు ఆంధ్ర నాట్యాన్ని గుర్తించి అభివృద్ధికి రెండు తెలుగు రాష్ట్రాలు తగు చర్యలు తీసుకోవాలని ప్రముఖ ఆంధ్రనాట్య కళాకారిణి దెందులూరి పద్మమోహన్ కోరారు. శనివారం గవర్నర్ పేటలోని బాలోత్సవ భవనంలో స్వరనర్తన ఆంధ్ర నాట్య సంస్థ ఆధ్వర్యంలో 'ఆంధ్ర నాట్యం'పై రచించిన పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించదగ్గ రెండు వేల ఏళ్లనాటి నృత్య కళారూపకమైన ఈ కళకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకురావాల్సిన అవసరముందన్నారు. పద్మశ్రీ నటరాజ రామకృష్ణ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళాకృష్ణ పర్యవేక్షణలో 'స్వరనర్తన' సంగీత నృత్య శిక్షణ సంస్థ(హైదరాబాద్) నిరంతరం ఆంధ్ర నాట్య అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఆదివారం మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఆంధ్ర నాట్య సంగమం' విశిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రాచీన ఆలయ నృత్య సంప్రదాయమైన 'నవ జనార్దన పారిజాతం'ను స్వరనర్తన బృందం ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ సభలో కర్నాటి నవత, ఆచార్యులు కళాకృష్ణ, పిళ్లా ఉమామహేశ్వర పాత్రుడు, గోళ్ల నారాయణరావు, స్వరనర్తన సంగీత నృత్య శిక్షణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా పుష్కరాలకు శాశ్వత మౌలిక వసతులు



పనులు పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్, దేవాదాయ శాఖ సీఈ శేఖర్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: రానున్న కృష్ణా పుష్కరాలకు ఇంద్రకీలాద్రిపై శాశ్వత మౌలిక సదుపాయాలు సిద్ధం కావాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ సూచించారు. దేవాదాయ శాఖ సీఈ శేఖర్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి దుర్గగుడిలో చేపట్టి అభివృద్ధి పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ.. రూ.13 కోట్లతో చేపట్టిన ఎలివేటెడ్ క్యూలైన్లు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని చెప్పారు. 2028లో రానున్న కృష్ణా పుష్కరాల్లో దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకొని మాస్టరు ప్లాన్ రూపొందుతుందని పేర్కొన్నారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా రూ.26 కోట్లతో చేపట్టిన అన్నదాన భవనం, రూ.29 కోట్లతో చేపట్టిన ప్రసాదాల పోటు పురోగతిని సీఈ శేఖర్‌కు అధికారులు వివరించారు. కార్యక్రమంలో డీఈ రవీంద్ర, ఏఈ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోండి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో వైద్యులు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.బాలరాజు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సి.సుభాష్ చంద్రబోస్ ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. ఐఎంఏ చేసిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఏపీ ప్రభుత్వం ఏపీ వైద్యమండలిలో 13 మంది సభ్యులను ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకునేందుకు ఎన్నికలు నిర్వహించడంపై ఐఎంఏ రాష్ట్ర శాఖ స్వాగతిస్తోందన్నారు. మెడికల్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్న వైద్యులు ఫిబ్రవరి 9న జరిగే ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఐఎంఏ తరఫున ఎలాంటి ప్యానెల్ ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని ఏ ప్యానెల్‌కు, వ్యక్తులకు మద్దతు ఇవ్వడం లేదని డాక్టర్ బాలరాజు, డాక్టర్ సుభాష్‌చంద్రబోస్‌లు తెలిపారు.

కారు డ్రైవర్ దుర్మరణం

కృష్ణలంక, న్యూస్‌టుడే: లారీ ఢీకొట్టడంతో కారు డ్రైవర్ దుర్మరణం పాలైన ఘటన కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... కారు డ్రైవర్‌గా పని చేస్తూ జీవించే శ్రీరామ సందీప్(26) ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, తల్లి ఉన్నారు. రోజు మాదిరిగానే పనికి వెళ్లే క్రమంలో శనివారం ఉదయం 8 గంటలకు ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలు దేరారు. బస్టాండ్ సమీపంలోని రాజీవ్ గాంధీ పార్క్ దాటి రైలు వంతెన దిగువకు వచ్చే సరికి వెనుక నుంచి మితిమీరిన వేగంతో వచ్చిన లారీ అతని ద్విచక్ర వాహనం వెనుక భాగానికి తగిలింది. సందీప్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో లారీ అతనిపై నుంచి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన అతను ఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.



గతేడాది వరదల సమయంలో నక్కలంవాగు రక్షణ గోడ కూలిందిలా..



సగం గోడ మాత్రమే మిగిలింది

నిర్వహణ లోపం.. రైతులకు శాపం..!

గత పాలకుల నిర్లక్ష్యంతో కాలువల్లో పూడిక తీయకపోవడం వల్ల వరదల సమయంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. గతేడాది వరదల సమయంలో కంచికచర్ల మండలం నక్కలంపేటలో నక్కలంవాగు గోడ సగం కూలిపోయింది. కంచికచర్ల చెరువు నుంచి అలుగు పారి వాగులో..ఇక్కడి నుంచి కృష్ణలో కలుస్తుంది. రక్షణ గోడ లేకపోతే వరద వచ్చినప్పుడు నీరు కట్టపై నుంచి పొంగి పొలాలు మునిగిపోయే పరిస్థితి తలెత్తుతుందని రైతులు వాపోతున్నారు. నీరు పారే దారి లేక, వరద ఉద్ధృతికి మట్టి కొట్టుకుపోయి రక్షణ గోడ కూలిపోయిందని, మిగిలిన సగం గోడ కూడా కూలిపోయే పరిస్థితిలో ఉందని సంబంధిత అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. **-ఈనాడు, అమరావతి**

'సంస్కరణలతో ఉన్నత విద్య విధ్వంసం'



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: విద్యారంగంలో సంస్కరణల పేరుతో కేంద్రం తెచ్చిన 'వికసిత శిక్ష అధిష్ఠానం 2025' బిల్లు రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ ఉన్నత విద్యను విధ్వంసం చేస్తోందని ఏఐఎస్ఎఫ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా రాష్ట్రాల హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. శనివారం లెనిన్ కూడలిలో ధర్నా చేశారు. ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈలను రద్దు చేసి హెచ్ఈసీఐ పేరుతో ఉన్నత విద్యను ఒకే గూడు కిందకు తీసుకు వచ్చిందన్నారు. ఈ బిల్లు విద్యా కార్పొరేటీకరణను ప్రోత్సహిస్తూ విజ్ఞానం పేరుతో తన ఆర్ఎస్ఎస్ భాజపా హిందుత్వ ఎజెండా అమలు చేస్తోందన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల వలరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్‌లు మాట్లాడుతూ రాష్ట్రాల చరిత్ర, సంస్కృతి, భాష, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలను రూపొందించే ప్రక్రియను కేంద్రం పక్కన పెట్టి విదేశీ కోర్సులను బలవంతంగా రుద్దుతోందని విమర్శించారు. ఇదే కొనసాగితే ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామీణ ప్రభుత్వ కళాశాలలు మూతపడతాయని, ప్రైవేట్ విద్యాసంస్థలు రాజ్యమేలతాయన్నారు. దీనిని ప్రతి ఒక్కరు అడ్డుకోవాలని పిలుపు ఇచ్చారు. యశ్వంత్, ఉమాకాంత్, రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడిన పలువురు వాహన యజమానులకు రూ.46,000 జరిమానా విధిస్తూ జేసీ ఎస్.ఇలక్కియా ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని కలెక్టరేట్‌లో పౌరసరఫరా కేసులకు సంబంధించిన శనివారం కోర్టు నిర్వహించారు. అధికారులు నిర్వహించిన దాడుల్లో రూ.3,15,150 విలువైన 135.18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సదరు బియ్యాన్ని ప్రభుత్వ పరం చేసేలా ఆమె ఉత్తర్వులు జారీ చేశారు.

గ్యాస్ డెలివరీ బాయ్స్ కోసం రాజస్థాన్ చేరుకున్న పోలీసులు

భవానీపురం: తుపాకీతో బెదిరించి డబ్బులు దోచుకున్న గ్యాస్ డెలివరీ బాయ్స్‌ను పట్టుకునేందుకు భవానీపురం పోలీసులు రాజస్థాన్ చేరుకున్నారు. ఈనెల 4న రాత్రి విద్యాధరపురంలోని రమ్యకృష్ణ గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ బాయ్స్‌గా పని చేసే ముగ్గురు యువకులు తుపాకీతో మహిళా సిబ్బందిని బెదిరించి డబ్బులు లాక్కుని వెళ్లిన సంగతి విదితమే. పోలీసులు విచారణలో భాగంగా నిందితుల రాష్ట్రమైన రాజస్థాన్ వెళ్లారు. ఆధార్ కార్డుల్లో వారి చిరునామాల ఆధారంగా వెళ్లి విచారణ చేస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో నిందితులను పట్టుకుంటామని స్థానిక పోలీసులు చెబుతున్నారు.

యానాది కులస్థులను ఆదుకోవాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువ సంఖ్యలో ఉన్న యానాది కులస్థులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆలిండియా యానాది మహానాడు సంఘం జాతీయ అధ్యక్షుడు మెలిక శ్రీనివాసరావు కోరారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చి మోసం చేయడమే కాకుండా యానాదులపై దాడులు, హత్యలు జరిగినా పట్టించుకోలేదని విమర్శించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ యానాదుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు 40 ఏళ్లు దాటిన వారికి పింఛను, ప్రతి ఒక్కరికీ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

నెక్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -133 రిటైల్ ధర 160 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 264.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 147, 156, 167 చికెన్ విత్ స్కిన్ - 280 చికెన్ స్కిన్‌లెస్ - 290.

మత్తుతో జీవితం చిత్తు



భవానీపురంలో సైకిల్ తొక్కుతూ వెళ్తున్న సీపీ రాజశేఖరబాబు, ఈగల్ ఐజీ రవికృష్ణ తదితరులు

విద్యాధరపురం, భవానీపురం, న్యూస్‌టుడే: డ్రగ్స్‌పై దండయాత్ర సైకిల్ ర్యాలీకి విద్యార్థులు, ప్రజల నుంచి 12 వ రోజు శనివారం విశేష స్పందన లభించింది. వన్‌టౌన్ కన్యకాపరమేశ్వరి సత్రం నుంచి ర్యాలీ రథం సెంటరు, రావిచెట్టు సెంటరు మీదుగా కుమ్మరిపాలెం చేరుకుంది. వేదపండితులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. కుమ్మరిపాలెంలో మొదలైన ర్యాలీ కబేళా సెంటరుకు చేరింది. ఈసందర్భంగా చెరువు సెంటరు వద్ద గంజాయికి బానిసైన ఇద్దరు యువకులు ఇకపై మత్తు పదార్థాలు తీసుకోమని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈగల్ ఐజీ రవికృష్ణ, ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం, ఏడీసీపీ రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ దుర్గారావు, భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు ఫోరం ఫర్ ఛైల్డ్ రైట్స్ సభ్యులు అరవ రమేష్ పాల్గొన్నారు.

భవానీపురంలో.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని శివాలయం సెంటర్ వద్ద డ్రగ్స్‌పై దండయాత్ర కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖరబాబు మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలను అలవాటు చేసుకుంటే జీవితం నాశనం అవుతుందని తెలిపారు. శివాలయం సెంటర్ వద్ద నుంచి ప్రదర్శనలో సీపీ, ఈగల్ ఐజీ రవికృష్ణ సైకిల్ తొక్కుతూ ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం భవానీపురం నుంచి గొల్లపూడి వరకు ప్రదర్శనగా వెళ్లి గోడ పత్రిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు బకాయిలు విడుదల చేయాలి

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు బకాయిలను తక్షణం విడుదల చేయాలని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో కూడిన సమావేశం డిమాండ్ చేసింది. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల ఇన్సెంటివ్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బాలోత్సవ భవన్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈదుప్పగంటి అనార్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం గత బడ్జెట్లో పారిశ్రామిక రాయితీల కింద రూ.3వేల కోట్లు ప్రకటించి కేవలం రూ.1000 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, బడ్జెట్‌లోపు మిగిలిన మొత్తాన్ని విడుదల చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. ప్రభుత్వం బకాయిలు విడుదల చేయని పక్షంలో భవిష్యత్తులో జరగనున్న ఉద్యమాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇతర పార్టీల నాయకులు మాట్లాడుతూ అనేక వృథా ఖర్చులు చేస్తున్న ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఇవ్వాల్సిన రాయితీలను ఇవ్వకపోవడం సరికాదన్నారు. స్థానిక పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇవ్వకుండా పరిశ్రమలను ఏవిధంగా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో భాగంగా సంఘం డిమాండ్లతో కూడిన తీర్మానానికి సమావేశం ఆమోదం తెలిపింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్, డీపీఎఫ్ జాతీయ అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి దేవీవరప్రసాద్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, కసపర్తి విజయరాజు, ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనార్‌బాబు. పక్కన దేవీవరప్రసాద్, రాజశేఖర్, మహేశ్వరరావు తదితరులు

'రాష్ట్రంలో ఆటవిక పాలన రాజ్యమేలుతోంది'



మాట్లాడుతున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, ఇతర మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : పెట్రోల్ బాంబులతో అరాచకాలు సృష్టించే నీచమైన సంస్కృతి రాష్ట్రంలో రావడం హేయమని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. ఇబ్రహీంపట్నంలో తెదేపా నేతల దాడికి గురైన మాజీ మంత్రి జోగి రమేష్ గృహాన్ని ఆయన శనివారం పరిశీలించి జోగిని పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆటవిక రాజ్యం రాజ్యమేలుతోందన్నారు. ప్రజాపాలన ఉందా...? అన్న సందేహాలు కలుగుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా ప్రశాంతంగా ఉండే మైలవరం నియోజకవర్గంలో ఇటువంటి సంస్కృతి భయానకం అన్నారు. నిరసన ప్రదర్శనలో భాగంగా క్షణికావేశంలో దాడి చోటు చేసుకొన్న సంఘటనగా తెదేపా వర్గాలు చెబుతున్నా.. ఇది ముమ్మాటికీ పక్కా ప్రణాళికతో చేసినట్లు తెలుస్తుందన్నారు. పోలీసులు ఇందుకు వత్తాసు పలుకుతూ నామమాత్రపు కేసులు నమోదు చేశారన్నారు. 304 సెక్షన్ ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ మెండితోక అరుణ్ కుమార్, కుంభా రవిబాబు తదితరులు ఉన్నారు.

సాంకేతిక రాజధానిగా అమరావతి: గద్దె

పటమట, న్యూస్‌టుడే: క్వాంటం వ్యాలీ ఏర్పాటుతో సాంకేతిక రాజధానిగా అమరావతి మారుతుందని తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి ఇన్నోవేషన్ హబ్‌గా అమరావతిని తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ సంకల్పానికి క్వాంటం వ్యాలీ నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. క్వాంటం వ్యాలీ ఏర్పాటుతో అత్యాధునిక క్వాంటం టెక్నాలజీ, పరిశోధన, ఆవిష్కరణ రంగాలు రాష్ట్రంలో అభివృద్ధి చెందుతాయని, ఫలితంగా యువతకు అంతర్జాతీయ స్థాయి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

ఖాళీసీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం(గొడుగుపేట): మచిలీపట్నంలోని జ్యోతిబా పులే బాలికల గురుకుల విద్యాలయం ఇంగ్లిష్ మాధ్యమంలో వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8 తరగతుల్లో ఖాళీలు ఉన్నాయని అన్నారు. ఆయా ప్రవేశాలు పొందాలనుకునే వారు సంబంధిత వెబ్‌సైట్‌లో మార్చి 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

పాత పథకం పేరే స్మరణ..!

మండల పరిషత్ సమావేశం నోటీసులో ప్రస్తావన

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 19 నెలలు అవుతుంది. ఇంకా అధికారులు వైకాపా ప్రభుత్వ హయాంలోని పథకాల పేరుతోనే కీలక సమావేశాల నోటీసులు ఇస్తుండడం విస్మయానికి గురి చేసింది. పెనుగంచిప్రోలు మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఈనెల 10న మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులకు ఎంపీడీవో శ్రీను నోటీసులు పంపించారు. దీనిలో అధికారుల జాబితాలో పెనుగంచిప్రోలు వెలుగు ఏపీఎంకు బదులు..ఏపీఎం వైఎస్సార్ క్రాంతి పథం(వెలుగు)గా పేర్కొన్నారు. ఇంకా వైఎస్సార్ పేరుతోనే పథకం అమలులో ఉన్నట్లు పేర్కొనడంపై పెనుగంచిప్రోలు మాజీ సర్పంచి జిల్లేపల్లి సుధీర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: మైలవరం తారకరామా నగర్‌లోని డ్రెయిన్లలో పూడిక తొలగించక మురుగు నిలిచిపోతుందని పలువురు సమస్యను 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వరరావు స్పందించి శనివారం ఆ ప్రాంతంలో పూడిక తొలగింపు పనులు చేయించారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

★ రెడ్డిగూడెం పంచాయతీలోని ఎస్సీవాడ ఆరోగ్య కేంద్రం దగ్గర ఉన్న డ్రెయిన్‌లో పూడిక పేరుకుందని స్థానికులు అధికారులకు తెలిపారు. ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి ఎస్. నాగబాబు స్పందించి శనివారం పంచాయతీ సిబ్బందితో పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

? వెలగలేరు ఎస్సీ ఏరియాలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటికి అవస్థలు పడుతున్నాం. **- వై.సుకుంద రావు, గ్రామస్థుడు** ✔ సమస్య తెలిసింది. సిబ్బందితో బోరుకు మరమ్మతులు చేయిస్తాం. **- సరోజా, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, జి.కొండూరు

విద్యా సామగ్రి అందజేత

జి.కొండూరు, న్యూస్‌టుడే : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇరిగేషన్ ఎస్ఈ ఆర్.మోహన్‌రావు సూచించారు. స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని ఆయన శనివారం ప్రత్యేక అధికారి హోదాలో సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పది పరీక్షలకు సిద్ధమవుతున్న 30 మందికి పరీక్ష అట్టలు, పెన్నులు, స్కేళ్లను ఆయన సతీమణి విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయిని సుజాత చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి ఎం.చంద్ర మోహన్, ఉపాధ్యాయుడు ఎం. హేమరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికత అందిపుచ్చుకుంటే మేలు

మైలవరం, న్యూస్‌టుడే : పోటీ ప్రపంచంలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి. రంగారావు తెలిపారు. పీఎం ఉషా పథకంలో భాగంగా బ్లాక్ బక్ ఎడ్యుకేషన్ సంస్థ సహకారంతో కళాశాలలో ఐఓటీ(ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్)పై నిర్వహించిన కార్యశాలలో పాల్గొన్న 41 మంది విద్యార్థులకు శనివారం ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు ఉమాలక్ష్మి, వెంకటాద్రి, జె.రాముడు తదితరులు పాల్గొన్నారు.


ధ్రువపత్రాలతో విద్యార్థులు

ఆరోగ్య సంరక్షణపై భరోసా

తిరువూరు, న్యూస్‌టుడే

తిరువూరు మండలం లక్ష్మీపురం గ్రామంలోని అస్సిసి సేవాసదన్ మూడు దశాబ్దాలకుపైగా నిర్విరామంగా ప్రతి శనివారం వైద్య సేవలు అందిస్తూ మానవత విలువలకు ప్రతీకగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో కంటి, చర్మ, కుష్ఠు వ్యాధులతో బాధపడుతున్న పేద ప్రజలకు నామమాత్రపు రుసుముతో నిపుణులైన వైద్యులతో వైద్య సేవలు అందిస్తూ ఆరోగ్య సంరక్షణలో కీలకపాత్ర పోషిస్తోంది. దూర ప్రాంతాలైన తెలంగాణ నుంచి వచ్చే రోగులకు సైతం సులభంగా చికిత్సలు అందించి వారి నమ్మకాన్ని సంపాదించింది.


బాధితుడికి చికిత్స అందిస్తున్న వైద్య నిపుణులు

ప్రశంసలు పొందుతూ..

ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ఈ సేవా సంస్థ కృషి చేస్తోంది. తిరువూరు చుట్టు పక్కల మండలాల ప్రజల ప్రశంసలు పొందుతోంది. అనుభవజ్ఞులైన వైద్యుల బృందంతో నిరంతరం వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ సేవా సంస్థ ఆధ్వర్యంలో అనాథలైన దివ్యాంగ బాలల కోసం ప్రత్యేక పాఠశాల నడుపుతున్నారు. ఇందులో బాలలకు విద్యతో పాటు నివాసం, భోజనం, వైద్యం అందిస్తున్నారు. సమాజంలో నిరాదరణకు గురైన అనాథ దివ్యాంగ బాలలకు భరోసా కల్పిస్తూ.. వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ఈ క్రమంలో అస్సిసి సేవాసదన్ చేపడుతున్న సేవలను మరింత విస్తరించాలని పలువురు కోరుతున్నారు.

శోభాయమానంగా అలంకరణ



గంపలగూడెం: మెట్టగుట్టలోని గజలక్ష్మి సమేత శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలో శనివారం ప్రధానార్చకుడు శ్యామ్‌సుందరాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ మేరకు మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణ చేయగా వివిధ గ్రామాల భక్తులు దర్శించుకున్నారు. గుడి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పి. వెంకట్రావు, సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చదువుతోనే మంచి భవిష్యత్తు

మైలవరం, న్యూస్‌టుడే : చదువులో తోటి విద్యార్థులతో పోటీతత్వంతో ముందుకు సాగడం ద్వారా ఉన్నత స్థానాలకు ఎదగొచ్చని స్థానిక శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. విద్యతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభిస్తోందని చెప్పారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల 28వ వార్షికోత్సవాన్ని కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విదేశాల్లో స్థిరపడిన బాలిరెడ్డి కుటుంబం స్వగ్రామంపై మమకారంతో కళాశాల స్థాపించి, మైలవరం ప్రాంత అభివృద్ధికి పాటుపడటం అభినందనీయమన్నారు. అనంతరం చదువు, ఆటల్లో ప్రతిభ చాటిన వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులను ఆయన అందజేశారు. కళాశాల గౌరవ ఛైర్మన్ లకిరెడ్డి జయప్రకాశరెడ్డి, ఛైర్మన్ ప్రసాదరెడ్డి, ఒరాకిల్ ఇండియా కన్సల్టింగ్ ప్రాక్టీస్ డైరెక్టర్ పమ్మి శిరీష, కళాశాల అధ్యక్షులు జి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రశంసాపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : రానున్న పది పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఫలితాలను సాధించి జిల్లాలో గుర్తింపు పొందాలని డీఈవో ఎస్.చంద్రకళ సూచించారు. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల 65వ వార్షికోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యా శాఖ అధికారి సాంబశివరావు, హెచ్‌ఎం దేవీదాస్ పెద్దు, వెంకటేశ్వర్లు, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొండపల్లి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, కలెక్టర్ లక్ష్మీశ, డీఈవో చంద్రకళ, కొండపల్లి పురపాలక సంఘ ఛైర్మన్ చిట్టిబాబు పాల్గొన్నారు.


గొల్లపూడి: అలరించిన చిన్నారుల నృత్యం

గొల్లపూడి, న్యూస్‌టుడే : గొల్లపూడిలోని నెక్స్ట్ జెన్ పాఠశాల వార్షికోత్సవంలో ఏపీ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ ఛైర్మన్ తేజస్వి పొడపాటి పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరస్పాండెంట్ కొల్లి సుధీర్, రవీంద్ర భారతి విద్యాసంస్థల ఛైర్మన్ వంశీకృష్ణ, డైరెక్టర్ శాంతి తదితరులు పాల్గొన్నారు.


మూలపాడు సభలో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

సీఎంఆర్‌ఎఫ్... పేదల వైద్యానికి ఉపయుక్తం

గంపలగూడెం, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందిస్తోన్న ఆర్థిక చేయూత పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని తిరువూరు శాసన సభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఊటుకూరు, గంపలగూడెం, పెనుగొలను, కొణిజర్ల, నెమలి, లింగాల, మేడూరు, పెదకొమిర, కనుమూరు, అనుమొలంక, చెన్నవరం గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించి 13 మంది లబ్ధిదారులకు రూ.3,48,847 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల తెదేపా నాయకులు పాల్గొన్నారు.

గంపలగూడెం: మండలంలోని మేడూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. బాల బాలికలకు పలకలు, బిస్కట్లు అందించారు. అదే విధంగా తెదేపా సీనియర్ నాయకుడు సాంబశివరావు జీవిత మృతి చెందగా అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తిరువూరు: తిరువూరు పట్టణంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ ఛైర్మన్ శవల.దేవదత్ పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


ఊటుకూరులో లబ్ధిదారుకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పక్కన తెదేపా నేతలు


తిరువూరులో శవల దేవదత్ తదితరులు...

నిరుద్యోగులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోండి

గుంటుపల్లి (ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే : గుంటుపల్లి రైజ్ కేంద్రంలో శనివారం నిర్వహించిన ఈ- జాబ్ మేళాలో 68 మంది నిరుద్యోగ యువకులు వివిధ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎన్టీఆర్ వికాస, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ సీడాప్‌లు సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని మాట్లాడారు. రైజ్ కేంద్రంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా వికాస మేనేజరు వంశీ, జిల్లా ఉపాధి కల్పన అధికారి మధుభూషణరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


యువకుడికి నియామక పత్రం ఇస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

'తెదేపా నేతపై విమర్శలు తగదు'

గొల్లపూడి, న్యూస్‌టుడే : వైకాపా నేత జోగి రమేష్ ఇంటిపై దాడికి తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు కుట్ర పన్నారంటూ మాజీ సీఎం జగన్ ఆరోపించడం తగదని విజయవాడ గ్రామీణ మండలం తెదేపా అధ్యక్షుడు మండ మురళి అన్నారు. గొల్లపూడిలోని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఇబ్రహీంపట్నంకు సుబ్బారావు వెళ్లి పోలీసులతో మాట్లాడినంత మాత్రాన కుట్ర పన్నినట్లు అవుతుందా? అని ప్రశ్నించారు. ఆధారాలు లేకుండా మాట్లాడటం తగదని మండిపడ్డారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్రా వాసు మాట్లాడుతూ గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం వరకు జగన్ ప్రదర్శనగా వెళ్లడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. వేలాది వాహనాలు జాతీయ రహదారిపై నిలిచిపోయాయని చెప్పారు. తెదేపా వివిధ గ్రామాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మురళి, పక్కన నాయకులు

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి

తిరువూరు, న్యూస్‌టుడే : స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. డ్రగ్స్ విక్రయం, వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరువూరు సీఐ గిరిబాబు హెచ్చరించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎస్సైలు శాతకర్ణి, గౌరిశ్వరీ, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ గిరిబాబు, పోలీసు సిబ్బంది

సాగర్ జలాల విడుదల

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలో మధిర బ్రాంచి కెనాల్‌కు శనివారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 763 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు.

తగ్గిన పెంపకం.. ప్రోత్సాహం అవసరం

నాటు కోళ్లకు దూరమైన పల్లెలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

'కోడి కూసి చాలా సేపయింది.... ఇంకా నిద్ర లేవలేదా?'.... అని కూతురిపై ఓ అమ్మ చిరు కోపం.. 'కోడి కూయగానే నిద్రలేసి పొలానికి వెళ్లు'... అని రాత్రి నిద్రపోయే ముందు ఓ తండ్రి కుమారుడికి బాధ్యత గుర్తు చేసే హెచ్చరికలు నేడు పల్లెల్లో వినిపించడం లేదు. గ్రామాల్లో మారిన జీవన విధాన నేపథ్యంలో కోడి కూత వినిపించడమే గగనమైంది. మైలవరం నియోజకవర్గ పరిధిలోని అటవీ సమీప గ్రామాల్లో గతంలో నాటుకోళ్ల పెంపకం గణనీయంగా ఉన్న రోజుల్లో కోడి కూతలతో పల్లె మేల్కొనేది. ఈ క్రమంలో పల్లెవాసులను నిద్ర లేపే కోడి క్రమక్రమంగా గ్రామానికి దూరమవుతోంది.

హైదరాబాద్, దుబాయ్‌లో ఇంటి, వంట పని చేయడానికి వీసా కలిగిన ఆడ వంట మనుషులు వెంటనే కావలెను. సంప్ర: 6303299545, 9642817525

హైదరాబాద్ నాచారం HMT Nagar శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయములో వైఖానస పూజారులు, వంట స్వామి కావలెను. వసతి సౌకర్యము ఇవ్వబడును. © 9640231864.

ఆఫీస్ బాయ్ కావలెను. విజయవాడ, కానూరులో FMCG డిస్ట్రిబ్యూటర్ వద్ద పనిచేయుటకు ఆఫీస్ బాయ్ కావలెను. © 87903 65333.

ఎలక్ట్రీషియన్స్ మరియు హెల్పర్స్ కావలెను. వయస్సు: 18-30 సం॥లోపు, హౌస్ వైరింగ్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. సంప్ర: © 93921 33234.

శ్రీ భారత బాల వికాస, కృష్ణా జిల్లా (B.O.), (భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ) A.Pలోని జిల్లాల్లో మండలాలవారీగా మండల కో-ఆర్డినేటర్ Q: 10+2, వయస్సు: 42, జిల్లా ఇన్‌ఛార్జ్ వయస్సు: 37, మంచి జీతం, డిగ్రీ అటో. Cont: 81259 70572.

మచిలీపట్నంలో ప్రముఖ రైస్‌మిల్లు నందు మేనేజర్‌గా ఉద్యోగం చేయుటకు 10సం॥ అనుభవం కలిగినవారు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్రదించండి © 70136 29928

ఇంటిపని మరియు ఆఫీసు పని చేయుటకు సొంత వాహనం కల్గిన Boy కావలెను. మంచి జీతం+పెట్రోలు అలవెన్సు ఇవ్వబడును. © 89789 97579.

Biggest Surgical and Pharmacy need following Personnel AVIN
Marketing Executives - 3 nos
Min 1 yr field Sales Experience
Pharmacy Sales (M/F) - 3 nos
Retail Pharmacy Experience required
Office Boys - 3 nos
Salary Best. Immediate Joiners preferred
Contact: 9246641899
Opp: ABC IMAGING
Domakal Road, Vijayawada.

Hyd కూకట్‌పల్లి UPSఇన్వేటర్ బ్యాటరీకంపెనీలో ఎలక్ట్రీషియన్లు, టెక్నీషియన్లు/హెల్పర్లు& M/F ఆఫీస్‌అసిస్టెంట్లు తెలుగు,హింది, తమిల్, E, 2 భాషలు మాట్లాడేవారు కా॥. అకామిడేషన్ 8105011213, 7760062220

పౌల్ట్రీ ఫారమ్స్‌లో పనిచేయుటకు షెడ్ సూపర్‌వైజర్లు కావలెను (అర్హత: 10th పాస్) వివరాలకు: 9491037194 చిరునామా: శీలానగర్ గ్రామం, నూజివీడు-విస్సన్నపేటరోడ్డు.

WANTED
WANTED MARKETING PROFESSIONALS TO WORK AS BUSINESS ASSOCIATE TO A FINTECH SOFTWARE COMPANY IN VIJAYAWADA, GUNTUR, HYDERABAD.
QUA: MBA FRESHERS FROM 2025, 2026 BATCH WITH STRONG COMMUNICATION & PRESENTATION SKILLS
CONTACT: SINDHU HR-EXECUTIIVE
7416240240
EMAIL :
jaysoftechltd@gmail.com

పూజారి కావలెను. విజయవాడ సింగ్‌నగర్, ఆంధ్రప్రభ కాలనీ సాయిబాబా మందిరం మరియు వెంకటేశ్వర స్వామి దేవస్థానంకు, + వసతి. © 80080 61818.

బందరు రోడ్డు, ఈడుపుగల్లు ఆనందలహరి ప్రాజెక్ట్ నందు వర్క్ చేయుటకు ఆఫీస్ అసిస్టెంట్స్-2 (M), ఏదైనా డిగ్రీ. ★ ఆఫీస్ బాయ్స్ -2 10th/ ఇంటర్ అర్జెంటుగా కావలెను. 80961 23123

విజయవాడ Zepto స్టోర్‌లో పనిచేయుటకు Pickers & Packers కావలెను. సంప్ర: 96765 32295. చౌదరిపేట, విజయవాడ.

WANTED
For the Associate of a Leading Multinational Company
SALES PROMOTERS (M)
Exp. / Freshers to work in Vijayawada & Other cities
DATA ENTRY OPERATORS (M/F)
Exp. in Ms.Office
ACCOUNTS ASSISTANT (M/F)
Exp./ Freshers also
Candidate with 1 or 2 yrs. exp. in Focus, Tally or SAP. Salary will be commensurate with qualification
Walk-in on 9/2/2026 between 11 am to 5 pm
FUSION ENTERPRISES
Opp. Siddhartha Public School, Mogalrajpuram, Vijayawada.
Cell : 9908152277
fusionenterprisestitan@gmail.com

విజయవాడ మొగల్‌రాజ్‌పురంలోని ప్రముఖ స్వీట్ షాపు నందు పనిచేయుటకు సేల్స్ బాయ్స్ & సేల్స్ గరల్స్ కావలెను. © 91778 17557

1గ్రామ్ జ్యూయలరీ షాప్‌లో పనిచేయుటకు సేల్స్‌గర్ల్స్, సేల్స్‌బాయ్స్, హెల్పర్స్ అకౌంటెంట్, సోషల్ మీడియా (FB,Insta) చేయుటకు స్టాఫ్ కావలెను. Q:10th-డిగ్రీ, Age:18-30 Yrs. శాలరీ 10K-15K (F), 15K-20K (M) ఆసక్తికలవారు బయోడేటాతో సోమవారం ఉ॥11గం॥లకు షాప్ వద్ద సంప్ర: సాయిశ్రీనివాస పెరల్స్, స్వర్ణలోక్ కాంప్లెక్స్, గవర్నరుపేట, VJA ©9848317372

ప్రముఖ యాడ్ ఏజెన్సీనందు పటమటలో పనిచేయుటకు కొరల్‌డ్రా/ పేజ్‌మేకర్ తెలిసిన డిటిపి ఆపరేటర్ కావలెను. © 90304 37799

ప్రముఖ డోర్స్ తయారీ కంపెనీలో పనిచేయుటకు M/F Accountant-2, Carpenters-2, Office Boys-2, Marketing Staff-2 కావలెను. Durga Bhavani Enterprices, Balaji Nagar, Vidyadara Puram, VJA. © 93953 01959, 88860 91199

WANTED
TELE CALLERS (Female) Any Degree, English fluency is must.
ACCOUNTANTS (Female) Degree with Tally Knowledge.
OFFICE ASSISTANTS (Female) Degree with Computer Knowledge.
HARDWARE ENGINEERS (Male) Should have Knowledge in Printer Installations and Network Sharing.
MARKETING EXECUTIVES (Male) Experience in Computers/Printers/ AC's / TV's/ Office Stationary for Banks & Corporates
DRIVERS (Male) Below 40 Yrs.
K.L COMPUTERS & PRINTERS
Opp.S.S.Convention, PVP Mall Opp. Road, Vijayawada.
Cont: 9032041574, 9246475192,
e-Mail: klcps2@gmail.com

MNC కంపెనీ VJAలో అడ్మిన్ ఇన్‌ఛార్జ్, అకౌంటెంట్, కస్టమర్ సర్వీస్, డేటాఎంట్రీ, H.R, వెరిఫికేషన్, సూ॥వైజర్స్. జీ: 15K to 30K. © 95058 38531.

క్రియేటివ్ గ్రాఫిక్ డిజైనర్ కావలెను. ఫొటోషాప్, కొరల్‌డ్రా, AE, AIలలో అనుభవంకలవారు రెజ్యూమ్ వాట్సప్ చేయగలరు. © 99498 73390

ప్రముఖ ఆడిట్ ఆఫీస్‌కు 30 సం॥లోపు (F) అభ్యర్థులు కావలెను. Tallyలో అనుభవం గల వారికి ప్రాధాన్యత. Resume to prasadvangala4@gmail.com

కావలెను: ప్రముఖ టూ వీలర్ ఫైనాన్స్ కంపెనీ నందు పనిచేయుటకు అనుభవంగల కలెక్షన్ ఏజెంట్స్, జీతం15k -20k మరియు టెలీకాలర్స్ జీతం12k-15k పటమట. © 63098 80999

Nippon పెయింట్స్ గవర్నర్‌పేటలో చేయుటకు సేల్స్ ఇన్‌ఛార్జి మరియు Tallyలో అనుభవం ఉన్న అకౌంటెంట్ కావలెను. © 80743 81992

హోల్‌సేల్ బట్టల షాపులో పనిచేయుటకు అనుభవం కల్గిన సేల్స్‌మెన్, డ్రైవర్స్, సేల్స్‌గర్ల్స్ కావలెను. శాలరీ 10K టు 25K © 88867 14699

కానూరు ప్రముఖ ట్రాన్స్‌పోర్టు ఆఫీస్‌నందు పనిచేయుటకు లేడీ కంప్యూటర్ ఆపరేటర్, ఆఫీస్ సూపర్‌వైజర్-2, గార్డెన్ సూపర్‌వైజర్-1, మెకానిక్-2 కావలెను. బొలెరో డ్రైవింగ్, హిందీ వచ్చిన వారికి ప్రాధాన్యత. © 86889 08675, 91542 97951

మైలవరంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ ఆఫీస్ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన లేడీ టెలీకాలర్స్ కావలెను. © 77998 67077.

ఐస్‌క్రీం తయారుచేయడంలో 40 సంవత్సరాల అనుభవంగల సంస్థతో కలిసి పనిచేయడానికి వైజాగ్, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలో డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. © 98485 10168

LIV హాస్పిటల్, విజయవాడలో పనిచేయుటకు స్టాఫ్‌నర్సులు, OT టెక్నీషియన్స్, ఎనస్తీషియా టెక్నీషియన్స్, మార్కెటింగ్ పర్సన్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ కావలెను Q: 2Y రిలవెంట్ అనుభవం. ©70328 14460

WE'RE HIRING
Sales Executives
Age: 30+yrs
Gender: Males (Only)
Experience: 2+Yrs in Marketing or Sales (Preferable)
Skills: Good Communication Skill Imitation Jewellery Exp (Preferable)
Location: Fashion Jewellery Sale in AP & TS Districts (Camp -12 Days in Every Month)
Education: Degree / ITI / Diploma
Salary Range: 30K+Incentives
Junior Accountant
Experience: 1 to 2 Years
Salary Range: 15K +
Senior Accountant
Experience: 2 Years
Salary Range: 25K +
Computer Operator
Experience: 2 Years
Salary Range: 15K +
© 90635 37117 97016 99797
VNR Jewellery Manufacturers MACHILIPATNAM

విజయవాడలో ఆటోమొబైల్ ఫైనాన్స్ కంపెనీలో ఫైనాన్స్ కలెక్షన్ చేయుటకు టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ గల మేల్ కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. © 9247864544

ప్రముఖ బ్యూటీపార్లర్ నందు వర్క్ చేయుటకు బ్యూటీషియన్స్ & అసిస్టెంట్ బ్యూటీషియన్స్ కావలెను. VMC కాలనీ, బెంజి సర్కిల్, VJA. © 9246401775, 8125341775.

VJA, ప్రభుత్వరంగ సంస్థ ద్వారా Work From Home అవకాశం M/F కావలెను పార్ట్/ఫుల్‌టైం అవకాశాలు అర్హత 10th to డిగ్రీ వరకు అర్హులైన వారికి స్టైఫండ్ ఇవ్వబడును కనీస ఆదాయం నెలకు 25 - 50వేలు. 8374507999

DRIVERS

TATA Ace Auto నడుపుటకు 40సం॥లోపు వయస్సు కలిగి, అనుభవం కలిగిన డ్రైవర్ కావలెను. © 93903 72020

ACCOUNTING

Learn GST, TDS, EPF, ESI returns in 9 sundays with live examples (online zoom classes). © 9292959527, 9640054074

Accountant with 5 years experience to work in Jharkhand construction site. WhatsApp resume to: 9502393999.

ENGINEERING

We Are Hiring – Sales & Service Mech. Engineer. 1–2 yrs exp. in MNC industrial products. Field work, customer handling & reporting. Hydraulics knowledge preferred. Location: Vizag (AP). pranjal@oswalhydraulics.com © 96698 41000

HOSPITALITY

Wanted ★Doctors (Ortho/ Pediatrician), ★ Exp. Nurses ★ Telecallers (M/F) ★ Car Driver ★ PROs ★ Aayamma (24/7) VJA-2 © 93936 09999

TOURS AND TRAVELS

[illegible] 4/5న, 4/4న మల్టీకార్, సీడాన్, 26/5వ [illegible] © 94301 19768

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్

Book your 5 lines Classified Colour Rs.1200/-	5 lines Classified B/W Rs.1025/-
3Ads Package Rs.3250/-	3Ads Package Rs.2575/-

ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం
PH: 98496 97616


ఆలయం ఎదుట భక్తుల కిటకిట


వేలాదిగా తరలివచ్చిన జనం

తిలకించారు.. పులకించారు

అంబరాన్నంటిన సిడిబండి ఉత్సవం

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరులో పదిహేను రోజుల పాటు జరిగే వీరమ్మతల్లి తిరునాళ్లలో పదకొండవ రోజు శనివారం "సిడిబండి" ఉత్సవం వైభవంగా నిర్వహించగా వేలాది మంది పాల్గొని తిలకించారు. స్థానిక శివాలయం రోడ్డులోని పాత ట్యాంకు వద్ద గత వారం రోజులుగా తయారు చేసిన సిడిబండిని మేళతాళాలు, డప్పువాయిద్యాల మధ్య తిరునాళ్ల ఉత్సవ ఆలయ ప్రాంగణానికి తీసుకొచ్చారు. సిడిబండి శివాలయం, ప్రధాన కూడలి మీదుగా ఉత్సవం ఆలయానికి చేరింది. అదే సమయంలో స్థానిక అంబేద్కర్ నగర్ నుంచి ఈ ఏడాది పెళ్లికి సిద్ధంగా ఉన్న నూతన వరుడు ఉయ్యూరు విక్రమ్ సింహాను డప్పువాయిద్యాలతో బంధుమిత్రులు, ఆ ప్రాంత వాసులు ఊరేగింపుగా ఆలయ ప్రాంగణానికి తీసుకొచ్చారు. అక్కడ సిడిబండికి గంప కట్టి అందులో అతడిని కూర్చోబెట్టి ఉత్సవ ఆలయం చుట్టు మూడు ప్రదక్షిణలు చేయించారు. ఆలయం ఎదురుగా గంపను పెళ్లికుమారుడితో పాటు పైకి ఎత్తిన సమయంలో జనం అరటికాయలతో అతన్ని కొట్టడం సంప్రదాయం. పెళ్లి కుమారుడిని ఆలయ ప్రదక్షిణలు చేయించే సమయంలో భక్తజనం బండి వెంట పరుగులు తీస్తారు. ఉత్సవానికి తరలివచ్చే వేలాది మంది భక్తజనం కోసం దాత యార్లగడ్డ సాయి సౌజన్యంతో స్థానిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటైన అన్నసమారాధన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్ శనివారం మధ్యాహ్నం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉయ్యూరు పురపాలక సంఘం ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, మాజీ ఛైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, తెదేపా మండల అధ్యక్షుడు వి.కుటుంబరావు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు వంగవీటి శ్రీనివాస్‌ప్రసాద్, సీహెచ్‌సీ ఛైర్మన్ మండవ జయదేవ్, జడ్పీ పాఠశాల ఛైర్మన్ శివసాయిప్రసాద్, తెదేపా రాష్ట్ర నేతలు అజ్మతుల్లా, రాజులపాటి ఫణి తదితర నాయకులు పాల్గొన్నారు.


గంపలో కూర్చున్న నూతన పెళ్లికుమారుడు


అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్


ప్రత్యేక అలంకరణలో వీరమ్మతల్లి

విశ్వాసులకు అండగా మేరీమాత

గుణదల(పటమట), న్యూస్‌టుడే: గుణదల మేరీ మాత తన పుణ్య క్షేత్రానికి వచ్చే విశ్వాసులను అక్కున చేర్చుకొని ఆపద సమయంలో రక్షణగా ఉంటోందని మంగళూరు ఎంఎస్ఎజే ఫాదర్ బత్తుల రవి కుమార్ అన్నారు. గుణదల మేరీ మాత మహోత్సవాల్లో భాగంగా శనివారం ఎనిమిదో రోజు నిర్వహించిన నవదిన ప్రార్థనలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై భక్తులకు సందేశం ఇచ్చారు. విజయవాడ కథోలిక పీఠం మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, గుణదల పుణ్య క్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు తదితర గురువులు దివ్యస త్ప్రసాద ఆరాధనతో కొండపైనున్న పూజ పీఠం వద్దకు చేరుకున్నారు. అనంతరం సమిష్టి దివ్య పూజాబలి సమర్పించారు. ఫాదర్లు గాబ్రియేలు, మరియన్న, తోట సునీల్‌రాజు తదితర గురువులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


కొండపైకి వెళ్తున్న ఫాదర్లు, ప్రార్థనలో పాల్గొన్న విశ్వాసులు

సివిల్స్‌లో యువతకు ఉచిత శిక్షణ

దరఖాస్తుల స్వీకరణకు మార్చి 1 తుది గడువు ● ఏపీ పశువైద్యమండలి బోర్డు అధ్యక్షుడు పీవీ లక్ష్మయ్య

నెహ్రూనగర్(గుంటూరు), న్యూస్‌టుడే: పారా అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో వెంకటపతి విద్యాదీవెన కార్యక్రమంలో భాగంగా యువతకు సివిల్స్‌లో ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, ఏపీ పశువైద్యమండలి బోర్డు అధ్యక్షుడు డాక్టర్ పీవీ లక్ష్మయ్య తెలిపారు. శనివారం కొత్తపేటలోని పశు సంవర్థకశాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పారా అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో విశ్రాంత సైనికుడు, సామాజిక సేవకుడు సీబీఆర్ ప్రసాద్ సహకారంతో వందమంది పురుషులు, వంద మంది మహిళలకు ఉచితంగా ఈ శిక్షణ ఇస్తామని వివరించారు. పురుషులకు వినుకొండలో, మహిళలకు ఇబ్రహీంపట్నం, విజయవాడలో తరగతులు ఉంటాయని చెప్పారు. అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. డిగ్రీ చదివిన 32 సంవత్సరాలలోపు అభ్యర్థులు మార్చి 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 78420 54669 నంబరులో సంప్రదించాలని చెప్పారు. మార్చి 5న ప్రవేశ పరీక్షలు నిర్వహించి మార్చి 10 నుంచి శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు. 6 నుంచి 12వ తరగతి వరకు పేద విద్యార్థులకు ఉచిత పాఠశాల నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వారికి కూడా ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. బాలలకు వినుకొండలో, బాలికలకు ఇబ్రహీంపట్నం, విజయవాడలో ఉచిత పాఠశాల ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో విశ్వహిందూపరిషత్ నాయకుడు రవికుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మయ్య. పక్కన సీబీఆర్ ప్రసాద్, రవికుమార్

పౌర హక్కులు కాపాడడమే న్యాయవాదుల ప్రధాన లక్ష్యం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: న్యాయవాద వృత్తి ఉన్నతమైందని రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన హక్కులను కాపాడడమే న్యాయవాదుల ప్రధాన లక్ష్యమని ఏపీ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. శనివారం సూర్యారావుపేటలోని రైల్వే ఫంక్షన్ హాలులో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ కృష్ణా జిల్లా, విజయవాడ నగర కమిటీల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ దుర్గాప్రసాద్.. 'రాజ్యాంగ హక్కులకు రక్షణ-న్యాయవాదుల పాత్ర' అనే అంశంపై మాట్లాడారు. న్యాయవాదులకు పలు సూచనలు చేశారు. న్యాయవాదులు సోషల్ ఇంజినీర్లు అని అన్నారు. సమాజాన్ని నిర్మించడంలో చట్టం ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. చట్టం లేకపోతే అరాచకత్వం పేట్రేగుతుందని దానిని కట్టడి చేయాల్సిందే న్యాయవాదులే అని అన్నారు. అదే సందర్భంలో న్యాయవాదులు తప్పు చేస్తే వారిపై చర్యలు ఉంటాయంటూ పంజాబ్ హైకోర్టులో ఒక న్యాయవాది కేసును ఉదహరించారు. ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఐఏఎల్ స్థాపించిన నాటి నుంచి ప్రజల హక్కుల పరిరక్షణకు పోరాటం చేస్తున్నామని వివరించారు. జూనియర్ న్యాయవాదులకు ప్రత్యేకంగా తరగతులు నిర్వహించి వారికి శిక్షణ ఇచ్చి పరీక్షలు నిర్వహించి వారిని ఎడ్యుకేట్ చేస్తున్నట్లు తెలిపారు. వి.డి.సిద్ధార్థ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌బాబు న్యాయవాదులకు పలు కీలకమైన సూచనలు చేశారు. జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌కు జ్ఞాపిక ఇచ్చి సత్కరించారు. కె.సురేష్‌కుమార్, ఎం.ఎ.షరీఫ్, కేవీవీ పరమేశ్వరరావు, చలసాని వెంకట్, ఈఎస్.ప్రసాద్, సుధాకర్ రాజు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ దుర్గాప్రసాద్‌ను సన్మానిస్తున్న అజయ్‌కుమార్ తదితరులు

అంతర్ వర్సిటీ నెట్‌బాల్ పోటీలకు 'కేఆర్‌యూ' జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కృష్ణా వర్సిటీ ఆధ్వర్యంలో నగరంలోని మారిస్ స్టెల్లా కళాశాల మైదానంలో ఈ నెల 14 నుంచి జరిగే ఆలిండియా అంతర్ వర్సిటీ మహిళా నెట్‌బాల్ పోటీలో తలపడే కృష్ణా వర్సిటీ జట్టును.. ఎంపిక కమిటీ ఛైర్‌పర్సన్ సిస్టర్ జి.ఇన్నాసమ్మ శనివారం వెల్లడించారు. బి.మౌనిక, ఎస్.స్రవంతి, వి.రమిత, టి.సుష్మ (విజయ వ్యాయామ విద్య కళాశాల, నున్న), వై.హారిక, ఎం.శ్రుతి, కె.సాయిదుర్గ, జి.రేచల్ (ఎస్సార్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విజయవాడ), కేఎస్‌వీఎస్ శ్రావణి (మారిస్ స్టెల్లా కళాశాల, విజయవాడ), జి.సిరి, ఎస్.మధురేశ్వరి, ఎన్.లిఖిత కృష్ణప్రియ (ఆంధ్రా లయోల కళాశాల, విజయవాడ) జట్టులో స్థానం సాధించారు. జట్టు సభ్యులను వర్సిటీ రెక్టార్ మండవ వెంకట బసవేశ్వరరావు, మారిస్ స్టెల్లా కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ లీనా క్వాడ్రస్, ఎంపిక కమిటీ సభ్యులు బీసీహెచ్ సంగీతరావు (పీడీ, శాతవాహన కళాశాల), దారం నవీన్‌కుమార్ (పీడీ, ఎస్సార్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల), పరిశీలకుడు మన్నె స్వామి (పీడీ, డాక్టర్ ఎల్‌హెచ్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైలవరం) శనివారం అభినందించారు.


క్రీడాకారులతో రెక్టార్ బసవేశ్వరరావు తదితరులు

కరెంట్ అఫైర్స్



◆ దేశీయ, అండర్ 19 క్రికెట్‌లో అత్యుత్తమ విజయాలు సాధించినందుకు 14 ఏళ్ల వర్ధమాన క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇటీవల ఏ పురస్కారాన్ని ప్రదానం చేశారు?

మాదిరి ప్రశ్నలు

జ: రాష్ట్రీయ బాల పురస్కార్ (క్రీడలు, కళలు, సైన్స్, సామాజిక సేవ, పర్యావరణం, ధైర్యం తదితర రంగాల్లో విశేష ప్రతిభ చూపిన 5 నుంచి 18 ఏళ్ల వయసు ఉన్న పిల్లలకు ఈ అత్యున్నత పురస్కారాన్ని ప్రదానం చేస్తారు.)

◆ 2026–29 కాలానికి బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) అథ్లెట్స్ కమీషన్ ఛైర్‌పర్సన్‌గా ఎవరు ఎన్నికయ్యారు? (డిప్యూటీ ఛైర్‌పర్సన్‌గా నెదర్లాండ్స్‌కు చెందిన డెబోరా జిల్లే నియమితులయ్యారు.)

జ: పీవీ సింధు

◆ వినియోగదారుల భద్రత, ఉత్పత్తి నాణ్యతను బలోపేతం చేయడానికి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) దేశంలోనే తొలిసారిగా ప్రకటించిన అగరబత్తి ప్రమాణం ఏది? (2025లో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా డిసెంబరు 24న మొదటి అగరబత్తీల ప్రమాణాన్ని ప్రకటించారు.)

జ: ఐఎస్ 19412 : 2025

◆ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2025, నవంబరు చివరినాటికి భారత్‌లో ఎంతమంది బ్రాడ్ బ్యాండ్ సబ్‌స్క్రైబర్లు ఉన్నారు?

జ: 100.37 కోట్లు

మరింత సమాచారం

తెగులు తెచ్చే సూక్ష్మ జీవరసం!



పరిసరాలతో పాటు మనుషుల శరీరంలోనూ ఉండే అత్యంత సూక్ష్మజీవులు వైరస్‌లు. ఇవి జీవ క్రియలు లేని జీవులు. ఎక్కువశాతం వ్యాధికారకాలు. అన్నిరకాల జీవులు, జీవపదార్థాలపై దాడి చేసి జీవించగలిగిన పరాన్నజీవులు. జలుబు, జ్వరం, గొంతునొప్పి, దగ్గు, వికారం తదితర సాధారణ ఆరోగ్య సమస్యలతోపాటు పోలియో, రేబిస్, మెదడు వాపు, బర్డ్ ఫ్లూ, ఎయిడ్స్, కరోనా లాంటి ప్రమాదకర రోగాలకు, పంటలకు సోకే వివిధ తెగుళ్లకు ఈ వైరస్‌లే కారణం. సులువుగా వ్యాపిస్తూ, అత్యంత వేగంగా పునరుత్పత్తి జరిపే వైరస్‌లపై పోటీ పరీక్షార్థులకు ప్రాథమిక పరిజ్ఞానం ఉండాలి. వాటి నిర్మాణం, పరిమాణం, ఆకారం, రసాయన కూర్పు ఆధారంగా వాటిలోని రకాలు, అవి మనుషులతోపాటు మొక్కల్లో కలిగించే వ్యాధుల గురించి తెలుసుకోవాలి.


జనరల్ స్టడీస్ - బయాలజీ

వైరస్

లాటిన్ భాషలో వైరస్ అంటే విషపదార్థం అని అర్థం. ఇవి బ్యాక్టీరియాల కంటే చిన్నవి. వీటిని సూక్ష్మదర్శినితో మాత్రమే చూడటం సాధ్యమవుతుంది. బైజరింక్ అనే శాస్త్రవేత్త వైరస్‌లను 'తెగులు తెచ్చే జీవరసం' అని పేర్కొన్నాడు. వాల్టర్ రీడ్ అనే శాస్త్రవేత్త ఎల్లోఫీవర్ వ్యాధి వైరస్‌ల వల్ల వస్తుందని కనుక్కున్నాడు. బ్యాక్టీరియాలను సంక్రమణ చేసే వైరస్‌ల గురించి ట్వార్ట్ తెలిపాడు.

వైరస్‌ల అధ్యయనాన్ని వైరాలజీ అంటారు. వైరస్‌లను విశిష్టమైన ప్రత్యేక లక్షణాలున్న వ్యాధికారక జీవులుగా పేర్కొనవచ్చు. వీటికి కణ నిర్మాణం ఉండదు. కేంద్రక పూర్వజీవులు, నిజకేంద్రక జీవుల కణనిర్మాణానికి భిన్నంగా వైరస్‌లు ఉంటాయి. వీటి కణంలో కణాంగాలైన కేంద్రకం, మైటోకాండ్రియా, రైబోజోమ్‌లు లాంటివి ఉండవు.

నిర్మాణం: వైరస్‌లు సరళ నిర్మాణంతో ఉంటాయి. వీటిలో 1) కేంద్రకామ్లం 2) ప్రొటీన్ తొడుగు అని రెండు భాగాలు ఉంటాయి. కేంద్రకామ్లం మధ్యలో ఉండి దీని చుట్టూ ప్రొటీన్ తొడుగు ఉంటుంది. ఈ రెండింటినీ కలిపి న్యూక్లియోక్యాప్సిడ్ అని పిలుస్తారు. కేంద్రకామ్లం, ప్రొటీన్ ఉండటం వల్ల వైరస్‌లను 'న్యూక్లియో ప్రొటీన్ రేణువులు' అంటారు. ఇవి కాకుండా కొన్ని వైరస్‌లలో ఎంజైమ్‌లు, లిపిడ్‌లు, లైపో ప్రొటీన్లు ఉంటాయి. క్షీరదాల్లో వ్యాధులను కలిగించే




అనేక వైరస్‌లలో ప్రొటీన్ తొడుగు బయట ఉన్న పొరను 'ఎన్వలప్' లేదా 'పరిమేయ త్వచం' అంటారు. వైరస్ కేంద్రకామ్లం చుట్టూ ఉన్న ప్రొటీన్ తొడుగును 'క్యాప్సిడ్' అంటారు. దీనివల్ల వైరస్‌లకు ఒక ప్రత్యేకమైన ఆకారం ఏర్పడుతుంది. ఇది కేంద్రకామ్లానికి రక్షణ కల్పిస్తుంది. ఈ ప్రొటీన్ ఆతిథేయిలోకి వైరస్‌లు ప్రవేశించినప్పుడు ప్రతిరక్షక ధర్మంగా కూడా పనిచేస్తుంది. క్యాప్సిడ్ ప్రొటీన్ తొడుగులో ఉండే ప్రొటీన్ ఉపప్రమాణాలను 'క్యాప్సోమియర్‌లు' అంటారు.

వైరస్‌లలో జన్యుపదార్థం

వైరస్‌లలో ఆర్ఎన్ఏ, డీఎన్ఏ జన్యుపదార్థంగా పనిచేస్తాయి. వైరస్‌ను బట్టి ఆర్ఎన్ఏ, డీఎన్ఏల్లో ఏదో ఒకటి మాత్రమే ఉంటుంది. ఆర్ఎన్ఏ జన్యుపదార్థం ఉన్న వైరస్‌లను ఆర్ఎన్ఏ వైరస్‌లు అంటారు. ఇది ఒకే పోచ ఆర్ఎన్ఏ లేదా రెండు పోచల ఆర్ఎన్ఏగా ఉండొచ్చు. డీఎన్ఏ జన్యు పదార్థం ఉన్న వైరస్‌లను 'డీఎన్ఏ వైరస్‌లు' అంటారు. ఇది ఒక పోచ డీఎన్ఏ లేదా రెండు పోచల డీఎన్ఏగా ఉండొచ్చు. మొక్కలపై వ్యాధులు కలిగించే వైరస్‌లలో ఆర్ఎన్ఏ జన్యుపదార్థంగా ఉంటుంది. కానీ కాలీఫ్లవర్ మొజాయిక్ వైరస్‌లు, డాహ్లియా మొజాయిక్ వైరస్ లాంటి మొక్కల వైరస్‌లలో డీఎన్ఏ జన్యుపదార్థంగా ఉంటుంది. సాధారణంగా జంతువులపై దాడిచేసే వైరస్‌లలో డీఎన్ఏ జన్యుపదార్థంగా ఉంటుంది. కానీ పోలియో వైరస్, ఇన్‌ఫ్లూయెంజా వైరస్, రేబిస్ వైరస్, మీజిల్స్ వైరస్, ఎబోలా వైరస్ లాంటివాటిలోజన్యుపదార్థంగా ఆర్ఎన్ఏ ఉంటుంది.

వైరస్‌ల రకాలు: ఆతిథేయి కణంపై దాడి చేసే స్వభావాన్ని బట్టి వైరస్‌లను పలు రకాలుగా విభజించారు. అవి..

1) బ్యాక్టీరియాఫేజ్‌లు - బ్యాక్టీరియా కణంపై దాడి చేస్తాయి.
2) ఫైటోఫేజ్‌లు - మొక్కల కణాలపై దాడి చేస్తాయి.
3) జూఫేజ్‌లు - జంతువుల కణాలపై దాడి చేస్తాయి.
4) మైకోఫేజ్‌లు - శిలీంధ్ర కణాలపై దాడి చేస్తాయి.
5) ఫైకోఫేజ్‌లు - శైవల కణాలపై దాడి చేస్తాయి.
6) సయనోఫేజ్‌లు - నీలిఆకుపచ్చ శైవలాలపై దాడి చేస్తాయి.
7) జైమోఫేజ్‌లు - ఈస్ట్ కణాలపై దాడి చేస్తాయి.




వైరస్‌ల ఆకారం వైరస్‌లు అనేక ఆకారాల్లో ఉంటాయి. అవి..

1) దండాకారం - టొబాకో మొజాయిక్ వైరస్
2) తోక కప్ప ఆకారం - బ్యాక్టీరియోఫేజ్
3) బుల్లెట్ ఆకారం - రాబ్డో వైరస్
4) దీర్ఘచతురస్రాకారం - వాక్సీనియా వైరస్
5) బహుభుజి - అడినో వైరస్
6) గుండ్రని ఆకారం - పోలియో

నిర్వచనం

ఆతిథేయి కణంలోని జీవరసాయన ప్రక్రియలను తనకు అనుకూలంగా మార్చుకుని పిల్ల వైరస్‌లను ఉత్పత్తి చేసుకునే వ్యాధికారక అతి సూక్ష్మజీవులే వైరస్‌లు.
– (పెల్జార్, శాస్త్రవేత్త)

వైరస్‌ల వల్ల మొక్కల్లో కలిగే వ్యాధులు



వ్యాధి పేరు	కలగజేసే వైరస్
పొగాకు మొజాయిక్ వ్యాధి	పొగాకు మొజాయిక్ వైరస్
వంకాయ చిన్నఆకుల వ్యాధి	వంకాయ చిన్న ఆకుల వైరస్
టమాటో ఆకుముడత వ్యాధి	టమాటో ఆకుముడత వైరస్
బొప్పాయి మొజాయిక్ వ్యాధి	బొప్పాయి మొజాయిక్ వైరస్
బంగాళాదుంప స్వల్ప మొజాయిక్ వ్యాధి	బంగాళాదుంప X వైరస్
నిమ్మ ట్రిస్టేజా వ్యాధి	నిమ్మ ట్రిస్టేజా వైరస్

ప్రత్యుత్పత్తి: వైరస్‌లు కణం బయట ప్రత్యుత్పత్తిని చూపవు. ఆతిథేయి కణం లోపల మాత్రమే ప్రత్యుత్పత్తి జరుపుతాయి. ఇవి ఆతిథేయి కణాన్ని మొదట అంటిపెట్టుకుని కణంలోకి తమ జన్యుపదార్థాన్ని పంపిస్తాయి. దీని తర్వాత ఆతిథేయి కణాన్ని తమ నియంత్రణలోకి తీసుకుని వైరస్‌ల భాగాలను విడివిడిగా తయారుచేసుకుంటాయి. ఇవన్నీ కలిసి పిల్ల వైరస్‌లుగా మారి ఆతిథేయి కణం నుంచి బయటకు వస్తాయి.

వైరస్‌లు-ప్రత్యేకతలు: ◆ వీటిలో కేంద్రకామ్లం, దీని చుట్టూ ప్రొటీన్ తొడుగు మాత్రమే ఉంటుంది. ◆ వైరస్‌ల కణంలో కణాంగాలు ఉండవు. ◆ శ్వాసక్రియ, పెరుగుదల, పోషణ లాంటివి ఉండవు. ◆ కణం బయట ఇవి నిర్జీవులుగా ఉండి, ఆతిథేయి కణంలోకి వెళ్లిన తర్వాత సజీవంగా మారతాయి. ◆ ఆతిథేయి కణంలోకి ఇవి ప్రత్యుత్పత్తి కోసం మాత్రమే ప్రవేశిస్తాయి. ◆ ఇవి సజీవులకు, నిర్జీవులకు వంతెన లాంటివి. ◆ వైరస్‌లు బ్యాక్టీరియాలతో సహా అన్ని జీవులపై దాడి చేయగలవు. ◆ వైరస్ కేంద్రకామ్లాల లక్షణాలు పిల్లజీవులకు సంక్రమించి, ఉత్పరివర్తనం జరుగుతుంది. వీటివల్లనే వైరస్‌లను సజీవులని చెప్పవచ్చు. ◆ ఆతిథేయి కణం వెలుపల ఇవి నిర్జీవ స్ఫటికాలుగా ఉంటాయి.



రచయిత: డాక్టర్ బి. నరేష్

SENIOR INTER ENGLISH

ON HIS HAVING ARRIVED AT THE AGE OF TWENTY THREE - JOHN MILTON

PARAGRAPH ANSWERS 4 Marks

1. 'Time and tide wait for none' is an old saying. Discuss this in the context of the poem "On His Having Arrived at the age of Twenty Three".

A: John Milton (1608 - 1674) was a great poet in English Literature, known for his Grand Style in composing grandeur poems. His well composed poem Paradise Lost is a timeless classic as an epic.

The present poem "On His Having Arrived at the age of Twenty Three" is a devotional sonnet and his autobiographical. It glorifies God for showing mercy upon His creation. Milton uses this sonnet to symbolize his journey from doubt to self-discovery. Milton asserts the importance of time in our lives. If things like money and vehicles are lost, we can get them back with efforts, whereas we can not get back even a single moment of time, if once it is lost though we she'll down bundles of currency notes. It reminds us of the dictum that 'The time and tide wait for none'. The poet regrets for wasting the prime time of his age without producing any work of writing in the service of God. He feels so sad for not being recognized by the world, though he is mentally matured. He realises later that what is lost is lost forever and he should not waste his precious future at least here afterwards. He starts his journey as a poet, choosing poetry as the best mode to praise his task-master. The lateral realization makes the poet become a versatile genius to compose such great poems, and thus he has attained immortality as a poet through his poetry and his service to God.

Practice Questions 4 Marks

ANNOTATIONS

**1. How soon hath Time, the subtle thief of youth,
Stol'n on his wing my
Three and twentieth
year!**

Final Exams-2026 IMPORTANT Q & A

**2. And inward ripens do that much less appear,
That some more timely happy spirits
endu'th.**

**3. All is, if I have grace to use it so
As ever in my great task
-master's eye.**

For more IMP Q & A



Writer: SHAIK ABDUL ZILANI


తెల్లని రంగు.. నీలం కళ్లు.. భారీ శరీరం!

ప్రపంచంలో జనాభా పరంగా అగ్రస్థానంలో ఉన్న భారత్‌లో జనాభా వర్గీకరణ అత్యంత వైవిధ్యభరితంగా ఉంటుంది. ప్రధానంగా జాతి, మతం, భాష, ప్రాంతం ప్రాతిపదికన ఈ వర్గీకరణ కనిపిస్తుంది. మొత్తం జనాభాలో దాదాపు మూడోవంతు పైగా ఇండో-ఆర్యన్ జాతి సమూహాలు ఉత్తరాదిన ఉంటే, నాలుగో వంతు మేర ద్రావిడ జాతి సమూహాలు దక్షిణ భాగంలో ఉన్నాయి. ఎక్కువమంది జనాభా గ్రామాల్లో నివసిస్తున్నారు. పట్టణ జనాభా శరవేగంగా పెరుగుతోంది. అత్యధికులు హిందువులు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు. జైనుల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. అందుబాటులో ఉన్న జనాభా లెక్కల ప్రకారం దేశంతో పాటు రాష్ట్రాల వారీగా అక్షరాస్యత, లింగ నిష్పత్తి, జనాభా వృద్ధి రేటు తదితర గణాంకాలను పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లోని ప్రత్యేక తెగలు, జాతుల జనాభా, వారి శారీరక లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలి.

జనరల్ స్టడీస్ - జాగ్రఫీ

భారతదేశం - జనాభా

1. జాతుల వర్గీకరణలో భాగంగా ఇండో ఆర్యన్‌ల గురించి వాక్యాలను సరిచూడండి.



ఎ) ఇండో ఆర్యన్‌లు మన దేశంలో దాదాపుగా 75% పైగా విస్తరించి ఉన్నారు.
బి) వీరి వల్ల మన దేశంలోని సంస్కృతి, నాగరికతల్లో చాలావరకు మార్పులు సంభవించాయి.
సి) తెల్లని రంగు, నీలం కళ్లు, భారీ శరీరాకృతితో ఉంటారు.
డి) యుద్ధ విన్యాసాల్లో అనుభవం ఉండటంతో వీరు ద్రావిడులను కూడా జయించారు.
1) ఎ, బి, సి, డి సరైనవి
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు
3) ఎ, డి, సి సరైనవి; బి సరికాదు
4) ఎ, సి, డి సరైనవి; బి సరికాదు

2. కింది వాటిని జతపరచండి.

నీగ్రిటోలు	రాష్ట్రాలు
ఎ) ఎరుంబ	1) అస్సాం
బి) పనియన్	2) ఆంధ్రప్రదేశ్
సి) యానాది	3) తమిళనాడు
డి) అంగామి	4) కేరళ

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-2, బి-3, సి-4, డి-1

3. కింది వాటిలో మంగోలాయిడ్స్ జాతికి సంబంధించి వాక్యాలను సరిచూడండి.
ఎ) మంగోలాయిడ్లు హిమాలయాలు, ఈశాన్య భారత దేశంలో విస్తరించి ఉంటారు.
బి) పసుపు రంగు దేహ వర్ణం, గుండ్రటి శిరస్సుతో ఉంటారు.
సి) మనదేశంలో అండమాన్ నికోబార్ దీవుల్లోని షాంపెన్, నికోబారీలు ఈ జాతికి చెందినవారే.
డి) వీరు బరువైన, పొడవైన వెంట్రుకలతో; నల్లని చిన్న కళ్లు, చిన్న ముక్కుతో ఉంటారు.
1) ఎ, బి సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
3) ఎ, బి, సి డి సరైనవి.
4) ఎ, డి సరైనవి; బి, సి సరికావు.

4. కింది తెగలను జతపరచండి.

తెగలు	రాష్ట్రాలు
ఎ) దోడియా	1) ఒడిశా
బి) భుంజియా	2) మధ్యప్రదేశ్
సి) ఖరియా	3) గుజరాత్
డి) కొరవ	4) మహారాష్ట్ర

1) ఎ-3, బి-4, సి-2, డి-1 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-1, బి-4, సి-2, డి-3


5. కింది వాక్యాలను సరిచూడండి.
ఎ) ప్రోటో ఆస్ట్రలాయిడ్స్ అనే వారు మధ్యధరా సముద్ర తూర్పు భాగం నుంచి మన దేశంలోకి వలస వచ్చారని అంటారు.
బి) ప్రోటోఆస్ట్రలాయిడ్స్ మన దేశంలో మొదట వ్యవసాయం ప్రారంభించారు.
సి) కోల్, బదగ, కోర్వ, బిల్లులు లాంటి వారిని మధ్య భారతదేశంలో విస్తరించిన ప్రోటో ఆస్ట్రలాయిడ్స్‌గా పరిగణిస్తారు.
డి) కొంతమంది చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం ప్రోటో ఆస్ట్రలాయిడ్స్ ఆస్ట్రేలియాలోని ఆదివాసీ తెగ నుంచి వచ్చారు.
1) ఎ, బి, సి డి సరైనవి.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

6. కింది వాటిని జతపరచండి.
(2011 ప్రకారం మతాల వారీగా అక్షరాస్యత)

మతాలు	అక్షరాస్యత
ఎ) జైనులు	1) 59%
బి) బౌద్ధులు	2) 70%
సి) సిక్కులు	3) 72%
డి) ముస్లింలు	4) 94%

1) ఎ-4, బి-1, సి-3, డి-2 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-1, బి-2, సి-4, డి-3

7. కింది వాటిని సరిచూడండి.



ఎ) పిల్లల్లో లింగ నిష్పత్తి అధికంగా ఉన్న రాష్ట్రాల్లో అరుణాచల్‌ప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది.
బి) పిల్లల్లో లింగ నిష్పత్తి అతితక్కువగా ఉన్న రాష్ట్రం హరియాణా.
సి) మన దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం పిల్లల జనాభా 16.45 కోట్లు
డి) పిల్లల లింగ నిష్పత్తి ఎక్కువ ఉన్న కేంద్ర పాలిత ప్రాంతం అండమాన్ నికోబార్ దీవులు.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) బి, సి సరైనవి; ఎ, డి సరికావు.
3) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
4) ఎ, బి, సి, డి సరైనవి.

8. మన దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం మతాల వారీగా లింగ నిష్పత్తిని జతపరచండి.

మతాలు	లింగ నిష్పత్తి
ఎ) ముస్లింలు	1) 965
బి) హిందువులు	2) 903
సి) సిక్కులు	3) 939
డి) బౌద్ధులు	4) 951

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-1, బి-4, సి-3, డి-2
3) ఎ-1, బి-3, సి-2, డి-4 4) ఎ-3, బి-4, సి-2, డి-1

9. కింది వాక్యాలను సరిచూడండి.
ఎ) వృద్ధి రేటు పరంగా ప్రపంచ జనాభా వేగంగా పెరగడానికి ప్రధాన కారణం సహజ వృద్ధి రేటు.
బి) మన దేశంలో 2011 జనాభా ప్రకారం వృద్ధి రేటు 17.7%. ఇది వార్షిక వృద్ధి రేటు పరంగా చూస్తే 1.64%.
సి) మన దేశంలో అధిక వృద్ధి రేటు ఉన్న రాష్ట్రం మేఘాలయ. అల్ప వృద్ధి రేటు ఉన్నది నాగాలాండ్.
డి) అత్యల్ప వృద్ధి రేటు ఉన్న కేంద్రపాలిత ప్రాంతం లక్షదీవులు.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
4) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.

10. కింది వాటిలో భారత జనాభా పరిణామానికి సంబంధించిన వాటిని జతపరచండి.

సంవత్సరం	జనాభా వృద్ధి స్వరూపం
ఎ) 1891-1921 (మొదటి దశ)	1) తగ్గుతుందని సూచిస్తూ అధిక వృద్ధి
బి) 1921-1951 (రెండో దశ)	2) సత్వర అధిక వృద్ధి నమోదు
సి) 1951-1981 (మూడో దశ)	3) స్తబ్ధతతో కూడిన జనాభా
డి) 1981-2011 (నాలుగో దశ)	4) క్రమేణా వృద్ధి నమోదు

1) ఎ-3, బి-4, సి-2, డి-1 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-1, బి-4, సి-3, డి-2

11. ప్రపంచ జనాభా వృద్ధికి సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
ఎ) ప్రపంచ జనాభా 1804 నాటికి క్రమేణా పెరిగి 100 కోట్లకు చేరింది.
బి) 1959 నాటికి అంటే కేవలం 155 సంవత్సరాలకే ప్రపంచ జనాభా 200 కోట్లు పెరిగి మొత్తం 300 కోట్లకు పెరిగింది.
సి) 1999 నాటికి ప్రపంచ జనాభా 600 కోట్లకు చేరింది అంటే కేవలం 40 ఏళ్ల వ్యవధిలో 300 కోట్లు పెరిగింది.
డి) యూఎన్ఓ అంచనా ప్రకారం ప్రపంచ జనాభా 2022 నాటికి 800 కోట్లు.
1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
4) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.

12. కింది వాటిని జతపరచండి.

జాబితా–1	జాబితా–2
ఎ) అక్షరాస్యులు తక్కువగా ఉన్న రాష్ట్రం	1) ఉత్తర్‌ప్రదేశ్
బి) అక్షరాస్యులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం	2) సిక్కిం
సి) గ్రామీణ అక్షరాస్యత అధికంగా ఉన్న రాష్ట్రం	3) మిజోరాం
డి) పట్టణ అక్షరాస్యత అధికంగా ఉన్న రాష్ట్రం	4) కేరళ

1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-2, బి-1, సి-4, డి-3
3) ఎ-4, బి-3, సి-2, డి-1 4) ఎ-1, బి-4, సి-3, డి-2

13. కింది వాక్యాలను సరిచూడండి.



ఎ) మన దేశంలో బౌద్ధులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం మహారాష్ట్ర.
బి) క్రైస్తవ జనాభా శాతం అధికంగా నాగాలాండ్‌లో ఉంది.
సి) ముస్లిం జనాభా తక్కువగా ఉన్న రాష్ట్రం మిజోరాం.
డి) హిందూ జనాభా శాతం తక్కువగా ఉన్న రాష్ట్రం మిజోరాం.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, సి, డి సరైనవి.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

14. కింది వాటిని జతపరచండి.

గిరిజన తెగ	రాష్ట్రం
ఎ) అడియన్	1) మహారాష్ట్ర
బి) పులియా	2) త్రిపుర
సి) చక్మ	3) కేరళ
డి) చోదం	4) కర్ణాటక

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-3, బి-4, సి-2, డి-1 4) ఎ-4, బి-2, సి-1, డి-3

15. కింది వాక్యాలను సరిచూడండి.



ఎ) గ్రామీణ జనాభా అధికంగా ఉన్న రెండో రాష్ట్రం బిహార్.
బి) గ్రామీణ జనాభా తక్కువగా ఉన్న రాష్ట్రం సిక్కిం.
సి) 2011 నాటికి మొత్తం గ్రామీణ జనాభా 83.35 కోట్లు.
డి) 2011 నాటికి భారతదేశంలో గ్రామీణ జనాభా వృద్ధి రేటు 12.3%.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి డి సరైనవి.
3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

16. కిందివాటిని జతపరచండి. (2011 ప్రకారం)

జాబితా–1	జాబితా–2
ఎ) చట్టబద్ధ నగరాలు	1) 981
బి) సెన్సస్ నగరాలు	2) 475
సి) పట్టణ సముదాయాలు	3) 3894
డి) బాహ్య అభివృద్ధి పట్టణాలు	4) 4041

1) ఎ-1, బి-2, సి-3, డి-4
2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-3, డి-2
4) ఎ-4, బి-3, సి-2, డి-1



రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు

1-1; 2-2; 3-3; 4-1; 5-1; 6-2; 7-4; 8-1; 9-2; 10-1; 11-1; 12-2; 13-3; 14-1; 15-2; 16-4.

వసుంధర

vasundhara@eenadu.in

సామాన్యులకూ తెలియాలని..!

ఏదైనా అనారోగ్యం వస్తే ఒకప్పుడు తొలి ఆలోచన వైద్యులను సంప్రదించాలనే! మరి ఇప్పుడు? జలుబు, జ్వరం... ఏదైనా నేరుగా మందులు కొనుక్కొని వేసుకుంటున్నాం. కానీ ఇలా ఇష్టమొచ్చినట్టుగా యాంటీ బయాటిక్స్ వేస్తూ పోతే మేలు కంటే కీడే ఎక్కువని తెలుసా? ఇదే ప్రశ్నిస్తున్నారు పొన్నారి గొట్టిపాటి. రాబోయే తరాలను ఆరోగ్యకరమైన సమాజం దిశగా నడిపించడానికీ కృషి చేస్తున్న ఈమెను వసుంధర పలకరించింది.



పొన్నారి

పొన్నారి... నా ముద్దుపేరు కాదు, అసలు పేరే! మా నాయనమ్మ పొన్నమాంబ పేరుమీదుగా నాకిలా పెట్టారు. మాది విజయవాడ. అమ్మ ఇంద్రాణి. నాన్న ఉమాశంకర్ గొట్టిపాటి ఆర్టిస్ట్. వ్యవసాయమూ చేసేవారు. కోయంబత్తూరులో బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీల్లో డ్యూయల్ డిగ్రీ, యూకేలో మాలిక్యులర్ జెనెటిక్స్‌లో మాస్టర్స్ పూర్తిచేశా. అక్కడే క్యాన్సర్ మీద రీసర్చ్ చేస్తూ పీహెచ్‌డీ పూర్తి చేశాను. ఆపై యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌లో ప్రొస్టేట్ క్యాన్సర్ మీద పోస్ట్ డాక్ చేశాను. తరవాత భారత్‌కి తిరిగొచ్చి, హైదరాబాద్‌లో స్థిరపడ్డా. ప్రస్తుతం ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసర్చ్‌గా చేస్తున్నా. పరిశోధకులకు సపోర్ట్ సర్వీసెస్ అందిస్తున్నా.

బాబు పుట్టాక మధ్యలో నేను కొన్నాళ్లు కెరియర్ బ్రేక్ తీసుకున్నా. ఆ సమయంలో సామాన్యులకీ సైన్స్ సంబంధిత అంశాలు తెలిసేలా చేయాలి అనుకున్నా. ఆ క్రమంలోనే యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) గురించి తెలిసింది. అంటే ఒంట్లో బాగోనప్పుడు మనం యాంటీబయాటిక్స్ తీసుకుంటాం కదా! నిజానికి అవి బ్యాక్టీరియాల మీదే పనిచేస్తాయి. మనమేమో చిన్న జలుబు, దగ్గు వంటివి వచ్చినా వాటిని తీసుకుంటున్నాం. దీంతో బ్యాక్టీరియాలు వాటిని తట్టుకునే శక్తిని పెంచుకుంటున్నాయి. తీరా అవసరానికి పనిచేయకపోగా చిన్న ఇన్ఫెక్షన్లూ ప్రాణాంతకంగా మారే అవకాశముంది. కాబట్టే, డబ్ల్యూహెచ్‌ఓ దీన్ని ప్రపంచ 10 అనారోగ్య సమస్యల్లో ఒకటిగానూ చెబుతోంది. ప్రసవ సమయంలో తల్లీబిడ్డల్ని రక్షించుకోగలుగుతున్నా, క్యాన్సర్ వంటి వాటికి చికిత్సలు కనిపెడుతున్నా యాంటీ బయాటిక్స్ వల్లే సాధ్యమవుతోంది. కానీ మితిమీరి వాడకం పెను ముప్పులకు కారణమవుతోందని తెలిసి ఆశ్చర్యపోయా. శాస్త్రవేత్తలమైన మాకే తెలియకపోతే సామాన్యులకు ఇది ఎలా తెలుస్తుంది అనిపించింది. అందుకే 'సూపర్ హీరోస్ ఎగెనెస్ట్ సూపర్ బగ్స్' అనే సంస్థని ఫ్రెండ్స్‌తో కలిసి ప్రారంభించి దీనిపై అవగాహన కల్పిస్తున్నాం.

అందుకే పిల్లలు...

దీనికి మేం ఎంచుకుంది పిల్లల్నే! పెద్దవాళ్లు అలవాట్లు మార్చుకోవడానికి ఇష్టపడరు. కానీ చిన్నప్పట్నుంచే అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో పిల్లలే సమస్యను సమర్థంగా ఎదుర్కోగలరు. అంతేకాదు, పెద్దవాళ్లపైనా ప్రభావం చూపగలుగుతారు అనిపించింది. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు వెళ్లి వర్క్‌షాపులు నిర్వహిస్తూ పిల్లలకు అర్థమయ్యేలా ఆటలు, యాక్టివిటీల ద్వారా దీనిపై అవగాహన కల్పిస్తున్నాం. తొలిరోజుల్లో వరల్డ్ కామిక్స్ ఇండియా అనే ఏజెన్సీతో కలిసి పనిచేశా. రెండు రోజులు చిన్నారులకు అర్థమయ్యేలా సమస్యని వివరించి, మూడోరోజు ఏఎంఆర్‌కి సంబంధించి నచ్చిన అంశమ్మీద కథ రాయమనేవాళ్లం. వాళ్లతోనే కామిక్స్ వేయించేవాళ్లం. తరవాత వాటితో ఇతరులకు అర్థమయ్యేలా చెప్పమనేవాళ్లం. దీంతో వాళ్లకెంత వరకూ అర్థమయ్యిందో తెలుస్తుంది. పిల్లలు చెబుతున్నారంటే పెద్దవాళ్లు ఆసక్తిగా వింటారు కదా! అలా ఎక్కువ మందికి చేరువవ్వాలనేది మా ఆలోచన. మా పనితీరు నచ్చి వాలంటీర్లు వచ్చారు. యునైటెడ్ నేషన్స్ 'కాల్ టూ యాక్షన్' అనే కాన్ఫరెన్స్ నిర్వహించి... ప్రపంచవ్యాప్తంగా ఏఎంఆర్ మీద యువతతో పనిచేస్తున్న రెండు సంస్థలను ఆహ్వానించింది. వాటిలో మాదీ ఒకటి. అక్కడ మాట్లాడటం ద్వారా కూడా మాకు గుర్తింపు వచ్చింది.

కర్ణాటక ప్రభుత్వంతో కలిసి మెడికల్ కాలేజీల్లో కార్యక్రమాలు నిర్వహించాం. దిల్లీ శానిటరీ వర్కర్స్‌తో కలిసి పనిచేయమని పిలుపొచ్చింది. ప్రస్తుతం స్కూళ్లే కాదు... మెడికల్, ఫార్మా, వెటర్నరీ విద్యార్థులు, ఉద్యోగులు, సామాన్యులకీ అవగాహన కల్పిస్తున్నాం. విద్యార్థులతో కలిసి మురల్స్ వేస్తున్నాం. మా లక్ష్యం ఒకటే... క్యాన్సర్, డయాబెటీస్ వంటి వాటిలాగే ఏఎంఆర్ గురించీ మాట్లాడుకునేంత అవగాహన రావాలి. వైద్యుల సలహా లేకుండా ఇష్టారీతిన యాంటీ బయాటిక్స్ వాడొద్దన్న స్పృహ రావాలి. ఇందుకు డాక్టర్లు, ఫార్మసిస్టుల నుంచి మామూలు ప్రజల వరకూ కలిసి పని చేయాలి. వాళ్లందరినీ ఏకతాటిపైకి తేవడం పైనే మా కృషంతా!

యోగాకో చాప!

యోగాసనాలు వేయడానికి చాప తప్పనిసరి. అయితే, అందుకు పీవీసీ మ్యాట్లను ఎంచుకునే బదులుగా... పర్యావరణహితమైన రకాలకు ప్రాధాన్యమివ్వండి. వీటిల్లో కొన్ని బయోడిగ్రేడబుల్ కాగా, మరికొన్ని రీసైకిల్ చేయగలిగేవి.



- **నేచురల్ ట్రీ రబ్బర్ మ్యాట్:** చెట్ల నుంచి తీసిన సహజ రబ్బరుతో వీటిని చేస్తారు. మంచి గ్రిప్ ఉంటుంది. మన్నికైనవి, బయోడిగ్రేడబుల్ కూడా. చెమట పట్టినప్పుడు పట్టు జారిపోదు.
- **కార్క్ మ్యాట్:** సహజంగా వీటికి దుమ్ము పట్టదు. యాంటీ మైక్రోబియల్ లక్షణాలు ఉండటం వల్ల దుర్వాసన ఉండదు. దీన్ని రెండువైపులా ఉపయోగించొచ్చు. చెమట పట్టినా పట్టు జారకుండానూ చేస్తుంది.
- **జ్యూట్ మ్యాట్:** జనపనారకు కొంత సహజ రబ్బరును కలిపి వీటిని చేస్తారు. మంచి టెక్స్చర్ ఉండి గ్రిప్ ఇస్తాయి. ఎక్కువకాలం మన్నుతాయి. త్వరగా భూమిలో కలిసిపోతాయి.
- **గడ్డి చాపలు:** సంబు, కొరాయ్, మదుర్ కతి వంటి గడ్డి రకాలకు జనపనార కలిపి నేసిన ఈ మ్యాట్‌లు పర్యావరణ ప్రియమైనవి. తేలికైనవి, పట్టునిస్తాయి.
- **హ్యాండ్‌లూమ్ మ్యాట్‌లు:** ఇవి మృదువుగా ఉండి... యోగాభ్యాసానికి అనుకూలంగా ఉంటాయి. వీటిని సులువుగా మడతపెట్టొచ్చు. ఉతకొచ్చు.



బామ్మ చిట్కా

వంట చేసేటప్పుడు తెలియకుండానే గంటలకొద్దీ నిలబడతారు. స్టైల్ పేరుతో హీల్స్ వేసుకుంటూ ఉంటారు. ఇలాంటప్పుడు చాలాసార్లు మడమలు నొప్పి పుడుతూ ఉంటాయి కదూ! పెద్దగా పట్టించుకోనీ, అలాగని వదిలేయలేని సమస్య ఇది. ఇలాంటప్పుడు ఒక ఉల్లిపాయను తీసుకుని మధ్యకి కోయండి. ఆపై పొయ్యిమీద పెనం పెట్టి, అది వేడయ్యాక ఈ సగం ఉల్లిముక్కతో దాన్ని రుద్దండి. ఉల్లిముక్క వేడయ్యాక దాన్ని మడమలు, అరిపాదాల్లో నొప్పి ఉన్నచోట రుద్దండి. ఈ నొప్పుల నుంచి ఉపశమనం దొరుకుతుంది. అయితే భరించగలిగేంత వేడి ఉండేలా చూసుకోవాలి మరి.

పది ఫెయిల్... జీవితంలో పాస్!

పదో తరగతి ఫెయిల్... అయితేనేం, వ్యవసాయం చేస్తూ రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు. పోషక విలువలున్న మునగతో సౌందర్య ఉత్పత్తులు తయారుచేసి... విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఆమే 38ఏళ్ల పొన్నరసి.

తమిళనాడు దిండిగల్‌కి మునగ సాగులో ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. కానీ, దాన్ని పండించే రైతులు మాత్రం ఎప్పుడూ నష్టాలే చూస్తున్నారని చెబుతారు పొన్నరసి. వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగారీమె. నలుగురు పిల్లల తల్లయ్యాకే వ్యవసాయం చేయడం మొదలుపెట్టారు. తనకున్న పదెకరాలను సాగు చేస్తున్నారు.

'మొదట్లో మునగ ఆకులు, విత్తనాలు, వేర్లు అమ్మేవాళ్లం. అయితే, ఈ పని చేసే రైతులు చాలా మంది ఉండటంతో మార్కెట్‌లో పోటీ ఏర్పడి దాని ధర బాగా పడిపోయింది. అప్పుడు కోయంబత్తూరులోని తమిళనాడు వ్యవసాయ కళాశాలలో డాక్టర్ జాన్ కెనడీని కలిశాను. ఆయన ఆధునిక పద్ధతిలో వ్యవసాయం ఎలా చేయాలో నేర్పించారు. ఎక్కువ దిగుబడినిచ్చే వంగడాలను ఎంచుకోవడం, మునగను ప్రాసెస్ చేసి వాటి గింజల నుంచి నూనె తీయడం, పొడి, సౌందర్య ఉత్పత్తులను తయారుచేయడం వంటివి నేర్పారు. తరవాత దిండిగల్‌లోని గాంధీగ్రామ్ యూనివర్సిటీలో వ్యవసాయ విస్తరణాధికారుల సాయంతో మునగ గింజల నుంచి నూనె తీసే యంత్రాల గురించి తెలుసుకున్నా. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సహకారమూ నాకు తోడయ్యింది.



పొన్నరసి

మునగ... మెట్ట పంటే అయినా అన్ని రకాల వంగడాలు తెగుళ్లని తట్టుకోలేవు. అందుకే వాటిని తట్టుకుని నిలబడే మూలన్నూర్ మునగను సాగుకి ఎంచుకున్నా. ఇది ఏడాదికి మూడు టన్నుల దిగుబడి ఇస్తుంది. వీటి గింజల్లో నూనె కూడా ఎక్కువ. మొదట్లో నూనె తీయడం, గింజల్ని శుభ్రం చేయడం, యంత్ర నిర్వహణలకు అనుభవం అవసరమై కష్టపడ్డా. వీటికితోడు చుట్టుపక్కల వాళ్లేమో 'పదో తరగతి ఫెయిల్... నలుగురు పిల్లల తల్లివి... ఇవన్నీ నీవల్ల కాదు' అంటూ వెనక్కి లాగేవారు. అయినా ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లా' అని చెబుతారు పొన్నరసి.

మహిళా వ్యాపారవేత్తగా...

ఉత్పత్తులు తయారుచేయడమే కాదు, నాణ్యత తగ్గకుండా కస్టమర్లకు సరకులు అందించడంలో చాలా సవాళ్లను ఎదుర్కొన్నారీమె. మునగ ఆకులు, కాయలు, గింజలతో నూనె, సబ్బులు, షాంపూలు, లిప్ బామ్స్, సూప్, పౌడర్లు వంటి మొత్తం 36 రకాల ఉత్పత్తులను తయారుచేస్తున్నారు. 'ప్రభుత్వం నుంచి రూ.2లక్షలు తీసుకుని ప్యాక్ హౌస్‌ను ఏర్పాటుచేశా. 'ఫేస్‌బుక్, వాట్సాప్... వంటి సోషల్ మీడియా వేదికల్లోనే మాకు వెయ్యి మంది కస్టమర్లున్నారు. మలేషియా, సింగపూర్, అమెరికా, ఫ్రాన్స్ మొదలైన దేశాలకు మా ఉత్పత్తుల్ని ఎగుమతి చేస్తూ సంవత్సరానికి రూ.12లక్షలు సంపాదిస్తున్నా'నంటారీమె. ఈ క్రమంలో అనేక అవార్డులతోపాటు 'మోరింగా క్వీన్' బిరుదునీ అందుకున్నారు.

నొప్పి లేకుండా బ్లాక్‌హెడ్స్ పోతాయా?

నేను ఐటీ ఉద్యోగినిని. నా వయసు 30 ఏళ్లు. నా ముక్కుపై బ్లాక్ హెడ్స్ బాగా వస్తున్నాయి. వాటిని పార్లర్‌లో తొలగిస్తుంటే నొప్పితోపాటు ఆ ప్రదేశం ఎర్రబారుతోంది. రెండు రోజుల వరకూ తగ్గడం లేదు. నొప్పి లేకుండా సులువుగా పోయే మార్గం ఏదైనా ఉందా? - హరిణి, చిత్తూరు



డియర్ వసుంధర
- సూరపనేని పద్మావతి, డెర్మటాలజిస్ట్

బ్లాక్‌హెడ్స్ రెండు రకాలు. వీటి ట్రీట్‌మెంట్స్ కూడా వేర్వేరుగా ఉంటాయి. మొదటి రకాన్ని కామెడోన్స్‌గా పిలుస్తారు. నూనె గ్రంథులు మూసుకుపోయి, లోపల మృతకణాలు, నూనె కలిసి నల్లగా మారి యాక్నే, పింపుల్స్‌తో కలిపి వస్తాయి. వీటిని బ్యూటీ పార్లర్‌లో ఫేషియల్ లేదా క్లీనప్ చేయించుకున్నప్పుడు కామెడోన్ ఎక్స్‌ట్రాక్టర్‌తో తీసేస్తారు. అయితే, కాస్త నొప్పి పుట్టొచ్చు. తర్వాత శాలిసిలిక్ యాసిడ్, అజిలిక్ యాసిడ్, రెటినాల్ క్రీమ్స్ వంటివాటిని వాడండి. ఇవి మళ్లీ రాకుండా చేసి చర్మాన్ని మృదువుగా మారుస్తాయి. ఇక రెండో రకం హెయిర్ ఫాలికల్స్ వల్ల వచ్చినవి. ముక్కు మీద సన్నని వెంట్రుకలు పెరిగి బ్లాక్ హెడ్స్‌లా కనిపిస్తాయి. వీటిని నోస్ వాక్స్ స్ట్రిప్స్ ద్వారా పార్లర్‌లోనే కాదు...ఇంట్లోనూ తొలగించుకోవచ్చు. అయితే, శాశ్వత పరిష్కారం కావాలనుకుంటే మాత్రం లేజర్ హెయిర్ రిమూవల్ చేయించుకోవచ్చు. సాధారణంగా 8 నుంచి 10 సెషన్లు పట్టొచ్చు. తర్వాత అక్కడ వెంట్రుకలు పెరగవు. ఇంకొందరు ముక్కుమీద నల్లటి మచ్చలు చూసి బ్లాక్‌హెడ్స్‌గా పొరపాటు పడతారు. ముందు అవి ఏరకమైనవో డెర్మటాలజిస్ట్‌కి ఓసారి చూపించుకుంటే తగిన సలహా ఇస్తారు.

బంగారం - వెండి



7న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,58,550	1,43,950	2,59,892
విజయవాడ	1,54,375	1,43,550	2,73,000
ప్రొద్దుటూరు	1,60,400	1,47,570	2,67,000
రాజమహేంద్రవరం	1,56,600	1,43,550	2,85,000
విశాఖపట్నం	1,56,600	1,43,650	2,65,000
తమిళనాడు	-----	1,44,200	2,85,000

ఈనాడు సినిమా

క్రేజీ కాంబో.. ప్రోమోతో సిద్ధమా!



రజనీకాంత్, కమల్‌హాసన్

కథానాయకులు రజనీకాంత్ - కమల్‌హాసన్ కలిసి నటించనున్న మల్టీస్టారర్ కోసం సినీప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రేజీ కాంబోలో రూపొందనున్న సినిమాకి నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించనున్నట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి. 'ఈ ప్రాజెక్ట్ చర్చల దశలో ఉంద'ని సౌందర్య రజనీకాంత్ కూడా ఇటీవల స్పష్టత ఇవ్వడంతో దీనిపై అంచనాలు రెట్టింపయ్యాయి. అయితే ఇప్పుడీ చిత్రానికి సంబంధించి మరో ఆసక్తికర వార్త బయటకొచ్చింది. ఈ సినిమా ప్రకటనకు సంబంధించిన ప్రోమో చిత్రీకరణ చెన్నైలో మొదలైందని సమాచారం. దీనికోసం ఓ ప్రత్యేక సెట్‌ను సిద్ధం చేసినట్లు తెలిసింది. త్వరలోనే ఈ ప్రచార చిత్రంతోనే ఈ మల్టీస్టారర్‌ను అధికారికంగా ప్రకటించనున్నారని తెలుస్తోంది.


మొదలయ్యేది మార్చి నుంచే!



చిరంజీవి

విజయోత్సాహంలో ఉన్న చిరంజీవి పెద్దగా విరామం తీసుకోకుండానే కొత్త సినిమా కోసం రంగంలోకి దిగనున్నారు. మార్చి నుంచే ఆ చిత్రం షురూ కానుంది. ఆ మేరకు చిత్రబృందం ప్రణాళికలు రచించినట్టు తెలుస్తోంది. సంక్రాంతికి 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాతో ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారు చిరంజీవి. ఆ సినిమా సెట్స్‌పై ఉండగానే, బాబీ కొల్లి దర్శకత్వంలో సినిమా చేయడానికి పచ్చ జెండా ఊపారు. ఇప్పటికే పూర్వ నిర్మాణ పనులన్నీ పూర్తి చేసిన బాబీ... వెంటనే సినిమాని పట్టాలెక్కించేందుకు సిద్ధమయ్యారు. తండ్రి, కూతురు కథతో ఆ చిత్రం రూపొందనున్నట్టు సమాచారం. కూతురు పాత్ర కోసం కృతిశెట్టి పేరు ప్రచారంలోకి వచ్చినా, తాజాగా సారా అర్జున్‌ని ఎంపిక చేశారని సమాచారం. ఇందులో ఇద్దరు కథానాయికలకు చోటుందని తెలిసింది. ఇప్పటికే ఓ సీనియర్ హీరోయిన్ పాత్ర పేరు ప్రచారంలోకి వచ్చింది. మరొక హీరోయిన్ ఎంపికపై చిత్రబృందం కసరత్తులు చేస్తోంది. 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి - బాబీ కలయికలో రూపొందుతున్న చిత్రమిది.

ద్వంద్వ విలువల మనస్తత్వాల్ని ప్రశ్నించడానికి



సునీల్‌కుమార్

సమాజం ఛీత్కరించుకునే మురికి మనుషుల మధ్య నున్న స్వచ్ఛమైన స్నేహం, ప్రేమని ఆవిష్కరించే చిత్రమే మా 'కాక్రోచ్' అంటున్నారు పి.సునీల్‌కుమార్ రెడ్డి. ఆయన దర్శకత్వంలో... అభిలాష్, ప్రేమసన్, నవీన్, 'సొంతవూరు' ఫేం తీర్థ, మీనాక్షి, రామన్ ప్రధాన పాత్రలు పోషించారు. శ్రీలక్ష్మి పిక్చర్స్ పతాకంపై బి.బాపిరాజు, ముతుకి నాగ సత్య నారాయణ సంయుక్తంగా నిర్మించారు. సెన్సార్ కార్యక్రమాల్ని పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మార్చి మొదటివారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపింది చిత్రబృందం. నిర్మాతలు మాట్లాడుతూ "భ్రష్టుపట్టిన అవినీతి సమాజపు చీకటిని పరిచయం చేసే చిత్రమిది. ద్వంద్వ విలువల మనస్తత్వాల్ని ప్రశ్నించే పాత్రలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. హింసాత్మక పోరాటాల్ని సహజంగా చూపించడానికి నిజమైన ఫైటర్స్‌ని నటులుగా ఎంపిక చేసి చిత్రీకరణ చేశాం. సున్నిత మనస్కులు, పిల్లలు ఈ చిత్రానికి దూరంగా ఉండాలి. పెద్దలు మాత్రమే చూడాల్సిన సినిమాగా సెన్సార్ బోర్డ్ 'ఏ' ధృవీకరణ పత్రాన్ని ఇచ్చింద"న్నారు.

రిటైర్మెంట్ కాదు.. విరామం అంతే



విక్రాంత్ మాస్సే

బాలీవుడ్ యువ హీరో విక్రాంత్ మాస్సే గతంలో తన నటనకు కొన్ని నెలల విరామం ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై సామాజిక మాధ్యమాల్లో ఆయన సినిమాలకు శాశ్వతంగా దూరమవుతున్నారని కూడా ప్రచారం జరిగింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న విక్రాంత్.. తన రిటైర్మెంట్‌ని అందరూ తప్పుగా అర్థం చేసుకున్నారంటూ దానికి గల కారణాల్ని వెల్లడించారు. "నేను చెప్పాలనుకుంటున్న విషయాన్ని తక్కువ పదాలలో చెప్పేసరికి అందరూ దాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారు. నేను విరామం తీసుకుందామనుకున్నాను కానీ, శాశ్వతంగా నటనకు దూరమవుతానని చెప్పలేదు. ఆ సమయంలో నేను తీవ్ర ఒత్తిడిలో ఉన్నా. అందుకే కొన్ని రోజులు విరామం ప్రకటించా. రోజులో 14, 16 గంటలు పనిచేయడం చాలా కష్టంగా అనిపించింది. కుటుంబంతో గడపడం కుదరలేదు. ఆ ఆలోచనలతో పనిచేస్తున్న క్షణాలను ఆస్వాదించలేకపోతే విజయంలో అర్థమేముంటుందని విరామం తీసుకున్నా" అని చెప్పారు.

ప్రతి ఒక్కర్నీ నవ్వించే పంపిస్తాం



కయాదు, విష్వక్ సేన్

"ఫంకీ' చిత్రంతో కడుపుబ్బా నవ్విస్తాం. మాట మీద నిల్చుంటాం" అంటున్నారు కథానాయకుడు విష్వక్ సేన్. ఆయన.. కయాదు లోహర్ జంటగా నటించిన ఈ సినిమాని అనుదీప్ కేవీ తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో విష్వక్ సేన్ మాట్లాడుతూ.. "బాధ్యతగా ప్రేక్షకులకు మంచి సినిమా ఇవ్వాలన్న ఉద్దేశంతో కాస్త గ్యాప్ తీసుకున్నా. ఈ చిత్రం కచ్చితంగా రెండు గంటల పది నిమిషాల పాటు నాన్‌స్టాప్‌గా నవ్విస్తుంది" అన్నారు. "ఇందులో అనుదీప్ ట్రేడ్ మార్క్ కామెడీని చూడబోతున్నారు. ట్రైలర్‌లో చూసిన దానికంటే రెట్టింపు వినోదం సినిమాలో కనిపిస్తుంది" అంది నటి కయాదు లోహర్. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో బలమైన కథ, ఎమోషన్స్ ఊహించి థియేటర్‌కు రాకండి. ట్రైలర్‌లో చూపించినట్లుగా మంచి పంచ్‌లు, వినోదం కోసమే రండి. కచ్చితంగా ప్రతి ఒక్కర్నీ నవ్వించే పంపిస్తాం" అన్నారు. ఈ కార్యక్రమంలో అనుదీప్, మోహన్, వెంకట్, నిరంజన్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.



నన్ను నేను అంగీకరించడానికే ఎంతో సమయం

మరిన్ని విశేషాలు https://epaper.eenadu.netలో

నవ్విస్తుంది.. భయపెడుతుంది

సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని



సాయికృష్ణ, లయ, అనిల్ రావిపూడి, శివాజీ, సుధీర్ శ్రీరామ్

"తక్కువ సమయంలోనే ఓటీటీ మార్కెట్‌ని ఈటీవీ విన్ శాసిస్తుందని ఇంతకు ముందు ఓ వేడుకకి హాజరైనప్పుడే చెప్పా. ఇంటిల్లిపాదినీ అలరించే కథల్ని ఎంపిక చేసుకొంటూ ప్రయాణం చేస్తోంది ఆ సంస్థ. అదే ఓటీటీలో ప్రదర్శనకు సిద్ధమైన 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' కూడా తప్పకుండా ప్రేక్షకుల మెప్పు పొందుతుంద"న్నారు ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి. ఆయన ముఖ్య అతిథిగా శనివారం హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. శివాజీ, లయ జంటగా నటించిన చిత్రమిది. శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ పతాకంపై శివాజీ స్వయంగా నిర్మించారు. సుధీర్ శ్రీరామ్ దర్శకుడు. రోహన్, ప్రిన్స్, అలీ, ధన్‌రాజ్, ఇమ్మానుయేల్ ఇతర పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈ నెల 12న ఈటీవీ విన్‌లో ప్రదర్శనకు రానుంది. అనిల్ రావిపూడి మాట్లాడుతూ "ట్రైలర్ చాలా బాగుంది. సినిమాని చూడాలనే ఆసక్తిని రేకెత్తిస్తుంది. దర్శకుడు సుధీర్ రచన, చిత్రాన్ని తీర్చిదిద్దిన తీరు చాలా బాగుంది. సినిమాని ఎంతగానో ప్రేమిస్తారు శివాజీ. ఆయనే నిర్మాతగా మారి ఈ చిత్రాన్ని రూపొందించారు. లయ ఇమేజ్‌కి భిన్నంగా ఆమె ఇందులో పాత్రని పోషించారు. ఎన్నో గొప్ప సినిమాలు చేసిన ఆమె రెండో ఇన్నింగ్స్‌కి శ్రీకారం చుట్టి మంచి చిత్రాలు చేస్తున్నార"న్నారు. నటుడు, నిర్మాత శివాజీ మాట్లాడుతూ "అనిల్ ఎంత ప్రతిభావంతుడో, అంత మంచివాడు. తనంటే ఎంతో ప్రేమ నాకు. తను ఈ వేడుకకి రావడం ఆనందంగా ఉంది. గతంలో నేను నిర్మించిన 'తాజ్‌మహల్' కంటే ఎక్కువగా ఈ సినిమా విషయంలో శ్రద్ధ తీసుకున్నా. ఈ చిత్రం నవ్విస్తుంది, భయపెడుతుంది. చివరివరకూ ఉత్కంఠభరితంగా సాగుతుంది. మేమందరం కలిసి ఓ మంచి సినిమా చేశాం. ఇందులో ఓ పాటని ఎవరితో చేయించాలా అనుకున్నప్పుడు మా అబ్బాయి రిక్కీ... బండ్ల గణేశ్ అన్న పేరు సూచించాడు. ఆయన దగ్గరకు వెళ్లి అడగ్గానే చేద్దాం అంటూ ముందుకొచ్చారు. ఆయనకి ఎంతో రుణపడి ఉన్నా. ఈ సినిమా ప్రతి ఒక్కరికీ నచ్చుతుంద"న్నారు. లయ మాట్లాడుతూ "దర్శకుడు నా పాత్రని మలిచిన తీరు చాలా బాగుంది. శివాజీ నిర్మాతగా, నటుడిగా సెట్‌లో ఎంతో ఉత్సాహంగా ఉంటూ మమ్మల్ని నడిపించారు" అన్నారు. ఈ కార్యక్రమంలో అలీ, ఈటీవీ విన్ హెడ్ సాయికృష్ణ, రచయిత మిథిల్, ఎడిటర్ బాలు, నటులు ధనరాజ్, రోహన్, బబ్లూ, చిత్రం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఓ మలుపులా మమ్ముట్టి పాత్ర



రోషన్ మాథ్యూ

"కుటుంబం, స్నేహితులతో కలిసి చూడాల్సిన సినిమా 'చథా పచ్చ: ది రింగ్ ఆఫ్ రౌడీస్'" అన్నారు నటుడు రోషన్ మాథ్యూ. ఈ చిత్రం కోసం ప్రత్యేకంగా నాలుగు నెలల పాటు రెజ్లింగ్‌లో శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. ఆయన.. విశాఖ్ నాయర్, ఇషాన్ ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ సినిమాని అద్వైత్ నాయర్ తెరకెక్కించారు. ఇప్పటికే మలయాళంలో విడుదలైన ఈ చిత్రం సురేశ్ ప్రొడక్షన్స్ ద్వారా ఈ నెల 13న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోషన్ మాథ్యూ మాట్లాడుతూ.. "అందర్నీ ఆకట్టుకునే మంచి క్రీడా నేపథ్య చిత్రమిది. ఇందులో ఓ ప్రత్యేక అతిథిగా నటించిన మమ్ముట్టి పాత్ర ఈ చిత్రానికి ఓ మలుపులా ఉంటుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ్ నాయర్, ఇషాన్ తదితరులు పాల్గొన్నారు.

దేశ క్వాంటమ్ నిర్దేశకులం మనమే

(మొదటి పేజీ తరువాయి)

నిర్దేశించే ప్రదేశంగా మారుతుంది. ఇక్కడి నుంచి క్వాంటమ్ వేగంతో నిర్ణయాలు తీసుకుంటాం. పనులు జరిగేలా చూస్తాం. వచ్చే 40ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇవన్నీ చేపట్టాం. డ్రోన్ సిటీ, ఏరోస్పేస్, మెడ్‌టెక్, స్పేస్ సిటీ లాంటివి రాష్ట్రంలో అందుబాటులోకి తెస్తున్నాం. డిఫెన్స్, హెల్త్‌కేర్, ఎనర్జీ, ఫైనాన్స్, క్లైమేట్ మోడలింగ్‌కు అమరావతి క్వాంటమ్ వ్యాలీలో పరిశోధనలు, ఆవిష్కరణలు జరుగుతాయి. ఈరోజు క్వాంటమ్ వ్యాలీ భవనాలకే కాదు.. అంతర్జాతీయ క్వాంటమ్ విప్లవంలో భాగమయ్యేనిపుణులకూ పునాది వేసుకుంటున్నాం. ఇప్పటివరకు అంతా అమెరికాలోని సిలికాన్ వ్యాలీ గురించి మాట్లాడేవారు. ఇకపై అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీ గురించి మాట్లాడుకుంటారు' అని పేర్కొన్నారు.



క్వాంటమ్ వ్యాలీలో భాగస్వాములైన వివిధ కంపెనీల ఏపీలను రిమోట్‌తో ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి జితేంద్రసింగ్, సీఎం చంద్రబాబు. చిత్రంలో ఎం.ఎ.సలీమ్ (డైరెక్టర్, ఎల్‌అండ్‌టీ), హరీశ్‌విన్(టీసీఎస్), ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, మంత్రులు దుర్గేష్, లోకేశ్, అమిత్‌సింఘీ (డైరెక్టర్, ఐబీఎం), ప్రొఫెసర్ అభయ్ కరందీకర్ (కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ), కేంద్ర మంత్రి చంద్రశేఖర్, ప్రొఫెసర్ అజయ్‌కుమార్, మంత్రి నారాయణ



సభావేదిక వద్ద ఏర్పాటు చేసిన క్వాంటమ్ వ్యాలీ నమూనా భవనాలు

తొలి కంప్యూటర్ వచ్చేది ఈ ఏడాదే

'సాంకేతికత గొప్పదనాన్ని అందిపుచ్చుకునే ప్రధాని మనకు ఉండడం అదృష్టం. క్వాంటమ్ మిషన్ కార్యకలాపాలు ఏపీ నుంచే ప్రారంభం కావాలని కోరగానే సహకరించారు. అతి తక్కువ సమయంలోనే క్వాంటమ్ కంప్యూటర్ ఏపీలో ఏర్పాటుచేయడానికి ముందుకొచ్చిన టీసీఎస్, ఐబీఎం, ఎల్‌అండ్‌టీ సంస్థలకు ధన్యవాదాలు. ఈ ఏడాది ఏప్రిల్ 14న అంతర్జాతీయ క్వాంటమ్ డే రోజున రెండు స్వదేశీ క్వాంటమ్ కంప్యూటర్లను రిఫరెన్స్ ఫెసిలిటీగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నుంచి ప్రారంభించబోతున్నాం. డిసెంబర్ నుంచి రాష్ట్రంలో తొలి క్వాంటమ్ కంప్యూటర్ అందుబాటులోకి తెస్తాం. 85% క్వాంటమ్ కంప్యూటింగ్ పరికరాలు ఇక్కడే తయారుచేసి అంతర్జాతీయ మార్కెట్లకూ సరఫరా చేయాలన్నదే మా ఆలోచన' అని తెలిపారు.

ఏఐ లివింగ్ ల్యాబ్ విశ్వవిద్యాలయం

ఐఎస్‌బీ తరహాలో ఏఐ లివింగ్ ల్యాబ్ యూనివర్సిటీ ప్రారంభించాలని ఆలోచిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. 'ఏఐ, క్వాంటమ్ ఏఐలలో కోర్సులు అందించేలా అమరావతిలో యూనివర్సిటీ ఏర్పాటుచేస్తాం. ప్రజలందరికీ ఏఐ సాంకేతికత చేరాలన్నదే మా ఆలోచన. క్వాంటమ్‌తో కూడిన లాజిస్టిక్ ద్వారా వ్యయం తగ్గుతుంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో వినియోగిస్తే రిస్క్ తగ్గుతుంది. విద్యుత్తు ఉత్పత్తి రంగంలో దీని వినియోగం ద్వారా అతి తక్కువ ఖర్చుతో ఉత్పత్తి, పంపిణీ సాధ్యమవుతాయి. అమరావతి డీప్‌టెక్ ప్రయాణంలో భాగస్వాములు కావాలని పరిశ్రమలు, విద్యా రంగం, విద్యార్థులకు పిలుపునిస్తున్నా' అన్నారు.

ఐటీని విమర్శించినోళ్ల పిల్లలు ఐటీలో స్థిరపడ్డారు

గతంలో ఐటీ, సెల్‌ఫోన్ల గురించి మాట్లాడితే తనను విమర్శించినవారి పిల్లలంతా ఐటీ రంగంలో అమెరికాలో స్థిరపడ్డారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'వచ్చే 30-40 ఏళ్లలో అవసరాలను దృష్టిలో పెట్టుకుని అంశాలపైనే నేనెప్పుడూ ఆలోచిస్తా. దానికి అనుగుణంగానే ప్రణాళికలు ఉంటాయి. ఐటీపై పూర్తి అవగాహన ఉన్నందునే లోకేశ్‌కు ఆ శాఖ బాధ్యతలు అప్పగించాను. పని పట్ల నిబద్ధత పెట్టింది పేరు ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ కామకోటి. 16న అమరావతికి బిల్‌గేట్స్ వస్తున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర అభివృద్ధికి సుస్థిర ప్రణాళికలతో ముందుకెళ్తున్నాం' అని చంద్రబాబు తెలిపారు.

2030 నాటికి 2.50 లక్షల మంది నిపుణులు అవసరం

క్వాంటమ్ ద్వారా చేసిన ఆవిష్కరణకు నోబెల్‌ప్రైజ్ సాధిస్తే రూ.100 కోట్ల నజరానా ఇస్తామని ప్రకటించినట్లు సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. 'యువ మేధావులు పరిశోధనలు చేయాలి. 2030 నాటికి 2.5 లక్షల మంది క్వాంటమ్ నిపుణులు అవసరమని అంచనా. దేశంలోని ఐటీ నిపుణుల్లో 35% తెలుగువాళ్లే. క్వాంటమ్ కోర్సుల్లో శిక్షణకు పిలుపునిస్తే 50వేల మంది వచ్చారు. దరఖాస్తువారిలో 35 లక్షల మందికి శిక్షణ ఇప్పిస్తాం. ఐఐటీ మద్రాస్ అడ్వాన్స్‌డ్ క్వాంటమ్ కోర్సులు అందించినప్పుడు దేశవ్యాప్తంగా 2.08 లక్షల మంది విద్యార్థులు రిజిస్టర్ చేయగా, వారిలో సగం మంది ఆంధ్రప్రదేశ్ వారే. క్వాంటమ్ ఏఐ, సైబర్ సెక్యూరిటీలో ప్రపంచవ్యాప్తంగా 50 లక్షల మందికి శిక్షణ ఇవ్వాలని ఐబీఎం ముందుకొచ్చింది. అందులో 10లక్షల మంది ఏపీకి చెందిన యువత ఉండేలా ఒప్పందం చేసుకున్నాం. రాష్ట్ర భవిష్యత్తు విద్యార్థులపైనే ఆధారపడి ఉంది. మన యువత సాంకేతిక రంగంలో క్వాంటమ్ వేగంతో దూసుకెళ్లాలి. కుప్పంలో ఏడో తరగతి విద్యార్థి ఏఐతో ఆరోగ్యపరీక్షలు చేశాడు. రాష్ట్రంలోని 50 లక్షల మంది యువత ఏఐ నేర్చుకుని అద్భుతాలు సృష్టించాలి. ఏపీలో విద్యార్థులంతా ఏఐ ఆల్గరిథమ్స్‌లో శిక్షణ పొందాలి' అని సీఎం పిలుపునిచ్చారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

క్వాంటమ్ నిపుణులకు కేంద్రంగా అమరావతి

- సీఎం చంద్రబాబు రేపటిలో జీవిస్తూ.. ఎల్లుండి కోసం ఆలోచిస్తారు
- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్



ఈనాడు, అమరావతి: అమరావతి క్వాంటమ్ కంప్యూటర్ల కేంద్రమే కాదు.. క్వాంటమ్ నిపుణులకూ కేంద్రంగా మారుతుందని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. రాజధాని అమరావతిలో శనివారం క్వాంటమ్ భవన నిర్మాణాలకు నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "సాధారణంగా మనమంతా ఈ రోజులో జీవిస్తూ రేపటి గురించి ఆలోచన చేస్తాం. ముఖ్యమంత్రి చంద్రబాబు రేపటిలో జీవిస్తూ ఆ తర్వాత రోజు గురించి ఆలోచన చేస్తారు. ప్రధాని మోదీ విజన్‌ను ముందుకు తీసుకెళ్లడంలో చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కేంద్రం కుదుర్చుకున్న ఒప్పందం జాతీయ క్వాంటమ్ మిషన్‌లో ఓ మైలురాయిగా నిలుస్తుంది. విశాఖను డీప్ సీ రీసెర్చ్ కేంద్రంగా మార్చేలా ప్రధాని ఎర్రకోట నుంచి ప్రకటించారు. ఇందుకు వేగంగా కార్యాచరణ జరుగుతోంది. భారత్‌ను సాంకేతికంగా అత్యున్నతంగా మార్చడానికి నేషనల్ క్వాంటమ్ మిషన్ సహా వేర్వేరు మిషన్లను ఆవిష్కరించనున్నాం. ఇందులో భాగంగానే దేశంలోనే తొలి క్వాంటమ్ వ్యాలీగా అమరావతి ఆవిష్కృతమవుతోంది. నేషనల్ క్వాంటమ్ మిషన్‌కు రూ.6వేల కోట్లు కేటాయించాం. రక్షణ, ఆరోగ్యం, ఆర్థికం ఇలా వేర్వేరు రంగాల్లో వేగవంతమైన పరిశోధనలు, ఆవిష్కరణలకు ఇది కేంద్రంగా మారుతుంది. ప్రపంచవ్యాప్తంగా సేవలు అందించేందుకు మనకు క్వాంటమ్ నిపుణులు అవసరముంటారు. క్వాంటమ్‌లో ఇప్పటికే బీటెక్ కోర్సులు అందిస్తున్నాం. త్వరలోనే ఎంటెక్ కోర్సులు అందించేందుకు కార్యాచరణ చేపట్టాం. క్వాంటమ్ నుంచి క్రయోజెనిక్స్ వరకు వేర్వేరు అధునాతన సాంకేతిక అంశాలపై అమరావతి క్వాంటమ్ వ్యాలీ కేంద్రంగా మారుతుందని ఆశిస్తున్నాను. పవిత్రమైన రాజధాని అమరావతి నుంచి భారత్ క్వాంటమ్ ప్రయాణం ప్రారంభించింది. వికసిత్ భారత్‌లో ఇది కీలకమైన ముందడుగు అవుతుంది. అంతరిక్షం, డిజిటల్ సేవలు, బయోటెక్నాలజీ రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులకు అవకాశం కల్పించినప్పుడు ఎలా విప్లవాత్మక మార్పులు వచ్చాయో అదే తరహాలో క్వాంటమ్ రంగంలోనూ మార్పు వస్తుంది" అని తెలిపారు.

క్వాంటమ్ కంప్యూటింగ్ క్లౌడ్ సేవలు ప్రారంభం: టీసీఎస్



ఈనాడు, అమరావతి: టీసీఎస్ క్వాంటమ్ కంప్యూటింగ్ క్లౌడ్ సేవలను శనివారం నుంచే అందుబాటులోకి తెస్తున్నట్లు టీసీఎస్ ప్రతినిధి హారిక్ విన్ ప్రకటించారు. ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వరంగ సంస్థలు, విద్యాసంస్థల పరిశోధనలకు ఇది అందుబాటులో ఉంటుందని తెలిపారు. అమరావతిలో శనివారం నిర్వహించిన క్వాంటమ్ వ్యాలీ భవనాల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. "అమరావతి క్వాంటమ్ వ్యాలీ.. ప్రపంచ ఇన్నోవేషన్ హబ్‌గా మారుతుంది. నేషనల్ క్వాంటమ్ మిషన్ ద్వారా ఆవిష్కృతమవుతున్న తొలి క్వాంటమ్ మిషన్ ఇది. ఏఐ, క్వాంటమ్ రంగాల్లో ముందుండాలనే వ్యూహాత్మక పెట్టుబడులు పెడుతున్నాం. టీసీఎస్‌లో ఓ క్వాంటమ్ హ్యాకథాన్ నిర్వహించాం. 50కి పైగా ప్రాజెక్టు ఏరియాస్‌ను గుర్తించాం. ఔషధాల ఆవిష్కరణ, విద్యుత్తు ఉత్పాదన సహా వివిధ రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలకు అవకాశం ఉంది" అని తెలిపారు.

ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం: ఐబీఎం



అమరావతిలో క్వాంటమ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటుచేస్తున్నామని ఐబీఎం ప్రతినిధి అమిత్ సింఘీ తెలిపారు. "అమరావతిలో ఏర్పాటుకానున్న క్వాంటమ్ వ్యాలీ క్వాంటమ్ నెర్వ్ సెంటర్‌గా మారుతుంది. ఇక్కడి నుంచి క్వాంటమ్ హార్డ్‌వేర్ యాక్సెస్ ఉంటుంది. పరిశోధనలు, ఆవిష్కరణల కోసం కొత్త ఆల్గరిథమ్స్, క్రిప్టోగ్రఫీ అవసరం అవుతుంది. అందుకు నిపుణులు అవసరమవుతారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 35 క్యూఐసీలతో పాటు భారత్‌లో మొదటి క్యూఐసీ అమరావతిలో అందుబాటులోకి వస్తోంది" అని తెలిపారు.

దక్షిణాసియాలోనే తొలి మేజర్ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు

– ప్రొఫెసర్ సత్యనారాయణ, డైరెక్టర్, ఐఐటీ తిరుపతి



"దక్షిణాసియాలోనే తొలి మేజర్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీలో ఏర్పాటు చేయనున్నాం. దీనికి సీఎం చంద్రబాబు 6 నెలల గడువు నిర్దేశించారు. మేం 9 నెలల సమయం అడిగాం. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకు అమలు చేసిన క్వాంటమ్ ప్రాజెక్టుల్ని అధ్యయనం చేశాం. స్పెయిన్, షికాగోల్లో ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు కనీసం రెండేళ్లు పట్టింది. కానీ దీన్ని మేం తొమ్మిది నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. నిర్మాణాలు పూర్తి చేయడం మొదలు కంప్యూటర్ ఇన్‌స్టాలేషన్, ఫ్యాబ్రికేషన్ అన్నీ సవాళ్లే. మొత్తం ఎనిమిది టవర్లు నిర్మాణం కానున్నాయి. సుమారు లక్ష మంది పనిచేసే అవకాశం ఉంటుంది"

క్వాంటమ్ కొత్త అవకాశాల గని

– ప్రొఫెసర్ అజయ్‌కుమార్ సూద్, భారత శాస్త్రీయ సలహాదారు



ఏఐతోపాటు క్వాంటమ్ కొత్త బజ్‌వర్డ్‌గా మారింది. దీనిపై అవగాహన లేకపోతే మీ జీవితంలో ఒక ప్రధానమైన అవకాశాన్ని కోల్పోయినట్లే. క్వాంటమ్ టెక్నాలజీ అత్యంత వేగవంతమైన కంప్యూటర్లకు సున్నితమైన సెన్సర్లు, సెక్యూర్ కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ అందిస్తుంది. దేశం, రాష్ట్రంలో క్వాంటమ్ విప్లవానికి ఇది చరిత్రాత్మక ఆరంభం. గ్లోబల్ క్వాంటమ్ టెక్నాలజీ పటంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రముఖ స్థానంలో నిలపాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు దృఢసంకల్పానికి, రాష్ట్ర ప్రభుత్వ పాలన యంత్రాంగం సమర్థతకు స్పష్టమైన నిదర్శనం. ఏడు నెలల క్రితం నేను ఇక్కడ క్వాంటమ్ వ్యాలీ వర్క్‌షాపులో పాల్గొన్నా. ఇప్పుడు అనతికాలంలోనే మళ్లీ క్వాంటమ్ వ్యాలీ భవనాల శంకుస్థాపనలో కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది.

అమరావతిలో క్వాంటమ్ విప్లవం

- కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



ఈనాడు, అమరావతి: క్వాంటమ్ విప్లవానికి అమరావతి కేంద్రంగా నిలవడంతోపాటు దేశాభివృద్ధికి దిశా నిర్దేశం చేసే నగరంగా మారుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. రాజధాని అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. 'ప్రపంచవ్యాప్తంగా క్వాంటమ్ కంప్యూటింగ్‌పై భారీ పోటీ నెలకొని రాబోయే దశాబ్దాల్లో ఇది వందల బిలియన్ డాలర్ల ఆర్థిక విలువ సృష్టించే రంగం కానుంది. నేషనల్ క్వాంటమ్ మిషన్ కింద రూ.6 వేల కోట్ల పెట్టుబడులు, స్టార్టప్ వ్యవస్థ విస్తరణ, సాంకేతిక విద్యాసంస్థల పెరుగుదల దేశ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. క్వాంటమ్ రంగంలో ఏపీని ముందంజలో నిలబెట్టే దిశగా అమరావతిలో తీసుకుంటున్న చర్యలు చరిత్రాత్మకం' అని కేంద్ర మంత్రి పెమ్మసాని అన్నారు.

ప్రపంచంలో టాప్-5 క్వాంటమ్ హబ్‌లలో ఒకటిగా అమరావతి

దేశ క్వాంటమ్ టెక్నాలజీకి పునాది మన క్వాంటమ్ వ్యాలీ

మంత్రి లోకేశ్



ఈనాడు, అమరావతి: ప్రపంచంలో ఐదు అత్యుత్తమ క్వాంటమ్ హబ్‌లలో ఒకటిగా అమరావతి క్వాంటమ్ వ్యాలీని తీర్చిదిద్దడమే ధ్యేయమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి లోకేశ్ అన్నారు. రాజధాని అమరావతిలో క్వాంటమ్ వ్యాలీకి సీఎం చంద్రబాబుతో కలిసి భూమిపూజ చేసిన లోకేశ్ అనంతరం సభలో మాట్లాడారు. 'ప్రపంచంలోనే మొట్టమొదటిగా అమరావతి క్వాంటమ్ వ్యాలీకి శ్రీకారం చుట్టి క్వాంటమ్ ఎకోసిస్టమ్ ఏర్పాటుచేస్తున్నాం. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ఆల్గరిథమ్‌లు, ఉత్పత్తులు, ఎగుమతులు, ప్రతిభావంతులకు శిక్షణ అన్నీ ఒకేచోట ఉండేలా రూపకల్పన చేశాం. ఈ సంకల్పం ఏపీని టెక్నాలజీ వినియోగదారుడిగానే కాకుండా భవిష్యత్తును తీర్చిదిద్దే అత్యున్నత సాంకేతిక ఆవిష్కరణ సృష్టికర్తగా నిలబెడుతుంది' అని మంత్రి లోకేశ్ అన్నారు. 'క్వాంటమ్ వ్యాలీ ఇప్పటికే అమలులో ఉంది. అత్యాధునిక 133-క్యూబిట్ ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్ ఇక్కడ ఆవిష్కృతం కాబోతుంది. దేశంలో మొదటి నేషనల్ క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీ స్థాపితమవుతుంది. 50వేల మంది ఇప్పటికే శిక్షణ పొందుతున్నారు. క్వాంటమ్ వ్యాలీ ద్వారా ఇంజినీర్లు, అడ్వాన్స్‌డ్ ఏఐ, కంప్యూటింగ్ స్పెషలిస్టులు, చిప్ డిజైనర్లు, క్రయోజెనిక్స్ నిపుణులు, ఆర్ఎఫ్ ఇంజినీర్లు, స్టార్టప్ ఫౌండర్లు, డీప్‌టెక్ పరిశోధకులకు పెద్దఎత్తున ఉద్యోగాలు లభిస్తాయి. దేశంలో ఐటీ విప్లవానికి హైదరాబాద్ నాయకత్వం వహించినట్లే చంద్రబాబు నాయకత్వంలో అమరావతి దేశ క్వాంటమ్ విప్లవాన్ని ముందుండి నడిపిస్తుంది. ఇండస్ట్రీ, అకడమియా, స్టార్టప్‌ల భాగస్వామ్యంతో తదుపరి సాంకేతిక శకానికి నాయకత్వం వహించడానికి ఏపీ సిద్ధంగా ఉంది' అని లోకేశ్ ప్రకటించారు.

మనకు మూడు బలాలు: 'రాష్ట్రానికి మూడు బలాలు ఉన్నాయి. అందులో మొదటిది నిరూపితమైన సమర్థ నాయకత్వం. చంద్రబాబు విజన్, బ్రాండ్, విశ్వసనీయత ద్వారా ప్రపంచస్థాయి గుర్తింపు సాధ్యమైంది. రెండోది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. గూగుల్ డేటా సెంటర్‌తో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడిని సాధించేందుకు 12 నెలల లక్ష్యాన్ని పెట్టుకుని 13 నెలల్లో పూర్తి చేసి రికార్డు సాధించాం. మూడోది.. స్టార్టప్ రాష్ట్రం. పెట్టుబడుల ఆకలితో ఉన్న మేం ఉత్సాహంగా, వేగవంతంగా ప్రణాళికలు అమలుచేసేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నాం' అని మంత్రి లోకేశ్ అన్నారు.

దేశ క్వాంటమ్ కంప్యూటింగ్‌కు బలమైన పునాది

– కర్నల్ సాయి, క్యూక్లేవ్ ఫౌండర్



"ఇక్కడ నిర్మిస్తున్నది భవనం కాదు. ప్రాజెక్టు కాదు. భవిష్యత్తు భారత క్వాంటమ్ కంప్యూటింగ్‌కు బలమైన పునాది. భద్రత, కమ్యూనికేషన్, డేటా భద్రత, జాతీయ వ్యూహాత్మక సామర్థ్యాల పరంగా క్వాంటమ్ కీలకపాత్ర పోషించనుంది. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుతో పరిశోధన, ఉత్పత్తి, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు ఇలా అన్నీ ఒక వేదిక మీదకు రానున్నాయి. ఇది భవిష్యత్తు తరాలకు గర్వకారణం."

సాగునీటికి జవసత్వాలు

ఊపందుకున్న ప్రాధాన్య ప్రాజెక్టుల పనులు

- పోలవరం ఎడమ కాలువ మార్చి నెలాఖరుకు పూర్తి
- ఇప్పటికే 738 కి.మీ. మేర హంద్రీ-నీవా ప్రవాహ సామర్థ్యం పెంపు
- 18 నెలల్లోనే రూ.23,793 కోట్ల ఖర్చు
- రూ.18 వేల కోట్ల పాత బిల్లులు క్రమేణా చెల్లింపులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు మళ్లీ మంచిరోజులు వచ్చాయి. ఎన్డీయే ప్రభుత్వంలో తొలి 18 నెలల్లో సాగునీటి రంగంపై రూ.23,793 కోట్లు ఖర్చు చేశారు. రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉండగా ప్రాధాన్య క్రమంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు ఇచ్చే ప్రాజెక్టులను పూర్తి చేసే లక్ష్యంతో నిధుల కేటాయింపు, పర్యవేక్షణ, ఖర్చు, అవసరమైన సమస్యలు పరిష్కరించి నిర్దిష్ట గడువు లోపు పనులు పూర్తయ్యేందుకు అడుగులు వేస్తున్నారు. పాత ప్రభుత్వం ఒక్క జలవనరుల శాఖలోనే రూ.18 వేల కోట్ల బిల్లులు పెండింగు ఉంచి వెళ్లింది. ఒక వైపు వీటిని చెల్లిస్తూనే అనేక సాగునీటి ప్రాజెక్టులను గాడిలో పెడుతూ పనుల వేగం పెంచారు. 2014-19 మధ్య రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు స్వర్ణయుగంగా పేర్కొంటారు. ఆ ఐదు సంవత్సరాల్లోనూ రూ.50 వేల కోట్లకు పైగా జలవనరుల శాఖకు, మరో రూ.11 వేల కోట్ల వరకు నీరు ప్రగతి పనులకు ప్రభుత్వం ఖర్చు చేసింది. మళ్లీ ఇప్పుడు ఆ దిశగా పనులు ఊపందుకున్నాయి.



వెలిగొండ సొరంగం పనులు

హంద్రీ-నీవాలో జలాలు పరుగులు

హంద్రీ-నీవా కాలువ రాయలసీమ ఉమ్మడి జిల్లాల్లో పరుగులు తీస్తుంది. కృష్ణా వరద జలాలను 738 కిలోమీటర్ల వరకు తీసుకెళుతుంది. 2,200 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న ఈ కాలువను వెడల్పు చేయడంతో పాటు లైనింగు పనులు కూడా చేసి ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెంచారు. ఈ పనులకు రూ.3,500 కోట్లు ఖర్చు చేశారు. ఈ కాలువ ద్వారా సీమ జిల్లాలకు ఈ ఏడాది 43 టీఎంసీలకు పైగా జలాలు పంపిణీ చేశారు. కుప్పానికి తొలిసారిగా నీటిని అందించారు.

వెలిగొండ పనులకు అండాదండ

వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పూర్తి చేయాలంటేనే ఇంకా నిర్మాణ పనులకు రూ.2,000 కోట్లకు పైగా ఖర్చు చేయాలి. పునరావాసానికి సుమారు వెయ్యి కోట్లు కావాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత టన్నెళ్ల తవ్వకాల్లో పెండింగు పనులతో పాటు లైనింగు పనుల వేగం పెంచారు. హెడ్ రెగ్యులేటర్ పనులూ చేస్తున్నారు. 18 నెలల కాలంలో 3,708 మీటర్ల మేర టన్నెల్ లైనింగు పూర్తయింది. ఫీడర్ కాలువ మరమ్మతులు లైనింగు కోసం రూ.456 కోట్లు మంజూరు చేశారు. ఎన్డీయే ప్రభుత్వంలో వెలిగొండపై ఇంతవరకు రూ.571 కోట్లు ఖర్చు చేశారు.

■ పోలవరం ఎడమ కాలువ పనులు వేగవంతమయ్యాయి. ఈ ప్రాజెక్టులో జగన్ సర్కారు హయాంలో ఒక్క శాతం పనులు కూడా చేయలేదు. ఒక వైపు ప్రధాన డ్యాం నిర్మిస్తున్నా ఎడమ కాలువ పనులు చేయకపోతే ఉపయోగం లేదు. ఎన్డీయే ప్రభుత్వంలో రూ.1,226 కోట్లతో కాలువలో వివిధ ప్యాకేజీలకు టెండర్లు పిలిచి పనుల వేగం పెంచారు. ఇంతవరకు రూ.900 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి.

■ 2024 ఆగస్టులో తుంగభద్ర ప్రాజెక్టులో 19వ గేటు కొట్టుకుపోయింది. ప్రాజెక్టుల మరమ్మతుల నిపుణుడు కన్నయ్యనాయుడిని పిలిచి ఏపీ ప్రభుత్వం మాట్లాడింది. 'జిందాల్' సహకారంతో అక్కడ స్టాప్ లాగ్ గేటు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేసి నీళ్లు వృథా కాకుండా అడ్డుకోగలిగారు. అక్కడ 33 గేట్ల కాలపరిమితి ముగిసిపోవడంతో కొత్తగా గేట్లు ఏర్పాటు చేసేందుకు రూ.55 కోట్లు ఏపీ ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు ప్రారంభమయ్యాయి.

■ గత ప్రభుత్వ హయాంలో కాలువ, నది వరద కట్టలకు మరమ్మతులు లేవు. ప్రాజెక్టుల నిర్వహణకూ నిధులు ఇవ్వలేదు. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం ధవళేశ్వరం బ్యారేజి, శ్రీశైలం రిజర్వాయర్, తుంగభద్ర డ్యాం, సోమశిల, కండలేరు, మైలవరం, గుండ్లకమ్మ, గోరకల్లు, అవుకు వంటి ప్రాజెక్టుల మరమ్మతులకు తొలి విడతగా రూ.610 కోట్లతో పనులు చేపట్టింది.

■ మరోవైపు కాలువల నిర్వహణ, పూడిక తీత, కాలువల లాకులు, ఇతర నిర్మాణాల నిర్వహణ, మరమ్మతులకు సంబంధించి గడిచిన రెండు సంవత్సరాల్లో 11,359 పనులకు రూ.878 కోట్లు కేటాయించింది. ఇప్పటికే రూ.400 కోట్ల వరకు ఖర్చు చేశారు.

■ చింతలపూడి ఎత్తిపోతల పనులకు జాతీయ హరిత ట్రైబ్యునల్ అనుమతులు లేవు. తాజాగా సుప్రీంకోర్టు తీర్పుతో ఈ ఇబ్బందులు తొలగిపోయాయి.

బడ్జెట్ కేటాయింపులు - ఖర్చు ఇలా.. (రూ.కోట్లలో)

ఆర్థిక సంవత్సరం	బడ్జెట్ కేటాయింపులు	ఖర్చు
2024–25	16,705.33	14,112.88
2025–26	18,019.00	9,681.00 (డిసెంబరు నెలాఖరు వరకు)
మొత్తం	34,724.33	23,793.88

2014-19 మధ్య బడ్జెట్ కేటాయింపులు - ఖర్చు (రూ.కోట్లలో)

సంవత్సరం	బడ్జెట్ కేటాయింపులు	ఖర్చు
2014–15	8463.50	9223.75
2015–16	5258.06	9545.87
2016–17	7978.80	8,747.89
2017–18	12770.26	8,936.60
2018–19	16,978.23	14,358.16
మొత్తం	51,448.85	50,812.27

■ *2014–19 మధ్య నీరు–ప్రగతి కింద మరో రూ.11 వేల కోట్ల వరకు ప్రభుత్వం ఈ రంగంపై ఖర్చు చేసింది.*

జగన్ ప్రభుత్వంలో ఖర్చు ఇలా..

2019-24 మధ్య బడ్జెట్ కేటాయింపులు - ఖర్చు (రూ.కోట్లలో)

సంవత్సరం	బడ్జెట్ ప్రతిపాదనలు	ఖర్చు
2019–20	13,139.05	6,812.90
2020–21	11,805.74	6,057.47
2021–22	13,237.79	7,144.06
2022–23	11,482.37	6,262.97
2023–24	11,908.20	8,370.72
మొత్తం	61,573.15	34,648.12

స్థానిక ఎన్నికల ఓటర్ల జాబితాల తయారీకి నోటిఫికేషన్లు

- వచ్చే నెల 9న తుది జాబితాలు ప్రచురించాలని కలెక్టర్లకు ఎస్ఈసీ ఆదేశం

ఈనాడు, అమరావతి: పుర, నగరపాలక సంస్థలు, గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాల పదవీకాలం ఒకటి, రెండు నెలల్లో ముగియనున్న నేపథ్యంలో కొత్త ఓటర్ల జాబితాల తయారీ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం వేర్వేరుగా నోటిఫికేషన్లు ఇచ్చింది. తక్షణమే జాబితా తయారీ ప్రక్రియ ప్రారంభించి వచ్చే నెల 9న ఓటర్ల ఫొటోలతో సహా తుది జాబితాలు ప్రచురించాలని కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల కమిషనర్(ఎస్ఈసీ) నీలంసాహ్ని ఆదేశించారు. ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) కార్యాలయం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాలు సేకరించిన రాష్ట్ర ఎన్నికల సంఘం ..వాటిని సర్వర్లలో నిక్షిప్తం చేసింది. జిల్లాల వారీగా మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులకు ఇచ్చిన లాగిన్ల ద్వారా జాబితాలు సేకరించి వాటిలో నుంచి పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో డివిజన్లు, వార్డులు, మండలాల్లో పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగానే ఓటర్ల జాబితాల తయారీకి నోటిఫికేషన్లు ఇచ్చినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. 2026 జనవరి 1 అర్హత తేదీగా ఓటర్ల జాబితా నవీకరించాలని ఎస్ఈసీ నిర్దేశించింది.

★ రాష్ట్రంలో 87 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో పాలకవర్గాల పదవీ కాలం వచ్చే నెల 17తో ముగియనుంది. మిగిలిన 36 సంస్థల్లో కోర్టు కేసులు, ఇతరత్రా కారణాలతో ఎన్నికలు నిర్వహించలేదు. ఇప్పుడు 123 పట్టణ స్థానిక సంస్థల్లోనూ డివిజన్లు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేయనున్నారు.

★ రాష్ట్రంలో 13,098 పంచాయతీల్లో సర్పంచులు, సభ్యుల పదవీకాలం ఏప్రిల్ 2తో ముగియనుంది. కోర్టు కేసులు, ఇతర వివాదాల కారణంగా 253 పంచాయతీల్లో అప్పట్లో ఎన్నికలు నిర్వహించలేదు. మొత్తం 13,351 పంచాయతీల్లోనూ ప్రస్తుతం ఓటర్ల జాబితాలు సిద్ధం చేయనున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం సెప్టెంబరు 23, 24 తేదీల్లో ముగియనుంది.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, న్యూస్‌టుడే: ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మలు శనివారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తులకు తితిదే అధికారులు స్వాగతం పలికి, మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.





ఆలయం ఎదుట జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, కుటుంబ సభ్యులు తదితరులు
★ జస్టిస్ అవధానం హరిహరనాథశర్మ, న్యాయాధికారులు తదితరులు



విద్యుద్దీప కాంతుల్లో మల్లికార్జునస్వామి ఆలయం

నేటి నుంచి శ్రీశైల బ్రహ్మోత్సవాలు

12 వరకు జ్యోతిర్ముడి శివదీక్షా భక్తులకు స్పర్శ దర్శనం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, ఈవో ఎం.శ్రీనివాసరావు, అర్చకులు, వేదపండితులు యాగశాల ప్రవేశం చేసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రారంభ పూజలు నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు భేరీ పూజ, భేరీ తాడనం, సకల దేవతలను ఆహ్వానిస్తూ ప్రధాన ధ్వజస్తంభంపై ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహిస్తారు. 9వ తేదీ నుంచి ప్రతి రోజూ రాత్రి 7 గంటలకు శ్రీస్వామిఅమ్మవార్లకు వాహన సేవలు, గ్రామోత్సవం జరగనుంది. ఈ నెల 18 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.

★ జ్యోతిర్ముడి కలిగిన శివదీక్షా భక్తులకు ఆదివారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు శ్రీమల్లికార్జున స్వామి స్పర్శ దర్శనం కల్పిస్తారు.

★ ప్రతి రోజూ ఉదయం 4 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు భక్తులకు దర్శనం కల్పించనున్నారు.

★ సాధారణ భక్తులందరూ శ్రీస్వామిఅమ్మవార్ల అలంకార దర్శనం చేసుకోవాల్సి ఉంటుంది.

★ శివదీక్షా భక్తులకు శిబిరాల్లో జ్యోతిర్ముడులు సమర్పించుకునే సదుపాయాలు కల్పించారు.

తిరుమలలో నూతన ఈవో విస్తృత పరిశీలన

- తితిదే సేవలపై భక్తులతో మాటామంతి

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే నూతన ఈవో ఎం.రవిచంద్ర శనివారం తిరుమల వ్యాప్తంగా విస్తృత స్థాయిలో పరిశీలనలు చేపట్టారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శ్రీవారిని దర్శించుకునేందుకు రాగా, ఆయనతో కలిసి ఈవో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రానికి వెళ్లారు. అన్నప్రసాదం స్వీకరించి, భక్తుల అభిప్రాయాలు తీసుకున్నారు. అక్కడి కియోస్క్ యంత్రంలో ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు విరాళం అందించారు. ఉద్యోగులు, శ్రీవారి సేవకులతో సమావేశమై సేవలను తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో కలిసి నీరు, ఆహార పదార్థాల తనిఖీ ప్రయోగశాలను సందర్శించారు. గోగర్భం డ్యామ్ వద్ద ఉన్న ఆక్టోపస్ భవనం నుంచి రింగురోడ్డు వరకు సర్వదర్శనం క్యూలైన్‌ను పరిశీలించారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రానికి వెళ్లి, రద్దీ నియంత్రణ, ఏఐ సేవలపై ఆరా తీశారు. కేంద్రం దాతల్లో ఒకరైన అమెరికాకు చెందిన వి.జయప్రకాశ్ వర్చువల్‌గా ఈవోతో మాట్లాడారు. అనంతరం వేంకటాద్రి నిలయం, లాకర్లు, కల్యాణకట్ట, స్మార్ట్ పాదరక్షల భద్రపరిచే కేంద్రాలను ఈవో సందర్శించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్‌వో మురళీకృష్ణ ఆయన వెంటున్నారు.



అన్నప్రసాద కేంద్రంలో భోజనం చేస్తున్న ఈవో రవిచంద్ర, మంత్రి పయ్యావుల కేశవ్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి

గ్రేడ్-2 మెకానిక్‌లకు హైకోర్టులో ఉపశమనం

ఈనాడు, అమరావతి: ఆర్టీసీలో 12 ఏళ్ల సర్వీసు పూర్తిచేసిన గ్రేడ్-2 మెకానిక్‌లకు హైకోర్టులో ఊరట లభించింది. ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (ఏఏఎస్) కింద లీడ్ హ్యాండ్ స్కేలుకు వారు అనర్హులంటూ గతేడాది డిసెంబర్ 23న ఏపీ రవాణాశాఖ ఈడీ(అడ్మిన్) జారీచేసిన నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే ఇచ్చింది. న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్ ఇటీవల ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చారు.

పోలవరంపై వర్షాకాల ప్రణాళిక ఏమిటి?

- నిర్ణీత గడువులోగా ప్రాజెక్టు పూర్తిచేయాలి
- పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో యోగేష్ పైథాంకర్ సమీక్ష

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-పోలవరం: 'పోలవరం ప్రాజెక్టులో ప్రధాన డ్యాం పనులు ప్రస్తుతం బాగానే జరుగుతున్నాయి. వర్షాకాలంలో పనులకు ఇబ్బంది లేకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు? డ్యాం నిర్మాణ ప్రాంతానికి మెటీరియల్ పూర్తిగా తెచ్చారా? కావాల్సిన ఇతర మెటీరియల్ విషయంలో ఏం చేస్తున్నారు? ఎలాంటి ప్రణాళికలు అనుసరిస్తున్నారు?' అని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో యోగేష్ పైథాంకర్ ప్రశ్నించారు. దిల్లీ నుంచి పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలనకు వచ్చిన ఆయన శనివారం ప్రధాన డ్యాం గ్యాప్ 1, గ్యాప్ 2 పనులను పరిశీలించారు. జనవరి చివరి వారంలో విదేశీ నిపుణులు రావడానికి ముందు ఆయన పర్యటించారు. అప్పటికీ, ఇప్పటికీ పనుల పురోగతిని పరిశీలించడంతో పాటు విదేశీ నిపుణుల బృందం ఇక్కడ పరిశీలించాక తర్వాత దిల్లీలో కేంద్రజలసంఘం ముఖ్యులతో చర్చించారు. ఆ అంశాలను సమన్వయం చేసుకుంటూ పైథాంకర్ అధికారులతో సమీక్షించారు. పీపీఏ సీఈ రమేష్‌కుమార్‌తో కలిసి ఈ సమావేశం నిర్వహించారు.

పనుల తీరుపై విదేశీ నిపుణుల బృందం దిల్లీ సమావేశంలో సంతృప్తి వ్యక్తం చేసిందని చెబుతూనే వారు ప్రస్తావించిన అంశాలపైనా అధికారులను వివిధ అంశాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత ప్రాజెక్టు సీఈ, ఈఎన్సీ కె.నరసింహమూర్తి ప్రజంటేషన్ ఇచ్చారు. వర్షాకాలంలో ఎలా పనులు చేయబోయేదీ గుత్తేదారు సంస్థ ప్రతినిధులు, అధికారులు వివరించారు. ప్రధాన డ్యాం నిర్మాణ ప్రాంత సమీపానికి మెటీరియల్ చేరవేశామని, వర్షానికి తడవకుండా టార్పాలిన్లతో కప్పి ఉంచుతామని చెప్పారు. డ్యాం నిర్మాణ సమయంలోనూ కట్టడం వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. వర్షాకాలంలో ఇంతకన్నా అనుసరించదగ్గ మంచి పద్ధతులు ఏమైనా కేంద్రజలసంఘం తెలియజేస్తే వాటిని అనుసరిస్తామని చెప్పారు.



డీవాల్ నిర్మాణ ప్రాంతంలో ఈఎన్సీ నరసింహమూర్తి తదితరులతో మాట్లాడుతున్న సీఈవో యోగేష్ పైథాంకర్

కేంద్ర జలసంఘం అనుమానాలు నివృత్తి చేశారా?

పోలవరం ప్రధాన డ్యాం నిర్మాణంపై కేంద్ర జలసంఘం గతేడాది నవంబరులో 32 అంశాలు లేవనెత్తింది. ఆకృతులకు అనుమతులు ఇచ్చేటప్పుడు ఆ అంశాలన్నింటిపై సంతృప్తికరమైన చర్యలు, సమాధానాలు కోరింది. వాటికి కేంద్ర జలసంఘానికి సమాధానాలు పంపినట్లు అధికారులు తెలియజేశారు. ప్రధాన డ్యాం గ్యాప్ 2 నిర్మాణానికి విదేశీ నిపుణుల బృందం సూత్రప్రాయంగా ఆమోదం తెలియజేసిందని చెప్పారు. కేంద్ర జలసంఘంలో తానూ సభ్యుడినైనందున ఆ విషయంలో ఆలస్యం జరగకుండా దిల్లీలో అవసరమైన చర్యలు తీసుకుంటానని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2027 జూన్ నాటికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయాలనే పట్టుదలతో ఉన్నాయని, అందుకు తగ్గట్టు ప్రణాళికలో లోపం రాకుండా చూడాలని పైథాంకర్ కోరారు. ఒక వారంలో ప్రణాళిక ప్రకారం పని జరగకపోతే తదుపరి వారంలో అది సరిదిద్ది పూర్తి లక్ష్యం చేరేలా చూసుకోవాలన్నారు.

పునరావాసం ఆలస్యమవుతుందా?

'పోలవరం ప్రాజెక్టులో తొలిదశలో +41.15 మీటర్ల స్థాయికి నీళ్లు నిలబెట్టాలంటే ఆ మేరకు పునరావాసం పూర్తిచేయాలి. దాదాపు 29వేల ఇళ్లు నిర్మించాలి. పునరావాస పనులు ఆలస్యమవుతున్నట్లు కనిపిస్తోంది. ఒకవైపు డ్యాం నిర్మాణం పూర్తిచేసి డ్యాంలో నీళ్లు నిలబెట్టేందుకు పునరావాసం పూర్తికాని పరిస్థితి తెచ్చుకోవద్దు' అని ఆయన ఆదేశించారు. సమావేశంలో పీపీఏ ఉపసంచాలకులు ప్రవీణ్‌వర్మ, ఎస్ఈ ఆర్.రామచంద్రరావు, నాణ్యత విభాగం చీఫ్ ఇంజినీర్ శేషుబాబు, ఎస్ఈ తిరుమలరావు, ఈఈలు బాలకృష్ణ, శ్రీనివాస్, నరసింహారావు, ప్రేమ్‌చంద్, మేఘా జీఎం ఎ.గంగాధర్, మురళి పమ్మి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్, చిత్రంలో లావు శ్రీకృష్ణదేవరాయలు, ఆనం రామనారాయణరెడ్డి, నన్నపనేని రాజకుమారి, మంజులారెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావు, కృతికా శుక్లా తదితరులు

ప్రజల్ని ఏకతాటిపైకి తెచ్చేందుకే సాంస్కృతిక కార్యక్రమాలు

కొండవీడు ఉత్సవాల్లో కేంద్రమంత్రి పెమ్మసాని

ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, యడ్లపాడు: సాంస్కృతిక కార్యక్రమాలతో అన్ని వర్గాల ప్రజల్ని ఏకతాటిపైకి తీసుకురావడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, అందులో భాగమే అన్ని జిల్లాల్లో పర్యాటక ఉత్సవాల నిర్వహణ అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు కోటలో రెండు రోజులపాటు నిర్వహించే కొండవీడు ఉత్సవాలను (ఫెస్ట్-2026) శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కోటపై యువత ట్రెక్కింగ్ చేస్తున్నప్పుడు చరిత్రతో కూడిన సంభాషణ వినాలని సూచించారు. కొండవీడు కోట నమూనా జల సంరక్షణలో ఇంజినీర్లకు ఒక మార్గదర్శి అని పేర్కొన్నారు. తెదేపా హయాంలో రూ.40 కోట్లతో ఘాట్‌రోడ్డు నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టడం వల్లే ఈరోజు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించుకుంటున్నామని చెప్పారు. కొండవీడు కోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, శిల్పకళా కమిషన్ ఛైర్మన్ మంజులారెడ్డి, కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న రాజశేఖరరెడ్డి, బోర్డు సభ్యులు

మల్లన్న బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

ఈనాడు, అమరావతి: శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ బోర్డు సభ్యులు శనివారం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను ఉండవల్లిలో కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. సంబంధిత ఆహ్వాన పత్రిక, స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. ఈ నెల 8 నుంచి 11 రోజులపాటు శ్రీశైలంలోని ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ బోర్డు ఛైర్మన్ రమేశ్‌నాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు, పండితులు ఉన్నారు.



నిప్పు.. ఏఐ.. మనకు ముప్పు కాదు

నిప్పును కనుగొన్నప్పుడు పూర్వీకులు దాన్ని చూసి భయపడ్డారు. ఆ తర్వాత దాన్ని వినియోగించి తమ పనులను సులువు చేసుకున్నారు. అదేవిధంగా కంప్యూటర్ లాంటి ఆవిష్కరణలతోనూ ఉపాధి పోతుందనే భయాలు కలిగినా, అవి మన జీవితాలను సౌకర్యవంతంగా మార్చేశాయి. ఇప్పుడు కృత్రిమ మేధ(ఏఐ)తో వస్తున్న మార్పులపైనా ఆందోళనను పక్కనపెట్టి, ఏఐకి మానవ మేధస్సును జోడించి ఎంత సమర్థంగా వినియోగించొచ్చనేదానిపై దృష్టి పెట్టండి. అప్పుడు ఉద్యోగానికి ఢోకా ఉండదు.

– ముత్తుకృష్ణన్ దండపాణి, ఇన్వెస్టర్

విజయవాడ బైపాస్‌లో హాయ్‌ల్యాండ్ వరకు వాహనాలకు అనుమతి

- 10 నుంచి గొల్లపూడి వైపు నుంచి వచ్చే కార్లు, బైక్‌లకు అవకాశం
- ఈ నెల 20 నుంచి లారీలకు సైతం అనుమతి

ఈనాడు, అమరావతి: ఈ నెల పదో తేదీ సాయంత్రం నుంచి విజయవాడ బైపాస్‌లో గొల్లపూడి వైపు నుంచి వచ్చే కార్లు, బైక్‌లను హాయ్‌ల్యాండ్ రోడ్డు వరకు అనుమతిస్తారు. ప్రస్తుతం కృష్ణా నది, సీడ్ యాక్సెస్ రోడ్ దాటిన తర్వాత బైపాస్ నుంచి పక్కకు దిగి మందడం వెళ్లే రోడ్‌లోకి చేరుకొని సచివాలయం, హైకోర్టు వైపు వెళ్లేందుకు వాహనాలను అనుమతిస్తున్నారు. ఇప్పుడు గొల్లపూడి వైపు నుంచి గుంటూరు వైపు వెళ్లాలనుకునే వాహనాలను కూడా హాయ్‌ల్యాండ్ రోడ్ వరకు అనుమతించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

★ బైపాస్‌లో టోల్‌ప్లాజా దాటాక ముందుకు వెళ్లేందుకు అవకాశం లేదు. పదో తేదీ సాయంత్రం నుంచి అందుకు అనుమతించి హాయ్‌ల్యాండ్ రోడ్ వరకు వెళ్లేందుకు అవకాశం కల్పిస్తారు.

★ హాయ్‌ల్యాండ్ రోడ్డులోకి దిగి 200 మీటర్లు ప్రయాణించి చెన్నై-కోల్‌కతా సర్వీసు రోడ్డు నుంచి వెళ్లొచ్చు. ★ తొలుత కార్లు, బైకులను మాత్రమే ఇలా అనుమతిస్తారు.

ఈనెల 20 నుంచి గొల్లపూడి నుంచి వచ్చే లారీలను సైతం గుంటూరు వైపు అనుమతించనున్నారు. హాయ్‌ల్యాండ్ రోడ్డు వద్ద కాకుండా నేరుగా చెన్నై-కోల్‌కతా హైవేలోకి దిగి, విజయవాడ వైపు కొంత దూరం వెళ్లి, సర్వీసు రోడ్డులోకి చేరుకుని, ఎన్ఆర్ఐ ఆస్పత్రి కూడలి వద్ద అండర్‌పాస్ నుంచి యూటర్న్ తీసుకొని గుంటూరు వైపు సర్వీసు రోడ్డులో కొంత దూరం వెళ్లి, అక్కడి నుంచి ప్రధాన హైవేలోకి చేరుకోవచ్చు.

★ విజయవాడ బైపాస్, కోల్‌కతా-చెన్నై రహదారిని పూర్తిగా అనుసంధానం చేసే పనులు వచ్చే నెలలో పూర్తికానున్నాయి. అప్పటి నుంచి గొల్లపూడి నుంచి వచ్చే వాహనాలన్నీ నేరుగా చెన్నై-కోల్‌కతా హైవేలోకి చేరుకొని, చెన్నై వైపు వెళ్లొచ్చు.

పంచాయతీరాజ్ ఇంజినీర్లపై విజిలెన్స్ కేసుల ఎత్తివేత

ఈనాడు, అమరావతి: పంచాయతీరాజ్ ఇంజినీర్లపై వైకాపా ప్రభుత్వంలో నమోదు చేసిన విజిలెన్స్ కేసులను కూటమి ప్రభుత్వం ఎత్తివేసింది. ఉమ్మడి అనంతపురం, కర్నూలు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, కృష్ణా, నెల్లూరు జిల్లాల్లో పలువురు ఇంజినీర్లపై నమోదైన కేసులను ఎత్తివేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2014-19 మధ్య కాలంలో తెదేపా ప్రభుత్వంలో ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) కింద చేపట్టిన గ్రామీణ రహదారుల పనుల్లో నాణ్యత లోపించిందంటూ వైకాపా ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అనేకమంది ఇంజినీర్లపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అప్పట్లో కేసులు నమోదు చేసింది. అకారణంగా కేసులు నమోదు చేశారని ఇంజినీర్లు ఆందోళనకు దిగినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వివిధ దశల్లో పరిశీలన తరువాత వారిపై విజిలెన్స్ కేసులు ఎత్తివేసింది.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వెంకయ్యనాయుడు

'బూతుల' నాయకులకు పోలింగ్ బూత్‌లలో సమాధానం చెప్పాలి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

విశాఖపట్నం (పెందుర్తి), న్యూస్‌టుడే: బూతులు మాట్లాడే నాయకులకు ప్రజలు పోలింగ్ బూత్‌లలో సమాధానం చెప్పాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. విశాఖ జిల్లా పెందుర్తిలో శనివారం బాలాజీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కొంతమంది రాజకీయ నాయకులకు బూతులు మాట్లాడటం ఫ్యాషన్ అయిపోయిందని, అలా మాట్లాడితే పేపర్లలో వేస్తారని భావిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సక్రమంగా మాట్లాడే సత్తా లేక ఎదుటివారి తల్లిదండ్రులు, వారి ఇంట్లో వాళ్ల గురించి మాట్లాడే దుస్థితి వచ్చిందన్నారు. అన్ని పార్టీల నాయకుల్లోనూ ఈ పరిస్థితి ఉందని అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో కొందరు పద్ధతిగా.. మంచిగా ఉంటున్నారని చెప్పారు. అసందర్భ ప్రసంగాలు చేసే వారికి ప్రజలు నిశ్శబ్దంగా ఎన్నికల్లో గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే అసెంబ్లీ, పార్లమెంటుల్లో వారిని చూసిన భవిష్యత్తు తరాలు మంచిని నేర్చుకుంటాయని వివరించారు. ఈ విషయాన్ని రాజకీయ నాయకులు గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

పేదల ఇళ్లు నిర్మించని రాక్రీట్ సంస్థపై కేసులు పెట్టండి: మంత్రి పార్థసారథి

ఈనాడు, ఏలూరు: పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుండా వదిలేసి వెళ్లిపోయిన రాక్రీట్ సంస్థపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కె.పార్థసారథి ఆదేశించారు. ఆ సంస్థ ఇళ్ల నిర్మాణ పనులు దక్కించుకున్న అన్ని జిల్లాల్లో ఫిర్యాదు చేసి కేసులు నమోదయ్యేలా చూడాలని యంత్రాంగానికి సూచించారు. వైకాపా హయాంలో పేదల ఇళ్లు నిర్మించే బాధ్యతలు దక్కించుకుని, బిల్లులు పొంది, ఇళ్లు నిర్మించలేదని విజిలెన్స్ నిగ్గు తేల్చిందని తెలిపారు. శనివారం ఏలూరు జిల్లా సమీక్ష కమిటీ(డీఆర్సీ) సమావేశానంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేసే బాధ్యతను వేరే ఏజెన్సీలకు అప్పగించామని వివరించారు. ప్రభుత్వం నుంచి బిల్లులు తీసుకుని నిర్మాణం చేపట్టని లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. టిడ్కో ఇళ్లను సెప్టెంబరు నాటికి పూర్తి చేసి అప్పగించాలని, ఎన్టీఆర్ పేదల కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ నాసిరకం విత్తనాలతో రైతులను మోసగిస్తున్న విత్తన కంపెనీలపై కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని ఆదేశించారు.

త్వరలో అడవిలోకి పెద్ద పులి

ప్రస్తుతం విశాఖ జూలో విశ్రాంతి

ఈనాడు-విశాఖపట్నం, న్యూస్‌టుడే-ఎండాడ, రాజానగరం: తూర్పుగోదావరి జిల్లాలో శుక్రవారం రాత్రి పట్టుకున్న పెద్ద పులిని అధికారులు శనివారం ఉదయం విశాఖ జంతు ప్రదర్శనశాలకు తీసుకొచ్చారు. మొదట పెద్దగా గాండ్రిస్తూ బోనులో అటూ ఇటూ తిరుగుతూ గంభీరంగా కనిపించిన పులి.. సాయంత్రానికి ప్రశాంతంగా మారింది. జూ క్యూరేటర్ మంగమ్మ, వెటర్నరీ వైద్యులు భాను ప్రసాద్ దానికి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అంతా సవ్యంగా ఉండటంతో మధ్యాహ్నం, రాత్రి మాంసాహారం అందించారు. అడవుల్లో స్వేచ్ఛగా తిరిగే అలవాటున్న నేపథ్యంలో చాలా సేపు గాండ్రించిన బెబ్బులి.. విశాలమైన బోనులోకి మార్చడంతో సేద తీరింది. దానిని మళ్లీ అడవిలో వదిలి పెట్టనున్నట్లు విశ్వసనీయ సమాచారం. కొద్ది రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచిన తర్వాత అధికారుల కమిటీ దీనిపై నిర్ణయం తీసుకోనుంది.



బోనులో పెద్ద పులి

ఈనాడు బిజినెస్ వారాంతం

ఎస్‌బీఐ లాభం రూ.21,317 కోట్లు



ముంబయి: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో స్టాండలోన్ ప్రాతిపదికన రూ.21,028 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఇది త్రైమాసికం వారీ ఆల్‌టైం గరిష్ఠ స్థాయి కావడం విశేషం. ఇక ఏకీకృత ఖాతాల ప్రకారం నికర లాభం రూ.21,317 కోట్లకు చేరింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభంతో పోలిస్తే ఇది 13.06 శాతం అధికం. మొత్తం ఆదాయం రూ.1,28,467.39 కోట్ల నుంచి 9.7 శాతం వృద్ధి చెంది రూ.1,40,914.65 కోట్లకు చేరింది.

రుణాల్లో 15% వృద్ధి: బ్యాంక్ ప్రధాన నికర వడ్డీ ఆదాయం స్టాండలోన్ ప్రాతిపదికన రూ.41,446 కోట్ల నుంచి 9.04 శాతం పెరిగి రూ.45,190 కోట్లకు చేరింది. రుణ వృద్ధి 15.14 శాతం నమోదు కావడంతో నికర వడ్డీ మార్జిన్ 3.12 శాతానికి చేరింది. వడ్డీయేతర ఆదాయం 15.65 శాతం పెరిగి రూ.8,404 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు రూ.1,04,917 కోట్ల నుంచి రూ.1,08,052 కోట్లకు చేరాయి. డిపాజిట్ల వృద్ధి 9.02 శాతంగా నమోదైంది.

రాంకీ ఇన్‌ఫ్రా లాభం రూ.78 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.550.70 కోట్ల ఆదాయం, రూ.78 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఈపీఎస్ రూ.11.35గా ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.498.78 కోట్లు, నికర లాభం రూ.59.80 కోట్లుగా ఉన్నాయి. డిసెంబరు 31, 2025తో ముగిసిన త్రైమాసికంలో, ఇకపై చెల్లించాల్సిన అవసరం లేదని భావించిన రూ.7.87 కోట్ల రుణాలను, అదనపు కేటాయింపులను కంపెనీ వెనక్కి తీసుకుంది. సంస్థ సీఈఓ సునీల్ నాయర్ మాట్లాడుతూ.. వరుసగా ప్రతి త్రైమాసికంలోనూ కంపెనీ పనితీరు స్థిరంగా మెరుగవుతోందన్నారు. బలమైన మార్జిన్లు, లాభదాయకత తమ నిర్వహణ సామర్థ్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. నిర్వహణ ఖర్చుల నియంత్రణ, సామర్థ్యం పెరగడంతో ఆదాయం, లాభాల్లో వృద్ధి సాధ్యమయిందని సీఎఫ్ఓ ప్రవంత్ రాయపూడి పేర్కొన్నారు.

హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్ 200% డివిడెండ్

ఈనాడు, హైదరాబాద్: హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఆకర్షణీయమైన ఫలితాలను ప్రకటించింది. సంస్థ ఆదాయం రూ.884.58 కోట్లు, నికర లాభం రూ.217.56 కోట్లు, ఈపీఎస్ రూ.7.95గా నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.452.10 కోట్లు, లాభం రూ.58.39 కోట్లు, ఈపీఎస్ రూ.2.31గా ఉన్నాయి. మొదటి 9 నెలల కాలానికి ఆదాయం రూ.2,744.67 కోట్లు, నికర లాభం రూ.746.07 కోట్లుగా ఉన్నాయి. రూ.1 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేరుపై రూ.2 (200%) మధ్యంతర డివిడెండ్ చెల్లించేందుకు బోర్డు ఆమోదించింది. ఇందు కోసం ఫిబ్రవరి 13ను రికార్డు తేదీగా నిర్ణయించారు. కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో సంయుక్త సంస్థ(జేవీ) ఏర్పాటు, బెంగళూరుకు చెందిన అంకుర సంస్థ యానంద్రియ ప్రైవేట్ లిమిటెడ్, కొచ్చికి చెందిన జాల్టెన్ సిస్టమ్స్‌లో ఈక్విటీ పెట్టుబడులు పెట్టేందుకూ బోర్డు ఆమోదం తెలిపింది.

కోడి గుడ్డు

8న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	495
వరంగల్	497
విజయవాడ	515
తూ/ప గోదావరి	485
విశాఖపట్నం	490
చిత్తూరు	563

అమెరికా నుంచి భారీగా బైక్‌లు, కార్లు



800-1600 సీసీ బైక్‌లపై దిగుమతి సుంకం ఎత్తివేసిన భారత్

- ప్రీమియం కార్లపైనా పన్ను రాయితీలు
- యాపిల్స్‌పై కోటా ఆధారిత మినహాయింపులు
- విమాన ఓఈఎం కేంద్రంగా మారతాం: కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

భారత్-యూఎస్ వాణిజ్య ఒప్పందం

భారత్-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం వల్ల మన దేశంతో పాటు అగ్రరాజ్యానికీ ప్రయోజనం దక్కనుంది. ఆ దేశం నుంచి వచ్చే వస్తువులపై మనం కూడా సుంకాలను మినహాయించాం. అందులో ముఖ్యంగా చెప్పుకోవలసిందేమిటంటే.. 800 సీసీ నుంచి 1600 సీసీ సామర్థ్యం కలిగిన బైక్‌లపై దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తివేయడం. దీంతో హార్లే డేవిడ్‌సన్ వంటి బైక్ తయారీ కంపెనీలకు ప్రయోజనం దక్కనుంది. అమెరికా యాపిళ్లకు కోటా ఆధారిత ప్రయోజనాలకూ భారత్ అంగీకరించింది.

మరో వైపు, విమాన విడిభాగాలపై దిగుమతి సుంకాలను తొలగించేందుకు అమెరికా అంగీకరించడంతో, ఆ దేశ సంస్థలైన బోయింగ్, ఎయిర్‌బస్ వంటివి భారత్ నుంచి భారీ ఎత్తున విడిభాగాలను కొనుగోలు చేయడానికి మార్గం సుగమం అయింది. దీంతో భారత్ అతిపెద్ద ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్(ఓఈఎం)గా మారనుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. భారత వస్తువులపై అమెరికా టారిఫ్‌లు 18 శాతానికే చేరడంతో జౌళి, రత్నాభరణాలు, ఆక్వా వంటి కార్మిక ఆధారిత రంగాలకు గట్టి ప్రయోజనం దక్కనుంది.

హార్లే డేవిడ్‌సన్‌కు గొప్ప ఊరట

భారత్ అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఇరు దేశాల మధ్య తయారీ రంగం, సరఫరా వ్యవస్థ భాగస్వామ్యాలను బలోపేతం చేయనుందని ఆటోమోటివ్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏసీఎంఏ) పేర్కొంది. ఈ ఒప్పందంలో భాగంగా అమెరికాకు చెందిన మోటార్ సైకిల్ బ్రాండ్ హార్లే డేవిడ్‌సన్‌కు భారీ ఊరట లభించనుంది. 800 సీసీ నుంచి 1600 సీసీ సామర్థ్యం కలిగిన బైక్‌లపై దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తివేయాలని భారత్ నిర్ణయించింది.

✦ పూర్తిగా తయారైన వాహనాలు(సీబీయూ)గా దిగుమతి అయ్యే 1600 సీసీ వరకు సామర్థ్యం ఉన్న మోటార్ సైకిళ్లపై దిగుమతి సుంకాన్ని 50 శాతం నుంచి 40 శాతానికి గతేడాది భారత్ తగ్గించింది. 1600 సీసీ మించిన బైక్‌లపై సుంకాన్ని 50 శాతం నుంచి 30 శాతానికి కుదించింది.

తాజా ఒప్పందంతో నిర్దేశిత సామర్థ్యం ఉన్న బైక్‌లకు 'జీరో-డ్యూటీ' (సున్నా సుంకం) వర్తించనుంది.

అమెరికాకు ఎంత ప్రయోజనం: భారతదేశంలో ప్రీమియం బైక్‌ల మార్కెట్ పరిమితంగా ఉండగా, ఇందులో అమెరికా వాటా చాలా తక్కువ. భారత మార్కెట్ కోసం అక్టోబర్ 2020లో హీరో మోటోకార్ప్, హార్లే డేవిడ్‌సన్ భాగస్వామ్యాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే.

కార్ల దిగుమతులపైనా..



ఈ వాణిజ్య ఒప్పందం కింద అమెరికా నుంచి దిగుమతయ్యే కార్లపైనా భారత్ సుంకం రాయితీలను అందించనుంది. ముఖ్యంగా 2,500 సీసీ కంటే ఎక్కువ సామర్థ్యంగల డీజిల్ వాహనాలు, 3,000 సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న పెట్రోలు వాహనాలకు ఈ వెసులుబాటు లభించనుంది. ప్రతిగా, భారత్ నుంచి దిగుమతి అయ్యే కొన్ని వాహన విడిభాగాలపైన అమెరికా సుంకాలను తొలగించనుంది. మరికొన్నింటిపై ఇది 18 శాతంగా ఉండనుంది.

✦ వాహన విడిభాగాలకు ప్రాధాన్యతతో కూడిన టారిఫ్ రేట్ కోటాలు, ఎంపిక చేసిన ఇన్‌పుట్‌లపై సెక్షన్ 232 సుంకాల తొలగింపునకు మార్గం సుగమం కావడం శుభ పరిణామం అని ఏసీఎంఏ అధ్యక్షుడు విక్రమ్‌పతి సింఘానియా పేర్కొన్నారు.

బోయింగ్‌కు ప్రయోజనం



అమెరికాకు చెందిన విమాన తయారీ సంస్థ బోయింగ్, భవిష్యత్తులో తమకు అవసరమైన విడిభాగాల కోసం భారత్‌ను అతిపెద్ద 'ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్ (ఓఈఎం)' కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఆసక్తి చూపిస్తోందని పీయూష్ గోయల్ వెల్లడించారు. భారత్-అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందం మేరకు.. విమాన విడిభాగాలపై దిగుమతి సుంకాలను తొలగించేందుకు అమెరికా అంగీకరించింది. 'ఇప్పటికే బోయింగ్, ఎయిర్‌బస్ సంస్థలు భారత్ నుంచి భారీ ఎత్తున విమాన విడిభాగాలను కొనుగోలు చేస్తున్నాయి. భవిష్యత్తులో విడిభాగాల తయారీకి సంబంధించి భారత్‌ను తమ అతిపెద్ద విదేశీ ఓఈఎం కేంద్రంగా మార్చాలని ప్రయత్నిస్తున్నాయి. ఈ విషయంపై ఆయా సంస్థల సీఈఓలు, బోర్డు సభ్యులతో చర్చలు జరిపాన'ని గోయల్ వెల్లడించారు.

✦ భారత్‌లో ప్రస్తుతం బోయింగ్‌కు చెందిన 265కు పైగా వాణిజ్య, మిలటరీ విమానాలున్నాయి. దేశవ్యాప్తంగా బోయింగ్‌కు 325కి పైగా సరఫరాదారులు ఉన్నారు.

✦ ఏటా సుమారు రూ.11 వేల కోట్ల (1.25 బిలియన్ డాలర్లు) విలువైన విడిభాగాలను, సేవలను భారత్ నుంచి ఈ సంస్థ సేకరిస్తోంది. మరోవైపు ఎయిర్‌బస్ సైతం భారత్ నుంచి రూ.12 వేల కోట్ల (1.4 బి.డాలర్లు) విడిభాగాలను కొనుగోలు చేస్తోంది. 2030 నాటికి దీనిని రూ.18 వేల కోట్ల (2 బి.డాలర్లు)కు పెంచాలని లక్ష్యంగా పెట్టుకొంది.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం వల్ల ఏరోస్పేస్ రంగానికి బహుళ ప్రయోజనాలుంటాయని బోయింగ్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్ సలీల్ గుప్తా హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఓఈఎంలు ప్రస్తుతం భారత్ నుంచి ఏటా 2 బిలియన్ డాలర్ల విలువైన విడిభాగాలను సేకరిస్తున్నాయని ఎక్విస్ ఛైర్మన్ అరవింద్ మెల్లిగేరి తెలిపారు. తాజా ఒప్పందం వల్ల విడిభాగాల సరఫరా వ్యవస్థలో ఖర్చుల పరంగా పోటీతత్వం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.

యాపిల్ రైతులకు భరోసా

అమెరికా నుంచి దిగుమతి అయ్యే యాపిళ్ల విషయంలో భారత ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేసింది. వాణిజ్య ఒప్పందంలో భాగంగా యాపిల్స్‌కు కోటా ఆధారిత సుంకాల రాయితీ కల్పించేందుకు నిర్ణయించింది. తద్వారా దేశీయ రైతుల ప్రయోజనాలకు ఇబ్బంది లేకుండా రక్షణ ఏర్పాటు చేసినట్లు వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. అమెరికా యాపిల్స్‌పై కనీస దిగుమతి ధరను కిలోకు రూ.80గా, దీనిపై 25 శాతం దిగుమతి సుంకాన్ని విధించాలని నిర్ణయించారు. దీనివల్ల మార్కెట్లో ఈ యాపిల్స్ ధర కిలో రూ.100కు తక్కువగా పడిపోయే ప్రసక్తే ఉండదని, తద్వారా హిమాచల్, కశ్మీర్ రైతుల యాపిల్స్‌కు పోటీ ఉండదని ఆయన స్పష్టం చేశారు. గతంలో కనీస దిగుమతి ధర రూ.50, సుంకం 50 శాతం ఉండేది. దీంతో ఈ యాపిల్స్ కిలో ధర రూ.75కే వచ్చేవి.

✦ అమెరికా సహా ఇతర దేశాల నుంచి భారత్ ఏటా 6 లక్షల టన్నుల యాపిల్స్‌ను దిగుమతి చేసుకుంటోంది.

పరిశ్రమ వర్గాలేమంటున్నాయంటే..

భారత్-అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం ప్రతిపాదన నేపథ్యంలో పరిశ్రమ వర్గాలు సానుకూలంగా స్పందించాయి...

అంతర్జాతీయ మదుపరులలో విశ్వాసం

సమగ్ర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దిశగా ఇదొక సమయానుకూల ముందడుగు. ఇది ఇరు దేశాల మధ్య పెరుగుతున్న నమ్మకాన్ని, విధానపరమైన సారూప్యతను, వాణిజ్య నిబంధనల పట్ల ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తోంది.

– రాజీవ్ మెమానీ, సీఐఐ అధ్యక్షుడు

వజ్రాల ఎగుమతులు పెరుగుతాయి

అమెరికాకు మన కట్, పాలిష్ చేసిన వజ్రాల ఎగుమతులు 60 శాతానికి పైగా పడిపోయిన క్లిష్ట సమయంలో.. వజ్రాలు, రంగురాళ్లకు అమెరికాలో సుంకాన్ని తొలగించడం మాకు సంతోషాన్నిస్తోంది. ఎగుమతులు పెరుగుతాయి. టారిఫ్‌ల కారణంగా కోల్పోయిన మార్కెట్‌ను తిరిగి పొందేందుకు ఇది ఒక గొప్ప మార్పు.

– కిరీట్ భన్సాలీ,
జెమ్ అండ్ జువెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఛైర్మన్

జనరిక్ ఔషధాలకు మినహాయింపు

టారిఫ్‌ల నుంచి జనరిక్ ఔషధాలను మినహాయించారు. మొత్తం ఫార్మాసూటికల్స్(జనరిక్స్ సహా)పై టారిఫ్ అనేది ప్రస్తుత అమెరికా సెక్షన్ 232 దర్యాప్తు ఆధారంగా ఉంటుంది.

– సుదర్శన్ జైన్,
ఇండియన్ ఫార్మాసూటికల్ అలయన్స్ సెక్రటరీ జనరల్

రవీంద్రుడి భూమిలో గిటార్ విలేజ్

బెంగాల్ అనగానే వెంటనే గుర్తొచ్చేది రవీంద్రుడి సంగీతం. అక్కడి పల్లెల్లో వినిపించే ఏక్‌తారా వాయిద్యం.. బౌల్ జానపద గీతాల మాధుర్యం. ఇప్పుడు కాలం మారింది. నేటి బెంగాల్ యువత భుజాలపై ఏక్‌తారా లేదు. ఆరు తీగలు మీటే పాశ్చాత్య వాయిద్యం గిటార్ వచ్చి చేరింది. ఈ మార్పు సంగీతం వినడానికే పరిమితం కాలేదు. ఏకంగా గిటార్ల తయారీ కేంద్రంగా బెంగాల్ మారిపోయింది. ఒకప్పుడు ఆధ్యాత్మిక భావనలకు, ఫుట్‌బాల్ ఆటకు పెట్టింది పేరైన శ్యామ్‌నగర్ ఇప్పుడు 'గిటార్ విలేజ్'గా దేశమంతా గుర్తింపు పొందుతోంది. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని శ్యామ్‌నగర్‌లో గల కౌగాచి - చండీతల ప్రాంతం సంగీత ప్రియులకు స్వర్గధామం. ఇక్కడున్న శ్యామ్ (కృష్ణుడు) ఆలయం చాలా ప్రసిద్ధి. ఇటువంటి



నేపథ్యం ఉన్న ఊరిలో గిటార్ తీగల సవ్వడి కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఆరేడు పెద్ద పరిశ్రమలు గిటార్లు తయారు చేస్తున్నాయి. అస్సాం కలపతో వీరు చేసే నాణ్యమైన గిటార్లు ఇండోనేసియా, చైనా మార్కెట్‌ను కూడా వెనక్కు నెట్టేశాయి. దేశంలో వాడే మొత్తం గిటార్లలో 60% ఇక్కడే తయారవుతుండగా.. 200 మందికి పైగా కార్మికులు ఈ పనిపై ఆధారపడి బతుకుతున్నారు.

ఈటీవీ భారత్

అమ్మానాన్నల ఒంటరితనం.. రీల్స్‌తో దూరం

తనూ వయసు 60.. రాజేశ్ సత్యవాదికి 65 ఏళ్లు. గత రెండేళ్ల వ్యవధిలో ఈ దంపతులు ఇన్‌స్టా రీల్స్‌తో 4.5 లక్షల వినియోగదారులను సాధించి, మంచి ఆదాయాన్నే పొందుతున్నారు. వీరిద్దరూ ఈ రంగంలోకి రావడం వెనుక భావోద్వేగంతో కూడిన ఓ కథ ఉంది. హరియాణాలోని కురుక్షేత్ర జిల్లా షాహాబాద్‌కు చెందిన వీరికి సురభి అనే కుమార్తె ఉంది. ఆమెకు పెళ్లి చేసి పంపాక ఇల్లు బోసిపోయింది. నిత్యం కూతురి తలపులతో తనూ ఆరోగ్యం దెబ్బతింది. తల్లిని చూడటానికి వచ్చినపుడల్లా సురభి ఆందోళనకు గురయ్యేది. ఆ క్రమంలోనే తల్లితో కలిసి ఆమె కొన్ని ఇన్‌స్టా రీల్స్ చేశారు. వాటికి పెద్దసంఖ్యలో వ్యూస్ రావడంతో తల్లి ముఖంలో ఆనం



దాన్ని సురభి గుర్తించారు. అంతే.. సోషల్ మీడియాలో తనూ, రాజేశ్‌ల ప్రయాణం మొదలైంది. "నా భార్య ఆరోగ్యం బాగైంది. సోషల్ మీడియా మాకు కొత్త జీవితాన్ని ఇచ్చింది" అని రాజేశ్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. "ఇది నా తల్లిదండ్రుల కథ మాత్రమే కాదు. పిల్లల కోసం జీవితాలు ధారపోసి, ఇప్పుడు ఒంటరితనం అనుభవిస్తున్న 60 ఏళ్ల పైబడిన లక్షల జంటల గాథ" అని సురభి అన్నారు.

---

80 ఏళ్ల వయసులో భారత పౌరసత్వం

ఈటీవీ భారత్: బ్రిటిష్ రచయిత్రి, ఫొటోగ్రాఫర్, సాంస్కృతిక పరిశోధకురాలు.. 'పద్మశ్రీ' అవార్డు గ్రహీత పెపెతా సేఠ్ 80 ఏళ్ల వయసులో భారత పౌరసత్వం అందుకున్నారు. కేరళలోని త్రిశ్శూర్ కలెక్టరేటులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అర్జున్ పాండ్యన్ ఆమెకు పౌరసత్వ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తన బ్రిటిష్ జాతీయతను అధికారికంగా త్యజించిన పెపెతా సేఠ్ మాట్లాడుతూ.. "నేను ఎంతగానో ప్రేమించిన ఈ భూమి నన్ను తన కుమార్తెగా స్వీకరించినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇక నేను వెనక్కు వెళ్లాల్సిన పని లేదు" అన్నారు. కేరళ ఆచారాలు, ఉత్సవాలు, ప్రకృతి సౌందర్యాలను డాక్యుమెంటు చేస్తూ దాదాపు నాలుగు దశాబ్దాలు ఆమె ఇక్కడే గడిపారు. 1857లో బ్రిటిష్ సైనికుడిగా ఉన్న తన తాత రాసిన డైరీ చదివి, 27 ఏళ్ల వయసులో పెపెతా భారత్‌కు వచ్చారు. 'గాంధీ' చిత్రంలో నెహ్రూ పాత్ర పోషించిన నటుడు రోషన్ సేఠ్‌ను పెళ్లాడారు. 2012లో భారత ప్రభుత్వం ఆమెను పద్మశ్రీతో సత్కరించింది.



'పద్మశ్రీ' పెపెతా సేఠ్

జిమ్‌కు వెళ్తే జీవితం బాగుపడుతుంది



జిమ్‌లో బరువులెత్తడానికి శక్తి కావాలి కాబట్టి → మీరు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటారు → అలాంటి ఆహారం వల్ల చక్కగా నిద్రపడుతుంది → దానివల్ల మరుసటి రోజు ఉత్సాహంగా పని చేస్తారు → దాంతో మీలో ఆత్మవిశ్వాసం పెరిగి కెరీర్లో రాణిస్తారు → దానివల్ల మీ జీవితం అన్ని విధాలుగా బాగుంటుంది. అందుకే జిమ్‌కు డుమ్మా కొట్టకండి.

– అభి రాజ్‌పూత్, ఫ్యాట్ లాస్ కోచ్

విశ్వసనీయతే భారత్‌కు బలమైన కరెన్సీ

- మలేసియాలో ప్రవాసులతో భేటీలో మోదీ

కౌలాలంపూర్: విశ్వసనీయతే భారత్‌కు బలమైన కరెన్సీగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. వృద్ధికి నమ్మకమైన వ్యవస్థగా భారత్‌ను ప్రపంచం చూస్తోందని చెప్పారు. బ్రిటన్, యూఏఈ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అమెరికా, ఐరోపా సమాఖ్య (ఈయూ) వంటివాటితో కుదిరిన/ కుదురుతున్న ఒప్పందాల్లో ఇది ప్రతిఫలించిందని చెప్పారు. మలేసియాలో రెండ్రోజుల పర్యటన కోసం శనివారం కౌలాలంపూర్ చేరుకున్న ఆయన.. ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. 'ఉమ్మడిగా రూపాంతరీకరణను ముందుకు తీసుకువెళ్లేందుకు భారత్-మలేసియా భాగస్వామ్యం' (ఇంపాక్ట్) అనేదే ఇరు దేశాలకు మార్గనిర్దేశం చేస్తుందని చెప్పారు. భాగస్వాములుగా రెండు దేశాలూ చేతిలో చేయివేసి నడుస్తున్నాయన్నారు. "భారత్, మలేసియా ఒకదానికొకటి బాగా తెలుసు. భారతీయ భాషల్లో, మలై భాషలో అనేక ఉమ్మడి మాటలు ఉంటాయి. ఇరు దేశాల మధ్య బలమైన వారధిలా ప్రవాస భారతీయులు నిలుస్తున్నారు. ఎంతో ఆత్మీయంగా నాకు స్వాగతం పలికినందుకు రుణపడి ఉంటాను" అని అన్నారు.

తమిళం అజరామరం.. అది భారత్ కానుక

"తమిళనాడు నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారు వేర్వేరు రంగాల్లో సేవలు అందిస్తున్నారు. 2026లో నా మొదటి విదేశీ పర్యటన మలేసియాలో కావడం మరింత ఆనందంగా ఉంది. ప్రస్తుత ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఈ పదవిలోకి రాకముందు నుంచీ మా ఇద్దరి మధ్య స్నేహం ఉంది. తమిళ పాటలన్నా, దిగ్గజ నటుడు ఎంజీ రామచంద్రన్ అన్నా ఆయనకు ఇష్టం. తమిళం అనేది ప్రపంచానికి భారత్ ఇచ్చిన కానుక. తమిళ సాహిత్యం అజరామరం. తమ ప్రతిభతో తమిళులు మానవాళికి సేవలందిస్తున్నారు. ప్రస్తుత ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు జైశంకర్, నిర్మలా సీతారామన్, ఎల్.మురుగన్ ఆ రాష్ట్రానికి చెందినవారే. తిరువళ్లువర్ పీఠాన్ని, కొత్త కాన్సులేట్‌ను ఇక్కడ ఏర్పాటు



కౌలాలంపూర్‌లో ప్రవాస భారతీయుల సమావేశంలో మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో కలిసి అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

చేస్తాం. ప్రవాస భారతీయుల్లో ఆరో తరం వరకు 'ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఇండియా' (ఓసీఐ) కార్డు జారీ చేయాలనే చరిత్రాత్మక నిర్ణయాన్ని ఇటీవలే తీసుకున్నాం. భారత్ విజయం మలేసియా విజయం. అది ఆసియా విజయం కూడా" అని మోదీ చెప్పారు. పలు భాషల్లో ఆయన అభివాదం చేశారు. మలేసియా ప్రధాని ఇబ్రహీం, ఇద్దరు మంత్రులు విమానాశ్రయానికి వచ్చి ఆయనకు ఘన స్వాగతం పలికారు. భరతనాట్యం, కథకళి, కూచిపూడి, ఒడిస్సీ తదితర శాస్త్రీయ నృత్యాలతో 800 మంది కళాకారులు మోదీని స్వాగతించడం 'మలేసియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో నమోదైంది. ఇద్దరు ప్రధానులు ఒకే కారులో సభాస్థలి వరకు ప్రయాణించారు.

మోదీ నా గొప్ప మిత్రుడు

గొప్ప మిత్రుడు మోదీ రావడం ఎంతో ఆనందదాయకమని ఇబ్రహీం అన్నారు. వాణిజ్య ఒప్పందాలు కుదరడానికంటే ముందునుంచీ రెండు దేశాల మధ్య బలమైన బంధాలు ఉన్నాయని చెప్పారు. మోదీకి, భారత్‌కు వ్యక్తిగత మిత్రునిగా ఉంటున్నందుకు గర్విస్తున్నానన్నారు. మోదీ, ఇబ్రహీం ఆదివారం వివిధ అంశాలపై చర్చలు జరిపి, ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. వివాదాస్పద మత ప్రబోధకుడు జకీర్ నాయక్ అప్పగింత గురించి భారత బృందం పట్టుబట్టే అవకాశం ఉంది.

ఓటరు నమోదు కేసు రాజకీయ ప్రేరేపితం

దిల్లీ కోర్టుకు తెలిపిన సోనియా గాంధీ

దిల్లీ: భారత పౌరసత్వం 1983లో తీసుకోవడానికి మూడేళ్ల ముందే ఓటరు జాబితాలో తన పేరును చేర్చారంటూ దాఖలైన కేసు రాజకీయ ప్రేరేపితమైనదని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ శనివారం దిల్లీ కోర్టుకు తెలిపారు. ఆ పిటిషన్‌లోని ఆరోపణలు నిరాధారమైనవి, దురుద్దేశాలతో కూడినవి, న్యాయ ప్రక్రియను దుర్వినియోగపరిచేవని పేర్కొన్నారు. సోనియా ప్రతిస్పందనను ఆమె తరఫు న్యాయవాదులు.. ప్రత్యేక జడ్జి విశాల్ గొగ్నేకి సమర్పించారు. పౌరసత్వం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, ఓటరు జాబితా విషయం ఎన్నికల సంఘం విశేషాధికారాలకు సంబంధించినదని వివరించారు. సోనియాపై ఆరోపణలకు సరైన ఆధారాలు లేవంటూ మేజిస్ట్రేట్ కోర్టు గతంలో ఈ కేసును కొట్టివేసిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం కేసు విచారణ ఈ నెల 21వ తేదీకి వాయిదాపడింది.



యాప్ ఆధారిత క్యాబ్, ఆటోల సమ్మె

ముంబయి: యాప్ ఆధారితంగా పనిచేసే క్యాబ్, ఆటో డ్రైవర్లు శనివారం మహారాష్ట్రలో, దేశంలోని పలు ప్రాంతాల్లో సమ్మె పాటించారు. చాలావరకు వాహనాలు అగ్రిగేటర్ యాప్‌లతో ముడిపడి నడుస్తుండటంతో ప్రజల మీద ప్రభావం కనిపించింది. యాప్ నిర్వాహకులు ఏకపక్షంగా ధరలు నిర్ణయిస్తుండటంపై చర్య తీసుకోవాలని, 'అక్రమ బైక్ ట్యాక్సీ'లను నిషేధించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అక్రమంగా బైక్ ట్యాక్సీలు నడుస్తుండటం వల్ల ఆదాయానికి గండి పడుతోందని, అత్యవసర మీటలను తప్పనిసరిగా నెలకొల్పాలనే నిబంధనతో ఆర్థిక భారం పడుతోందని డ్రైవర్లు ఆందోళన వ్యక్తంచేశారు. డిమాండ్లు తీర్చకపోతే మరింత ముమ్మరంగా నిరసనలు వ్యక్తపరుస్తామని చెప్పారు.

ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో అనిల్ అంబానీ


- భారత పారిశ్రామికవేత్తకు విదేశీ మహిళలను ఆఫర్ చేసిన లైంగిక నేరాల నిందితుడు

వాషింగ్టన్/లండన్: అమెరికన్ ఫైనాన్సర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారం పలు దేశాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. రాజకుటుంబికులు, శ్రీమంతులు, రాయబారులు, దౌత్యాధికారులు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు తదితర ప్రముఖుల గౌరవ, మర్యాదలను మంటగలిపే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కొందరు పదవులను వీడాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. భారత పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ పేరు తాజాగా తెరపైకి వచ్చింది. లైంగిక నేరాల నిందితుడు ఎప్‌స్టీన్, అనిల్ అంబానీ మధ్య 2017 నుంచి 2019 వరకు కొనసాగిన సంభాషణలు, సందేశాలు వెలుగులోకి వచ్చాయి. అమెరికా అధికారులు... ఎప్‌స్టీన్‌పై లైంగిక నేరాల అభియోగాలు మోపటానికి కొన్ని నెలల ముందు వరకూ ఇవి కొనసాగినట్లు తెలుస్తోంది. ప్రపంచ వ్యవహారాలు, వ్యాపారాలు, మహిళలు, వ్యక్తిగత భేటీల ప్రణాళికలు వీటిలో ఉన్నాయి. ఓ సందర్భంలో... పొడగరి అయిన స్వీడిష్ మహిళను అనిల్ అంబానీకి ఆఫర్ చేసిన విషయం, పారిస్ నగరంలో సమావేశం ప్రణాళికలు, దావోస్‌లో 2018లో ప్రపంచ ఆర్థిక వేదికపై ట్రంప్ వ్యాఖ్యలకు ప్రతిస్పందన, 2019లో న్యూయార్క్‌కు వస్తే ఎప్‌స్టీన్ నివాసంలో కలుసుకోవాలని నిర్ణయించడం...తదితర విషయాలు బహిర్గతమయ్యాయి.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

అమెరికా విడుదల చేసిన భారత్ మ్యాప్‌లో పీవోకే!

వాషింగ్టన్: మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఫ్రేమ్‌వర్క్ ఖరారైన నేపథ్యంలో విడుదల చేసిన మ్యాప్‌లో పీవోకే, అక్సాయ్ చిన్‌లను భారత్‌లో అంతర్భాగంగా అమెరికా చూపించింది. ఆ దేశ వాణిజ్య మంత్రిత్వశాఖ ప్రతినిధి కార్యాలయం ఈ మ్యాప్‌ను విడుదల చేసింది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌ను (పీవోకేను) పాక్, అక్సాయ్ చిన్‌ను చైనా తమ భూభాగాలుగా పేర్కొంటున్న సంగతి తెలిసిందే. దీనిపై నెటిజన్లు స్పందిస్తున్నారు. భారత్‌తో బంధాన్ని పటిష్ఠం చేసుకోవడం ద్వారా పాకిస్థాన్‌కు అమెరికా గట్టి సందేశాన్ని పంపిందని వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో విడుదల చేసిన మ్యాప్‌లలో వాటిని వేర్వేరుగా అమెరికా చూపించింది.



హార్వర్డ్‌తో అన్ని సంబంధాలు తెంచుకుంటున్నాం: పెంటగాన్

వాషింగ్టన్: హార్వర్డ్ వర్సిటీతో అన్ని సంబంధాలను తెంచుకుంటున్నట్లు పెంటగాన్ శుక్రవారం ప్రకటించింది. సైనిక శిక్షణ, ఫెలోషిప్పులు, సర్టిఫికెట్ ప్రోగ్రామ్స్‌ను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఇప్పటికే తరగతులకు హాజరవుతోన్న సైనిక సిబ్బంది ఆయా కోర్సులను పూర్తి చేయొచ్చని స్పష్టంచేసింది. హార్వర్డ్‌తో పాటు ఇతర ఐవీ లీగ్ వర్సిటీలతో ఉన్న సంబంధాలను సమీక్షించనున్నట్లు పెంటగాన్ తెలిపింది.

రాజస్థాన్‌లో కూలిన భవంతి

ఇద్దరి మృతి.. శిథిలాల కింద పలువురు!

జైపుర్: రాజస్థాన్‌లోని కోటాలో మూడంతస్తుల భవనం శనివారం రాత్రి కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. శిథిలాల కింద పలువురు చిక్కుకుని ఉండొచ్చని భావిస్తున్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని అయిదుగురిని రక్షించి ఆసుపత్రికి తరలించారు. తల్వాండీ ప్రాంతంలోని ఈ భవనంలో ఒక రెస్టారెంటు కూడా ఉంది. ప్రమాదం జరిగినప్పుడు పలువురు సిబ్బంది, వినియోగదారులు ఇందులో ఉన్నారు.




నోరా ఫతేహి



గాల్లో ఎగురుతూ..

భారత్, అమెరికా మ్యాచ్ ముందు వాంఖడే స్టేడియంలో ప్రపంచకప్ ప్రారంభోత్సవం అభిమానులను అలరించింది. రితేష్ శర్మ, శివమణి పాటల సమాహారం మధ్య ప్రపంచకప్ ట్రోఫీని మైదానంలోకి తీసుకొచ్చారు. ఓ జెట్ సూట్ పైలట్ గాల్లో ఎగురుతూ ట్రోఫీని తెచ్చాడు. ఆ తర్వాత బాద్‌షా, నోరా ఫతేహి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. టోర్నమెంట్ ప్రారంభమైనట్లు ఐసీసీ ఛైర్మన్ జై షా, టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్, టీ20 ప్రపంచకప్ ప్రచారకర్త రోహిత్ శర్మ అధికారికంగా ప్రకటించారు. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ప్రత్యేక అతిథిగా మ్యాచ్‌కు హాజరయ్యారు.


రోహిత్ శర్మ

ఛాంపియన్




సాయి తేజ

వాళ్లూ మనోళ్లే..

ఈనాడు క్రీడావిభాగం

టీ20 ప్రపంచకప్‌లో అమెరికాతో మ్యాచ్ అంటే భారత్ తేలిగ్గా గెలిచేస్తుందనుకున్నారంతా. కానీ తీవ్రంగా తడబడి.. తర్వాత పుంజుకుని గెలిచింది. భారత్‌కు బలమైన పోటీ ఇచ్చిన జట్టులో ఉన్న మెజారిటీ ఆటగాళ్లు భారతీయులు, భారత సంతతికి చెందినవారే కావడం విశేషం. అందులో ఒకరు తెలుగు కుర్రాడే కాగా.. ఇంకో ఆరుగురికి భారత్‌తో సంబంధం ఉంది. సాయితేజ ముక్కమల్ల.. ఈ పేరు చూస్తేనే అతను తెలుగువాడని అర్థమైపోతుంది. సాయితేజ తండ్రి నాగేశ్వర్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కోవెలకుంట్ల మండలం, కమలాపురి. తండ్రి ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడడంతో సాయితేజ అక్కడే పుట్టి పెరిగాడు. క్రికెట్ శిక్షణలో భాగంగా అతను భారత్‌తో పాటు ఇంగ్లాండ్‌కు కూడా వెళ్లాడు. ఏడాది పాటు హైదరాబాద్‌లోని వీవీఎస్ లక్ష్మణ్ అకాడమీలో ఉన్నాడు. టీ20 లీగ్‌లో సత్తా చాటడంతో అతడికి అమెరికా జట్టులో చోటు దక్కింది. రెండేళ్లుగా టాప్‌ఆర్డర్ కీలక బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. ఢిల్లీకి చెందిన మిలింద్ కుమార్.. భారత్‌లో దేశవాళీ క్రికెట్ ఆడాడు. ఈ ఆల్‌రౌండర్ ఐపీఎల్ జట్టు ఢిల్లీ డేర్‌డెవిల్స్‌లో అవకాశం దక్కించుకున్నాడు కూడా. కానీ మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. తర్వాత అతను అమెరికా వెళ్లిపోయి, జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. శుభమ్ రంజానే మహారాష్ట్ర. అతను నాలుగేళ్ల కిందటి వరకు దేశవాళీల్లో ఆ జట్టుకు ఆడాడు. ఇక్కడ పోటీ ఎక్కువగా ఉండడంతో ఈ ఆల్‌రౌండర్ అమెరికాకు మళ్లాడు. ప్రస్తుత అమెరికా కెప్టెన్, టాప్‌ఆర్డర్ బ్యాటర్ మోనాంక్ పటేల్‌ది గుజరాత్. అండర్-19 స్థాయి వరకు అతను గుజరాత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఇక అమెరికా జట్టులోని స్పిన్ ఆల్‌రౌండర్ హర్మీత్ సింగ్, ఫాస్ట్‌బౌలర్ సౌరభ్ నేత్రావల్కర్‌లిద్దరూ ముంబయి వాళ్లే. మిడిలార్డర్ బ్యాటర్, స్పిన్నర్ సంజయ్ కృష్ణమూర్తి పుట్టింది, పెరిగింది అమెరికాలోనే అయినా.. అతడి మూలాలు కర్ణాటకలో ఉన్నాయి. అతను అండర్-16 స్థాయిలో కర్ణాటకకు ఆడాడు కూడా. శనివారం మ్యాచ్ ఆడిన జట్టులో మిగతా నలుగురిలో కూడా ఒక్కరు పక్కా అమెరికన్ కాదు. మోసిన్, అలీ ఖాన్ పాకిస్థాన్‌కు చెందిన వాళ్లు కాగా.. షాడ్లీ, ఆండ్రీస్ గౌస్ దక్షిణాఫ్రికా నుంచి వచ్చి అమెరికాలో స్థిరపడ్డారు.



ఉదయం నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో పాకిస్థాన్ చచ్చీ చెడీ గెలవడం చూసి ఆ జట్టుపై జాలి పడి ఉంటారు భారత అభిమానులు! కానీ రాత్రి టీమ్‌ఇండియా అంతకుమించిన ఇబ్బందినే ఎదుర్కొంది. అమెరికా బౌలర్లను ఆడేసుకుంటారనుకున్న బ్యాటర్లు.. వారిని తక్కువగా అంచనా వేసి, అడ్డదిడ్డంగా షాట్లు ఆడడంతో 13 ఓవర్లకు 77/6తో నిలిచింది భారత్. అమెరికా లాంటి జట్టుపై టీమ్‌ఇండియా ఇలాంటి స్థితిలో ఉంటుందని ఎవ్వరూ ఊహించి ఉండరు! అయితే ఇంతటి ఇబ్బందికర స్థితి నుంచి పుంజుకుని 29 పరుగుల తేడాతో విజయం సాధించింది భారత్. అదంతా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అద్భుత పోరాట ఫలితమే. ప్రపంచకప్ ముంగిట లయ అందుకున్న అతను.. కెరీర్లో నిలిచిపోయే మేటి ఇన్నింగ్స్‌తో జట్టుకు పోరాడే స్కోరునందించాడు. బౌలర్లు రాణించడంతో టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్ శుభారంభం చేయగలిగింది.


టీ20 ప్రపంచకప్‌లో ఈనాడు

న్యూజిలాండ్ × అఫ్గానిస్థాన్	వేదిక: చెన్నై, ఉ. 11.00
ఇంగ్లాండ్ × నేపాల్	వేదిక: ముంబయి, మ. 3.00
శ్రీలంక × ఐర్లాండ్	వేదిక: కొలంబో, రా. 7.00

కెప్టెన్.. ఏం కొట్టాడయ్యా!

● సూర్య సూపర్ ఇన్నింగ్స్

● పరాభవం తప్పించుకున్న భారత్
● తొలి మ్యాచ్‌లో అమెరికాపై విజయం


సూర్యకుమార్ 84 నాటౌట్
49 బంతుల్లో 10×4, 4×6


సిరాజ్ 3/29

ముంబయి

టీ20 ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో కఠిన సవాలు ఎదురైనప్పటికీ టీమ్ ఇండియా గట్టెక్కింది. శనివారం సూర్యకుమార్ సేన 29 పరుగుల తేడాతో అమెరికాను ఓడించింది. మొదట భారత్ 9 వికెట్లకు 161 పరుగులు సాధించింది. షాడ్లీ వాన్ షాల్క్‌విక్ (4/25), హర్మీత్ సింగ్ (2/26), మహ్మద్ మోసిన్ (1/16)ల ధాటికి తీవ్రంగా తడబడ్డ భారత్‌ను 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్ యాదవ్ (84 నాటౌట్; 49 బంతుల్లో 10×4, 4×6) గొప్ప ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. అనంతరం యూఎస్ఏ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లకు 132 పరుగులే చేయగలిగింది. అనుకోకుండా ప్రపంచకప్‌లోకి వచ్చిన మహ్మద్ సిరాజ్ (3/29)తో పాటు అర్ష్‌దీప్ (2/18), అక్షర్ పటేల్ (2/24), వరుణ్ చక్రవర్తి (1/24) ప్రత్యర్థిని దెబ్బ తీశారు. భారత సంతతి ఆటగాళ్లు మిలింద్ కుమార్ (34; 34 బంతుల్లో 3×4, 1×6), సంజయ్ కృష్ణమూర్తి (37; 31 బంతుల్లో 1×4, 2×6), శుభమ్ రంజానే (37; 22 బంతుల్లో 2×4, 3×6) పోరాడారు. భారత్ తన తర్వాతి మ్యాచ్‌లో గురువారం నమీబియాను ఢీకొంటుంది.

మధ్యలో పోటీ ఇచ్చినా..: 162 పరుగుల లక్ష్యం.. టీ20ల్లో అంత కష్టమేమీ కాదు. కానీ భారత పేస్ ద్వయం విజృంభణతో అమెరికాకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బలు తగిలాయి. హర్షిత్ రాణా దూరం కావడంతో ఒక్క రోజు ముందు ప్రపంచ కప్ ఆడే అవకాశం దక్కించుకున్న సిరాజ్.. తన తొలి ఓవర్లోనే వికెట్ పడగొట్టి బౌలింగ్‌లో భారత్‌కు అదిరే ఆరంభాన్నిచ్చాడు. తన బౌలింగ్‌లో సిక్సర్ బాదిన ఆండ్రీస్ గౌస్ (6)ను అతను ఔట్ చేశాడు. తర్వాతి ఓవర్లో కెప్టెన్ మోనాంక్ (0)ను అర్ష్‌దీప్ పెవిలియన్ చేర్చాడు. సిరాజ్ తన రెండో ఓవర్లో తెలుగు కుర్రాడు సాయితేజ (2)కు చెక్ పెట్టాడు. దీంతో 12/3తో అమెరికా పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ స్థితిలో మిలింద్, సంజయ్, శుభమ్ గట్టిగానే పోరాడారు. 15 ఓవర్లకు 98/4తో యూఎస్ఏ.. కాస్త పోటీలోకి వచ్చింది. అయితే తర్వాతి ఓవర్లో అక్షర్.. వరుస బంతుల్లో సంజయ్, హర్మీత్ (0)లను ఔట్ చేసి ప్రత్యర్థిని దెబ్బ కొట్టాడు. తర్వాత ఆ జట్టు క్రమంగా లక్ష్యానికి దూరమైంది.

ఏదో అనుకుంటే..: మొదట టాస్ గెలిచిన అమెరికా బౌలింగ్ ఎంచుకోగా, తాము టాస్ నెగ్గినా బ్యాటింగే చేసేవాళ్లం అంటూ ఉత్సాహంగా చెప్పిన టీమ్‌ఇండియా కెప్టెన్ సూర్యకుమార్‌కు సహచరులు పెద్ద షాకే ఇచ్చారు. రెండో ఓవర్లో అభిషేక్ (0) భారీ షాట్‌కు ప్రయత్నించి.. బౌండరీ వద్ద సంజయ్ కృష్ణమూర్తికి దొరికిపోయాడు. అయితే ఇషాన్ కిషన్ (20)తో కలిసి తిలక్ వర్మ (25) నిలకడగా ఆడడంతో భారత్ పుంజుకుంది. 5 ఓవర్లకు 44/1తో నిలిచింది. కానీ షాడ్లీ షాల్క్‌విక్ వేసిన తర్వాతి ఓవర్లో భారత్‌కు మామూలు షాకు తగల్లేదు. రెండో బంతికి ఇషాన్ ఔట్ అయితే.. 5, 6 బంతులకు తిలక్, దూబె (0) ఔటైపోయారు. 6-9 మధ్య 4 ఓవర్లలో కేవలం 9 పరుగులే వచ్చాయి. భారత్ 9 ఓవర్లకు 53/4తో నిలిచింది. అయితే పదో ఓవర్ నుంచి సూర్య కొంచెం బ్యాట్ ఝుళిపించడంతో స్కోరు బోర్డులో కదలిక వచ్చింది. కానీ వరుస ఓవర్లలో రింకు (6), హార్దిక్ (5) ఔటైపోవడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. కానీ చివరి ఓవర్లలో సూర్యకుమార్ అసాధారణ పోరాటంతో జట్టుకు ఊహించని స్కోరు సాధించి పెట్టాడు. 17వ ఓవర్లో అక్షర్ (14) ఔటైనప్పటికీ.. సూర్య అద్భుత షాట్లతో స్కోరును 160 దాటించాడు. నేత్రావల్కర్ వేసిన చివరి ఓవర్లో తొలి నాలుగు బంతులకు అతను 4, 6, 6, 4 బాదేశాడు. చివరి 7 ఓవర్లలో 84 పరుగులొచ్చాయి.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) మిలింద్ (బి) షాడ్లీ 20; అభిషేక్ (సి) సంజయ్ (బి) అలీ ఖాన్ 0; తిలక్ (సి) మోనాంక్ (బి) షాడ్లీ 25; సూర్యకుమార్ నాటౌట్ 84; దూబె (సి) సౌరభ్ (బి) షాడ్లీ 0; రింకు (సి) మిలింద్ (బి) మోసిన్ 6; హార్దిక్ (సి) సాయితేజ (బి) హర్మీత్ 5; అక్షర్ (సి) మోసిన్ (బి) హర్మీత్ 14; అర్ష్‌దీప్ (సి) మిలింద్ (బి) షాడ్లీ 14; వరుణ్ రనౌట్ 0; ఎక్స్‌ట్రాలు 3 **మొత్తం:** (20 ఓవర్లలో 9 వికెట్లకు) **161; వికెట్ల పతనం:** 1-8, 2-45, 3-46, 4-46, 5-72, 6-77, 7-118, 8-140, 9-161; **బౌలింగ్:** సౌరభ్ నేత్రావల్కర్ 4-0-65-0; అలీ ఖాన్ 2-0-13-1; షాడ్లీ షాల్క్‌విక్ 4-0-25-4; మోసిన్ 4-0-16-1; శుభమ్ రంజానే 2-0-16-0; హర్మీత్ సింగ్ 4-0-26-2

అమెరికా ఇన్నింగ్స్: ఆండ్రీస్ గౌస్ (సి) తిలక్ (బి) సిరాజ్ 6; సాయితేజ (సి) వరుణ్ (బి) సిరాజ్ 2; మోనాంక్ (సి) దూబె (బి) అర్ష్‌దీప్ 0; మిలింద్ స్టంప్డ్ (బి) వరుణ్ 34; సంజయ్ (సి) రింకు (బి) అక్షర్ 37; శుభమ్ ఎల్బీ (బి) సిరాజ్ 37; హర్మీత్ (సి) సిరాజ్ (బి) అక్షర్ 0; మోసిన్ (సి) తిలక్ (బి) అర్ష్‌దీప్ 8; షాడ్లీ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 6, **మొత్తం:** (20 ఓవర్లలో 8 వికెట్లకు) **132; వికెట్ల పతనం:** 1-8, 2-11, 3-13, 4-71, 5-98, 6-98, 7-110, 8-132; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-18-2, సిరాజ్ 4-0-29-3, వరుణ్ 4-0-24-1, అక్షర్ 4-0-24-2, హార్దిక్ 4-0-34-0


సూర్య షాట్ కొట్టే క్రమంలో..

అద్భుతం.. అతడి పోరాటం

ఈనాడు క్రీడావిభాగం

సూర్య కానీ లేకుంటే..? శనివారం రాత్రి ఎంతమంది ఈ మాట అనుకుని ఉంటారో! నిజమే కెప్టెన్ ఆడకపోతే టీ20 ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో ఘోర పరాభవాన్ని ఖాతాలో వేసుకునేదే టీమ్ ఇండియా. కానీ నెల ముందు సూర్య ఎందుకు జట్టులో అనే ప్రశ్నలు తలెత్తడం గమనార్హం. ఏడాదిన్నర ముందు కెప్టెన్ అయ్యాక రెండు మూడు మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడాక, ఫామ్ కోల్పోయిన సూర్య.. ఎంతకీ లయ అందుకోలేకపోయాడు. వరుసగా 26 ఇన్నింగ్స్‌ల పాటు అతను అర్ధశతకమే సాధించలేదు. దీంతో జట్టుకు అతను భారంగా మారుతున్నట్లుగా అనిపించింది. అయితే సూర్య సారథ్యంలో భారత్ వరుస సిరీస్ విజయాలు సాధిస్తుండడం, ప్రపంచకప్ దగ్గర పడుతుండడంతో అతణ్ని సెలక్టర్లు కెప్టెన్‌గా కొనసాగించారు. సరిగ్గా ప్రపంచకప్ ముంగిట అతను ఫామ్ అందుకుని అభిమానుల్లో భరోసా నింపాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో మూడు మెరుపు అర్ధశతకాలు సాధించాడు. ఈ ఫామ్‌ను కొనసాగిస్తూ.. ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో మేటి ఇన్నింగ్స్ ఆడాడు సూర్య. కెరీర్లోనే ఉత్తమ ఇన్నింగ్స్‌ల్లో ఇదొకటనడంలో సందేహం లేదు. వరుసగా వికెట్లు పడుతున్నపుడు.. తన వికెట్‌ను కాచుకుంటూ, పరుగులు సాధించడం తేలికైన విషయం కాదు. చివరి ఓవర్లలో తన షాట్ ఒక్కటి తేడా కొట్టినా భారత ఇన్నింగ్స్ ఇంకెంతో దూరం వెళ్లేది కాదు. తక్కువ స్కోరుకే పరిమితం అయ్యేది. సూర్య స్కూప్ షాట్ల నైపుణ్యం తెలిసిందే కాబట్టి అమెరికా బౌలర్లు అతడికి చిక్కకుండా ఆఫ్ సైడే బంతులు వేయాలని చూశారు. అయినా అతను సర్దుకుని ఫైన్ లెగ్‌లో తన మార్కు షాట్లు కొట్టాడు. అలాగే స్వీప్‌లూ చేశాడు. కొన్నిసార్లు లాంగాన్‌లో కూడా అద్భుత షాట్లు ఆడాడు. ముఖ్యంగా సౌరభ్ వేసిన చివరి ఓవర్లో ముందుకొచ్చి ఫైన్ లెగ్‌లో కొట్టిన సిక్సర్, తర్వాత ఫుల్‌టాస్‌కు లాంగాఫ్‌లో బాదిన సిక్సర్ కళ్లు చెదిరిపోయేలా చేసినవే.


దక్షిణేశ్వర్

దక్షిణేశ్వర్ విజయం

● నెదర్లాండ్స్‌తో భారత్ పోరు 1-1తో సమం

బెంగళూరు: భారత డేవిస్‌కప్ జట్టులో కీలక సభ్యుడిగా ఎదుగుతోన్న దక్షిణేశ్వర్ సురేశ్ సత్తా చాటాడు. శనివారం డేవిస్‌కప్ క్వాలిఫయర్స్ రౌండ్-1లో అతడు డచ్ నంబర్‌వన్ ఆటగాడు జెస్పర్ డి జాంగ్‌ను ఓడించాడు. దీంతో నెదర్లాండ్స్‌తో పోరును 1-1తో భారత్ సమం చేసింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 465వ స్థానంలో ఉన్న దక్షిణేశ్వర్.. రెండో సింగిల్స్ మ్యాచ్‌లో నెగ్గడం ద్వారా భారత్ మరింత వెనకబడకుండా చూశాడు. తొలి సింగిల్స్‌లో సుమిత్ నగాల్ 0-6, 6-4, 3-6తో గై డి ఔడెన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. ఆ తర్వాత దక్షిణేశ్వర్ 6-4, 7-5తో డి జాంగ్‌పై విజయం సాధించాడు. జాంగ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 88వ స్థానంలో ఉన్నాడు.

మెరిసిన హెట్‌మయర్

స్కాట్లాండ్‌పై విండీస్ విజయం


హెట్‌మయర్

కోల్‌కతా: టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్ శుభారంభం చేసింది. హెట్‌మయర్ (64; 36 బంతుల్లో 2×4, 6×6) చెలరేగడంతో శనివారం గ్రూప్-సి మ్యాచ్‌లో ఆ జట్టు 35 పరుగుల తేడాతో స్కాట్లాండ్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన విండీస్, 5 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. బ్రెండన్ కింగ్ (35; 30 బంతుల్లో 4×4, 1×6), షై హోప్ (19) తొలి వికెట్‌కు 54 పరుగులు జోడించారు. ఆ తర్వాత హెట్‌మయర్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ధాటిగా బ్యాటింగ్ చేసిన అతడు.. రోమన్ పావెల్ (24; 14 బంతుల్లో 1×4, 2×6)తో మూడో వికెట్‌కు 81, రూథర్‌ఫోర్డ్ (26; 13 బంతుల్లో 4×4, 1×6) నాలుగో వికెట్‌కు 36 పరుగులు జోడించాడు. స్కాట్లాండ్ బౌలర్లలో బ్రాడ్ కరీ (2/23) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. ఛేదనలో రొమారియో షెఫర్డ్ (5/20), హోల్డర్ (3/30) ధాటికి స్కాట్లాండ్ 18.5 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌటైంది. బెరింగ్టన్ (42; 24 బంతుల్లో 3×4, 2×6), బ్రూస్ (35; 28 బంతుల్లో 1×4, 2×6) రాణించారు. స్కాట్లాండ్ ఓ దశలో 115/3తో మెరుగ్గానే కనిపించింది. కానీ అనూహ్యంగా దెబ్బతింది. షెఫర్డ్ విజృంభించడంతో 32 పరుగులకే చివరి ఏడు వికెట్లు కోల్పోయింది. షెఫర్డ్ 17వ ఓవర్లో హ్యాట్రిక్ సహా నాలుగు వికెట్లు పడగొట్టడం విశేషం.

సంక్షిప్త స్కోర్లు... వెస్టిండీస్ ఇన్నింగ్స్: 182/5 (హెట్‌మయర్ 64, బ్రెండన్ కింగ్ 35, రూథర్‌ఫోర్డ్ 26, పావెల్ 24; బ్రాడ్ కరీ 2/23); స్కాట్లాండ్ ఇన్నింగ్స్: 18.5 ఓవర్లలో ఆలౌట్ 147 (బెరింగ్టన్ 42, బ్రూస్ 35; షెఫర్డ్ 5/20, హోల్డర్ 3/30)

పాక్.. గట్టెక్కింది

నెదర్లాండ్స్‌పై అతి కష్టం మీద విజయం

ఓటమి తప్పించిన ఫహీమ్



ఫహీమ్

కొలంబో: అనిశ్చిత ఆటకు మారు పేరైన పాకిస్థాన్.. టీ20 ప్రపంచ కప్‌ను తనదైన శైలిలోనే ఆరంభించింది. శనివారం టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో పసికూన నెదర్లాండ్స్ చేతిలో ఓటమి ముప్పును ఎదుర్కొన్న పాక్.. చివరికి అతి కష్టం మీద గట్టెక్కింది. 148 పరుగుల లక్ష్యాన్ని ఆ జట్టు 19.3 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. సాహిబ్‌జాదా ఫర్హాన్ (47; 31 బంతుల్లో 4×4, 2×6), సయిమ్ అయూబ్ (24; 13 బంతుల్లో 4×4, 1×6) జట్టుకు అదిరే ఆరంభాన్నిచ్చినప్పటికీ.. మీకెరన్ (2/20), ఆర్యన్ దత్ (2/33), వాండర్‌మెర్వ్ (1/13), కైల్ క్లీన్ (1/23)ల ధాటికి తడబడిన పాక్ ఒక దశలో 114/7కు చేరుకుంది. అయితే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఫహీమ్ అష్రాఫ్ (29 నాటౌట్; 11 బంతుల్లో 2×4, 3×6) ఆఖర్లో అనూహ్యంగా చెలరేగి తన జట్టును గెలిపించాడు. మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్స్.. 19.5 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌటైంది. సల్మాన్ మీర్జా (3/24), అబ్రార్ అహ్మద్ (2/23), సయిమ్ అయూబ్ (2/7), మహ్మద్ నవాజ్ (2/38) ఆ జట్టును దెబ్బ తీశారు. కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (37; 29 బంతుల్లో 3×4, 1×6) టాప్‌స్కోరర్.

అలా మొదలై..: పాకిస్థాన్ ఛేదనను ఆరంభించిన తీరు చూస్తే.. విజయం కోసం అంత శ్రమిస్తుందని ఎవ్వరూ ఊహించి ఉండరు. ఇన్నింగ్స్‌కు మెరుపు ఆరంభాన్నిచ్చిన అయూబ్, త్వరగా ఔటైనా.. మరో ఓపెనర్ ఫర్హాన్ నిలకడగా ఆడడంతో పాక్ లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. కెప్టెన్ సల్మాన్ ఆఘా (12) కూడా ఎక్కువసేపు నిలవకపోయినా.. బాబర్ ఆజామ్ (15)తో కలిసి ఫర్హాన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. 11 ఓవర్లకు 98/2తో పాక్ పటిష్ఠ స్థితిలో నిలిచింది. 8 వికెట్లు చేతిలో ఉండగా.. ఆ జట్టు 9 ఓవర్లలో 50 పరుగులే చేయాల్సి వచ్చింది. ఈ స్థితిలో 12 ఓవర్లో మీకెరన్ అద్భుతమే చేశాడు. ఫర్హాన్‌తో పాటు ఉస్మాన్ (0)ను ఔట్ చేయడమే కాక మెయిడెన్ వేశాడు. తర్వాతి ఓవర్లో వాండర్‌మెర్వ్.. బాబర్ (15)ను పెవిలియన్ చేర్చాడు. నవాజ్ (6), షాదాబ్ (8) సైతం ఎంతోసేపు నిలవకపోవడంతో పాక్ తీవ్ర ఇబ్బందుల్లో పడింది. 2 ఓవర్లలో 29 పరుగులు చేయాల్సి రావడంతో పాక్‌కు కష్టమే అనిపించింది. కానీ 19వ ఓవర్లో వాన్‌బీక్ పూర్తిగా లయతప్పాడు. ఫహీమ్ అతడి బౌలింగ్‌లో మూడు సిక్సర్లు, ఒక ఫోర్ బాదేశాడు. ఈ ఓవర్లో మొత్తం 24 పరుగులు వచ్చాయి. చివరి ఓవర్లో మూడో బంతికి ఫోర్ కొట్టిన ఫహీమ్ మ్యాచ్‌ను ముగించాడు. షహీన్ అఫ్రిది (5 నాటౌట్) అతడికి అండగా నిలిచాడు.

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: లెవిట్ (సి) షహీన్ (బి) నవాజ్ 24; ఒడౌడ్ (సి) ఉస్మాన్ (బి) సల్మాన్ 5; డిలీడ్ (సి) బాబర్ (బి) నవాజ్ 30; ఆకర్‌మ్యాన్ (బి) అబ్రార్ 20; ఎడ్వర్డ్స్ (సి) ఫర్హాన్ (బి) అబ్రార్ 37; క్యాచెట్ (సి) నవాజ్ (బి) అయూబ్ 9; వాన్‌బీక్ (సి) ఆఘా (బి) అయూబ్ 0; ఆర్యన్ (సి) ఫర్హాన్ (బి) సల్మాన్ 13; వాండర్‌మెర్వ్ (సి) ఆఘా (బి) షహీన్ 4; క్లీన్ నాటౌట్ 2; మీకెరన్ (సి) ఉస్మాన్ (బి) సల్మాన్ 0; ఎక్స్‌ట్రాలు 3 **మొత్తం:** (19.5 ఓవర్లలో ఆలౌట్) **147; వికెట్ల పతనం:** 1-28, 2-31, 3-65, 4-105, 5-127, 6-128, 7-129, 8-139, 9-147; **బౌలింగ్:** షహీన్ అఫ్రిది 3-0-28-1; సల్మాన్ మీర్జా 3.5-0-24-3; మహ్మద్ నవాజ్ 4-0-38-2; షాదాబ్ ఖాన్ 4-0-26-0; అబ్రార్ 4-0-23-2; సయిమ్ అయూబ్ 1-0-7-2

పాకిస్థాన్ ఇన్నింగ్స్: ఫర్హాన్ (సి) వాండర్‌మెర్వ్ (బి) మీకెరన్ 47; అయూబ్ (సి) వాండర్‌మెర్వ్ (బి) ఆర్యన్ 24; ఆఘా (సి) లెవిట్ (బి) ఆర్యన్ 12; బాబర్ (సి) క్లీన్ (బి) వాండర్‌మెర్వ్ 15; ఉస్మాన్ (బి) మీకెరన్ 0; షాదాబ్ (సి) ఎడ్వర్డ్స్ (బి) వాన్‌బీక్ 8; నవాజ్ (సి) ఎడ్వర్డ్స్ (బి) క్లీన్ 6; ఫహీమ్ నాటౌట్ 29; షహీన్ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 2 **మొత్తం:** (19.3 ఓవర్లలో 7 వికెట్లకు) **148; వికెట్ల పతనం:** 1-27, 2-53, 3-98, 4-98, 5-100, 6-114, 7-114; **బౌలింగ్:** ఆర్యన్ దత్ 4-0-33-2; వాన్‌బీక్ 4-0-46-1; కైల్ క్లీన్ 3-0-23-1; వాండర్‌మెర్వ్ 3-0-13-1; మీకెరన్ 4-1-20-2; డిలీడ్ 1.3-0-13-0


ఆరిఫ్ మహ్మద్


పోటీలో ఓ అథ్లెట్ విన్యాసం

వింటర్ ఒలింపిక్స్ షురూ

మిలన్: వింటర్ ఒలింపిక్స్ ఇటలీలోని మిలన్‌లో ఘనంగా మొదలయ్యాయి. ఇటలీలోనే అతి పెద్ద స్టేడియమైన సా సిరోలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. పరేడ్‌లో ఆరిఫ్ మహ్మద్ ఖాన్ మువ్వన్నెల పతాకాన్ని చేబూని భారత బృందానికి నాయకత్వం వహించాడు. అతడు కాకుండా భారత్ నుంచి స్టాంజిన్ లండప్ మాత్రమే ఈ క్రీడల్లో పోటీపడుతున్నాడు. అల్పైన్ స్కీయింగ్‌లో ఆరిఫ్, క్రాస్ కంట్రీ స్కీయింగ్ స్టాంజిన్ అర్హత సాధించారు. మిలన్‌తో పాటు కోర్టినా డంపెజో ఈ పోటీలకు ఆతిథ్యమిస్తోంది. శీతాకాల ఒలింపిక్స్ (మిలానో కోర్టినా 2026)లో కొన్ని ఆటలు రెండు రోజుల ముందే ఆరంభమయ్యాయి. మొత్తం 16 క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి.


ఆరంభ వేడుకల్లో..

రైఫిల్ విజేత ఇలవేనిల్


ఇలవేనిల్

దిల్లీ: ఆసియా ఛాంపియన్‌షిప్ పది మీటర్ల ఎయిర్ రైఫిల్ పోటీల్లో భారత షూటర్ ఇలవేనిల్ స్వర్ణం సాధించింది. ఆమె 252.0 స్కోరుతో అగ్ర స్థానం దక్కించుకుంది. మిసాకి నొబాతా (251.5, జపాన్) గట్టి పోటీ ఇచ్చినప్పటికీ.. రెండో స్థానానికే పరిమితమైంది. మరో భారత షూటర్ మేఘన సజ్జనార్ (229.5) కాంస్యంతో సరిపెట్టుకుంది. ఇలవేనిల్, ఆర్య బోర్సే, మేఘన త్రయం.. టీమ్ పోటీల్లోనూ సత్తాచాటింది. 1892.6 స్కోరుతో మొదటి స్థానంలో నిలిచి స్వర్ణం గెలిచింది.

ఆర్సీబీ కోసం మాంచెస్టర్ యునైటెడ్..

బెంగళూరు: ప్రీమియర్ లీగ్ దిగ్గజం మాంచెస్టర్ యునైటెడ్ ఐపీఎల్‌లో అడుగుపెట్టనుందా? ఆ క్లబ్ సహ యజమాని అవ్రామ్ గ్లేజర్ ఆర్సీబీని కొనడానికి ఆసక్తి చూపిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ ఫ్రాంఛైజీ కోసం గ్లేజర్ రూ.16,300 కోట్లు చెల్లించడానికి సిద్ధమయ్యాడట. ఆర్సీబీ ప్రస్తుత యజమాని డియాగో.. నవంబరు నుంచే ఫ్రాంఛైజీని అమ్మడానికి ప్రయత్నిస్తున్నట్లు భావిస్తున్నారు. తొమ్మిది మంది బిడ్డర్లు ఆసక్తి చూపిపస్తున్నట్లు తెలుస్తోంది.

పాక్ పునరాలోచన!

కరాచి: భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించడంపై పునరాలోచించాలంటూ శ్రీలంక చేసిన విజ్ఞప్తిపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తమ ప్రభుత్వాన్ని మరోసారి సంప్రదించనుంది. పాకిస్థాన్ తన మ్యాచ్‌లన్నింటినీ శ్రీలంకలో ఆడనున్న సంగతి తెలిసిందే. అయితే భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించడం వల్ల తాము ఆర్థికంగా నష్టపోతామన్న శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్ఎల్‌సీ).. నిర్ణయంపై పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేస్తూ పీసీబీకి లేఖ రాసింది. గతంలో పాకిస్థాన్‌కు తాము అండగా నిలిచిన విషయాన్ని గుర్తు చేసింది. లేఖ విషయాన్ని తాము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పీసీబీ ఛైర్మన్ నఖ్వీ.. ఎస్ఎల్‌సీకి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

బెంగాల్ 199/5

కల్యాణి: ఆంధ్ర, బెంగాల్ మధ్య రంజీ క్వార్టర్‌ఫైనల్ నువ్వానేనా అన్నట్టుగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో 295 పరుగులకు ఆలౌటైన ఆంధ్ర.. బెంగాల్‌ను కట్టడి చేసింది. శనివారం రెండో రోజు ఆట చివరికి బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 199/5తో నిలిచింది. 43 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడ్డ జట్టును ఘరామీ (112 బ్యాటింగ్) సెంచరీతో ఆదుకున్నాడు. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్ రెండు వికెట్లతో ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టాడు. ఉదయం 264/6తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర.. 31 పరుగులకే మిగతా 4 వికెట్లు కోల్పోయింది.

aha@eenadu.in

ఆహా! .. ఏమి రుచి

పళ్లెంలో.. తుమ్మ జిగురు!

బ్యాచిలర్స్ కిచెన్

దోసకాయ పప్పు, టొమాటో పప్పు బాగుంటాయి గానీ బెండకాయ పప్పు ఎవరైనా చేస్తారా? కానీ.. నేనదే చేశా. వంట నేర్చుకోమని అమ్మ ఎన్నిసార్లు బతిమాలినా.. రేపు, ఎల్లుండి అంటూ తప్పించుకునేవాణ్ణి. డిగ్రీ వరకూ వంటిల్లంటే అదో కెమిస్ట్రీల్యాబ్‌లా అనిపించేది. వంటావార్పుతో నాకేం సంబంధం అనుకునేవాణ్ణి. చదువయ్యాక వేరే ఊళ్లో ఓ చిరుద్యోగం వచ్చింది. మొదటి నెల హాస్టల్లో గడిచింది. వారానికోరోజు చికెన్. మిగిలిన రోజుల్లో నీళ్లచారు, రుచీపచీ లేని కూరలతో విరక్తి కలిగింది. ఇక లాభం లేదని ఇంకో నలుగురితో కలిసి.. గది అద్దెకు తీసుకున్నా. రోజుకొకరు వంట చేయాలన్నది నిబంధన. కానీ వాళ్ల వంట హాస్టల్ కంటే వికారంగా ఉండటంతో తక్కిన పనులు వాళ్లను చేయమని, వంట బాధ్యత నేనే తీసుకున్నా. ఓ రోజు బెండకాయలూ, పెసరపప్పు తప్ప మరేం లేవు. తోటకూరపప్పు చేయగా లేనిది.. ఇదెందుకు చేయకూడదని.. పప్పులో బెండకాయ ముక్కలేసి ఉడికించా. అదేం చిత్రమో.. గరిటె పెడితే తుమ్మ జిగురులా అతుక్కుంటోంది. కొంచెం వంటసోడా జోడిస్తే దారికొస్తుందనుకున్నా. లాభం లేకపోయింది. సర్లే.. తాలింపు తర్వాత భేషుగ్గా ఉంటుందిలెమ్మనుకున్నా. తీరా పళ్లెంలో వేసుకుంటే గమ్ బాటిల్ వంపినట్లు.. జిగురు జిగురుగా సాగుతూనే ఉంది. అంతలో సూరి వచ్చాడు. ఆకలిమీద ఉన్నాడేమో.. రూపూ, రుచీ పట్టించుకోకుండా ఆత్రుతగా తిన్నాడు. అరగంటయ్యిందో లేదో.. 'కూరలో ఏం వేశావురా బాబూ?' అనరిచాడు. అతడిక బాత్రూమ్ జానా, బెడ్‌పై సోనా. ఎప్పట్లాగే అమ్మ గుర్తొచ్చింది. అమ్మలు అమృతభాండాన్ని తమతో తెచ్చుకుంటారు కాబోలు.. ఏం చేసినా అద్భుతం గానే ఉంటుందనుకున్నా. ఆ తర్వాతెన్నడూ బెండకాయ జోలికి పోలేదులెండి.



– ఎన్. ప్రేమ్ కుమార్, హైదరాబాద్

ఎర్రెర్రని టొమాటో.. ఎన్నెన్ని రుచులో!

ఇంట్లో టొమాటోలుంటే చాలు.. పప్పు, రసం, కూర, పచ్చడి, షోర్బా.. ఇలా ఎన్నెన్నో చేయొచ్చు. ఇవి క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బఠాణీలు, బంగాళదుంపలు.. వేటితోనైనా జతకట్టేస్తాయి. ప్రస్తుతం విస్తారంగా దొరుకుతున్న టొమాటోలతో పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టపడే జామ్, సాస్ వంటివి చేసి చూడండి.



జామ్

కావలసినవి: టొమాటోలు - కిలో, పంచదార - ముప్పావు కిలో, ఉప్పు, చిటికెడు, నిమ్మరసం - 2 టేబుల్ స్పూన్లు, దాల్చినచెక్క ముక్క - రెండంగుళాల ముక్క, లవంగాలు - 6

తయారీ: కడిగిన టొమాటోలకు తొడిమ దగ్గర ఇంటూ గుర్తులో గాటు పెట్టాలి. నీళ్లను మరిగించి, వాటిలో టొమాటోలు వేసి పది నిమిషాలు ఉడికించకుండా ఉంచాలి. తొక్క తీసేయడం తేలికవుతుంది. వాటిని గ్రైండ్ చేసి.. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో సన్న సెగ మీద పావుగంట ఉడికించాలి. అడుగంటకుండా మధ్యమధ్యలో కలియబెడుతుండాలి. అందులో దాల్చినచెక్క, లవంగాలను పొడిచేసి వేయాలి. పంచదార కూడా జతచేసి చిక్కబడే వరకూ ఉడికించాలి. మరీ గట్టిపడకుండా, కాస్త జారుగానే ఉండాలి. చివర్లో నిమ్మరసం, ఉప్పు జోడించి దించేయాలి. పూర్తిగా చల్లారాక.. తడి లేని సీసాలోకి తీసి.. రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకోవాలి. ఇక బ్రెడ్ టోస్ట్, ఫ్రెంచ్ ఫ్రైస్ వంటివి ఈ జామ్‌తో తినేయొచ్చు.



సూప్

కావలసినవి: సన్నగా తరిగిన టొమాటో ముక్కలు - రెండు కప్పులు, ఉప్పు - రుచికి తగినంత, వెన్న - ఐదు స్పూన్లు, బిర్యానీ ఆకు - ఒకటి, ఉల్లి తరుగు - అర కప్పు, మొక్కజొన్న పిండి, పంచదార, క్రీమ్ - టేబుల్ స్పూన్ చొప్పున, నీళ్లు - రెండున్నర కప్పులు, అల్లం ముద్ద, మిరియాలపొడి - స్పూన్ చొప్పున, కచ్చాపచ్చా దంచిన వెల్లుల్లి - అర స్పూన్.

తయారీ: ప్యాన్‌లో సగం వెన్న వేడిచేసి బిర్యానీ ఆకును వేయించాలి. కాస్త వేగాక.. ఉల్లి తరుగు చేర్చాలి. అది లేత గోధుమ రంగులోకి మారాక.. అల్లం ముద్ద, వెల్లుల్లి, టొమాటో ముక్కలు, ఉప్పు వేసి.. మూత పెట్టాలి. ముక్కలు చక్కగా ఉడికాయనుకున్నాక దించేయాలి. చల్లారిన తర్వాత మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని వడకట్టి మళ్లీ ప్యాన్‌లోకి తీసి.. రెండు కప్పుల నీళ్లు పోసి ఉడికించాలి. మొక్కజొన్న పిండిలో కొన్ని నీళ్లు పోసి ఉండలు కట్టకుండా కలిపి సూప్‌లో చేర్చాలి. మిరియాల పొడి, పంచదార జతచేసి ఇంకాస్త మరిగించాలి. చివర్లో మిగిలిన వెన్న, క్రీమ్ వేసి సెగ తీసేయాలి. ఇక.. హోటల్ స్టైల్ టొమాటో సూప్‌ను ఆస్వాదించడమే తరువాయి.




సాస్

కావలసినవి: టొమాటోలు - రెండున్నర కిలోలు, కిస్‌మిస్, వెనిగర్ - అర కప్పు చొప్పున, ఉప్పు - టేబుల్ స్పూన్, వెల్లుల్లి రెబ్బలు - 15, అల్లం - 3 అంగుళాల ముక్క, ఎండుమిరపకాయలు - 7, పంచదార - 6 టేబుల్ స్పూన్లు, సోడియం బెంజోయేట్ - పావు స్పూన్

తయారీ: అల్లం, వెల్లుల్లి పొట్టు తీసేసి సన్నగా తరగాలి. టొమాటోలు కడిగి తొడిమ దగ్గర గట్టి భాగాన్ని తీసేసి.. ముక్కలుగా కోయాలి. వీటికి అల్లం, వెల్లుల్లి, కిస్‌మిస్, వెనిగర్, ఉప్పు, ఎండుమిరపకాయలు జతచేసి ఉడికించాలి. మధ్యమధ్యలో అడుగంటకుండా కలుపుతుండాలి. ముక్కలు మెత్తగా అయ్యాక సెగ తీసేయాలి. ఇందుకు సుమారు అరగంట పడుతుంది. చల్లారాక గ్రైండ్ చేసి.. స్ట్రెయినర్ సాయంతో వడకట్టాలి. ఈ మిశ్రమాన్ని ప్యాన్‌లోకి తీసి.. సన్న సెగ మీద మరో అరగంట ఉడికించాలి. సోడియం బెంజోయేట్‌ను ఒక టేబుల్ స్పూన్ వేడినీళ్లలో వేసి కరిగించాలి. దీన్ని సాస్‌లో చేర్చి, కలియబెట్టి దించేయాలి. చల్లారాక తడి లేని సీసాలోకి తీసి.. రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకోవాలి.

ఘుమఘుమలాడే మెంతి పులుసు

పాఠక వంట



ఇది చింతకాయల సీజన్. వీటితో చారు, పప్పు, రోటి పచ్చడి, ఊరగాయ చేయొచ్చు. అల్లం, బెల్లం, ఉలవచారు జోడించి ప్రత్యేక రకాలూ చేసుకోవచ్చు. ఇక చింతకాయలతో మెంతి పులుసు గనుక చేశారంటే.. మళ్లీ మళ్లీ కావాలంటారు..

ఇందుకోసం.. చింతకాయలు - 100 గ్రా, ఎండు కొబ్బరి, శనగపిండి- 2 స్పూన్ల చొప్పున, పచ్చి మిర్చి- నాలుగు, పసుపు- అర స్పూన్, కొత్తిమీర తరుగు- గుప్పెడు, ఉప్పు- తగినంత, నూనె - 3 స్పూన్లు, ఎండుమిర్చి- ఒకటి, కరివేపాకు- రెండు రెబ్బలు, అల్లం ముద్ద- ఒకటిన్నర స్పూన్లు, ఇంగువ- చిటికెడు, మెంతులు, ఆవాలు, శనగ, మినప్పప్పులు, జీలకర్ర- స్పూన్ చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. మెంతులను వేయించి పొడి చేయాలి. చింతకాయలు కడిగి కచ్చాపచ్చా దంచాలి. అందులో నీళ్లు, ఉప్పు, పసుపు చేర్చి ఉడికించాలి. చల్లారాక వడకట్టి పిప్పి తీసేయాలి. ఆ చింతపండు గుజ్జులో రెండు గ్లాసుల నీళ్లు, పచ్చిమిర్చి, అల్లం, శనగపిండి, మెంతుల పొడి జతచేసి.. కలియతిప్పుతూ ఉడికించాలి. చివర్లో కొబ్బరి తురుము, కొత్తిమీర జోడించి, ఒక నిమిషం ఉంచి దించేయాలి. ప్యాన్‌లో నూనె వేడిచేసి.. ముందుగా ఆవాలు వేయాలి. అవి చిటపటలాడుతున్నప్పుడు.. శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ ఒక దాని తర్వాత ఒకటి వేయాలి. ఈ తాలింపును చింతకాయల మెంతి పులుసులో కలపాలి. మూతపెట్టి కొంతసేపు అలాగే ఉంచితే మరింత రుచి, ఘుమాయింపు వస్తాయి.



– పొత్తూరి మాధురి అన్నపూర్ణ, హైదరాబాద్

వహ్వారే చికెన్ తహారీ

షెఫ్ స్పెషల్



కొన్ని రెసిపీలు ఇంట్లో అంతగా కుదరవు అనుకుంటారు కొందరు. అలాంటి వాటిలో 'చికెన్ తహారీ' ఒకటి. దీన్ని ఈ కొలతల ప్రకారం ఇలా చేశారనుకోండి.. ఇంటిల్లిపాదికీ నచ్చేస్తుందంటే నమ్మండి!

కావలసినవి: చికెన్ - అర కిలో, బాస్మతి బియ్యం - 2 కప్పులు, ఉల్లి తరుగు - కప్పు, ఉప్పు - తగినంత, పచ్చిమిర్చి - 4, నెయ్యి, అల్లం-వెల్లుల్లి పేస్ట్ - 2 టేబుల్ స్పూన్ల చొప్పున, నూనె - 3 టేబుల్ స్పూన్లు, బిర్యానీ ఆకులు - 2, లవంగాలు - 4, యాలకులు - 3, దాల్చినచెక్క - అంగుళం ముక్క, జీలకర్ర, కారం, గరం మసాలా - స్పూన్ చొప్పున, షాజీరా - అర స్పూన్, ధనియాల పొడి, నిమ్మరసం - 2 స్పూన్ల చొప్పున, టొమాటో ముక్కలు, పుదీనా, కొత్తిమీర, పెరుగు - అర కప్పు చొప్పున

తయారీ: బియ్యం కడిగి, అరగంట నానబెట్టాలి. కుక్కర్‌లో నూనె వేడి చేసి.. బిర్యానీ ఆకులు, దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు, జీలకర్ర, షాజీరాలను వేయించాలి. మంచి వాసన వస్తుండగా.. ఉల్లితరుగు వేసి లేత గోధుమ రంగులోకి మారే వరకూ వేయించాలి. అందులో అల్లం-వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి, పుదీనా, టొమాటో ముక్కలు, చికెన్ జోడించాలి. కొద్దిసేపు వేయించి.. ధనియాల పొడి, గరం మసాలా, కారం, ఉప్పు, పెరుగు జతచేసి.. ఆరేడు నిమిషాలు ఉడికించాలి. ఇప్పుడు నానబెట్టిన బియ్యం, 4 కప్పులు వేడి నీళ్లు, కొత్తిమీర జోడించి.. మూత పెట్టి ఒక విజిల్ వచ్చాక సెగ తీసేయాలి. ఆవిరి పోయి.. మూత తీశాక.. నెయ్యి, నిమ్మరసం వేసి కలపాలి. అంతే.. అదిరిపోయే రుచితో 'చికెన్ తహారీ' సిద్ధమవుతుంది.

మిల్క్ క్యాండీ.. ఇంట్లోనే!

చిన్నారులు క్యాండీలు ఇష్టంగా తింటుంటారు కదా! వాళ్ల కోసం మిల్క్ క్యాండీ ఇంట్లోనే సులభంగా చేసేయొచ్చు.

కావలసినవి: పాలు - రెండు కప్పులు, పంచదార - కప్పు, పంచదార పొడి - అర స్పూన్, వెన్న - టేబుల్ స్పూన్, వెనీలా ఎసెన్స్ - కొద్దిగా, మిల్క్ పౌడర్ - అర కప్పు, నెయ్యి - గ్రీజ్ చేయడానికి

తయారీ: అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో పాలు పోసి సన్న సెగ మీద మరిగించాలి. అందులో పంచదార వేసి కలియబెడుతుండాలి. చిక్కగా అయ్యాక.. పాల పొడి జతచేసి ఉండలు కట్టకుండా కలపాలి.



కొంచెం శ్రమే అయినా.. కలియతిప్పుతూనే ఉండాలి, లేదంటే అడుగంటుతుంది. మరింత చిక్కబడి, పాత్రకు అంటుకోకుండా విడిపోతున్నప్పుడు.. వెన్న, వెనీలా ఎసెన్స్ జోడించి.. కొన్ని క్షణాలు కలిపి, సెగ తీసేయాలి. మరీ గట్టిపడినట్లు అనిపిస్తే.. కొంచెం పాలు చేర్చి సర్దుబాటు చేయొచ్చు. పళ్లెంలో నెయ్యి రాసి.. ఈ మిశ్రమాన్ని సమంగా సర్దాలి. పూర్తిగా చల్లారిన తర్వాత నచ్చిన ఆకృతుల్లో ముక్కలుగా కట్ చేసుకోవాలి. వాటిమీద పంచదార పొడి చల్లితే.. ఒకదానికొకటి అంటుకోవు. వీటిని తడి లేని, గాలి చొరబడని సీసాలోకి తీయాలి. రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి.

యర్రబాలెం ఆర్మీ జవానుకు గ్యాలంటరీ పురస్కారం



లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్‌సేథ్ నుంచి గ్యాలంటరీ అవార్డు అందుకుంటున్న పుల్లయ్య

కంభం, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా కంభం మండలం యర్రబాలెం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ డర్రె పుల్లయ్య ప్రతిష్ఠాత్మక గ్యాలంటరీ (సేన మెడల్) అవార్డు అందుకున్నారు. అహ్మదాబాద్‌లో శనివారం నిర్వహించిన వేడుకలో సదరన్ కమాండ్ అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ చేతుల మీదుగా ఈ మెడల్ తీసుకున్నారు. 2024 మార్చి 17న జమ్మూకశ్మీర్‌లోని అత్యంత శీతల ప్రాంతమైన గ్లేషియర్‌లో విధులు నిర్వహిస్తుండగా ఇద్దరు జవాన్లు సుమారు 200 అడుగుల లోతున ఉన్న మంచు లోయలో పడిపోయారు. కమాండో ఇన్‌స్ట్రక్టర్ శిక్షణలో నిపుణుడైన పుల్లయ్య అందులోకి దిగి మంచులో కూరుకుపోయిన ఇద్దరినీ బయటకు తీసుకొచ్చి ప్రాణాలు కాపాడారు. ఈ సాహసాన్ని గుర్తించి గ్యాలంటరీ అవార్డు ఇచ్చారు. పుల్లయ్య 2016లో ఆర్మీలో చేరారు. ఆయనకు పురస్కారం రావడంతో తల్లిదండ్రులు సింగరయ్య, నాగేశ్వరమ్మ, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణ.. 13 మందిపై క్రిమినల్ కేసులు

- వైఎస్సార్ కడప జిల్లా అధికారుల చర్యలు

ఈనాడు, కడప: వైఎస్సార్ కడప జిల్లా బద్వేలు నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల ఆక్రమణకు సంబంధించి 13 మందిపై జిల్లా అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. నియోజకవర్గంలోని కాశినాయన మండలం మూలపల్లి రెవెన్యూ గ్రామం సర్వే నంబరు-1లో ప్రభుత్వ భూములను ఆక్రమించినట్లు జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ దృష్టికి వచ్చింది. దీంతో క్షేత్ర పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్‌ను ఆదేశించారు. అక్కడికి వెళ్లిన ఆర్డీవో చదును చేస్తున్న నాలుగు భారీ వాహనాలను స్వాధీనం చేసుకుని ఆక్రమణదారులను గుర్తించారు. గంగనపల్లి, గుంటువారిపల్లి, నరసాపురం గ్రామాలకు చెందిన పలువురు ప్రభుత్వ భూములను ఆక్రమించి చదును చేస్తున్నట్లు నిర్ధారించారు. రెవెన్యూశాఖ సర్వేల్లో మొత్తం 139.31 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగినట్లు తేల్చారు. 13 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వారిలో అధిక సంఖ్యలో వైకాపా వారే ఉన్నారు. వీరితో పాటు ఇంకా పలువురి హస్తం ఉన్నట్లు కాశినాయన తహసీల్దార్ వెంకటసుబ్బయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న నిందితులు పరారయ్యారు. వీరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రభుత్వ భూమిలో ఏళ్లుగా ఉన్నా ఆక్రమణదారులే

- భూసేకరణ చట్ట ప్రకారం వారు పరిహారానికి అనర్హులు
- విజయవాడ ఆర్వోబీ నిర్వాసితుల వ్యాజ్యాలు కొట్టేసిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: భూసేకరణ చట్టం-2013 ఆక్రమణదారుల ప్రయోజనాల కోసం తెచ్చింది కాదని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వ భూమి దశాబ్దాలుగా స్వాధీనం/అనుభవంలో ఉన్నప్పటికీ దానిని ఆక్రమించిన వారు ఆక్రమణదారులే అవుతారని, చట్టబద్ధమైన యాజమాన్య హక్కులున్న వారితో సమానంగా పరిహారం కోరజాలరని తేల్చిచెప్పింది. ప్రభుత్వ భూమిని ఆక్రమించడం చట్టవిరుద్ధమని, ఆక్రమించిన వారు భూయజమాని నిర్వచనం పరిధిలోకి రారని పేర్కొంది. విజయవాడలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణం కోసం తమ భూములు తీసుకున్నందుకు పరిహారం చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ పలువురు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టేసింది. కోర్టు ధిక్కరణ వ్యాజ్యాలను కూడా తోసిపుచ్చింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

పన్నులు కడుతున్నట్లు డాక్యుమెంట్లున్నాయ్

తమ స్వాధీనంలోని భూములను ఆర్వోబీ కోసం తీసుకున్నారని, భూసేకరణ చట్టం-2013 ప్రకారం పరిహారం చెల్లించేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ విజయవాడలోని గుణదలకు చెందిన వెంకటాద్రి, మరికొందరు 2020-2022 మధ్య కాలంలో హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. ఆ భూములు తమకు వారసత్వంగా వచ్చాయని కొందరు, తామే కొన్నామని మరికొందరు పేర్కొన్నారు. మున్సిపల్ నల్లా కనెక్షన్ ఉందని, విద్యుత్ బిల్లు, ఆస్తి పన్ను చెల్లిస్తున్నామన్నారు. ఆ స్థలాల్లో దుకాణాలు నిర్వహిస్తున్నామని, పరిహారం చెల్లించకుండా ఖాళీ చేయిస్తే జీవనోపాధి దెబ్బతింటుందని పేర్కొన్నారు. దీనిపై రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. 'పిటిషనర్లు ప్రభుత్వ పోరంబోకు భూమిని ఆక్రమించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం అక్కడ కాలువ, శ్మశానవాటిక ఉన్నాయి. పన్నులు చెల్లించినంత మాత్రాన వారికి హక్కులు దాఖలు పడవు. వారు భూయజమానులు అనేందుకు వారివద్ద ఎలాంటి దస్త్రాలూ లేవు. అయినా, మానవీయ కోణంలో వారికి 114 ఇళ్లు కేటాయించామ'ని పేర్కొన్నారు. పరిహారం పొందేందుకు పిటిషనర్లు అనర్హులన్నారు.

ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్.. 'భూయజమానులు, ప్రభావిత కుటుంబాలకు సముచిత పరిహారం అందించడానికి శాసనకర్తలు భూసేకరణ చట్టం-2013ని తీసుకొచ్చారు. భూమి కోల్పోయిన వారు నిరాశ్రయులుగా మిగిలిపోకుండా వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచాలన్నది చట్టం ఉద్దేశం. ఈ కేసులో ఆక్రమణదారులు పరిహారానికి అనర్హులు. చట్టబద్ధ యజమానులు మాత్రమే ఆ చట్ట ప్రయోజనాలకు అర్హులు. ఈ అంశాల దృష్ట్యా కోర్టు ధిక్కరణ కేసుతో పాటు వ్యాజ్యాలను కొట్టేస్తున్నామ'ని ప్రకటించారు.

యువత ఆకాంక్షలు నెరవేర్చడమే బడ్జెట్ లక్ష్యం

- పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు

ఈనాడు, రాజమహేంద్రవరం: ప్రధాని మోదీ అధికారం చేపట్టాక ఏటా 7% వృద్ధిరేటులో దూసుకెళ్తూ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశం ఎదిగిందని, వచ్చే పాతికేళ్ల అవసరాలను గుర్తించి యువత ఆకాంక్షలే లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు చేశారని పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. రాజమహేంద్రవరంలో భాజపా జిల్లా అధ్యక్షుడు పి.నాగేంద్ర అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో కేంద్ర బడ్జెట్‌పై ఆయన మాట్లాడారు. రేర్ ఎర్త్ మ్యాగ్నటిక్ కారిడార్‌తో రాష్ట్రానికి మేలు చేకూరుతుందని.. సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్ పరికరాల తయారీకి ఉపకరించే మినరల్స్ శ్రీకాకుళం, విజయనగరం తీరాల్లో ఉన్నాయన్నారు. కోనసీమలో తాము రైలు కూత వినిపిస్తామన్నారు. దేశంలో 2014 వరకు 74 విమానాశ్రయాలుంటే.. గత 12 ఏళ్లలో 164 నిర్మించామన్నారు. 2047 నాటికి 350 ఏర్పాటుచేయాలన్నది లక్ష్యమన్నారు. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో టెర్మినల్ అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి.. మార్చి 31లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాజమహేంద్రవరం అర్బన్, గ్రామీణం, అనపర్తి ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రుడా ఛైర్మన్ బి.వెంకటరమణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌నాయుడు, చిత్రంలో గోరంట్ల బుచ్చయ్య చౌదరి, సోము వీర్రాజు, ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు

89 మంది విద్యార్థులకు అస్వస్థత

దేవరపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఘటన

మారేడుమిల్లి, రంపచోడవరం, న్యూస్‌టుడే: పోలవరం జిల్లా మారేడుమిల్లి మండలం దేవరపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం 89 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇక్కడ ఆరు నుంచి పదో తరగతి వరకు 277 మంది బాలురు చదువుతున్నారు. శనివారం ఉదయం వీరంతా శెనగ పిండి చట్నీతో ఇడ్లీలు తిన్నారు. 10 గంటల తర్వాత కడుపునొప్పి, వాంతులతో సతమతమవడంతో 18 మందిని మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, మరో 71 మందిని రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థులు కోలుకుంటున్నారని, ప్రమాదం ఏమీ లేదని వైద్యులు తెలిపారు. ఇడ్లీలు నాణ్యంగా లేకపోవడమే దీనికి కారణమని విద్యార్థులు వాపోయారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులను వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆదేశించారు.



రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

ఈ మహిళా కూలీ.. పంచాయతీ సర్పంచి



భవన నిర్మాణంలో కూలీగా ఇటుకలు మోస్తున్న ఈ మహిళ ఓ పంచాయతీ సర్పంచి. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయతీ నూతన భవన నిర్మాణానికి ఆమె కూలి పనులకు వెళ్తున్నారు. అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం మండలంలో కొత్త లక్ష్మీపురం 2021లో పంచాయతీగా ఆవిర్భవించగా గెడ్డం అచ్చియ్యమ్మ సర్పంచిగా గెలుపొందారు. ఆమెకు రెండెకరాల పొలం ఉండగా ఆ పనులన్నీ అచ్చియ్యమ్మే చూసుకుంటున్నారు. కుటుంబ పోషణ కోసం ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న ఆమె గ్రామంలో ఉపాధి పనులకు వెళ్తుంటారు. అయితే పంచాయతీ భవన నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కొన్ని నెలల క్రితం రూ.32 లక్షలు మంజూరు చేసింది. భవన నిర్మాణాన్ని ఉపాధి హామీ పథకానికి అనుసంధానించడంతో పిల్లర్లకు గుంతలు తవ్వడం, మట్టితో కప్పడం తదితర పనులకు ఈ నిధులే ఖర్చు చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా సర్పంచి అచ్చియ్యమ్మ 58 రోజులపాటు ఈ పనులకు హాజరయ్యారు. భవన నిర్మాణ పనులు ఆమె భర్త పర్యవేక్షిస్తుండగా, అచ్చియ్యమ్మ ఇటుకలు మోస్తూ శనివారం కనిపించారు. సర్పంచిగా గ్రామాభివృద్ధికి సైతం కృషి చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, నర్సీపట్నం గ్రామీణం

ఏఐ హబ్‌గా విశాఖ.. క్వాంటమ్ హబ్‌గా అమరావతి

- కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి జితేంద్రసింగ్



విజయవాడలో కేంద్ర బడ్జెట్‌పై మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జితేంద్రసింగ్. వేదికపై పీవీఎన్ మాధవ్ తదితరులు

ఈనాడు, అమరావతి: దేశానికే కృత్రిమ మేధ(ఏఐ) హబ్‌గా విశాఖపట్నం అభివృద్ధి చెందుతోందని, భారతదేశ మొట్టమొదటి క్వాంటమ్ హబ్ అమరావతిలో ఏర్పాటవుతోందని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. విజయవాడలో శనివారం కేంద్ర బడ్జెట్‌పై నిర్వహించిన విలేకర్ల సమావేశంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి మాట్లాడుతూ.. "డేటా సెంటర్లు, పర్యాటక రంగానికి కేంద్రంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతోంది. రాజధాని అమరావతిలో కొత్త భవనాలు, మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాం. పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేసేందుకు కేంద్రం కట్టుబడి ఉంది. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రగతిశీల రాష్ట్రంగా మారుతోంది. ఏపీకి ఉన్న వెయ్యి కిలోమీటర్ల తీరప్రాంతం దేశ ఆర్థికవ్యవస్థకు కీలకం. ఏపీలో హైస్పీడ్ రైలు కారిడార్లు ఏర్పాటుకానున్నాయి. గోదావరి ప్రాంతం కొబ్బరి, జీడిపప్పు, కోకో పంటల్లో 2030 నాటికి ప్రపంచ దేశాలతో పోటీపడేలా అభివృద్ధి చెందనుంది. రాయలసీమలో ఖనిజ కారిడార్లు, తయారీ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. తీరప్రాంతం మత్స్య సంపద, ఓడరేవుల అభివృద్ధికి నిలయంగా మారుతుంది. ఫైనాన్స్ కమిషన్ నివేదిక ఆధారంగా ఏపీ అభివృద్ధికి రూ.1.4లక్షల కోట్లు కేటాయించాం. 2047 నాటికి భారతదేశం అగ్రగామి ఆర్థికవ్యవస్థగా మారడంలో ఏపీ ప్రధానపాత్ర పోషిస్తుంది. దేశ బ్లూ ఎకానమీ వృద్ధిలో ఏపీ ముఖ్య రాష్ట్రంగా నిలుస్తుంది. వ్యవసాయరంగంలో పంట నాణ్యత, నీటి వినియోగాన్ని తగ్గించేందుకు, దివ్యాంగులకు సహాయపడడానికి ఏఐపై పెట్టుబడులు పెడుతున్నారు" అని చెప్పారు. అంతకుముందు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ బడ్జెట్‌పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. "వ్యవసాయ, ఆక్వా రంగాల్లో ఏపీ వాటా 40%. కోకో ఉత్పత్తిలో ఏపీ ఇప్పటికే ముందుంది. నగరాల అభివృద్ధికి నిధుల సేకరణ కోసం తొలిసారిగా బాండ్ల విధానాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించారు" అని తెలిపారు.

పదో తరగతి ఆంగ్ల భాష సబ్జెక్టు పరీక్ష మార్చి 21న

ఈనాడు, అమరావతి: ఏపీ పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్పమార్పు చేసినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కేవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఇటీవల ప్రకటించిన పరీక్షల షెడ్యూల్ ప్రకారం ఆంగ్లం భాష సబ్జెక్టు పరీక్ష మార్చి 20న ఉండగా.. దీన్ని 21వ తేదీకి మార్చినట్లు వెల్లడించారు. 20న రంజాన్ పండుగ ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ మార్పును విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, అధికారులు గమనించాలని సూచించారు.

నాడు హైటెక్ సిటీ.. నేడు క్వాంటమ్ వ్యాలీ

సీఎం చంద్రబాబుకు మంత్రి సత్యకుమార్ అభినందనలు

ఈనాడు, అమరావతి: క్వాంటమ్ వ్యాలీ శంకుస్థాపన ద్వారా ప్రపంచస్థాయి టెక్నాలజీ హబ్‌గా అమరావతిని సీఎం చంద్రబాబు మార్చనున్నారని రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. నాడు హైటెక్ సిటీతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రూపురేఖలను మార్చిన చంద్రబాబు.. ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీతో ఏపీని ప్రపంచ పటంలో నిలపనున్నారని శనివారం ఓ ప్రకటనలో కొనియాడారు. ఈ కేంద్రం సరికొత్త ఆవిష్కరణలకు వేదిక కానుందని పేర్కొన్నారు.

దేవుడిపై జరిగిన అతిపెద్ద కుట్ర ఇదే

- వైవీ సుబ్బారెడ్డి లాగే వైకాపా నేతలంతా కల్తీని ఒప్పుకోవాలి
- తితిదే బోర్డు మాజీ సభ్యుడు ఓవీ రమణ



ఈనాడు డిజిటల్, తిరుపతి: 'వైకాపా హయాంలో శ్రీవారి లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి వినియోగించడం సామాన్యమైన నేరం కాదు, మహా పాపం. స్వయంగా నాటి తితిదే బోర్డు ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కల్తీ జరిగిందని అంగీకరించారు. ఆయన లాగే తప్పు చేసిన వారందరూ బాహాటంగా ఒప్పుకోవాల'ని తితిదే బోర్డు మాజీ సభ్యుడు ఓవీ రమణ డిమాండ్ చేశారు. శనివారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక తిరుమలేశుడిపై కుట్ర జరగడం ఇదే మొదటిసారని వాపోయారు. 'తిరుమల పుణ్యక్షేత్రానికి పక్కా ప్రణాళికతో ద్రోహం చేశారు. దర్యాప్తు సంస్థలు ఆధారాలతో సహా నెయ్యి కల్తీని నిరూపిస్తుంటే, కొందరు నేతలు సిగ్గులేకుండా తప్పుబడుతున్నారు. ఇది కోట్ల మంది హిందువుల విశ్వాసాలపై జరిగిన దాడి' అని రమణ ధ్వజమెత్తారు.

జగన్.. మీ పాపానికి ప్రక్షాళన లేదు

మాజీ సీఎం జగన్‌కు రమణ పలు ప్రశ్నలు వేశారు. 'ఏడుకొండల వాడు మీకు దేవుడు కాదా? మీ తండ్రి బైబిల్ చదువుకున్నట్లుగా, హిందువులకు వారి దేవుడిపై భక్తి ఉండదా? శ్రీవారి కైంకర్యాల్లో ఇంతటి పాపానికి ఒడిగట్టి, మళ్లీ యజ్ఞాలు, యాగాలు చేస్తారా?' అని ప్రశ్నించారు. 'జాతీయ మీడియా సైతం తితిదేలో జరిగిన అవినీతిపై గగ్గోలు పెడుతోంది. సిట్ నివేదికలో ప్రతి అంశమూ కల్తీ నెయ్యిని ధ్రువీకరించింది. అయినా వైకాపా నేతలు బుకాయించడం సిగ్గుచేటు. కల్తీ నెయ్యి ద్వారా సంపాదించిన అవినీతి సొమ్మును తిరిగి దేవుడికే ఇచ్చేయాలి. చేసిన తప్పును ఒప్పుకొని, ప్రాయశ్చిత్తం చేసుకోవడమే వైకాపా నేతల ముందున్న ఏకైక మార్గమ'ని రమణ స్పష్టం చేశారు. సరకుల కొనుగోళ్లపై తితిదే 30 ఏళ్లుగా పాటిస్తున్న కఠిన నిబంధనలను గత పాలకమండలి మార్చిందని, అదే కల్తీ నెయ్యి సరఫరాకు కారణమైందని రమణ ఆరోపించారు.



లీకవుతున్న బకెట్లో నీరు నింపగలరా?

రంధ్రం పడిన బకెట్లో ఎన్ని నీళ్లు పోసినా అది నిండదు. మీ శక్తిని, సమయాన్ని హరించే చెడు అలవాట్లను వదులుకోకుండా ఎంత శ్రమించినా లక్ష్యాన్ని సాధించలేరు. బకెట్లో నీరు పోయడానికి ముందే లీకేజీని అరికట్టాలి. లక్ష్యం కోసం ప్రయత్నించడానికన్నా ముందే చెడు అలవాట్లను త్యజించాలి.

– శరణ్ శ్రీవత్స, ఆంత్రప్రెన్యూర్

ఈ నెలలో రెండు సార్లు తిరుపతి వెళ్లా. అక్కడ ఏ మార్పూ లేదు. వెంకన్న లడ్డూలో నెయ్యి పసలేదు. నాణ్యత అస్సలు లేదు. అన్నప్రసాదం బాగా లేదు.

– శ్రీనివాస్‌రెడ్డి అనే శ్రీవారి భక్తుడు 2022 మార్చి 24న సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్టు ఇది

తిరుమల లడ్డూ మొత్తం వెతికితే రెండు జీడిపప్పు ముక్కలు, ఒక పావు యాలక ముక్క దొరికాయి. కిస్‌ 'మిస్సింగ్' అయింది. ఇక నెయ్యి వాసన, కర్పూరం సువాసన కోరుకోవడం కూడా అత్యాశేనేమో.

– 2022 జూన్ 6న ఆంజనేయులు అనే వ్యక్తి పెట్టిన మరో పోస్టు

మీకో నమస్కారం. నా వయసు 40 ఏళ్లు. ఇప్పటివరకు ఎన్నోసార్లు తిరుపతి లడ్డూ ప్రసాదం తిన్నా. లడ్డూ ప్రసాదాన్ని కొద్దిగా రుచి చూసినా శరీరమంతా దద్దుర్లు వస్తున్నాయి. నెయ్యి పూర్తిగా కల్తీ అయింది. మహాప్రభో సరిచేయండి

– ఇది 2022 మే 29 ప్రసాద్ అనే వ్యక్తి సామాజిక మాధ్యమాల వేదికగా అప్పటి వైకాపా ప్రభుత్వానికి చేసుకున్న విన్నపం.

అసలు తిరుమలలో ఏం జరుగుతోంది. స్వామి వారి దర్శనానికి విదేశీ దుస్తుల్ని అనుమతిస్తున్నారు. మొబైల్ తీసుకెళుతున్నా శోధించడం లేదు. లడ్డూ ప్రసాదంలో నెయ్యి మాయమైంది.

– 2023 మే 21న ప్రదీప్ అనే భక్తుడు పెట్టిన పోస్ట్ ఇది.

తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీని
ఆనాడే పసిగట్టిన భక్తులు

అందులో ఏదో తేడా ఉందని గుర్తించి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు

- అప్పట్లోనే పెద్ద సంఖ్యలో గళమెత్తిన వైనం
- అయినా పట్టించుకోని జగన్ అండ్ కో
- తాజాగా సిట్ దర్యాప్తులో నెయ్యి కల్తీ వెల్లడి కావడంతో రీపోస్టులు

ఈనాడు, అమరావతి: ఇలా ఒకరూ ఇద్దరూ కాదు. అచంచలమైన భక్తితో ఏడుకొండల వాడి దర్శనానికి వెళ్లి తిరుమల లడ్డూను మహాప్రసాదంగా కళ్లకు అద్దుకుని తిన్న చాలా మంది భక్తులు వైకాపా ప్రభుత్వ హయాంలో బాధాతప్త హృదయంతో విలవిల్లాడిపోయారు. నెయ్యి కల్తీ అయిందని సామాజిక మాధ్యమాల వేదికగా ఆనాడే గళం విప్పారు. తిరుమల లడ్డూ కల్తీ జరిగిందని 2021 నుంచే నెత్తీనోరూ బాదుకున్నారు. వైకాపా అధికారం కోల్పోయేనాటి వరకు ట్వీట్లు, పోస్టుల ద్వారా తమ ఆవేదనను పదేపదే వ్యక్తం చేశారు. వీటికి ఆనాడే వేల సంఖ్యలో వ్యూస్ వచ్చాయి. ఈ పోస్టులను ట్యాగ్ చేస్తూ పెద్ద సంఖ్యలో నెటిజన్లు మద్దతుగా కూడా నిలిచారు. అయినా జగన్ మొదలు తితిదే ఛైర్మన్‌గా వ్యవహరించిన సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డిలుగానీ, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, ఏఈవో ధర్మారెడ్డిగానీ ఒక్కరంటే ఒక్కరు కూడా పట్టించుకోలేదు. నెయ్యి కల్తీ జరిగిందని తాజాగా సీబీఐ సిట్ నివేదిక స్పష్టం చేయడంతో అప్పటి పోస్టుల్ని భక్తులు మళ్లీ తెరపైకి తెస్తున్నారు. అసలు నెయ్యి కల్తీపై సిట్ దర్యాప్తు జరగకముందే నెయ్యి నాణ్యతపై వైకాపా హయాంలోని తితిదే పాలకమండలికి అనేక రూపాల్లో ఫిర్యాదు చేశామని, కానీ వాటిని ఏమాత్రం ఖాతరు చేయలేదని ఇప్పుడు నెటిజన్లు గుర్తుచేసుకుంటున్నారు.

భక్తుల అనుమానమే నిజమైంది...

నెయ్యి కల్తీ జరిగినట్లు ఆనాడు భక్తులు అనుమానించిందే నిజమైంది. సిట్ ఇదే విషయాన్ని తన నివేదికలో నిగ్గు తేల్చింది. 2022లోనే సీఎఫ్‌టీఆర్ఐ ప్రయోగశాల నివేదిక ద్వారా కల్తీ నెయ్యి గురించి అప్పటి తితిదే పెద్దలకు సమాచారం ఉందనే విషయాన్ని కూడా సిట్ బహిర్గతం చేసింది. ఈ నివేదికతోపాటు ఫిర్యాదుల్ని కూడా పరిగణనలోకి తీసుకోకుండా కల్తీ విషయాన్ని అప్పటి తితిదే పెద్దలు, అధికారులు తొక్కిపెట్టారని సామాజిక మాధ్యమాల్లో భక్తులు మండిపడుతున్నారు.

కాసుల కక్కుర్తితో.. కలియుగ దైవానికే అపచారం

- జంతువుల కొవ్వు, రసాయనాలతో నెయ్యి తయారీ
- దాన్ని శ్రీవారి ప్రసాదాల తయారీకి వినియోగించడం దారుణం
- వీడియో సందేశంలో ఎంబార్ జీయర్ స్వామి



ఎంబార్ జీయర్ స్వామి

ఈనాడు, అమరావతి: సమస్త సృష్టిని పాలిస్తూ మనల్ని రక్షించే వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమలలో ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి వాడటం పరమ అపచారమని తమిళనాడులోని శ్రీపెరంబుదూర్‌కు చెందిన ఎంబార్ జీయర్ స్వామి ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో డబ్బు ఆశతో ఇలాంటి దారుణానికి ఒడిగట్టారన్నారు. తిరుమలలో లడ్డూ ప్రసాదం తయారీకి జంతు కొవ్వు, రసాయనాలతో తయారు చేసిన మిశ్రమాన్ని నెయ్యి పేరుతో వినియోగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై ఎంబార్ జీయర్ స్వామి శనివారం ఒక వీడియో విడుదల చేశారు. 'ప్రజలంతా తిరుపతి లడ్డూను సాక్షాత్తూ ఆ వేంకటేశ్వరస్వామి కరుణాకటాక్షంగా భావించి స్వీకరిస్తారు. ఎవరైనా తిరుమల వెళ్లి వచ్చి లడ్డూ ఇస్తే.. ఏడుకొండల వాడి అనుగ్రహం లభించిందని సంతోషిస్తారు. అంతటి పవిత్రమైన తిరుమల ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించడం హేయమైన చర్య. ఇలాంటి తప్పులు జరుగుతుంటే లోకక్షేమమే దెబ్బతింటుంది. ఈ కల్తీకి కారకులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం' అని ఎంబార్ జీయర్ స్వామి పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి తప్పులు జరగకుండా ఏపీ ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం ఒక కమిటీ ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రధాని మోదీకి వ్యాసరాజమఠాధిపతి శ్రీ విద్యాశ్రీశ తీర్థ స్వామీజీ లేఖ

పవిత్ర లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించే ఆవునెయ్యి కల్తీకి గురైందని తెలిసి తీవ్ర మనస్తాపానికి గురయ్యామని కర్ణాటకలోని వ్యాసరాజమఠాధిపతి శ్రీ విద్యా శ్రీశ తీర్థ స్వామీజీ పేర్కొన్నారు. స్వామీజీ శనివారం ప్రధాని మోదీకి లేఖ రాశారు. 'ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది భక్తులు అచంచల విశ్వాసంతో పూజించే ఆపదమొక్కుల వాడు వేంకటేశ్వరస్వామి. ఆ స్వామి వారి మహాప్రసాదం తయారీలో అపచారం జరిగింది. ఇది హిందూ ధర్మాన్ని అనుసరించే వారి మనోభావాల్ని తీవ్రంగా గాయపరిచింది. ఘోర తప్పిదానికి బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల్ని కోరుతున్నాం' అని లేఖలో పేర్కొన్నారు.

దైవభక్తి లేనివారు చేసిన దారుణమిది

- ఇంకా ఎక్కడెక్కడ కల్తీలున్నాయో తేల్చాలి
- సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామి



వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమలలో కల్తీ నెయ్యితో లడ్డూ తయారు చేయించి ప్రసాదంగా ఇచ్చారని తమిళనాడులోని మన్నార్‌గుడి మఠాధిపతి సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామీజీ పేర్కొన్నారు. 'దైవభక్తిలేని వారు చేసిన ఈ పని వల్ల ప్రసాదం స్వీకరించే లక్షల మంది భక్తుల ఆరోగ్యం ఎంతలా దెబ్బతింటుందో.. వారి మనోభావాలు ఎంతగా గాయపడతాయో ఆలోచించాలి. ఇలాంటి కల్తీలకు పాల్పడినవారు ఎవరైనా కఠినంగా శిక్షించాలి' అని కోరారు. ప్రస్తుతం బయటపడింది కల్తీ నెయ్యి మాత్రమేనని, ఇంకా ఎక్కడెక్కడ కల్తీ జరిగిందో పూర్తిస్థాయిలో విచారణ చేయించాలని సూచించారు.

కల్తీ నెయ్యిపై సీఎఫ్‌టీఆర్ఐ నివేదికను
ఎందుకు తొక్కిపెట్టారు?

- 2022లోనే తేలినా ఎందుకు చర్యలు తీసుకోలేదు?
- కల్తీకి బాధ్యులు ఎంతటివారైనా శిక్ష తప్పదు
- భాజపా మెతక వైఖరి అవలంబించట్లేదు.. సభ్యతతో మాట్లాడుతోంది: కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ



ఈనాడు డిజిటల్, తిరుపతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీ కోసం సరఫరా చేస్తున్నది కల్తీ నెయ్యేనని 2022 ఆగస్టులోనే సీఎఫ్‌టీఆర్ఐ నివేదికలో స్పష్టంగా వెల్లడైనా సరే.. అప్పటి వైకాపా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని కేంద్ర భూగర్భ గనుల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ నిలదీశారు. అప్పట్లో ఆ నివేదికను ఎందుకు తొక్కిపెట్టారని ప్రశ్నించారు. కేవలం రసాయనాలతో కూడిన మిశ్రమాన్ని సిద్ధం చేసి, దాన్నే నెయ్యి పేరిట స్వామివారి ప్రసాదం తయారీ కోసం పంపించటం దారుణం కాదా అని ధ్వజమెత్తారు. కనీసం ఒక్క లీటరు పాలైనా సేకరించే సామర్థ్యం లేని డెయిరీకి లక్షల టన్నుల నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. తిరుపతి జిల్లా భాజపా కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

- నెయ్యిలో కల్తీ జరిగిందని అప్పటి తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, కొనుగోలు కమిటీ సభ్యులే అంగీకరిస్తున్నారు. జంతు కొవ్వు కలవలేదని, పామాయిల్, ఇతర రసాయనాలు కలిశాయని వారే చెబుతున్నారు. అంటే కల్తీ జరిగిందని వారు అంగీకరిస్తున్నట్లే కదా! పరమ పవిత్రమైన ప్రసాదంలో ఏది కలిసినా అది అపవిత్రమే. భక్తుల మనోభావాలు దెబ్బతీయటమే.
- వెంకన్న లడ్డూ ప్రసాదాన్ని వైకాపా హయాంలో కల్తీ నెయ్యితో తయారు చేశారనేది అక్షర సత్యం. తప్పు చేసింది ఎంతటి వారైనా ఊచలు లెక్కపెట్టాల్సిందే. ఈ అంశంలో భాజపా మెతక వైఖరి అవలంబిస్తోందనడం సరికాదు. వైకాపా నేతల్లాగా మేం బూతులు తిట్టలేం. సభ్యతగా మాట్లాడటం మెతకదనం కాదు.
- లడ్డూ తయారీలో వాడిన నెయ్యి కల్తీదని, అందులో జంతు కొవ్వుతో పాటు మోనోగ్లిజరైడ్స్ వంటి రసాయనాలు ఉన్నాయని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) స్పష్టంగా నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక సీఎం చంద్రబాబు లేదా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తయారు చేసింది కాదు.
- ప్రస్తుతం ఏర్పాటు చేసిన 'సిట్' కేవలం నిజానిజాలు తెలుసుకోవడానికే. విచారణ పూర్తయ్యాక దోషులు ఎవరైనా సరే శిక్ష తప్పదు. అప్పట్లో కొనుగోలు కమిటీలో ఉన్నవారు ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నా సరే, బాధ్యత వహించాల్సిందే.

దూరదృష్టితో కక్షిదారులకు న్యాయం చేయాలి

న్యాయ విద్యార్థులకు అటార్నీ జనరల్ పిలుపు



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న ఏజీ వెంకటరమణి. చిత్రంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథశర్మ తదితరులు

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: న్యాయ విద్యార్థులు దూరదృష్టితో ప్రతిఅంశాన్ని లోతుగా పరిశీలించాలని, తమదైన విచక్షణ, పరిజ్ఞానం జోడించి బాధితులకు నూటికి నూరు పాళ్లు న్యాయం చేసేందుకు యత్నించాలని భారత అటార్నీ జనరల్ (ఏజీ) ఆర్.వెంకటరమణి అన్నారు. తిరుపతిలోని ఎస్వీ న్యాయ కళాశాల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరగనున్న న్యాయోత్సవ్‌లో తొలిరోజు శనివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విశ్వవిద్యాలయాలు సామాజిక ప్రయోగశాలలని, విజ్ఞానసృష్టి కేంద్రాలుగా దేశ భవిష్యత్తుకు బాటలువేసే పరిశ్రమలుగా అవి విరాజిల్లాలన్నారు. న్యాయవిద్యార్థులు వర్తమాన, సామాజిక అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. మన ప్రాచీనతను వదులుకోవద్దని, స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని కొనసాగించాలని తెలిపారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథశర్మ ప్రసంగిస్తూ, న్యాయవ్యవస్థ ముందున్న సవాళ్లు, పరిష్కారాలను లోతుగా పరిశీలించాలని, కేసుల వాదనలో పూర్వాపరాలపై అధ్యయనం చేయాలని సూచించారు. సదస్సులో విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య డి.సూర్యప్రకాశ్‌రావు, ఎస్వీయూ వీసీ ఆచార్య టి.నరసింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ సుధారాణి, సమన్వయకర్త ఆచార్య భాస్కర్‌రెడ్డి, అధ్యాపకుడు అంజన్‌సింగ్ పాల్గొన్నారు.

డాక్టర్ విజయ్ ఆనంద్‌రెడ్డిని సన్మానించిన సీఎం చంద్రబాబు



ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ పురస్కారాన్ని దక్కించుకున్న డాక్టర్ పి.విజయ్ ఆనంద్‌రెడ్డిని శనివారం సన్మానించారు. ప్రముఖ ఆంకాలజిస్టు అయిన విజయ్ ఆనంద్‌రెడ్డి క్యాన్సర్ చికిత్స, వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన కార్యక్రమాలకు గాను ప్రశంసలు అందుకున్నారు. క్యూర్ ఫౌండేషన్ ద్వారా క్యాన్సర్ నివారణకు, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సీఎం చేతుల మీదుగా సన్మానం అందుకోవడాన్ని తాను అత్యంత గౌరవంగా భావిస్తున్నట్లు అపోలో క్యాన్సర్ సెంటర్ డైరెక్టర్, క్యూర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడైన విజయ్ ఆనంద్‌రెడ్డి తెలిపారు. ఈ సన్మానం మరింత నిబద్ధతతో సేవలందించేందుకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

కల్తీ నిజమే.. కానీ నేరం నాది కాదు

సీఎఫ్‌టీఆర్ఐ నివేదిక తొక్కిపెట్టడంలో దురుద్దేశం లేదా?

'సీఎఫ్‌టీఆర్ఐ నివేదికను నేను తొక్కిపెట్టానని ఘోరమైన అభియోగం చేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫిర్యాదు చేస్తే నెయ్యి శాంపిళ్లను సీఎఫ్‌టీఆర్ఐకి పంపాలని రాసిందే నేను. రిపోర్టు వచ్చాక చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులది. నివేదికలోని అంశాల్ని వారు మా దృష్టికి తేలేదు'

– సుబ్బారెడ్డి చేస్తున్న మరో వింత వాదన.

అధికారులు తాత్సారం చేస్తారేమోనని మీరే సంతకం చేసి, శాంపిళ్లను సీఎఫ్‌టీఆర్ఐకి పంపాలని ఆదేశాలు జారీ చేసినట్టు చెబుతున్నారు. సంతోషం! నెయ్యి నాణ్యతపై నిజంగా మీకంత శ్రద్ధే ఉన్నప్పుడు సీఎఫ్‌టీఆర్ఐకి పంపిన శాంపిళ్ల పరిస్థితేంటని అధికారుల్ని అడగాలి కదా? అధికారులు మీ దృష్టికి తేలేదనడం అడ్డగోలు బుకాయింపు కాదా? సీఎఫ్‌టీఆర్ఐ నివేదికనూ తొక్కిపెట్టిన మీకు ఎలాంటి దురుద్దేశాలు లేవంటే నమ్మాలా? కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నారని పరీక్షల్లో నిర్ధారణైన తర్వాత కూడా భోలేబాబా డెయిరీకి 1.07 లక్షల కిలోల సరఫరాకు 2022 ఆగస్టు 29న ఆర్డరు ఇవ్వటం, అక్టోబరు 28 వరకూ ఆ డెయిరీ నెయ్యి సరఫరా చేయటం వాస్తవం కాదా? ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, వైష్ణవి డెయిరీలు 2024 వరకూ సరఫరాదారులుగా కొనసాగటానికి కారకులెవరు? ల్యాబ్ రిపోర్టు చూపించి, ఆ డెయిరీల నుంచి ఎక్కువ కమీషన్లు దండుకోవడానికే ఆ పరీక్షలు చేయించారన్న ఆరోపణలకు మీ సమాధానమేంటి?

చిన్నప్పన్న మీ పీఏ కానప్పుడు ఫిర్యాదులు వచ్చినా ఎందుకు పట్టించుకోలేదు?

'నేను తితిదే ఛైర్మన్‌గా ఉన్నప్పుడు చిన్నప్పన్న నా పీఏ కాదు. అంతకుముందు 2014 నుంచి 2018 వరకు నాకు పీఏగా ఉన్నాడు. 2019 నుంచి ఏపీ భవన్‌లో పనిచేశాడు' – సుబ్బారెడ్డి ఉవాచ

చిన్నప్పన్న అప్పుడు మీ పీఏ కాకపోవచ్చు. కానీ మీ అండ లేకపోతే చిన్నప్పన్న లాంటి ఒక సాధారణ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి తితిదే ఇన్‌స్పెక్షన్ కమిటీని భోలేబాబా డెయిరీకి తనిఖీకి పంపించగలడా? బ్లాక్‌లిస్ట్‌లో పెట్టించగలడా? ఆ డెయిరీ ప్రతినిధుల్ని దిల్లీ పిలిపించి కిలోకి రూ.25 చొప్పున లంచం అడగ్గలడా? ప్రీమియర్ డెయిరీ నుంచి రూ.50 లక్షలు లంచం తీసుకోగలడా? అతని ఖాతాలోకి రూ.4.69 కోట్లు ఎలా వచ్చాయి? చిన్నప్పన్న మీ పీఏ కాకపోతే అతను లంచం అడిగాడని భోలేబాబా డెయిరీ ప్రతినిధులు మీకే ఎందుకు ఫిర్యాదు చేశారు? దాన్ని మీరెందుకు తొక్కిపెట్టారు? చిన్నప్పన్న ఒక అనామక ఫిర్యాదును మీకు అందజేస్తే దాని ఆధారంగా నెయ్యి శాంపిళ్లను సీఎఫ్‌టీఆర్ఐకి పంపాలని ఎందుకు ఆదేశించారు? కల్తీ జరిగిందని నివేదిక వచ్చాక ఎందుకు చర్యలు తీసుకోలేదు?

జంతువుల కొవ్వు కలవలేదని సిట్ ఎక్కడ చెప్పింది?

'నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని, వేరే పదార్థాలతో కల్తీ చేశారని సిట్ చెప్పింది. నెయ్యిలో జంతువుల కొవ్వు, ఫిష్ ఆయిల్ కలిసేందుకు అవకాశాలున్నాయని మాత్రమే ఎన్‌డీడీబీ నివేదికలో ప్రస్తావించారు' – సుబ్బారెడ్డి మరో అడ్డగోలు వాదన.

ఆ నెయ్యి శాంపిళ్లలో జంతువుల కొవ్వు కలవలేదని సిట్ ఎక్కడా నిర్ధారించలేదు. ఎన్‌డీడీబీ రిపోర్టులో వెజిటబుల్ ఆయిల్స్‌తో పాటు, పంది కొవ్వు (లార్డ్), గొడ్డు కొవ్వు (బీఫ్ టాలో), చేప నూనె (ఫిష్ ఆయిల్) కలిసేందుకు అవకాశాలున్నాయని స్పష్టంగా పేర్కొంది. కర్నాల్‌లోని ఎన్‌డీఆర్ఐ ల్యాబ్ తాము చేసిన పీసీఆర్ పరీక్షా విధానంలో.. నెయ్యిలో పందికొవ్వు పది శాతం కంటే తక్కువుంటే గుర్తించలేమని చెప్పింది. గొడ్డుకొవ్వు, చేపనూనె కల్తీని నిర్ధారించే పరీక్షల తమ వద్ద లేవని స్పష్టం చేసింది. ల్యాబ్ రిపోర్టులు అంత స్పష్టంగా ఉంటే జంతువుల కొవ్వు కలవలేదని సిట్ క్లీన్‌చిట్ ఇచ్చినట్టుగా అడ్డగోలు వాదనేంటి సుబ్బారెడ్డీ?

ఆర్జిత సేవల్ని చేపల మార్కెట్‌లా వేలం వేసినప్పుడే మీ నైజం తెలిసింది

'సుప్రభాతం టికెట్ ధర రూ.400 నుంచి రూ.800కి పెంచావు కదా! వై ఎనిమిది వందలు.. రెండు వేలు చెయ్! విచక్షణ కోటాలోని అన్ని సేవల ధరలూ పెంచేయ్. తోమాల సేవ టికెట్ ధర రూ.2 వేలు చేశావు కదా.. రూ.5 వేలు చెయ్. అర్చన కూడా రూ.5 వేలు చెయ్యండి. కల్యాణోత్సవం రూ.2 వేలు చేద్దామా. రూ.2,500 లేదా రూ.3 వేలు చేయండి'

– తితిదే బోర్డు సమావేశంలో సాక్షాత్తూ ఛైర్మన్ హోదాలో సుబ్బారెడ్డి వ్యాఖ్యలివి..

మీరు తితిదే పాలకమండలిని చేపల మార్కెట్‌లా మార్చేసి, స్వామివారి ఆర్జిత సేవల టికెట్ ధరల పెంపు ప్రతిపాదనను వేలం పాటలా మార్చేసిన తీరును లైవ్‌లో చూసిన జనం ఛీత్కరించుకున్నారు! ఇలాంటి ఘనకార్యాల్ని ప్రజలు చూస్తే బండారం బయట పడుతుందనుకున్నారో ఏమో ఆ తర్వాత ఇంకెప్పుడూ సమావేశాల ప్రత్యక్షప్రసారం చేయలేదు. పాలకమండలి ఎజెండాను, నిర్ణయాల్ని తితిదే వెబ్‌సైట్‌లోనూ పెట్టడం మానేశారు. లైవ్ కొనసాగించి ఉంటే కల్తీ నెయ్యి సరఫరాకు రాచబాట పరిచిన మీ నిర్వాకాన్ని ప్రజలు అప్పుడే గుర్తించేవారేమో!



అగ్ని ప్రమాదం జరిగిన భవనం నుంచి వెలువడుతున్న పొగ

తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో భారీ అగ్నిప్రమాదం

ఈనాడు, హైదరాబాద్: అనేక కేసుల్లో శాస్త్రీయ పద్ధతిలో ఆధారాలను సేకరించి విశ్లేషించే తెలంగాణ న్యాయ వైజ్ఞానిక శాస్త్ర ప్రయోగశాలలో శనివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. వివిధ కేసుల్లో సీజ్ చేసిన భౌతిక ఆధారాలను భద్రపర్చిన హైదరాబాద్ నాంపల్లిలోని జీ ప్లస్ టూ భవనం మొదటి అంతస్తులోని గదిలో ప్రమాదం జరిగింది. దాదాపు 40-50 కంప్యూటర్లు కాలిపోయినట్లు అధికారులు గుర్తించారు. ఘటనపై నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు జరిగిందా... లేక కుట్రకోణం దాగి ఉందా అని విశ్లేషిస్తున్నారు. ఘటనలో ప్రాణనష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆరు ఫైరింజన్లతో సిబ్బంది మూడు గంటలపాటు శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. 'కేసు సంబంధిత ఆస్తి, ఎఫ్ఎస్ఎల్‌కు చెందిన సామగ్రి సురక్షితంగానే ఉందని జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నాం' అని ఎఫ్ఎస్ఎల్ డీజీ శిఖా గోయల్ ఓ ప్రకటనలో తెలిపారు.

హిందువుల మనోభావాలతో ఎలా ఆడుకుంటారు?

నెయ్యి కల్తీని చిన్న విషయంగా చెబుతారా?

- జగన్‌నుద్దేశించి అర్ణబ్ గోస్వామి ప్రశ్నలు
- శ్రీవారి ప్రసాదం కల్తీపై జాతీయ మీడియాలో చర్చ

ఈనాడు, అమరావతి: 'మీ ప్రభుత్వ హయాంలో తితిదేకి పంపిన నెయ్యిలో భారీగా కల్తీ జరిగిందన్నది వాస్తవం. నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని వాదించడంలో అర్థమేంటి జగన్? మీరొక రాజకీయ పార్టీ నడుపుతున్నారు. బాధ్యతగా మాట్లాడండి. మీ మతవిశ్వాసాలతో ఎవరైనా ఆడుకుంటే ఊరుకుంటారా? హిందువుల మనోభావాల్ని దెబ్బతీసేందుకు ఎలా అనుమతించారు? అసలు మీరేం చేస్తున్నారు?'

రిపబ్లిక్ ఛానల్ ఎడిటర్ ఇన్ చీఫ్ అర్ణబ్ గోస్వామి.. వైకాపా అధినేత జగన్‌నుద్దేశించి వేసిన ప్రశ్నలివి. కల్తీ నెయ్యి వ్యవహారం జాతీయ మీడియాలో తీవ్ర చర్చనీయాంశమైంది. దాదాపు అన్ని టీవీ ఛానళ్లు దీనిపై డిబేట్లు నిర్వహిస్తున్నాయి. పత్రికలు కథనాలు ప్రచురిస్తున్నాయి.

'దేశవ్యాప్తంగా కోల్‌కతా నుంచి ముంబయి వరకు, లఖ్‌నవూ నుంచి చెన్నై వరకు, జమ్మూ నుంచి గువాహటి వరకు హిందువులంతా తిరుపతి లడ్డూ ప్రసాదం పొందడాన్ని గొప్ప ఆశీర్వచనంగా పరిగణిస్తారు. స్వామివారికి భక్తిశ్రద్ధలతో సమర్పించే లడ్డూను రసాయనాలతో కూడిన సింథటిక్ నెయ్యితో చేశారు. ఇది హిందువుల మనోభావాల్ని నేరుగా దెబ్బతీసినట్టే. ఈ దేశంలో 100 కోట్లకు పైగా హిందువులున్నారని, వారి సెంటిమెంట్స్‌తో ఆడుకోలేనన్న విషయాన్ని రాత్రి నిద్రపోయే ముందు, ఉదయం నిద్రలేచాక మీరు గుర్తు పెట్టుకోవాలి. కానీ మీరు 'నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదు కాబట్టి, పెద్ద విషయం కాదు' అనడం హిందువుల సెంటిమెంట్స్‌తో ఆడుకోవడమే. మీరిలా చేయడాన్ని ఎవరూ అనుమతించరు జగన్' అని అర్ణబ్ పేర్కొన్నారు.

స్వీయ అనుభవం పంచుకున్న ఆనంద్ నరసింహన్

'నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని, వెజిటబుల్ ఆయిల్స్‌తో కల్తీ జరిగిందని తితిదే బోర్డు మాజీ ఛైర్మన్లు సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి చెబుతున్నారు. అది స్వామివారికి అపచారం కాదా?' అని సీఎన్ఎన్-న్యూస్18 సీనియర్ యాంకర్ ఆనంద్ నరసింహన్ ప్రశ్నించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో శ్రీవారి లడ్డూ నాలుగైదు రోజులు దాటితే రంగు, రుచి, వాసన మారిపోయేదని, పోస్టల్ డిస్పాచ్ రెండు రోజులు దాటితే పాడైపోయేదని గుర్తుచేసుకున్నారు. ఆ తేడాను తాను స్పష్టంగా గుర్తించానని, తన తల్లి కూడా లడ్డూ గతంలో మాదిరిగా లేదని తనతో అన్నారని ఆనంద్ ఉటంకించారు. నెయ్యి కల్తీని 2022లోనే సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్ నిర్ధారించినా, అప్పటి ఛైర్మన్, అధికారులు పట్టించుకోకపోవడాన్ని ప్రశ్నించారు.

- నెయ్యి కల్తీ రూ.250 కోట్ల కుంభకోణమని, 68 లక్షల కిలోల కల్తీ నెయ్యితో లడ్డూలు తయారు చేశారని ఇండియా టుడే ఛానల్ రిపోర్టు చేసింది. కల్తీ నెయ్యితో తయారుచేసిన లడ్డూలను ఐదేళ్లపాటు భక్తులకు అందజేయడం దేశ ప్రజలను షాక్‌కు గురిచేసిందని పేర్కొంది.

చేతులు జోడించి క్షమాపణ కోరండి

'2024లో చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యాక నెయ్యి కల్తీ అంశాన్ని లేవనెత్తి మంచి పనిచేశారు. సీబీఐ దర్యాప్తులో కల్తీ నెయ్యి వాడినట్లు రుజువైంది. హిందువుల విశ్వాసాల్ని దెబ్బతీయడానికి ఇంత భారీ కుట్రకు ఎందుకు పాల్పడ్డారు? దీనికి మిమ్మల్ని ప్రేరేపించిన అంశమేంటి? 300 ఏళ్లుగా శుద్ధమైన నెయ్యితో లడ్డూ ప్రసాదాలు తయారుచేసే సంప్రదాయాన్ని మీ హయాంలో మంటగలిపారు. దీనికి మీరు బాధ్యులు కాదా? సిట్ నివేదిక మీకు క్లీన్‌చిట్ ఇవ్వలేదు జగన్. ఈ ఘోరతప్పిదానికి 'సారీ' చెబితే సరిపోదు. దేశప్రజల ముందు చేతులు జోడించి క్షమించాలని వేడుకోండి. అంతకుమించి మీకు మరో మార్గం లేదు' అని అర్ణబ్ వ్యాఖ్యానించారు.

ప్రకటన

ఈటీవీ భారత్ యాప్/ website లోని వార్తలు, కథనాలను మొత్తంగా లేదా పాక్షికంగా ఈటీవీ భారత్ వారి అనుమతి లేకుండా ఎటువంటి హక్కు లేని కొంతమంది వ్యక్తులు, సంస్థలు కాపీ చేసి తీసుకొని తమ వాణిజ్య ప్రయోజనాల (వెబ్‌సైట్లలో, న్యూస్‌యాప్‌లలో, యూట్యూబ్ ఛానళ్లలో) కోసం వినియోగిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ విధమైన అనుమతి లేని చర్యలు కాపీరైట్ చట్టానికి విరుద్ధం మరియు శిక్షార్హమైన నేరం. అందువల్ల ఎవరైనా వ్యక్తులు, సంస్థలు ఈటీవీ భారత్‌లోని వార్తలు, వ్యాసాలను అనుమతి లేకుండా అప్‌లోడ్ చేయడం నేరం. అట్టి చర్యలను ఈటీవీ భారత్ తీవ్రంగా పరిగణించి, బాధ్యులపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరిక జారీ చేయడమైనది.

ఇట్లు/- వెల్లంకి రత్నకుమార్,
ఛీఫ్ మేనేజర్, లీగల్ డిపార్ట్‌మెంట్

అమెరికాతో ఒప్పందం ఓ ముందడుగే కానీ..

- రెండు దేశాల మధ్య సమతూకంగా లేదు..
- మన ఎగుమతుల్లో 55 శాతానికి మాత్రమే ప్రయోజనం
- కార్మికులు ఎక్కువగా పనిచేసే ఉత్పత్తులకు ఉపయోగం
- కొన్ని వ్యవసాయోత్పత్తులపై వ్యతిరేక ప్రభావం చూపే అవకాశం

‘ఈనాడు’ ఇంటర్వ్యూలో జీటీఆర్ఐ వ్యవస్థాపకులు అజయ్ శ్రీవాత్సవ

ఈనాడు, హైదరాబాద్: సుంకాలపై జరిగిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్-ఎఫ్‌టీఏ) భారత్‌కు ఊరట కలిగించిందని, కానీ ఇది రెండు దేశాల మధ్య సమతూకంగా లేదని, అమెరికాకు వ్యూహాత్మక ప్రయోజనాలు అధికమని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) వ్యవస్థాపకులు అజయ్ శ్రీవాత్సవ అభిప్రాయపడ్డారు. ఈ ఒప్పందం వల్ల ఎగుమతి సుంకాలు 50 నుంచి 18 శాతానికి తగ్గుతాయని, కానీ మన దేశం నుంచి అమెరికాకు చేసే ఎగుమతుల్లో 55 శాతానికి మాత్రమే దీనివల్ల ఉపయోగం కలుగుతుందని, వ్యవసాయ రంగానికి చెందిన కొన్ని ఉత్పత్తులపైన వ్యతిరేక ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. వాణిజ్యంపైనే కాకుండా దీర్ఘకాలంలో వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి (స్ట్రాటజిక్ అటానమీ) పైనా ప్రభావం చూపే అవకాశం ఉందని, ఈ విషయంలో ప్రభుత్వం జాగ్రత్తపడాలని సూచించారు. కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖలో అదనపు కార్యదర్శిగా పనిచేసిన అజయ్ శ్రీవాత్సవకు.. డబ్ల్యూటీవో, ఎఫ్‌టీఏ చర్చల్లో పాల్గొన్న అనుభవం ఉంది. మూడేళ్ల క్రితం స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఆయన జీటీఆర్ఐను ప్రారంభించారు. భారత్, అమెరికాల స్వేచ్ఛా వాణిజ్య అవగాహనపై సంయుక్త ప్రకటన చేసిన నేపథ్యంలో, దీని ప్రభావంపై ‘ఈనాడు’కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.



? అమెరికాతో ఒప్పందం వల్ల భారతదేశానికి ఏ మేరకు ప్రయోజనం కలుగుతుంది

ప్రస్తుతం జరిగింది మధ్యంతర ఒప్పందం. ఇది అమెరికా, భారత్ మధ్య జరిగిన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో ఓ ముందడుగే. మన ఎగుమతులపై అమెరికా విధించే సుంకం 50 నుంచి 18 శాతానికి తగ్గుతుంది. దీంతో తగిన మేర ఆర్థిక ప్రయోజనాలు లభిస్తాయి. కార్మికులు ఎక్కువగా పనిచేసే ఉత్పత్తుల ఎగుమతులకు అధిక ప్రయోజనం కలుగుతుంది. కానీ భారత్ నుంచి ఎక్కువ రాయితీలు అమెరికాకు లభించాయి. అమెరికా నుంచి వచ్చే పారిశ్రామిక ఉత్పత్తులు, పలు రకాల వ్యవసాయోత్పత్తులకు భారత్ సుంకాలను తగ్గించింది. మోస్ట్ ఫేవర్డ్ నేషన్ (ఎంఎఫ్ఎన్)గా కొన్నింటికి తొలగించింది. అమెరికా మాత్రం ఎంఎఫ్ఎన్ సుంకాలను తగ్గించలేదు. మన ఎగుమతులపైనా కొంత ఊరట మాత్రమే ఇచ్చింది. గతంలో యూకే, యూరోపియన్ యూనియన్‌తో జరిగిన ఒప్పందంలో ఆటోమొబైల్స్‌పై సుంకాలు పరిమితంగానే తగ్గించడానికి భారత్ అంగీకరించింది. ఇప్పుడు అమెరికాతో పరిమితి కోటా, పరిమితంగానే సుంకాలకు అంగీకరించారా లేక పూర్తిగా సుంకాలు తగ్గించి పరిమితి లేకుండానే దిగుమతులకు అంగీకరించారా అన్నదానిపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. దీంతోపాటు ఎలక్ట్రానిక్ పరికరాలు, స్మార్ట్‌ఫోన్లు, సోలార్ ప్యానెల్స్‌పై సుంకాలను పూర్తిగా తొలగించడం వల్ల భవిష్యత్తులో స్వదేశీ తయారీరంగంపై ప్రభావం పడుతుంది. భారత్ ఎగుమతుల్లో 55 శాతం ఉత్పత్తులకు మాత్రమే ప్రయోజనం కలుగుతుంది. వస్త్రాలు, దుస్తులు, తోలు, పాదరక్షలు, ప్లాస్టిక్, రబ్బర్ ఉత్పత్తులు, ఆర్గానిక్ కెమికల్స్, గృహాలంకరణలు, హస్తకళ ఉత్పత్తులు, కొన్ని రకాల యంత్ర సామగ్రి, రత్నాలు, ఆభరణాలు, రొయ్యలు మొదలైన మన ఎగుమతులకు ఎక్కువ ప్రయోజనకరం. సుంకాలు మరింత తగ్గించే అంశం తదుపరి చర్చల్లో ఉంటుంది. చైనా వస్తువులపై అమెరికా సుంకాలు 30 శాతం ఉండటం వల్ల చైనా ప్లస్ వన్ తయారీ రంగానికి కూడా ఈ ఒప్పందం బాగా ఉపయోగపడుతుంది.

? వ్యవసాయ రంగంపై ఎలాంటి ప్రభావం ఉండవచ్చు..

అమెరికా నుంచి దిగుమతి చేసుకునే యాపిల్స్, ఆరెంజ్‌తో పాటు సోయాబీన్ ఆయిల్‌కు సుంకాలు తగ్గించింది. వీటితోపాటు డ్రైడ్ డిస్టిలర్స్ గ్రెయిన్స్ (డీడీజీ), పశువుల దాణాకు వినియోగించే ఎర్ర జొన్న, నట్స్ మొదలైనవి ఉన్నాయి. ఇవి మన రైతులపై ప్రభావం చూపడంతోపాటు వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. ఇంకా ఏయే వ్యవసాయోత్పత్తులపై సుంకాలు తగ్గించారన్నది స్పష్టత లేదు. కానీ తుది ఒప్పందంలో.. దేశంలోని సున్నిత రంగాలకు రక్షణ లభిస్తుందని అంచనా వేస్తున్నాం.

? ఆర్థిక భద్రత పటిష్ఠత కూడా ఒప్పందంలో ఓ భాగంగా ఉంది కదా, దీని ప్రభావం ఎలా ఉంటుంది

సరఫరా వ్యవస్థ స్థిరత్వం కోసం ఆర్థిక భద్రత ఎలైన్‌మెంట్‌ను పటిష్ఠం చేయడానికి రెండు దేశాలు అంగీకరించాయి. థర్డ్‌పార్టీల నాన్ మార్కెట్ విధానాలను అడ్రస్ చేయడంలో భాగంగా ఇది జరిగింది. ఈ నిబంధన భారత్ భద్రత, ఆర్థిక విధానాలతో ముడిపడి ఉన్నందున చాలా జాగ్రత్తగా ఉండాలి. దీనివల్ల దీర్ఘకాలంలో వ్యతిరేక ప్రభావం పడవచ్చు. భవిష్యత్తులో ఆర్థిక భద్రత పేరుతో రష్యా, చైనాలపై అమెరికా నూరు శాతం సుంకాలు విధిస్తే.. భారత్ కూడా అలాగే చేయాల్సి రావొచ్చు. అమెరికా ఆంక్షలు విధించే దేశాలతో లావాదేవీలపై భారత్‌కు పరిమితులు ఏర్పడతాయి. ఇది మన విదేశాంగ విధానంపై ప్రభావం చూపుతుంది. ఇతర దేశాలతో కొత్త డిజిటల్ ట్రేడ్ ఒప్పందాలు చేసుకోవాలంటే అమెరికాతో సంప్రదింపులు జరపాల్సి రావొచ్చు. మలేసియా నుంచి అమెరికా ఇలాంటి అంగీకారమే తీసుకుంది. దీన్నే భారత్‌తోనూ కొనసాగించాలని చూస్తోంది. ఈ విషయంలో జాగ్రత్తపడకపోతే భవిష్యత్తులో సమస్యలొస్తాయి. బ్రిక్స్ దేశాలతో సంబంధాలపైనా ప్రభావం పడవచ్చు. నాన్ టారిఫ్ అడ్డంకులూ ప్రధానమైనవే. అమెరికా నుంచి వైద్య పరికరాలు దిగుమతి చేసుకోవడానికి ఈ ఒప్పందం అనుమతులను సడలించడంతో పాటు.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గూడ్స్ దిగుమతి కోసం లైసెన్స్ అవసరాన్ని కూడా భారత్ తొలగించింది. ఈ ఒప్పందం ఆరు నెలల్లో అమలులోకి వచ్చేలా చూడాలన్నది నిబంధన. దీని బదులుగా అమెరికా నుంచి వచ్చే ఆహార, వ్యవసాయోత్పత్తులపై ప్రభావం చూపే నాన్ టారిఫ్ అడ్డంకులపై దృష్టి పెడతామని భారత్ అంగీకరించింది. ఇలాంటి అనేక నిబంధనలు అమెరికా-మలేసియా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందంలో ఉన్నాయి. ఇలాంటివన్నీ భారత్ ఒప్పందంలో కూడా భాగమయ్యే అవకాశం ఉంది. ఈ ఒప్పందం తదుపరి దశలో అనేక అంశాలు ద్వారాలు తెరిచే అవకాశం ఉంది.

? అమెరికా నుంచి 500 బిలియన్ డాలర్ల వస్తువులను కొనుగోలు చేయడానికి భారత్ అంగీకరించిందని ట్రంప్ చెబుతున్నారు, ఆచరణలో ఇది సాధ్యమా

వచ్చే ఐదేళ్లలో అమెరికా నుంచి 500 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను కొనుగోలు చేయాలన్నది లక్ష్యం. ఇందులో ఇంధన పరికరాలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు, ఎయిర్ క్రాఫ్ట్ విడిభాగాలు, విలువైన లోహాలు, టెక్నాలజీ ఉత్పత్తులు, వంటబొగ్గు తదితరమైనవి ఉన్నాయి. ఈ లెక్కన అమెరికా నుంచి ప్రస్తుతం ఉన్న వార్షిక దిగుమతులు 45 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్లకు పెరగాలి. ఇది వాస్తవదూరంగా ఉంది. ఇందులో ఎయిర్‌క్రాఫ్ట్‌ల కొనుగోలు ప్రధానమైనది. ప్రస్తుతం భారత్ 200 బోయింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను నిర్ధారించింది. వచ్చే ఐదేళ్లలో మరో 200 ఎయిర్‌క్రాఫ్ట్‌లను కొన్నా మొత్తం విలువ సుమారు 60 బిలియన్ డాలర్లు. ఇలాంటి కొనుగోలు నిర్ణయాలను చేసేది ప్రైవేటు ఎయిర్‌లైన్స్ తప్ప ప్రభుత్వం కాదు. ఈ నేపథ్యంలో 500 బిలియన్ డాలర్ల లక్ష్యం ప్రశ్నార్థకమే.

ఇద్దరు పిల్లలకు ఉరేసి.. తల్లి ఆత్మహత్య

- భర్త చేసిన అప్పులే కారణమని లేఖ
- తిరుపతి జిల్లా పుత్తూరులో విషాదం



పద్మ, పిల్లలు తేజ, లాస్య

పుత్తూరు, న్యూస్‌టుడే: ‘తల్లిదండ్రులను కాదని పెళ్లి చేసుకున్న ప్రతి ఒక్కరికి నా జీవితం ఓ గుణపాఠం. ఒక అమ్మాయి ఎలాంటి లక్షణాలు తన భర్తకు ఉండకూడదని అనుకుంటుందో.. అవన్నీ నా భర్తలో ఉన్నాయి. ఇది నేను కలలోనూ అనుకోలేదు. శివశంకర్.. నిన్ను ప్రేమ వివాహం చేసుకున్న పాపానికి ఎంత కష్టపడ్డానో నాకు తెలుసు. నా కడుపున పుట్టిన పిల్లలూ ఆ కష్టాన్ని అనుభవిస్తున్నారు. ఊరంతా అప్పులు చేసి, తీర్చలేను అంటే.. నేనేం చేయాలి. ఇక ఉంటా! నేను చనిపోయాక ఎలాగూ ఇంకో పెళ్లి చేసుకుంటావ్, ఈ సారైనా లైఫ్‌లో సెటిల్ అయ్యాక చేసుకో’ అని లేఖ రాసిన ఓ వివాహిత.. తన ఇద్దరు పిల్లలకు ఉరేసి, తానూ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఉదంతమిది. తిరుపతి జిల్లా పుత్తూరులో జరిగిన ఈ విషాద ఘటనపై పోలీసులు, స్థానికుల కథనం.. పుత్తూరు మండలం నేషనూరుకు చెందిన కన్నెప్పరెడ్డి కుమార్తె పద్మ(28), తొరూరు పంచాయతీకి చెందిన శివశంకర్ పుత్తూరులో డిగ్రీ చదువుకునే రోజుల నుంచీ స్నేహితులు. వీరు ప్రేమపెళ్లికి సిద్ధపడగా.. కులాలు వేరు కావడం, శివశంకర్ పని లేక జులాయిగా తిరుగుతున్నాడని పద్మ తల్లిదండ్రులు అంగీకరించలేదు. అయినా ఆమె అతన్ని 2019లో వివాహం చేసుకుంది. వీరికి తేజ(6), లాస్య(5) కుమార్తెలు సంతానం. పిల్లలు స్థానిక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. ప్రస్తుతం వీరు పుత్తూరులో నివాసం ఉంటున్నారు.

కుటుంబ పోషణకు కష్టాలు: శివశంకర్ జులాయిగా తిరుగుతూ ఇంటి ఖర్చులకూ డబ్బులివ్వడం లేదని పద్మ రాసిన లేఖ ద్వారా స్పష్టమవుతోంది. స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉండి, రుణం తీసుకున్నారు. పిల్లల స్కూలు ఫీజులు, ఇంటి అద్దె, ఇతర ఖర్చులకు ప్రతినెలా ఇబ్బంది పడుతోంది. భర్త ఇంటి విషయాలు పట్టించుకోవడం లేదు. దీనిపై రెండు రోజుల క్రితం శివశంకర్‌ను పెద్ద మనుషులు మందలించారు. కుటుంబాన్ని బాగా చూసుకుంటానని, తనకు శ్రీసిటీలో ఉద్యోగం వచ్చిందని వారికి చెప్పాడు. శనివారం బయటకు వెళ్లిన భర్తకు ఫోన్ చేసిన పద్మ.. డ్వాక్రా సంఘంలో అప్పు కట్టావా అని ప్రశ్నించింది. భర్త చెల్లించలేదని చెప్పడంతో మనస్తాపం చెందింది. ఆత్మహత్య లేఖ రాసి, బెడ్ రూమ్‌లో ఇద్దరు పిల్లలకు ఉరేసి చంపి, తాను హాల్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం ఇంటికొచ్చిన శివశంకర్.. తలుపులు వేసి ఉండటం, ఎంతకీ తీయకపోవడంతో మామ కన్నెప్పరెడ్డికి ఫోన్ చేశాడు. అతను వచ్చి తలుపులు పగలగొట్టి చూడగా, ముగ్గురూ విగతజీవులుగా ఉరికి వేలాడుతున్నారు. డీఎస్పీ రవికుమార్ ఘటనా స్థలికి వచ్చి పరిశీలించారు. శివశంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

గాల్లో తేలినట్టుందే..!

విశాఖలో అలరించిన బైక్ రేస్ పోటీలు



పోటీలో దూసుకుపోతున్న రేసర్లు



విశాఖక్రీడలు, న్యూస్‌టుడే: రయ్ రయ్ మంటూ బైక్‌లపై దూసుకొచ్చి, అమాంతం గాల్లోకి ఎగిరిన రైడర్ల సాహస విన్యాసాలు అభిమానులను ఆకట్టుకున్నాయి. జాతీయస్థాయి మోటార్ బైక్ రేసింగ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ పోటీలు శనివారం సాయంత్రం విశాఖపట్నం ఇందిరాప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో ఉత్సాహంగా జరిగాయి. ఎంఆర్ఎఫ్ మోగ్రిప్ సూపర్‌క్రాస్ ఎఫ్ఎంఎస్‌సీఐ-2025 పేరిట ఇప్పటి వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో అయిదు రౌండ్లు పూర్తి చేయగా, ఫైనల్ రౌండ్‌కు విశాఖ వేదికైంది. 70 మంది వరకు రేసర్లు పాల్గొని మోటారు బైక్‌లతో అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. జర్మనీ, నార్వేకు చెందిన సెబాస్టియన్, థామస్ చేసిన స్టంట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విశాఖలో తొలిసారిగా నిర్వహించిన బైక్ రేసింగ్ పోటీలు అభిమానుల్లో జోష్ నింపాయి. స్టేడియంలో గ్యాలరీలన్నీ అభిమానులతో నిండిపోయాయి. వేల మంది అభిమానులు రావడంతో స్టేడియం గేట్ల వద్ద తీవ్ర రద్దీ నెలకొంది. వారిని నియంత్రించేందుకు పోలీసులు శ్రమించారు. పోటీలు తిలకించేందుకు జారీ చేసిన పాస్‌లలో కొన్ని నకిలీవి ఉన్నాయని పలువురు అభిమానులు వాపోయారు.

కొత్తతరం 2-నానోమీటర్ సెమీకండక్టర్ ఆవిష్కరణ



నానో సెమీకండక్టర్ గురించి కేంద్ర మంత్రి వైష్ణవ్‌కు వివరిస్తున్న నిపుణులు

ఈనాడు, బెంగళూరు: కొత్తతరం అవసరాలకు అనుగుణంగా నానో మీటర్ సెమీకండక్టర్‌ను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ శనివారం బెంగళూరులో ఆవిష్కరించారు. క్వాల్‌కమ్ సంస్థ అభివృద్ధి చేసిన 2నానోమీటర్ (ఎన్ఎం) సెమీకండక్టర్ భారతీయ 5వ పారిశ్రామిక విప్లవానికి ప్రతీకగా ఆవిష్కృతమైందన్నారు. అత్యాధునిక మైక్రో ఎలక్ట్రానిక్స్‌లతో తయారైన ఈ చిప్‌లో 20-30 బిలియన్ల ట్రాన్సిస్టర్లు ఉన్నాయి. జీపీయూ, సీపీయూల సామర్థ్యం ఒకే చిప్‌లో ఉన్న ఈ సెమీకండక్టర్ కొత్తతరం కృత్రిమ మేధను ఆటోమొబైల్స్, విమానాలు, హైస్పీడ్ రైళ్ల సేవల్లో విస్తృతంగా వినియోగించేందుకు దోహదపడుతుందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ‘‘కేంద్ర ప్రభుత్వం సెమీకాన్ 1.0ను కేవలం మానవ మేధకు పదును పెట్టే లక్ష్యంతో ఏర్పాటు చేశాం. పదేళ్లలో 85వేల సెమీ కండక్టర్ నిపుణులకు శిక్షణ ఇవ్వాలన్నది లక్ష్యంగా కాగా 67వేల మంది ఇంజినీర్లు నాలుగేళ్లలోనే సిద్ధమయ్యారు. చిప్‌ల వాడకం నుంచి వాటిని తయారు చేసే స్వావలంబన దేశంగా మారిన భారత్‌లో 315 విశ్వవిద్యాలయాలు, కళాశాలలు.. చిప్‌ల తయారీ కేంద్రాలుగా మారాయి’’ అని వెల్లడించారు. కంపెనీలు, అంకురాల పర్యావరణ వ్యవస్థలు, చిప్ తయారీలో అత్యున్నత సామర్థ్యాన్ని వృద్ధి చేయడమే ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0 లక్ష్యమని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

సెమీ కండక్టర్లలో తైవాన్‌లా.. క్వాంటమ్‌లో అమరావతి

- ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.కామకోటి



ఈనాడు, అమరావతి: ప్రపంచంలో అత్యంత ముఖ్యమైన క్వాంటమ్ టెక్నాలజీ హబ్‌లలో అమరావతి ఒకటిగా ఎదుగుతుందని ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.కామకోటి ఆకాంక్షించారు. సెమీకండక్టర్లలో తైవాన్ మాదిరిగా.. క్వాంటమ్ హార్డ్‌వేర్‌లో అమరావతి అత్యున్నత స్థాయికి చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ శంకుస్థాపన కార్యక్రమం ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ 2047 దూరదృష్టిని ప్రతిబింబిస్తోందన్నారు. జాతీయ క్వాంటమ్ మిషన్ దేశ చరిత్రలో అత్యంత ధైర్యవంతమైన శాస్త్రీయ ప్రయత్నమని ఆయన అభివర్ణించారు. 17 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 43 సంస్థల నుంచి 152 పరిశోధకులతో నాలుగు థీమాటిక్ హబ్‌లు ఏర్పాటయ్యాయన్నారు. ఐబీఎంతో కలిసి ఎన్‌పీటీఈఎల్ (నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హేన్స్‌డ్ లెర్నింగ్)లో అందుబాటులో ఉన్న క్వాంటమ్ కోర్సుల్లో ఇప్పటి వరకు 2.8 లక్షల మంది విద్యార్థులు చేరితే వీరిలో లక్ష మందికి పైగా ఏపీవారే ఉన్నారన్నారు.

క్వాంటమ్ వేగంతో పనులు: సీఎం చంద్రబాబుకు సాంకేతిక విప్లవాలు కొత్త కాదు. ఇప్పుడు క్వాంటమ్ కంప్యూటింగ్‌తో మరో విప్లవానికి ఆయన నాంది పలికారు. ప్రపంచంలోనే మొదటిసారి అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేయాలని ఆయన కంకణం కట్టుకున్నారు. ప్రపంచంలో ప్రముఖ క్వాంటమ్ హబ్‌లతో పోటీపడే స్థాయికి ఏపీ చేరుకుంటుంది. క్వాంటమ్ హార్డ్‌వేర్, కాంపొనెంట్లు, క్వాంటమ్ కంప్యూటర్ల తయారీ ఇక్కడే జరగాలని ప్రణాళిక రచించారు. ఆరు నెలల్లో మొదటి క్వాంటమ్ మెషిన్లు అందుబాటులోకి వస్తాయి. రెండేళ్లలో పెద్ద ఎత్తున ఉత్పత్తి ప్రారంభమవుతుంది. భవిష్యత్తులో క్వాంటమ్, ఏఐ, మెషిన్‌లెర్నింగ్, డీప్ టెక్నాలజీల్లో నైపుణ్యం ఉన్న వారికి ఉద్యోగ అవకాశాలుంటాయి. క్వాంటమ్‌లో అవకాశాలు మరో 50 ఏళ్లు కొనసాగుతాయి. ఈ అవకాశాన్ని వదులుకోకండి’ అని కామకోటి వివరించారు.

దశలవారీగా 35 లక్షల మందికి శిక్షణ

వైసర్ సంస్థ ప్రతినిధి వరదాన్



ఈనాడు, అమరావతి: వైసర్ క్వాంటమ్ టాలెంట్ హబ్‌ను కేంద్ర మంత్రి జితేంద్రసింగ్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ కలిసి శనివారం ఆవిష్కరించారు. వైసర్ సంస్థ ప్రతినిధి వరదాన్ మాట్లాడుతూ ‘అమెరికా వెలుపల తొలిసారి వైసర్ సంస్థ ఈ ఎక్సలెన్స్ సెంటర్‌ను ఏర్పాటుచేస్తోంది. రాష్ట్రప్రభుత్వ సహకారంతో వచ్చే ఐదేళ్లలో ఇక్కడ 35లక్షల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తాం. ప్రపంచంలోనే ఈ స్థాయిలో క్వాంటమ్ వర్క్‌ఫోర్స్ తయారుచేయడం ఇదే ప్రథమం. ఇక్కడి విద్యార్థుల ప్రతిభనూ గుర్తించి ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. అత్యున్నత ప్రతిభ కనబరిచిన 1% విద్యార్థులకు స్థానికంగా ఉపాధి లభించేలా వైసర్ సంస్థ అవసరమైన మద్దతు ఇస్తుంది.

క్వాంటమ్ వ్యాలీ కీలక అడుగు

కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ కార్యదర్శి అభయ్ కరందీకర్



ఈనాడు, అమరావతి: ‘అమరావతిలో ఈ క్వాంటమ్ వ్యాలీ సాంకేతిక ప్రాజెక్టు మాత్రమే కాదు, భారతదేశ శాస్త్ర, సాంకేతిక దిశను సూచించే కీలక అడుగు. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ సెన్సింగ్ లాంటి అంశాలు ఆరోగ్యం, మందుల పరిశోధన, వ్యవసాయం, వాతావరణ మార్పులు, సైబర్ భద్రత, రక్షణ రంగం లాంటి అనేక విభాగాల్లో అసాధారణ మార్పులు తెస్తాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుచూపుతో క్వాంటమ్ వ్యాలీని ప్రారంభించడం ప్రశంసనీయం’.

క్వాంటమ్‌లో పెట్టుబడులకు ఒప్పందాలు

ఈనాడు, అమరావతి: అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఎకోసిస్టమ్‌లో భాగస్వాములు అయ్యేందుకు 15 సంస్థలు రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. దీనిద్వారా క్వాంటమ్ కంప్యూటింగ్, ఆల్గరిథమ్స్, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, సెక్యూరిటీ, క్వాంటమ్ సెన్సింగ్, క్వాంటమ్ బయోఫౌండ్రీ రంగాల్లో రాష్ట్రానికి పెట్టుబడులు రానున్నాయి. ఐక్యూలీప్, ట్రై క్వాంటా ల్యాబ్స్, క్యూబిట్ ఫోర్స్, ఎస్ఆర్ఎం, క్వాంట్ ఫోకస్ ల్యాబ్స్ తదితర సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి.

విద్యార్థులకు సర్టిఫికెట్లు: అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్-2025లో విజేతలకు ముఖ్యమంత్రి చేతులమీదుగా సర్టిఫికెట్లు, నగదు బహుమతుల చెక్కులు అందించారు.

శంకుస్థాపనలో మంత్రులు పి.నారాయణ, కందుల దుర్గేష్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, ప్రభుత్వ కార్యదర్శి కాటమనేని భాస్కర్, సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు పాల్గొన్నారు.

ప్రపంచస్థాయి మౌలిక వసతులు అందించడంలో కీలకం

– డా.సతీశ్, ఎస్ఆర్ఎం ప్రతినిధి

‘‘అమరావతి క్వాంటమ్ వ్యాలీ భారత క్వాంటమ్ పరిశోధనలకు కేంద్ర బిందువు కానుంది. ప్రపంచస్థాయి ప్రతిభను ఆకర్షించే వేదికగా నిలవనుంది. దీని పరిధిలో ప్రారంభించనున్న ఎస్ఆర్ఎం క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీ సెంటర్ విద్యార్థులు, పరిశోధకులు, అంకుర పరిశ్రమలకు ప్రపంచస్థాయి మౌలిక వసతులు కల్పించడంలో కీలక పాత్ర పోషించనుంది.’’

దేశ భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థకు క్వాంటమ్ వ్యాలీ పునాది

– ఎంవీ సతీష్, ఎల్అండ్‌టీ డైరెక్టర్

దేశ అభివృద్ధి ప్రయాణంలో మౌలిక సదుపాయాల నిర్మాణం నుంచి సాంకేతిక వ్యవస్థల అమలు వరకు ఎల్అండ్‌టీ ఎప్పుడూ దేశంలో ముందుంటుంది. అమరావతిలో ప్రారంభం కానున్న క్వాంటమ్ వ్యాలీ కేవలం ఒక ప్రాజెక్టు కాదు. దేశ భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థకు పునాది. సీఎం చంద్రబాబు ప్రతిపాదించిన సిలికాన్ వ్యాలీ నుంచి క్వాంటమ్ వ్యాలీ వరకు ఆయన దూరదృష్టి అందరికీ ప్రేరణ. చంద్రబాబు విజన్ కార్యరూపం దాల్చడంలో ఎల్అండ్‌టీ భాగస్వామిగా ఉండడం బాధ్యతగా భావిస్తున్నాం. క్వాంటమ్ వ్యాలీ కోసం అత్యున్నత ప్రమాణాలతో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధిలో సంస్థ పూర్తి నిబద్ధతతో పనిచేస్తుంది.

వీలైనంత త్వరగా ప్రాజెక్టు పూర్తి

– కాటమనేని భాస్కర్, కార్యదర్శి, ఐటీఈ అండ్ సీ

ఈనాడు, అమరావతి: దేశంలో తొలి స్వదేశీ క్వాంటమ్ కంప్యూటర్ తయారీకి అమరావతి నుంచి అడుగులు పడడం చారిత్రక ఘట్టం. జాతీయ క్వాంటమ్ మిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా దేశంలోని సంస్థలు, విశ్వవిద్యాలయాలకు క్వాంటమ్ సేవలు అందుతాయి. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మాణానికి పట్టిన సమయంలో 30% సమయంలోనే ప్రాజెక్టు పూర్తిచేస్తాం.

దగ్ధమైన ప్రైవేట్ స్లీపర్ బస్సు



బస్సుపై నీళ్లు చిమ్ముతూ మంటలార్పే ప్రయత్నం




పూర్తిగా దగ్ధమైన బస్సు

ఈనాడు, అమరావతి-న్యూస్‌టుడే, కంచికచర్ల: జాతీయ రహదారిపై తెల్లవారుజామున ఓ ప్రైవేట్ స్లీపర్ బస్సు మంటల్లో చిక్కుకుంది. ఆ సమయంలో గాఢనిద్రలో ఉన్న 39 మంది ప్రయాణికులు డ్రైవర్ అప్రమత్తతతో సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసర సమీపంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో రాత్రి 10.30 గంటలకు ఇంటర్ సిటీ వరుణ్ ట్రావెల్స్‌కు చెందిన స్కానియా స్లీపర్ బస్సు 39 మంది ప్రయాణికులతో గుంటూరుకు బయలుదేరింది. వారాంతం కావడంతో విజయవాడ, గుంటూరుకు చెందిన ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఈ బస్సులో సొంతూళ్లకు బయలుదేరారు. బస్సు ఉదయం 5.35 సమయంలో కంచికచర్ల మండలం టోల్ ప్లాజా దాటగానే ప్రమాదానికి గురైంది.

బస్సును పరిశీలించిన ఐదు నిమిషాల్లోనే..

బస్సు వేకువజామున 5.30 గంటలకు కీసర టోల్ ప్లాజా వద్ద రుసుము చెల్లించిన తర్వాత ఆగింది. క్లీనర్ దిగి కాలకృత్యాలకు వెళ్లాడు. ఆ సమయంలో డ్రైవర్ చంద్రమౌళి బస్సు టైర్లు, ఇంజిన్ చూశారు. అనంతరం బస్సు మళ్లీ బయలుదేరింది. సరిగ్గా ఐదు నిమిషాల్లోనే బస్సు పికప్‌లో హెచ్చుతగ్గులను డ్రైవర్ గమనించారు. అద్దంలో నుంచి చూడగా వెనుకవైపు పొగ కనిపించింది. వెంటనే అప్రమత్తమై బస్సును రోడ్డు పక్కన ఆపేశారు. క్లీనర్‌కు విషయం చెప్పి క్షణాల్లో ప్రయాణికులను నిద్రలేపారు. అప్పటికే పొగ కమ్మేసింది. ఎలాగోలా అందరినీ కిందకు దింపి, లగేజీ రోడ్డుపైకి వేసేశారు. ఆ వెంటనే బస్సంతా మంటలు వ్యాపించాయి. డయల్ 112కు డ్రైవర్ ఫోన్ చేసి సమాచారమిచ్చారు. 10 నిమిషాల్లో ఘటనా స్థలానికి రెండు అగ్నిమాపక వాహనాలు చేరుకుని, మంటలను అదుపులోకి తెచ్చాయి. కానీ, అప్పటికే బస్సులోపల భాగమంతా పూర్తిగా కాలిపోయింది. పోలీసులు, రవాణా శాఖ అధికారులు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఫోరెన్సిక్ నిపుణులు, క్లూస్ సిబ్బంది పలు ఆధారాలను సేకరించారు. షార్ట్‌సర్క్యూట్ కానీ పిస్టన్లలో లోపం కారణంగా ప్రమాదం సంభవించి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రమాదంపై కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గుంటూరుకు చెందిన తాడిశెట్టి వినోద్‌కుమార్ పేరున బస్సు రిజిస్ట్రేషన్ అయింది.

ఆపద్బాంధవుడు చంద్రమౌళి



డ్రైవర్ చంద్రమౌళి అప్రమత్తత, సమయస్ఫూర్తి కారణంగా మంటల్లో చిక్కుకున్న బస్సులో 39 ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. గుంటూరులోని కొత్తపేటకు చెందిన చంద్రమౌళి వరుణ్ ట్రావెల్స్‌లో డ్రైవరుగా పని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో డ్యూటీ ఎక్కారు. బస్సు పికప్‌లో తేడాను గమనించి, పొగ రావడాన్ని గమనించారు. బస్సును ఆపి, క్లీనర్ తోడ్పాటుతో గాఢ నిద్రలో ఉన్న ప్రతి ప్రయాణికుడిని లేపి అందరినీ దగ్గరుండి కిందకు దించారు. ఇదంతా బస్సు మంటల్లో చిక్కుకునే ఐదు నిమిషాల్లోనే చేయడం విశేషం.

EENADU Vol: 52, Issue: 179 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao